

# ఫెమినిస్ట్ అంబేడ్కర్

సమాజం - మహిళలపై అంబేడ్కర్



# ఫెమినిస్టు అంబేడ్కర్

## సమాజం - మహిళలపై అంబేడ్కర్

తెలుగు అనువాదం

**బి. అనురాధ**

**బొజ్జా తారకం**

**బి. విజయభారతి**

**జి. భార్గవ**

హైదరాబాద్ బుక్ ట్రస్టు

ధర : రూ. 100/-
ప్రథమ ముద్రణ : ఆగస్ట్ 2019
ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్,
గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 006.
ఫోన్ : 23521849
www.hyderabadbooktrust.blogspot.com

ముద్రణ : అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్,
హైదరాబాద్ - 28 ఫోన్ : 23391364, 23304194
Email: anupamaprinters@yahoo.co.in

# విషయసూచిక


1. భారతదేశంలో కులాలు- వాటి పుట్టుక, పనితీరు, అభివృద్ధి 7
2. స్త్రీలు - ప్రతీఘాతుక విప్లవం 15
3. మనువు ఉన్మాదం-లేదా మిశ్రమ కులాల ఆవిర్భావం గురించి బ్రాహ్మణ వివరణ 23
4. పితృసవర్ణత నుంచి మాతృసవర్ణతకి మార్పు-దీని నుంచి బ్రాహ్మణులు ఏం సాధించాలనుకున్నారు? 35
5. హిందూకోడ్ 42
6. రాజీనామా సందర్భంగా ప్రకటన 65
7. హిందూ స్త్రీ ఉత్థాన పతనాలు:అందుకు బాధ్యులెవరు? 74
   అనుబంధం : హైందవంలోనూ బౌద్ధమతంలోనూ స్త్రీల పరిస్థితి-లామా గోవింద
8. కుల నిర్మూలన 94
9. ప్రసూతి ప్రయోజన బిల్లు 95
10. జనన నియంత్రణ చర్యల గురించి 97
11. భారత రాజ్యాంగ సంస్కరణల పై సంయుక్త కమిటీ ముందు ఇచ్చిన సాక్ష్యం 98
12. సంస్కర్తలు వారి భవితవ్యం 103
13. బ్రాహ్మణ మత విజయం 104
14. అంటరానితనం - అరాచకత్వం 105
15. రాముని రహస్యాలు 106
17. మహిళల గురించి బాబా సాహెబ్ అభిప్రాయాలు 113
   - ఊర్మిళా పవార్, మీనాక్షీ మూన్

# ఈ పుస్తకం గురించి అనువాదకురాలి మాటలు

డా. బి. ఆర్. అంబేద్కర్ రచనలు, ఉపన్యాసాలు అనేక సంపుటాలుగా వెలువడిన విషయం తెలిసిందే. అందులో స్త్రీలకు సంబంధించిన కొన్ని వ్యాసాలు, ఉపన్యాసాలు, కొన్ని పూర్తిగానూ, కొన్ని పాక్షికంగాను ఒకదగ్గరకు తీసుకొచ్చి ఈ పుస్తకాన్ని హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురిస్తోంది. సంపుటాలలో అక్కడక్కడా ఉన్న వీటినన్నింటినీ ఒక దగ్గర చేర్చడం వల్ల స్త్రీల విషయంలో డా. అంబేద్కర్ అభిప్రాయాలూ, ఆయన తన పరిధిలో చేసిన కృషి గురించి అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

డా. అంబేద్కర్ హిందూ కోడ్ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంలో స్త్రీలకు ఆస్తి హక్కుని కలగ జేయడం, ఆస్తి పంపకాల సందర్భంగా వితంతువుల పట్ల చూపే వివక్షని అంతం చేయడం, స్త్రీలు వివాహితులైతే ఒక చట్టం, అవివాహితులైతే ఒక చట్టం, వితంతువులైతే మరొక చట్టం ఇలా ఇన్ని రకాలుగా ఉండడం సరైంది కాదని, స్త్రీలకు పురుషులకు సమానంగా చట్టం వర్తించేలా మార్పులు సూచించారు. కులాంతర మతాంతర వివాహాలకు కూడా చెల్లుబాటు ఉండాలని, ధార్మిక పద్ధతులకి అతీతంగా రిజిస్టర్ పెళ్లిళ్లను ప్రవేశపెట్టి ఏ పద్ధతిలోనైనా సరే చేసుకునే పెళ్లిళ్లకు గుర్తింపు గౌరవం ఉండాలని హిందూ కోడ్ బిల్లులో సూచించారు. ఇంకా వేరు వేరు సందర్భాలలో చట్ట సభల్లో ఆయన స్త్రీల సమస్యల గురించి వాదించారు. ప్రభుత్వం జనన నియంత్రణ గురించి చేపట్టవలిసిన చర్యల గురించి వాదిస్తూ, వెంట వెంట కాన్పులతో, అనారోగ్య పరిస్థితుల్లో పిల్లలని కనాల్సి రావడంతో స్త్రీలు జీవచ్ఛవాలుగా మారుతున్నారని, అనేక మంది స్త్రీలు ప్రాణాలు కోల్పోతున్నారనీ ఇది సమాజానికి ఏమీ క్షేమం కాదని అంటారు. స్త్రీలకు జనన నియంత్రణ పద్ధతులను సులభంగా అందుబాటులో ఉంచవలిసిన బాధ్యత ప్రభుత్వానిదే అని గట్టిగా వాదించారు. అలాగే ముంబయ్ ఫ్యాక్టరీల్లో స్త్రీలకు ప్రసూతి ప్రయోజన బిల్లును ప్రవేశపెట్టాలని, ఆ భారం మొయ్యాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని గట్టిగా వాదించారు. స్త్రీల చేతిలో అక్షరాస్యత ఒక ఆయుధంగా పనిచేస్తుందన్నారు. అన్ని వర్గాల స్త్రీలకు ఓటు హక్కు కావాలన్నారు. ముఖ్యంగా ఈ వాదనలు చేసిన కాలాన్ని కనక దృష్టిలో పెట్టుకొంటే (1930, 50 ల మధ్య కాలం) ఆ కాలంలోనే స్త్రీల విషయంలో ఇంత ప్రగతిశీలంగా ఆలోచించడం డా. అంబేద్కర్ లోని ఒక ఫెమినిస్టు కోణాన్ని చూపిస్తుంది.

స్త్రీలను అధోగతికి చేర్చి వారు ఆ స్థితిలో కొనసాగేందుకు ధర్మ శాస్త్రాలు, అందులోని "న్యాయ స్మృతులు", చట్టాలు ఎలా పనిచేశాయో డా.అంబేద్కర్ చాలా విస్తారంగా వాటి

నుండి ఉటంకించి వివరిస్తారు. కాబట్టి ఆ చట్టాలలో మార్పులు చేయడం ద్వారా స్త్రీల పరిస్థితిని ఎంతో కొంత మార్చగలమని విశ్వసించారు కనక అందుకు చాలా కృషి చేశారు. కాబట్టి ఇందులో చట్టాల గురించి చాలా వివరణా చర్చా ఉంటాయి. పాఠకులకి కొన్ని చోట్ల క్లిష్టంగా అనిపించవచ్చు. కానీ ఇది ఒక రెఫరెన్సు పుస్తకంగా పనికివస్తుంది. అలాగే అర్థం కానట్లనిపించినపుడు వెనక్కి వెళ్ళి మళ్ళీ చదవాల్సి వస్తుంది. బొజ్జా తారకం గారు, డా.విజయభారతి గారు అనువాదం చేసిన వ్యాసం, భార్గవ గారు చేసిన వ్యాసం యథాతథంగా ఇందులో ఉన్నాయి. నేను చేసిన అనువాదాలు సరళంగా ఉండాలనే ప్రయత్నంలో భావాన్ని బలిపెట్టకూడదని ప్రయత్నించాను. అలాగే పితృ సవర్ణత, మాతృ సవర్ణత వంటి అనేక పదాలు డా. అంబేద్కర్ ఇంగ్లీష్‌లో కూడా అలాగే వాడారు. వాటిని అలాగే ఉంచాను. ప్రత్యేకంగా స్త్రీలకు సంబంధించి డా.అంబేద్కర్ చేసిన కృషి గురించి తెలుసుకోవాలనుకొనేవారికి ఈ పుస్తకం చాలా ఉపయోగపడుతుంది.

**బి.అనురాధ**

**బి. అనురాధ** స్త్రీల హక్కుల కోసం పోరాడుతున్న కార్యకర్త. హైదరాబాదులో నివసిస్తూ బ్యాంకు ఉద్యోగిగా ఉన్న క్రమంలో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంస్థతో పరిచయం ఏర్పడి, ఆ సంస్థలో 1990 నుంచి 1993 వరకూ పనిచేసారు. తదుపరి, ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో రాష్ట్రస్థాయి సంస్థగా ఉన్న చైతన్య మహిళా సంఘంలో క్రియాశీల కార్యకర్తగా కృషి చేయడానికి బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసారు. ఈ సంస్థ నిర్వహించిన మహిళా మార్గం పత్రిక సంపాదక సభ్యురాలిగా ఉన్నారు. అనంతరం నారి ముక్తి సంఘ్ లో పనిచేసే లక్ష్యంతో ఝార్ఖండ్ వెళ్ళి అక్టోబరు 2009 లో అరెస్టయి, హజారిబాగ్ జైల్లో నాలుగు సంవత్సరాల నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆమె రాసిన జైలు కథలు సంపుటాన్ని విరసం ప్రచురించింది. ఈ పుస్తకం త్వరలో ఆంగ్ల భాషలో కూడా రాబోతున్నది.

# భారతదేశంలో కులాలు- వాటి పుట్టుక, పనితీరు, అభివృద్ధి

భారత సమాజం లాగా, ఆదిమ కాలం నాటి అనేక అవశేషాలను సజీవంగా ఈ నాటికీ నిలుపుకున్న నాగరిక సమాజం మరొకటి వుండదు అని చెప్పడం అవసరం అని భావిస్తున్నాను.

భారతదేశంలో వున్న మతం సారాంశంలో ఆదిమ మతమే. కాలం ఎంత పురోగమించినా, నాగరికత ఎంత వికసించినా ఈ మతం అంతటా వ్యాపించి వున్న ఆటవిక సంకేత భాష నేటికీ స్ఫటిక స్వచ్ఛతతో, నిసర్గశక్తితో అమలవుతూనే వుంది. ఇలాంటి ఆటవిక అవశేషాలలో ఒకదాన్ని మీ దృష్టికి తేదలిచాను. అదే "బహిర్వివాహ కట్టుబాటు" (exogamy). ఆదిమ యుగాలలో బహిర్వివాహ పద్ధతి ఎంత విస్తారంగా అమలయ్యిందో ప్రత్యేకంగా వివరించవలసిన పనిలేదు. నాగరికతా వికాస క్రమంలో బహిర్వివాహ పద్ధతి తన ప్రాధాన్యతను కోల్పోయింది. అతి దగ్గరి రక్త బంధువులు మినహా వివాహ విషయంలో ఎలాంటి సాంఘిక ఆంక్షలు పని చేయని స్థితి ఏర్పడింది. అయితే భారత ప్రజల విషయంలో బహిర్వివాహం అనే ఆచారం / కట్టుబాటు ఈనాటికీ ప్రబలంగానే వున్నది. తెగలు ఏనాడో అంతరించి పోయినా భారత సమాజం తెగల వ్యవస్థ నాటి జ్ఞాపకాలను పట్టి వేలాడుతూనే వుంది. పెళ్ళిని శాసించే నియమాలను చూస్తే బహిర్వివాహ పద్ధతి ఎంత శక్తి వంతంగా పని చేస్తున్నదో మనకు అర్థం అవుతుంది. సపిండ (రక్త బంధువులు) వివాహాన్నే కాదు, సగోత్ర (ఒకే మూల పురుషుని వారసుల) వివాహాన్ని కూడా భారత సమాజం అంగీకరించదు. దీన్ని మహా పాపంగా భావిస్తుంది. ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే, భారత ప్రజలకు అంతర్ వివాహం అనే పద్ధతి పూర్తిగా కొత్తది, అనే విషయం మీరు బాగా గుర్తుంచుకోండి. భారతదేశంలోని వివిధ గోత్రాలు బహిర్వివాహ నియమాన్ని పాటిస్తాయి. ఇంటి దేవతా ప్రతీకల ప్రకారం సంఘటితమైన సముదాయాలు కూడా బహిర్వివాహ పద్ధతినే పాటిస్తాయి. భారత ప్రజలకు బహిర్వివాహం ఒక మతం లాంటిది. దాన్ని ఉల్లంఘించే సాహసం ఎవరూ చేయరు. కులాల మధ్యన అంతర్వివాహసూత్రం పని చేస్తున్నప్పటికీ, కులం లోపల జరిగే పెళ్ళిళ్ళు కూడా బహిర్వివాహ నియమాన్ని తు.చ. తప్పకుండా పాటిస్తాయి. నిజానికి అంతర్ వివాహ నియమాన్ని ఉల్లంఘించిన (అంటే కులాన్ని ఉల్లంఘించి వేరే కులంలో పెళ్ళి చేసుకున్న) వారికన్నా, బహిర్వివాహ నియమాన్ని ఉల్లంఘించిన (సగోత్ర వివాహం చేసుకునే) వారిపైనే చాలా కఠినమైన సాంఘిక ఆంక్షలు / శిక్షలు విధిస్తారు. బహిర్ వివాహ పద్ధతిలో కులం వుండరాదు.

ఎందుకంటే ఈ పద్ధతిలో అందరూ కలసి పోతారు. కానీ మా సమాజంలో కులాలు వున్నాయి. ఇది ఎలా సాధ్యం? ఒకే ఒక రకంగా మాత్రమే ఇది సాధ్యం. భారతదేశానికి సంబంధించినంత వరకూ కులాల పుట్టుక అన్నది బహిర్వివాహం పైన అంతర్వివాహాన్ని ఆపాదించడం వల్ల ఏర్పడిన పరిణామం. అయితే బహిర్వివాహ పద్ధతిని అచంచలంగా పాటించే సమాజంలో అంతర్ వివాహ పద్ధతిని ప్రవేశపెట్టడం చాలా గడ్డు సమస్య. అలలు అలలుగా వ్యాపించే బహిర్ వివాహ సముద్రంలో అంతర్ వివాహ నియమాన్ని మునిగి పోకుండా కాపాడేందుకు ఎలాంటి విధానాలు వుపయోగించాడు అన్నది మనం అర్థం చేసుకోగలిగితే కులం చిక్కుముడిని విప్పగలిగినట్లే.

"బహిర్ వివాహంపై అంతర్ వివాహ ఆపాదనం అంటే కులం పుట్టుక" అన్నది నా ప్రతిపాదన. అయితే ఇది చెప్పినంత తేలిక వ్యవహారం కాదు. కులంగా మారాలనుకుంటున్న ఒక ఊహాకల్పిత సముదాయాన్ని తీసుకుని దాని లక్ష్యం నెరవేరాలంటే అది ఏ విధానాలు పాటించాల్సి వుంటుందో కొద్దిగా విశ్లేషణ చేద్దాం. కులాంతర వివాహాలను నిషేధిస్తూ ఒక ఉత్తర్వు జారీ చేయడం ద్వారా ఆ సముదాయం సాధించేదేమీ వుండదు. ఎందుకంటే అంతర్ వివాహ పద్ధతి కన్నా ఎంతో ముందు నుంచీ బహిర్ వివాహ పద్ధతి బలంగా అమలులో వున్నది. అంతేకాక పరస్పర సన్నిహిత సంపర్కంతో సహజీవనం సాగిస్తున్న వివిధ సాంఘిక బృందాలు ఒకదానితో ఒకటి సంబంధబాంధవ్యాలను పెంచుకొని ఒక సమరూప సమాజంగా విలీనమై పోయేందుకే ఎక్కువగా ప్రయత్నిస్తుంటాయి. కుల నిర్మాతలు ఈ సహజమైన ధోరణికి విరుద్ధంగా, కుల నిర్మాణం దిశగా బలమైన చర్యలు చేపట్టాల్సి వుంటుంది. ఒక సముదాయంలోని ప్రజలు మరొక సముదాయం వారితో పెళ్ళి సంబంధాలు ఏర్పరుచుకోకుండా ఒక శక్తివంతమైన పరిధిని గీయవలసి వుంటుంది. అయితే బయటి వారితో పెళ్ళిని నిషేధించడం వల్ల అనేక గడ్డు సమస్యలు పుట్టుకొస్తాయి. వాటిని పరిష్కరించడం కూడా అంతతేలిక కాదు. అది ఎలానో చూద్దాం. సాధారణంగా ఏ సమూహంలోనైనా ఆడ, మగ జనాభా సమానంగా వుంటుంది. ఒకే వయసువున్న ఆడ, మగవారి సంఖ్య కూడా సాధారణంగా సమానంగానే వుంటుంది. అయితే (అనేక చారిత్రక, ఆకస్మిక పరిస్థితుల కారణంగా) వాస్తవ సమాజాలలో ఈ సమానత నియమానికి భంగం ఏర్పడుతుంటుంది. కానీ అంతర్ వివాహాన్ని ప్రవేశపెట్టాలనుకుంటున్న (కులంగా పరివర్తన చెందాలనుకుంటున్న) సమూహానికి స్త్రీ–పురుషుల సంఖ్య ఎల్లప్పుడూ సమానంగా వుండడం అనేది అత్యంత అవసరంగా మారుతుంది. అలా సమాన సంఖ్యను నిలుపుకోవడం అనేది పరమలక్ష్యం కూడా అవుతుంది. లేకపోతే అంతర్ వివాహ పునాది బీటలు వారుతుంది. ఒక సముదాయంలోని వారందరికీ పెళ్ళికి అవసరమైన జోడీ లభించి తీరాలి. లేకపోతే వారు బయటి సమూహాలలో తమ జంటను వెతుక్కుంటారు. వారిని ఆపడం ఏ కుల కట్టుబాటు తరమూ కాదు. కాబట్టి 'కులం'గా మార్పు చెందాలనే

సమూహంలో వివాహయోగ్యమైన స్త్రీ, పురుషుల సంఖ్య ఎప్పుడూ సమానంగానే వుండాలి. సభ్యులకు తమ సముదాయంలోపలే జంట దొరకాలి. ఈ అవసరాన్ని తీర్చలేకపోతే, వివాహయోగ్యతగల చాలా మంది సభ్యులకు సముదాయం లోపలే జత దొరకకపోతే అప్పుడు అంతర్ వివాహ పద్ధతి విచ్ఛిన్నమైపోతుంది.

దీన్ని బట్టి, కులం పుట్టుకకూ నిర్వహణకూ వివాహ యోగ్యత కల స్త్రీ, పురుషుల సంఖ్య సమానంగా వుండడం అనేది అతి కీలకమైన సమస్య అని చెప్పవచ్చు. ఈ సంఖ్యా సమానత్వాన్ని ప్రకృతికి వదిలేస్తే కుదరదు. ఎందుకంటే భార్య, భర్త ఇద్దరూ ఒకేసారి మరణించినప్పుడు మాత్రమే సంఖ్యా సమానత్వం సాధ్యం. అది ఎప్పుడో ఒకసారి కానీ జరగదు. భార్యకన్నా భర్త ముందే మరణించవచ్చు. అప్పుడు ఆమె ఆ సమూహంలో 'అదనపు స్త్రీ' అవుతుంది. ఆమెను ఎలాగో వదిలించుకోవాలి. లేకపోతే ఆమె అంతర్ వివాహ కట్టుబాటును ఉల్లంఘించే అవకాశం వుంది. అదే విధంగా భార్యముందుగా మరణించి భర్త మిగిలినప్పుడు, అందరూ ఆయనపై సానుభూతి చూపవచ్చు కానీ 'అదనపు పురుషుడి'గా అతనివల్ల తలెత్తే సమస్య నుంచి బయట పడాలంటే అతన్ని కూడా ఎలాగో వదిలించుకోవాలి. లేకపోతే అతను కులం కట్టును ధిక్కరించవచ్చు. అలా "అదనపు స్త్రీ లేక అదనపు పురుషుడు" కులానికి ఎదురయ్యే అతిపెద్ద సవాళ్ళు. వాళ్ళ సంగతి పట్టించుకోకుండా, వారి సమస్యకు పరిష్కారం చూపకుండా వదిలేస్తే, వారు కులం బయటి వారితో సంబంధాలు పెట్టుకుంటారు. అంతేకాదు కులం బయటి వారి ద్వారా సంతానాన్ని కూడా పొంది కులం లోపలికి తీసుకు వచ్చే ప్రమాదం వుంటుంది.

'కులం'గా మారాలనుకుంటున్న మన ఊహాజనిత సముదాయం, ఈ 'అదనపు స్త్రీ, అదనపు పురుషుని' సమస్యను ఎలా పరిష్కరించగలదో కొద్దిగా ఆలోచిద్దాం. మొదట 'అదనపు స్త్రీ' సమస్య గురించి ఆలోచిద్దాం. కులంలోపల అంతర్ వివాహ పద్ధతిని కాపాడ్డానికి అదనపు స్త్రీని రెండు విధాలుగా వదిలించుకోవచ్చు.

**మొదటిది :** మరణించిన భర్త చితి మంటల్లో ఆమెను కూడా కాల్చేయడం. కానీ స్త్రీ – పురుషుల సంఖ్యలో వ్యత్యాసాన్ని తగ్గించడానికి ఈ మార్గం ఆచరణ సాధ్యం కాని మార్గం. కొన్ని సందర్భాల్లో ఇది పని చేయవచ్చు. కొన్నిసార్లు ఇది సాధ్యం కాకపోవచ్చు. చూడ్డానికి ఇది అతి సులభ పరిష్కారంగా కనబడినా ఆచరణలో కష్ట సాధ్యమైనది. ప్రతి 'అదనపుస్త్రీ'ని ఈ మార్గంలో వదిలించుకోవడం కుదరని పని. అంటే ఈ అదనపు స్త్రీ (వితంతువు) సమూహంలో వుండిపోతుంది. అయితే ఈమె వునికి రెండు రకాల ప్రమాదాలకు కారణం అవుతుంది. కులం బయట పునర్వివాహం చేసుకుని ఆమె అంతర్ వివాహ పద్ధతిని వుల్లంఘించవచ్చు. లేదా సమూహంలోపలే మరొకరిని పెళ్ళి చేసుకోవడం ద్వారా న్యాయంగా మరొక వధువుకు దక్కవలసిన అవకాశాలను దెబ్బతీయవచ్చు.

మరణించిన భర్తతో పాటు దహనం చేయడానికి కుదరకపోతే వేరే ఏ మార్గం ద్వారా అయినా ఈమెను ఏదో ఒకటి చేయవలసి వుంటుంది.

**రెండవ మార్గం :** ఈమె మళ్ళీ పెళ్ళి చేసుకోకుండా, జీవితాంతం వితంతువుగానే వుండిపోయేలా కట్టడి చేయడం రెండవ మార్గం. వాస్తవిక ఫలితాలను బట్టి చూసినప్పుడు బలవంత వైధవ్యం కన్నా కాల్చి చంపడమే ఉత్తమమైనది. ఎందుకంటే కాల్చడం ద్వారా, వితంతువు వల్ల రాగల మూడు రకాల ప్రమాదాలను శాశ్వతంగా నివారించవచ్చు. కులం లోపల కానీ, బయట కానీ మళ్ళీ పెళ్ళి చేసుకోవడంవల్ల ఏర్పడే సమస్యలేవీ ఇక వుండవు. కానీ కాల్చి చంపడం కన్నా బలవంత వైధవ్యమే ఉన్నతమైనది. కారణం, ఇది ఆచరణలో సాధ్యమైన మార్గం. చంపడం కన్నా మానవీయమైనదేకాక, మళ్ళీ పెళ్ళి అనే సమస్యను కూడా ఇది పరిష్కరిస్తుంది. కానీ సమూహం లోపల నైతిక విలువలను ఈ మార్గం కాపాడలేదు. బలవంత వైధవ్యంలో స్త్రీ బతికే వుంటుంది. ఎవరో ఒకరికి సక్రమమైన భార్యగా బతికే సహజమైన హక్కును కోల్పోయి వుండడం చేత, అక్రమ సంబంధం, అనైతిక ప్రవర్తనకు బలం చేకూరుతుంది. అయితే ఇదేమంత గడ్డు సమస్యకాదు. ఏమగవానికీ ఆమెపై వ్యామోహం కలగని విధంగా ఆమె పరిస్థితిని దిగజార్చితే సరిపోతుంది.

ఇక అదనపు పురుషుని సమస్య. కులంగా మారాలని వువ్విళ్ళూరుతున్న సమూహానికి అదనపు స్త్రీ సమస్య కన్నా అదనపు పురుషుని సమస్య ఇంకా ముఖ్యమైనది. ఇంకా జటిలమైనది కూడా. అనాదిగా స్త్రీలతో పోల్చితే పురుషునిదే పైచేయి. ప్రతి సమూహంలో మగవానిదే పెత్తనం. స్త్రీ కన్నా పురుషునికే గౌరవం, ప్రతిష్ట ఎక్కువ. సాంప్రదాయికమైన ఈ పురుషాధిక్యత వల్ల మగవాని ఇష్టా ఇష్టాలకు సముదాయాలు ఎక్కువ విలువ ఇస్తాయి. అదే స్త్రీలు మాత్రం మతపరంగా, సాంఘికంగా, ఆర్థికంగా రకరకాల అన్యాయమైన నిషేధాలనూ, ఆంక్షలనూ ఎదుర్కొంటుంటారు. ఈ ఆంక్షలనూ, నిషేధాలనూ మగవాడే తయారు చేస్తాడు కాబట్టి అవి అతని మీద పెద్దగా పనిచేయవు. ఇటువంటి పరిస్థితిలో ఒక కులం లోపల అదనపు స్త్రీతో వ్యవహరించినట్లే, అదనపు పురుషునితో వ్యవహరించడం కుదరనిపని.

భార్యతోపాటే భర్తను కూడా మంటల పాలు చేయడం అనే పథకం రెండు రకాలుగా విఫలమై పోతుంది. మొదలు, అతను మగవాడు కావడం అనే ఒకే కారణం వల్ల అతన్ని కాల్చడమే జరగదు. రెండవ కోణంలో, అతన్ని తగులబెట్టడం వల్ల కులం ఒక బలమైన సభ్యున్ని కోల్పోతుంది. కులానికి నష్టంకాని పద్ధతిలో ఇతని సమస్యను రెండే రెండు మార్గాల్లో పరిష్కరించవచ్చు. నష్టంకాని పద్ధతిలో అని ఎందుకంటున్నానంటే మగవాడు ఆ సముదాయానికి అతి విలువైన ఆస్తి.

మగవాడు విలువైనవాడే. కానీ అంతర్ వివాహం కూడా అంతే ముఖ్యం. లేదా అంతకంటే ముఖ్యం. కాబట్టి ఏ పరిష్కారం చూపినా అది ఈ రెండు లక్ష్యాలను సాధించేదిగా

వుండాలి. మొదటిది స్త్రీ లాగే ఇతను కూడా జీవితాంతం మరో పెళ్ళి చేసుకోకుండా వుండేలా అతన్ని అంగీకరింపచేయడం (కట్టడి చేయడం) కుదరదు. ఇది సాధ్యమైన పరిష్కారమే. ఎందుకంటే భార్య వియోగంలో ఎందరో మగవారు స్వచ్ఛందంగా మళ్ళీ పెళ్ళి చేసుకోకుండా అలాగే వుండిపోతారు. మరికొందరు ఇంకో అడుగు ముందుకు వేసి, ఇహలోక సుఖ భోగాలను త్యజించి విరాగులుగా మారుతుంటారు. అయితే ఇది కొందరి విషయంలో మాత్రమే ఈ విధంగా జరుగుతుంది. భార్యను కోల్పోయిన ప్రతి మగవాడూ ఈ విధంగానే ప్రవర్తించాలనుకోవడం అవాస్తవికమైన, అసహజమైన దురాశ. ఈ అదనపు పురుషుడు సాంఘిక కార్యకలాపాలన్నింటిలో చురుకుగా పాల్గొంటూ పదిమందితో నిత్యం సంపర్కంలో వుంటూ వుంటాడు. అతని వల్ల ఆ సముదాయ నైతిక విలువలకు ప్రమాదం తప్పక ఏర్పడుతుంది. ఇక బ్రహ్మచర్యాన్ని మరో కోణంలోంచి చూస్తే, పాటించే వ్యక్తి దీక్షాపరుడైతే బ్రహ్మచర్యం సాధ్యమే కావచ్చు కానీ ఆ సమూహం యొక్క భౌతిక సంపదల దృష్ట్యా మాత్రం అది నిరుపయోగమే. సమూహం నుంచి మానసికంగా దూరమై, విరక్తితో జీవించేవ్యక్తి వున్నా ఒకటే, భార్యతోపాటే చితిమంటలో కాలిపోయినా ఒకటే. ఎందుకంటే కులం, చురుకైన సాముదాయిక జీవనాన్ని అందివ్వగల ఒక పెద్ద సమూహంగా వుండాలంటే చాలా మంది చురుకైన, శక్తివంతులైన సభ్యులు దానికి అవసరం. విరక్తితో జీవచ్ఛవంలా మారేమనుష్యులు కులానికి దమ్మిడీ వంతు కూడా పనికిరారు.

కాబట్టి అదనపు పురుషుణ్ణి ఆజన్మ బ్రహ్మచర్యంలోకి నెట్టి వేయడం అన్నది సైద్ధాంతికంగా, ఆచరణాత్మకంగా, రెండు రకాలుగా కూడా నిష్ప్రయోజనము అని చెప్పవచ్చు. ఆవిధంగా కాకుండా మగవాణ్ణి ఎప్పుడూ 'గృహస్తు'గా వుంచడంవల్లే కులానికి చాలా లాభం. ఇందుకుగాను ఆ మగవానికి కులంలోపలే ఒక భార్యను సమకూర్చవలసి వుంటుంది. సాధారణంగా ఇది కుదరనిపని. ఎందుకంటే ఒక పురుషునికి ఒక స్త్రీ అనే నియమం అమలవుతుంటుంది. ఏ సముదాయంలోనైనా పెళ్ళీడు మగవారి సంఖ్యకు సమానమైనంత మంది మాత్రమే పెళ్ళీడు స్త్రీలు వుంటారు. ఇలాంటి పరిస్థితిలో మిగిలింది ఒకే ఒక మార్గం. ఆ అదనపు పురుషున్ని గృహస్తుగా మార్చి అతని శక్తి సామర్థ్యాలను సముదాయం వుపయోగించుకోవాలంటే పెళ్ళీడు రాని వారి నుండీ అతనికి భార్యను సమకూర్చాలి. ఇదే సాధ్యమయ్యే అత్యుత్తమ పరిష్కారం. దీనితో అతడు కులంలోపలే వుండిపోతాడు. కుల కార్యకలాపాల్లో మునుపటిలాగే పాల్గొంటాడు. అంతర్ వివాహం, నైతిక విలువలు పరిరక్షించబడతాయి.

పై చర్చను క్రోడీకరిద్దాం. ఆడ–మగల మధ్య సంఖ్యాపరమైన సమానత్వాన్ని సాధించడానికి నాలుగు మార్గాలు కనబడుతున్నాయి. 1. చచ్చిన భర్తతో పాటే భార్యను కూడా కాల్చేయడం. 2. బలవంతవైధవ్యం విధించడం – (కాల్చడానికి సున్నితమైన

రూపాంతరం) 3. భార్యను కోల్పోయిన మగవానిపై ఆజన్మ బ్రహ్మచర్యం విధించడం. 4. పెళ్ళి ఈడు లేని బాలికతో అతనికి పెళ్ళి చేయడం.

నేను ఇంతకుముందే చెప్పినట్లు వితంతువును కాల్చి చంపడం, భార్యావియోగిని ఆజన్మ బ్రహ్మచారిని చేయడం అనే రెండు మార్గాలు ఆచరణలో కష్ట సాధ్యం, కులానికి నిరుపయోగం. అంతర్ వివాహ పద్ధతిని రక్షించేందుకు ఇవన్నీ సాధనాలు. కానీ సాధనాలు ఆచరణలో పెట్టినప్పుడు, సాంఘిక శక్తులుగా మారి తమ లక్ష్యాన్ని తామే సృష్టించుకుంటాయి. ఈ సాధనాలు ఏ లక్ష్యాన్ని సృష్టించుకుంటాయి? ఇవి అంతర్ వివాహపద్ధతిని సృష్టించి, కొనసాగేలా చేస్తాయి. కులంపై రకరకాల నిర్వచనాలను విశ్లేషించినప్పుడు కులము, అంతర్ వివాహము రెండూ ఒకటే అని మనం నిర్ధారించగలం. కాబట్టి ఒక సముదాయంలో పై విధానాలు అమలులో వున్నాయి అంటే ఆ సముదాయం కులంగా ఏర్పడింది అని అర్థం. అలాగే కులం వీటిని తన సాధనాలుగా వుపయోగిస్తుంది అని కూడా అర్థం. బహుళ కులాల వ్యవస్థలో ఒక కులం సాధారణంగా పని చేసే తీరు ఇదే అని నా అభిప్రాయం.

ఈ సాధారణీకరణల నుండీ హిందూ సమాజంలో కులం ఎలా పని చేస్తున్నది అనే నిర్దిష్టత వైపు మనం దృష్టి సారిద్దాం. గతాన్ని ఆవిష్కరించే మార్గంలో ఎన్నో అవాంతరాలు వుంటాయని మనందరికీ తెలుసు. భారతదేశంలోని కులం అతి ప్రాచీనమైన సాంఘిక వ్యవస్థ అనేది నిస్సందేహం. ఈ ప్రాచీనతకు తోడు, దీనిపై ఎలాంటి లిఖిత ఆధారాలు లేని స్థితి కూడా వున్నప్పుడు, పైగా ప్రపంచం ఒక మిథ్య, చరిత్ర రచన ఒక దండగ పని అని గాఢంగా నమ్మే హిందూ ప్రజలాంటి ప్రజ వున్నప్పుడు గతాన్ని పరిశోధించడం మరీ కష్టం. అయితే ఎలాంటి లిఖిత చారిత్రక ఆధారాలు లేకపోయినా, సాంఘిక వ్యవస్థలు బతికే వుంటాయి. వాటి ఆచారాలు, నీతి నియమాలు శిలాజాలవలే నేటికీ నిలిచిపోయి తమ చరిత్రను తామే వెల్లడిస్తుంటాయి. ఈ ఆశతో మనం ముందుకు సాగాలి. హిందువులు 'అదనపు స్త్రీ, అదనపు పురుషుడు' సమస్యను ఎలా పరిష్కారం చేసారో పరిశీలన జరిపితే మన ప్రయత్నం సఫలమౌతుంది.

హిందూ సమాజం పని తీరు చాలా జటిలమైనది. అయినా ప్రతి ఒక్కరికీ వెంటనే కనిపించే మూడు విలక్షణమైన ఆచారాలను నేను మీ దృష్టికి తెస్తాను.

1. సతీసహగమనం-మరణించిన భర్త చితిపై భార్యను కూడా కాల్చివేసే ఆచారం.
2. నిర్బంధ, ఆజన్మ వైధవ్యం - భర్త మరణించినాక జీవితాంతం మరో పెళ్ళిలేకుండా స్త్రీ విధవగా జీవించాలనే ఆంక్ష,
3. బాలికా వివాహం.

ఈ మూడు శక్తివంతమైన ఆచారాలకు తోడు, భార్యను కోల్పోయిన భర్త ఇహలోక సుఖ భోగాలను వదలి వైరాగ్యంతో బతకడంపై (సన్యాసం) ఎన్నో వుపదేశాలు మనకు కనిపిస్తాయి.

నాకు తెలిసినంతవరకూ, ఈ ఆచారాలు ఎందుకు పుట్టాయి అనే దానిపై శాస్త్రీయ వివరణ ఏదీ ఇంతవరకూ లేదు. ఈ ఆచారాలు ఎంత గొప్పవో వర్ణించే పురాణాలు, వేదాంతాలు లెక్కలేనన్ని ప్రచారంలో వున్నాయి. కానీ, ఈ ఆచారాలు పుట్టడానికి వెనకగల కారణాలు చెప్పిన వారు మాత్రం ఎవరూ లేరు. ఆనంద కుమార స్వామి లాంటి కళా, సాంస్కృతిక విమర్శకులు 'సతి' ఆచారాన్ని సమర్థిస్తూ ఎంతో రాసారు." "శరీరానికీ, ఆత్మకు మధ్య వుండే ఐక్యతకు సతి ఒక ఋజువు" అట. "భార్యాభర్తల అవిభాజ్య బంధానికీ, మరణానంతరం కూడా కొనసాగే అంకిత భావానికి సతి ఒక ఉదాహరణ" అట. "పతివ్రతల లక్షణమట" పతివ్రతలందరూ భక్తితో కొలిచే ఉమ (పార్వతి దేవి) ఇలా అంటున్నదట.

"పతి భక్తికి మించిన గౌరవం భార్యకులేదు. అదే ఆమెకు అసలైన, శాశ్వతమైన స్వర్గం. ఓ మహేశ్వరా, నావల్ల నీవు తృప్తి పొందలేకపోతే, నాకు స్వర్గం కూడా అనవసరం". ఇలా ఎందరో సతీ సహగమన ఆచారాన్ని, దాని గొప్పతనాన్ని వేయినోళ్ళతో కీర్తించారు.

ఇక నిర్బంధ వైధవ్యం ఎలా గొప్ప ఆచారంగా మారిందో మాత్రం నాకు తెలీదు. దాన్ని కీర్తించిన వాళ్ళు కూడా ఎవరూ నాకు తారసపడలేదు. కానీ ఆచరించే వాళ్ళు మాత్రం ఎందరో మనకు కనిపిస్తారు.

బాలికా వివాహం గూర్చి ఘనంగా పొగడుతూ రాసిన రాతలు చాలానే దొరుకుతాయి. డా.కేట్కర్ గారు అలాంటి ఒక రాతను మనకోసం సేకరించి పెట్టారు. "నిజాయితీ పరులు, పవిత్రులైన స్త్రీ, పురుషులు తాము వివాహం ద్వారా ఎవరితో ఏకమయ్యారో ఆ వ్యక్తులతో తప్ప మరి ఏ ఒక్కరిపైన కూడా వ్యామోహం కలిగి వుండరాదు. పెళ్ళి అయిన తరువాత మాత్రమేకాదు, పెళ్ళి కాకముందునుండి కూడా ఈ నియమాన్ని పాటించి తీరాలి. అదే నిజమైన శీలానికి గుర్తు. తాను భవిష్యత్తులో పెళ్ళి చేసుకోబోయే వ్యక్తిని తప్ప మరొకరిని ఇష్టపడే ఏ కన్య కూడా శీలవంతురాలు కాదు. అయితే తాను ఎవరిని పెళ్ళి చేసుకోబోతున్నది ఆమె తెలుసుకోలేదు కాబట్టి పెళ్ళికి ముందు ఏ పురుషున్ని కూడా ఆమె ఇష్టపడరాదు. ఆమె అలా చేస్తే అది పాపం. అందువల్ల ఒక బాలిక మనసులో లైంగిక పరమైన భావనలు పుట్టకముందే, తాను ఎవరిని ప్రేమించాలో ఆ బాలికకు స్పష్టంగా తెలియాలి. దీనికి ఏకైక మార్గం, బాలికా వివాహమే."

ఈ గంభీర, పాండిత్య పటాటోపం చూసారు కదా! ఈ ఆచారాలు ఎందుకు గౌరవనీయమైనవో, పవిత్రమైనవో చెప్పేందుకే ఈ తంటాలు. కానీ ఈ ఆచారాలు ఎందుకు పుట్టాయో మాత్రం ఎవరూ వివరించరు. నా వాదన ఏమిటంటే ఈ నియమాలను అందరూ ఆచరిస్తున్నారు కాబట్టే వాటిని అందరూ పొగుడుతున్నారు. 18వ శతాబ్దంలో తలెత్తిన వ్యక్తివాదం గురించి కొద్దిగా పరిచయం వున్నవారెవరైనా నా మాటలను అర్థం చేసుకుంటారు. ఏ కాలంలో అయినా సాంఘిక వుద్యమమే ప్రధానమైనది. కొద్ది కాలానికి ఆ వుద్యమాన్ని కేంద్రంగా చేసుకుని అనేక సిద్ధాంతాలు, తత్వశాస్త్రాలు పుట్టి పెరుగుతాయి.

ఆ వుద్యమాన్ని సమర్థిస్తాయి. ఆ వుద్యమానికి అవసరమైన నైతిక మద్దతునూ, ఆమోదనీయతనూ సమకూర్చేందుకు ప్రయత్నిస్తాయి. ఇదే విధంగా హిందూ సమాజంలోని పై ఆచారాలు ఇంతగా ఎందుకు కీర్తించబడుతున్నాయంటే, ఆ ఆచారాలు బతికి బట్టకట్టేందుకు ఈ స్తోత్ర పాఠాలు అవసరమవుతున్నాయన్నమాట. ఈ ఆచారాలు ఎందుకు పుట్టాయి అనే ప్రశ్నకు నా సమాధానం ఒకటే. కులం అనే సాంఘిక వ్యవస్థను నిర్మించడానికే ఈ ఆచారాలు పుట్టాయి. ఈ ఆచారాలను కీర్తించే తాత్త్విక, నైతిక సిద్ధాంతాల వుద్దేశ్యం ఈ ఆచారాలకు విస్తృత ప్రచారం కల్పించి సమాజంలో ఆమోదనీయతను సృష్టించడమే. ప్రకృతి సహజమైన బతుకు బతుకుతున్న ప్రాచీనులకు ఈ ఆచారాలు ఎంతో కంపరాన్ని కలిగించి వుంటాయి. ఆ కంపరాన్ని, వ్యతిరేకతను తొలగించి వారి చేతనే ఈ ఆచారాలు పాటించేలా చేయడానికే ఈ రకరకాల సిద్ధాంతాలు అవసరమయి వుంటాయి. చేదు మాత్రలు మింగించడానికి తేనెలో కలిపి ఇచ్చినట్లు అన్నమాట. ఈ ఆచారాలన్నీ కుల నిర్మాణానికి సాధనాలు. కానీ వీటిని ఆదర్శాలుగా ఆకాశానికి ఎత్తడం జరిగింది. సాధనాలు బాగా పనిచేసి చక్కటి ఫలితాలు ఇవ్వాలంటే ఆ సాధనాలనే పవిత్ర ఆదర్శాలుగా మార్చి కీర్తించడం అవసరం అని కుల నిర్మాతలు భావించి వుంటారు. అప్పుడు ఆ సాధనాలను ఎవరూ విస్మరించరు. సాధనాన్ని లక్ష్యం అని పిలవడం వల్ల నష్టమేమీ లేదు. దాని అసలు స్వభావాన్ని దాచిపెట్టడం మాత్రం జరుగుతుంది. సాధనాన్నే లక్ష్యం అనాలనీ, పిల్లిని కుక్క అనాలనీ నీవు ఒక చట్టం జారీ చేయవచ్చు. వచ్చే నష్టం ఏమీ లేదు. ఎందుకంటే ఆ చట్టం వల్ల పిల్లులన్నీ కుక్కలుగా మారేదేమీ వుండదు. అలాగే సాధనాన్ని లక్ష్యంగా పిలుచుకో. అంతమాత్రాన సాధనం సాధనమే. దాని స్వభావం మారదు. ఏది ఏమైనా నా అభిప్రాయం మాత్రం స్పష్టం. సతి, నిర్బంధవైధవ్యం, బాలికావివాహం అనే మూడు ఆచారాలు (సాధనాలుగా కానీ, లక్ష్యాలుగా కానీ ఎలా చూసినప్పటికీ) ప్రధానంగా ఒక కులం లోపల తలెత్తే అదనపు స్త్రీ, అదనపు పురుషుని సమస్యను పరిష్కరించి, అంతర్ వివాహాన్ని పదిలంగా వుంచే వుద్దేశ్యంతో అమలు అవుతున్నాయి. ఈ ఆచారాలు లేకుండా అంతర్ వివాహాన్ని కట్టుదిట్టంగా అమలు చేయలేము. అంతర్ వివాహం లేకుండా కులమేలేదు.

***అనువాదం: భార్గవ (హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణ పేజి- 9-17)***

***ఇంగ్లీష్ మూలం:*** Castes in India: Their Mechanism, Genesis and Development, Vol. 1, Part 1, pg 9-14

# స్త్రీలు - ప్రతీఘాతుక విప్లవం

మనువు శూద్రుల పట్ల ఉన్నదానికంటే ఎక్కువ మృదువుగా స్త్రీల పట్ల ఉన్నాడని చెప్పలేము. మొదలుపెట్టడమే స్త్రీల పట్ల చాలా చులకన భావనతో మొదలుపెడతాడు.

"213. పురుషులను వశపరచుకోవడం స్త్రీల నైజం. ఆ కారణంగానే తెలివైన పురుషులు స్త్రీల సన్నిధిలో ఏమరుపాటుగా వ్యవహరించరు".

"214. మూర్ఖులనే కాదు స్త్రీలు విజ్ఞులను కూడా తప్పుదోవ పట్టించి కోరికలకు, క్రోధానికి బానిసలను చేయగలరు."

"215. పురుషుడు తల్లితో గాని, చెల్లితో గాని, కూతురుతో గానీ ఏకాంత ప్రదేశాలలో ఉండరాదు. ఎందుకంటే ఇంద్రియాలు శక్తివంతమైనవి. అవి విజ్ఞుడిని సైతం లొంగదీయగలవు".

"14. స్త్రీలకు అందంతోనూ వయసుతోను పని లేదు. మగవాడైతే చాలు. అందగాడి కైనా సరే కురూపికైనా సరే తమని తాము అర్పించుకుంటారు."

"15. పురుషుల పట్ల వ్యామోహం వల్లా చంచల స్వభావం వల్లా సహజంగానే ఉండే కర్కశత్వం వల్ల ఎంత జాగ్రత్తగా సంరక్షించినప్పటికీ స్త్రీలు తమ భర్తల పట్ల అవిధేయంగా ఉంటారు."

"16. సృష్టికర్త వారి స్వభావాన్ని ఆ విధంగా సృష్టించాడు కాబట్టి పురుషుడు పట్టుదలతో శ్రమించి వారికి కాపలా కాయడం తప్పనిసరి."

"17. వారిని సృష్టించినప్పుడు వారికి ఆసనం, ఆభరణం, అపవిత్ర కోరికలు, ద్వేషం, నిజాయితీ లేని తనం, అసూయ, దుష్ప్రవర్తనలను కేటాయించాడు."

స్త్రీలకి వ్యతిరేకంగా మనువు ఈ ఉద్దేశంతోనే చట్టాలు తయారుచేశాడు. స్త్రీలు ఎటువంటి పరిస్థితుల్లోనూ స్వేచ్ఛగా ఉండకూడదు. మనువు అభిప్రాయంలో....

"2. స్త్రీలను పగలు, రాత్రి తమ కుటుంబంలోని మగవాళ్ళ పై ఆధారపడేలా ఉంచాలి. ఒకవేళ వాళ్లు ఇంద్రియ సుఖాలకు అలవాటు పడితే వారిని అదుపు చేయాలి."

"3. ఆమెను బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు సంరక్షిస్తారు. స్త్రీ ఎట్టి పరిస్థితుల్లో స్వతంత్రంగా ఉండరాదు."

"5. అవి ఎంత అల్పమైనవి అనిపించినా సరే చెడు తలంపులకు పాల్పడకుండా మహిళలను రక్షించు కోవాలి. అలా రక్షించుకోకపోతే వారు కుటుంబాలకు విషాదాన్ని కలిగిస్తారు."

"అన్ని కులాలకు ఉండే అత్యున్నత విధులను దృష్టిలో పెట్టుకున్నప్పుడు, బలహీనులైన భర్తలు కూడా తమ భార్యలను రక్షించుకోవాలి."

"147. బాలిక కానీ యువతి గానీ వృద్ధురాలు గానీ ఆమె సొంత ఇంట్లోనైనా సరే స్వతంత్రంగా ఏదీ చేయకూడదు."

"148. బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త అధీనంలో ఉండాలి. భర్త మరణించినప్పుడు కొడుకుల అధీనంలో ఉండాలి. స్త్రీ ఎన్నడూ స్వతంత్రంగా ఉండరాదు."

"149. ఆమె తండ్రి నుండి కానీ భర్త నుండి కానీ కొడుకుల నుండి కానీ వేరు పడాలని ప్రయత్నించకూడదు. వారిని వదిలి పెట్టడం ద్వారా ఆమె రెండు కుటుంబాలకు (తనది, తన భర్తది) అప్రతిష్ట కలుగచేస్తుంది. స్త్రీ కి విడాకుల హక్కు ఉండరాదు."

"45. వివాహానంతరం భార్యాభర్తలు ఒకటవుతారు. దానర్థం ఒకసారి వివాహం అయిన స్త్రీ ఇక విడిపోవడం అనేది ఉండకూడదు."

చాలామంది హిందువులు విడాకుల విషయంలో మనువు చెప్పిన చట్టం విషయంలో ఇక్కడే ఆగిపోయి వివాహాన్ని మనువు చాలా పవిత్రంగా భావించాడనీ అందువల్లనే విడాకులను అనుమతించలేదని భావిస్తూ ఆత్మ సంతృప్తి పొందుతుంటారు. ఇది చాలా వాస్తవ దూరమైన విషయం. అతను విడాకుల చట్టం రూపొందించిన ఉద్దేశం పూర్తిగా వేరు. అది పురుషుల్ని స్త్రీకి కట్టబెట్టడం కోసం కాదు. స్త్రీని పురుషుడికి కట్టబెట్టి పురుషుడ్ని స్వేచ్ఛగా వదిలిపెట్టడానికే ఉద్దేశించినవి. ఎందుకంటే పురుషుడు తన భార్యను వదిలిపెట్టడాన్ని మనువు నిరోధించలేదు. పురుషుడు స్త్రీని వదిలి పెట్టడానికే కాదు అమ్మి వేయడానికి సైతం అనుమతిస్తాడు. భార్య మాత్రం విడిపోయి స్వతంత్రురాలు కావడాన్ని నిరోధిస్తాడు. మనువు ఏం చెప్పాడో చూడండి....

"46. అమ్మకం వల్ల గానీ, పరిత్యజించడం వల్ల గానీ భార్య భర్త నుండి విడుదల కాజాలదు."

దీనర్థం భార్యను అమ్మివేసినా విడిచి పెట్టినా తనను కొనుక్కున్న వారికి గాని వేరొకరికి గాని చట్టబద్ధమైన భార్య కాజాలదు. దీనికన్నా దుర్మార్గం మరొకటి లేదు. మనువు తన న్యాయ సూత్రాలు రూపొందించేటప్పుడు న్యాయాన్యాయాలను గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. బౌద్ధం స్త్రీలకు అనుమతించిన స్వేచ్ఛను వారికి దక్కకుండా చేయాలని అతను తలచాడు. స్త్రీలకు స్వాతంత్రం ఉండడాన్ని మనువు సహించలేకపోయాడు. దానిని అరికట్టడానికే ఆమెకు స్వేచ్ఛ లేకుండా చేశాడు. ఆస్తికి సంబంధించి మనువు భార్య స్థాయిని ఒక బానిస స్థాయికి దిగజార్చాడు.

"416. భార్యకు, కొడుకుకు, బానిసకు ఆస్తి ఉండదు. వారు ఎవరికి చెందుతారో వారు సంపాదించే/పొందే ఆస్తి కూడా అతనికే చెందుతుంది."

ఒక స్త్రీ వితంతువు అయినప్పుడు ఒకవేళ ఆమె భర్తది ఉమ్మడి ఆస్తి అయి ఉంటే ఆమెకు పోషణ ఖర్చునూ భర్త వేరు పడి ఉంటే భర్త ఆస్తి నుండి భరణాన్ని అనుమతించాడు కానీ ఆ ఆస్తి పై ఆమెకు అధికారాన్ని అనుమతించలేదు. మనుస్మృతి ప్రకారం భార్యని కొట్టే హక్కు భర్తకు ఉంటుంది.

"299. భార్య, కొడుకు, బానిస, విద్యార్థి, తమ్ముడు తప్పు చేస్తే తాడుతో గాని బెత్తంతో కానీ కొట్టవచ్చు."

తక్కిన విషయాలలో మనువు స్త్రీని శూద్రుల స్థాయికి దిగజార్చాడు. శూద్రులకి చేసినట్టే వేదాలు పఠించే హక్కును వారికి మనువు నిషేధించాడు.

"66. స్త్రీలు కూడా సంస్కారాలు ఆచరించవలసిన అవసరం ఉంది. తప్పక ఆచరించాలి. కానీ వాటిని వేదమంత్రాలు చదవకుండా ఆచరించాలి."

"స్త్రీలకు వేదాలు చదివే హక్కు లేదు. అందువల్లనే వారు చేసే సంస్కారాలు వేద మంత్రాల పఠనం లేకుండా జరుగుతాయి. స్త్రీలకు మతం గురించిన జ్ఞానం ఏమీ ఉండదు. ఎందుకంటే వారికి వేదాలు చదివే హక్కులేదు. వేద మంత్రాలు చదవడం వల్ల పాపాలు పరిహారమవుతాయి. స్త్రీలు వేదాలు చదవలేరు కనక వారు అసత్యం వలెనే అపవిత్రులు."

మతాచారాలకు ముఖ్యమైనవి క్రతువులు. స్త్రీలు అటువంటి క్రతువులు నిర్వహించడాన్ని మనువు నిషేధించాడు.

"36. స్త్రీలు వేదాలలో ఉటంకించిన క్రతువులు ఆచరించడం నిషేధం."

"37. ఒకవేళ ఆచరిస్తే ఆమె నరకానికి పోతుంది."

ఆమె క్రతువులు చేయకుండా నిరోధించేందుకు మనువు ఆమెకు బ్రాహ్మణ పురోహితుల సహకారం అందకుండా చేసాడు.

"205. స్త్రీలు నిర్వహించిన క్రతువులలో బ్రాహ్మణులు భోజనం ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదు."

"206. స్త్రీలు నిర్వహించే క్రతువులు అపవిత్రమైనవి. భగవంతునికి ఆమోదం కానివి. అందువల్ల వాటికి దూరంగా ఉండాలి.

స్త్రీలకు మేధోపర జిజ్ఞాస కానీ నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛగానీ ఆలోచించే స్వేచ్ఛగానీ ఉండకూడదు. బౌద్ధం వంటి ఇతర మతాలలో చేరకూడదు. ఒకవేళ అలా చేరి మరణించేవరకూ ఆ మతంలోనే కొనసాగితే చనిపోయాక వారికి తర్పణాలు వదలకూడదు."

చివరగా జీవితాదర్శంగా మనువు స్త్రీల ముందు ఉంచిన విషయం గురించి ఒక్క మాట. అది మనువు మాటల్లో చెప్పడమే ఉత్తమం.

"151. తండ్రి గానీ తండ్రి అనుమతితో సోదరుడు గానీ ఆమెను వివాహబంధంలో ఎవరికి ఇస్తారో అతను జీవించి ఉన్నంత కాలం ఆమె అతనికే విధేయురాలుగా ఉండాలి. అతను మరణించాక అతని స్మృతిని అవమానపరచకూడదు. విధివంచితుడైనా, వేరే చోట సుఖాలను వెతుక్కుంటున్నా, మంచి అలవాట్లు లేకున్నా విధేయురాలైన భార్య భర్తని ఎల్లప్పుడూ దైవంలాగా పూజిస్తూ ఉండాలి."

"155. స్త్రీలు భర్తలను వదిలిపెట్టి ఏ క్రతువులూ ఏ నోములూ ఏ ఉపవాసాలూ చేయనవసరం లేదు. భర్తకు విధేయురాలుగా ఉండడం అనే ఒక్క విషయం తోటే ఆమెకు స్వర్గం ప్రాప్తిస్తుంది."

ఈ ఆదర్శం సారాంశంగా మనువు అనేక ధర్మపన్నాలు నిర్దేశించాడు.

"153. పవిత్ర మంత్రాలతో వివాహం చేసుకున్న భర్త తోనే రుతుకాలంలోనూ ఋతుకాలం కానికాలంలోనూ ఇహలోకంలోనూ పరలోకంలోనూ ఆమె సుఖ సంతోషాలు ఉంటాయి."

"150. ఆమె ఎల్లప్పుడు సంతోషంగానూ అతని కుటుంబ వ్యవహారాలు చక్కపెట్టడంలో తెలివిగానూ గిన్నెలు శుభ్రం చేయడంలో జాగ్రత్తగానూ ఖర్చుపెట్టడంలో పొదుపరిగానూ ఉండాలి."

ఇవీ హిందువులు స్త్రీలకు చూపించిన గొప్ప ఆదర్శం!!!

**మనువుకు పూర్వం ఉన్న కాలంతో దీనిని పోల్చి చూద్దాం.**

బ్రహ్మచర్యాన్ని ముగించి వివాహానికి సిద్ధమైన యువతి ఉపనయనానికి అర్హురాలనే విషయం అధర్వణ వేదంలో స్పష్టంగా ఉంది. స్త్రీలు మంత్రాలు జపించవచ్చనీ స్త్రీలకు కూడా వేదాలు చదవడం నేర్పారని శ్రౌత సూత్రాలలో స్పష్టంగా ఉంది. స్త్రీలు గురుకులాలలో విద్య నేర్చారనీ వేదాలలోని వివిధ శాఖలను అధ్యయనం చేసి తర్కంలో ఆరితేరారు అనడానికి పాణిని రచించిన అష్టాధ్యాయ ఒక సాక్ష్యం. పతంజలి రచించిన మహాభాష్యంలో విద్యార్థినులకు గురువులుగా మహిళలే వేదాలు బోధించారని పేర్కొన్నాడు. మతం, తత్వశాస్త్రం, అధిభౌతిక శాస్త్రం వంటి సంక్లిష్ట విషయాలపై స్త్రీలు పురుషులతో బహిరంగ చర్చల్లో పాల్గొన్న ఉదంతాలు కొల్లలు. జనకుడు సులభల మధ్యా, యాజ్ఞవల్కుడు గార్గిల మధ్యా, యాజ్ఞవల్కుడు మైత్రేయిల మధ్యా, శంకరాచార్య విద్యాధరిల మధ్య జరిగిన బహిరంగ వాగ్వివాదాలు మనువుకు ముందు కాలంలో స్త్రీలు విద్య, అధ్యయనాలలో అత్యున్నత శిఖరాలను అధిరోహించారని తెలియజేస్తున్నాయి.

ఒకప్పుడు స్త్రీలను అత్యున్నతంగా గౌరవించారనటంలో సందేహం లేదు. ప్రాచీన భారతదేశంలో మహారాజు పట్టాభిషేక సమయంలో ప్రముఖ పాత్ర వహించిన 'రాత్నులలో' రాణి కూడా ఒకరు. ఇతరులకు అర్పించినట్టే రాజు రాణికి కూడా పూజలు అర్పించేవాడు.

రాణికే కాకుండా పట్టాభిషిక్తుడు అవుతున్న రాజు కింది కులాలకు చెందిన తన ఇతర భార్యలకు కూడా పూజలు అర్పించేవాడు. పట్టాభిషేకం పూర్తయ్యాక తన శ్రేణులలోని ముఖ్య నాయకుల భార్యలకు కూడా నమస్కరించే వాడు.

కౌటిల్యుని కాలంలో స్త్రీలు 12 ఏళ్లకు పురుషులు 16 ఏళ్లకు వయస్కులు అయినట్టుగా పరిగణించేవారు. వయస్కులయ్యే వయసు అంటే వివాహ యోగ్యమైన వయసు అనే అనుకోవాలి. వివాహాలు రజస్వల అయిన తరవాతే జరిగేవనేది బౌద్ధాయనుల 'గృహ్య సూత్రాల' నుండి స్పష్టం అవుతోంది. అందులో వివాహ సమయంలో వధువుకు రుతుక్రమం వస్తే అనుసరించవలసిన ప్రాయశ్చిత్త పద్ధతుల గురించి ప్రస్తావన ఉంది.

కౌటిల్యుని ప్రకారం సమ్మతి వయసు అనేది ఏం లేదు. ఎందుకంటే వివాహాలు రజస్వల అనంతరమే జరిగేవి. వధువు కానీ వరుడు గాని వివాహానికి పూర్వం మరో వ్యక్తితో కాని, లేదా రుతుక్రమంలో ఉన్న కన్యతో కానీ శారీరక సంపర్కం కలిగి ఉన్న విషయాన్ని దాచి పెట్టి వివాహం చేసుకోవడం అనే దాని గురించే ఎక్కువ పట్టించుకున్నాడు. మొదటి విషయం గురించి కౌటిల్యుడు ఇలా అంటాడు.

ఏ వ్యక్తి అయినా అమ్మాయికి వివాహ పూర్వమే వేరొకరితో శారీరక సంబంధం కలిగి ఉన్నదన్న విషయాన్ని చెప్పకుండా ఆమెకు వివాహం చేస్తే అతనికి దండుగ విధించడమే కాకుండా అతను వధువు తరఫున పుచ్చుకున్న శుల్కం, స్త్రీధనాన్ని కూడా తిరిగి ఇవ్వాలి. అలాగే తన వైపు దోషాలను బయట పెట్టకుండా వివాహం చేసుకున్న అబ్బాయి రెట్టింపు దండగ చెల్లించడమే కాకుండా అతను చెల్లించిన శుల్కం, స్త్రీ ధనం కూడా కోల్పోతాడు.

రెండవ సందర్భంలో కౌటిల్యుని సూత్రం ఈ విధంగా ఉంది. "రజస్వల అయిన మూడేళ్ల వరకూ అవివాహితగా ఉన్న ఒకే కులానికి, శ్రేణికి చెందిన కన్యతో సంబంధం పెట్టుకోవడం నేరం కాదు. అలాగే రజస్వల అయిన మూడేళ్ల వరకు కన్యగా ఉండి తన శరీరంపై ఆభరణాలు లేని వేరే కులానికి చెందిన యువతితో సంబంధం కలిగి ఉండడం కూడా తప్పు కాదు. మనువు లాగా కాకుండా కౌటిల్యుడు ఏక పత్నీత్వాన్ని సమర్థిస్తాడు. పురుషులు కొన్ని ప్రత్యేక సందర్భాలలో మాత్రమే ఒకరికంటే ఎక్కువ భార్యలను కలిగి ఉండొచ్చు. ఆ సందర్భాలను కౌటిల్యుడు ఈ విధంగా వివరిస్తాడు. "ఒక స్త్రీ ప్రాణం ఉన్న పిల్లల్ని కనలేకపోయినా లేదా మగ పిల్లవాడు కలగకపోయినా లేక గొడ్రాలైనా ఆమె భర్త మరో వివాహం చేసుకోవడానికి కనీసం ఎనిమిదేళ్ల పాటు ఆగాలి. ఆమె విగతజీవికి జన్మనిస్తే పదేళ్ల పాటు ఆగాలి. ఆడపిల్లల్ని మాత్రమే కంటే పన్నెండేళ్ళ పాటు ఆగాలి. అప్పటికీ మగపిల్లలు కావాలనుకుంటే మరో వివాహం చేసుకోవచ్చు. ఈ నియమాలను ఉల్లంఘించిన పక్షంలో ఆమెకు శుల్కం, స్త్రీధనం మాత్రమే కాకుండా తగినంత పరిహారం ధన రూపంలో చెల్లించాలి. అంతేకాకుండా 24 పనల దండుగను ప్రభుత్వానికి చెల్లించాలి.

వివాహ సమయంలో శుల్కం, స్త్రీధనం పొందని స్త్రీలకు కూడా అది చెల్లించి తన భార్యలకు తత్సమానమైన పరిహారాన్ని, తగినంత పోషణ సొమ్మును చెల్లించిన పక్షంలో అతను ఎందరినైనా వివాహం చేసుకోవచ్చు. ఎందుకంటే స్త్రీలను సృష్టించిందే కొడుకులను కనడానికి."

మనువు కాలంలో లాగా కాకుండా కౌటిల్యుని కాలంలో స్త్రీలు పరస్పర ద్వేషం, అసహ్యం కారణాలతో విడాకులు పొందవచ్చు. భర్తని ద్వేషించే ఒక స్త్రీ అతని ఆమోదం లేకుండా వివాహాన్ని రద్దు చేయడానికి వీలు లేదు. అలాగే భార్య అనుమతి లేకుండా భర్త వివాహాన్ని రద్దు చేయలేడు. కానీ పరస్పరం ద్వేషించుకొనే వారి విషయంలో విడాకులు పొందవచ్చు. భార్య నుండి ప్రమాదాన్ని శంకించి విడిపోదలచుకున్న పురుషుడు వివాహ సమయంలో ఆమెకు ఇచ్చినవన్నీ ఆమెకు చెల్లించాలి. ఒకవేళ భర్త నుండి ప్రమాదాన్ని శంకించి విడిపోదలుచుకున్న స్త్రీ ఆమెకు చెందే ఆస్తిపై హక్కులను కోల్పోతుంది. చెడు ప్రవర్తన ఉన్న భర్తను ఆమె వదిలి వేయవచ్చు.

కౌటిల్యుని కాలంలో ఒక స్త్రీ గాని వితంతువు గాని పునర్వివాహం చేసుకోవడంపై నిషేధం లేదు.

"ఒక స్త్రీకి భర్త చనిపోయినప్పుడు ఆమె పవిత్ర జీవితం గడప దలచుకుంటే ఆమెకు ఒకేసారిగా ఆమె మాన్యం, ఆమె ఆభరణాలు మాత్రమే కాకుండా ఆమెకు చెల్లించవలసిన శుల్కం కూడా వెంటనే ఇవ్వాలి. ఇవి పొందిన అనంతరం ఆమె మరో వివాహం చేసుకుంటే ఆ ధనాన్ని, ఆభరణాలు అయితే వాటి విలువపై వడ్డీతో సహా చెల్లించాలి. ఒకవేళ వితంతువు తిరిగి వివాహం చేసుకోదలచుకుంటే ఆమె మామ గారు లేదా భర్త లేదా ఇద్దరూ, ఆమెకు ఇచ్చిన వాటిని రెండవ వివాహం సందర్భంలో ఆమెకు చెల్లించాలి. స్త్రీలు పునర్వివాహం ఎప్పుడు చేసుకోవచ్చున్న విషయం "భర్తల సుదీర్ఘ ప్రయాణం" అన్న అంశం గురించి ప్రస్తావించిన సందర్భంలో వివరంగా ఉంది.

"ఒక వితంతువు తన మామగారు ఎంపిక చేసిన వ్యక్తిని కాకుండా వేరే వ్యక్తిని వివాహం చేసుకుంటే ఆమెకు మామగారు కానీ భర్త గాని ఇచ్చిన సొమ్మును కోల్పోతుంది. ఒకవేళ ఆ స్త్రీ జ్ఞాతి (బంధువు) నే వివాహం చేసుకుంటే ఆమె పునర్వివాహ సమయంలో మామగారు ఇచ్చినవి ఏమైనా ఆ బంధువు ఆమె మామ గారికి తిరిగి ఇచ్చేయాలి. ఒక స్త్రీ సంరక్షణ భారం వహించేవారు ఎవరైనా అంతే బాధ్యతతో ఆమె ఆస్తిని కాపాడాలి. పునర్వివాహం చేసుకున్న స్త్రీ మరణించిన భర్తకు చెందిన ఆస్తిపై హక్కును ఏర్పరుచుకోజాలదు."

"ఆమె ఒకవేళ పవిత్ర జీవితం గడప తలుచుకుంటే ఆమె ఆస్తిని అనుభవించవచ్చు. కొడుకు లేదా కొడుకులు ఉన్న స్త్రీ, తన స్త్రీ ధనాన్ని స్వేచ్ఛగా ఖర్చు పెట్టడానికి వీల్లేదు.

ఎందుకంటే దానిపై ఆమె కొడుకులకు హక్కు ఉంటుంది. భర్తతో విడిపోయిన స్త్రీ పునర్వివాహం తర్వాత మునుపటి భర్త ద్వారా కలిగిన కొడుకుల పోషణ కోసం ఆస్తిని ఉపయోగించ దలచుకుంటే దానిని కొడుకుల పేరు మీదకు మార్చవలిసి ఉంటుంది. ఒకవేళ ఒక స్త్రీ వేరు వేరు భర్తల నుండి అధిక సంఖ్యలో కొడుకులను కలిగి ఉంటే ఆమె తన భర్తల నుండి సంక్రమించిన ఆస్తిని యధాతథంగా ఉంచాలి. ఒక స్త్రీకి ఆస్తి మీద పూర్తి స్వతంత్రతతో స్వేచ్ఛగా అనుభవించి ఖర్చుపెట్టే సర్వ హక్కులు ఉండి ఉన్నప్పటికి ఆమె పునర్వివివాహం చేసుకుంటే ఆస్తిని ఆమె తన కొడుకుల పేర రాయ వలసిందే."

"గొడ్రాలయిన ఒక స్త్రీ, మరణించిన తన భర్త పడకకు విధేయంగా ఉంటే ఆమె తన గురువు రక్షణలో ఉంటూ జీవించి ఉన్నంత కాలం ఆస్తిని అనుభవించవచ్చు. ఆస్తి కలిగిన వితంతువుకు రాగల ప్రమాదాలను ఇది దూరంగా ఉంచుతుంది. ఆమె మరణానంతరం ఆస్తి దాయాదులకు చెందుతుంది. భర్త జీవించి ఉండగా భార్య చనిపోతే ఆమె ఆస్తిని కొడుకులు, కూతుళ్ళు పంచుకుంటారు. మగ పిల్లలు లేని పక్షంలో ఆడపిల్లలు పంచుకుంటారు. పిల్లలు లేని సందర్భంలో భర్త తాను వివాహ సమయంలో ఇచ్చిన శుల్కం తిరిగి తీసుకుంటాడు. బంధువులు బహుమతి రూపంలో గాని కట్నాల రూపంలో గాని ఆమెకు ఇచ్చిన వాటిని తిరిగి తీసుకోవచ్చు. ఆ రకంగా స్త్రీకి సంబంధించిన ఆస్తి వ్యవహారాన్ని పరిష్కరించాలి."

"భర్తలు కొంతకాలం కోసం విదేశాలకు వెళ్లిన సందర్భాలలో శూద్రులకు వైశ్యులకు క్షత్రియులకు లేదా బ్రాహ్మణ కులాలకు సంబంధించిన భార్యలు వారికి పిల్లలు లేకపోయి ఉంటే వరుసగా ఒక ఏడాది, రెండు, మూడు, నాలుగు ఏళ్ళు చొప్పున భర్తల కోసం వేచి చూడాలి. పిల్లలు కలిగి ఉంటే ఏడాదికంటే ఎక్కువ కాలం ఎదురు చూడాలి. వారికి పోషణ ఖర్చు అందుతూ ఉంటే పైన చెప్పిన సమయానికి రెట్టింపు సమయం వేచి చూడాలి. ఒకవేళ పోషణ అందకపోతే బంధువులు (జ్ఞాతులు) నాలుగు లేదా ఎనిమిదేళ్ల పాటు పోషించాలి. తర్వాత వివాహ సమయంలో ఇచ్చిన వాటిని వెనక్కి తీసుకొని, వారిని పునర్వివాహం చేసుకోవడం కోసం వదిలి పెట్టాలి. ఆమె బ్రాహ్మణ స్త్రీ అయి ఉండి భర్త చదువుల కోసం విదేశాలకు వెళ్లి ఆమెకు పిల్లలు లేకపోయి ఉంటే పదేళ్లపాటు భర్త కొరకు ఎదురు చూడాలి. ఒకవేళ పిల్లలు ఉంటే పన్నెండేళ్ళ పాటు ఎదురు చూడాలి. ఒకవేళ భర్త రాజసేవకుడు అయి ఉంటే జీవితాంతం ఎదురు చూడాలి. ఒకవేళ జాతి అంతరించి పోకుండా కాపాడడం కోసం భర్త గోత్రానికి చెందిన సవర్ణ వ్యక్తితో ఆమె పిల్లల్ని కని ఉంటే ఆమె శిక్షార్హురాలు కాజాలదు. భర్త లేని సమయంలో ఆమెకు పోషణ ఖర్చు అందక పోయి, ఆమె సంపన్న బంధువులు ఆమెను ఆదరించక పోతుంటే ఆమె తనకు నచ్చిన, తనను పోషించగల వ్యక్తిని పునర్వివాహం చేసుకోవచ్చు."

మనువు లాగా కాకుండా కౌటిల్యుడు వివాహిత స్త్రీకి ఆర్థిక స్వాతంత్రాన్నిచ్చేందుకు ప్రతి జాగ్రత్తనూ తీసుకున్నాడు. ఈ విషయం కౌటిల్యుని అర్థశాస్త్రంలో వివాహిత స్త్రీల మాన్యాలు, పోషణ గురించి పొందుపరచిన ఈ విషయాల నుండి స్పష్టం అవుతుంది. "పోషణ లేదా ఆభరణాలు స్త్రీకి సంబంధించిన ఆస్తి అవుతాయి. పోషణ ఖర్చు నిమిత్తం నిర్ణయించిన విలువ 2000 ఆమె పేరున రాయాలి. ఆభరణాలకు సంబంధించిన పరిమితి ఏమీ లేదు. ఆమె పోషణ నిమిత్తం భర్త ఏ ఏర్పాటూ చేయని సందర్భంలో ఈ ఆస్తిని ఆమె తన కోసం కానీ తన కొడుకు కోసం కానీ కోడలి కోసం కానీ ఖర్చు పెట్టడం నేరం కాదు. విపత్తుల సందర్భంగా గాని, అనారోగ్యం కరువుల సందర్భంగా కానీ ప్రమాద నివారణ కోసం లేదా దానధర్మాల సందర్భంగా గాని ఈ ఆస్తిని భర్త కూడా వినియోగించవచ్చు. పిల్లలకు జన్మనిచ్చిన జంట పరస్పర అంగీకారంతో ఈ ఆస్తిని ఖర్చుపెట్టడం పట్ల కూడా ఫిర్యాదు ఉండదు. మొదటి నాలుగు పద్ధతుల్లోని ఏదో ఒక పద్ధతిలో వివాహం చేసుకున్న వారు మొదటి మూడేళ్లు ఈ ఆస్తిని అనుభవించడం పై కూడా ఫిర్యాదు ఉండదు. గాంధర్వ, అసుర పద్ధతుల్లో వివాహం చేసుకున్న వారు వడ్డీతో సహా ఈ మొత్తాన్ని తిరిగి సమకూర్చ వలసి ఉంటుంది. రాక్షస, పైశాచిక వివాహాలలో ఈ ఆస్తిని వినియోగించడం దొంగతనంతో సమానం. ఆ రకంగా వివాహ విధులకు సంబంధించిన విషయాలతో వ్యవహరించవలసి ఉంటుంది."

"అపరిమిత కాలం వరకు పోషణను పొందే హక్కు కలిగిన స్త్రీ తనకు అవసరమైనంత తిండి, బట్ట లేదా తనకు భరణం ఇవ్వాల్సిన వ్యక్తి ఆదాయాన్ని బట్టి తన అవసరానికి మించి కూడా భరణం పొందవచ్చు. ఒకవేళ ఆ కాలం పరిమితం అయితే అతని ఆదాయాన్ని బట్టి నిర్దిష్ట మొత్తాన్ని నిర్ణయించి (ఆ కాలానికి సరిపడా తిండి బట్టతో పాటు అదనంగా పదవ వంతు మొత్తాన్ని) ఆమెకు చెల్లించవలసి ఉంటుంది. అలాగే వివాహ సమయంలో ఆమెకు ఇచ్చిన శుల్కం, స్త్రీ ధనం చెల్లించాలి. పునర్వివాహం చేసుకోవడానికి అనుమతించినందుకు పరిహారం కూడా చెల్లించాలి. ఒకవేళ ఆమె తన మామగారి సంరక్షణలో ఉన్నా లేదా స్వతంత్రంగా బతుకుతున్నా ఆమె భర్తపై పోషణ నిమిత్తం కేసు వేయజాలదు. ఆ రకంగా పోషణ విషయాన్ని పరిష్కరించాలి".

ఆశ్చర్యం అనిపించవచ్చు కానీ కౌటిల్యుని కాలంలో భర్త కొట్టినా అవమానపరిచినా అతనికి వ్యతిరేకంగా భార్య కోర్టుకు వెళ్లవచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే మనువుకు ముందు కాలంలో ఒక స్త్రీ స్వేచ్ఛగానూ పురుషునికి సమాన భాగస్వామిగానూ ఉంది.
ఆమెను మనువు ఎందుకు దిగజార్చాడు?

**అనువాదం: బి.అనురాధ**

**ఇంగ్లిష్ మూలం:** Women and the Counter - Revolution, Vol 3, pg 428-437

# మనువు ఉన్మాదం లేదా మిశ్రమ కులాల ఆవిర్భావం గురించి బ్రాహ్మణ వివరణ

## చిక్కుముడి-18

మనువు తన చర్చకు అనుకూలంగా వివిధ కులాలను కొన్ని ప్రత్యేక శీర్షికల క్రింద విభజించాడన్న విషయం మనుస్మృతి చదివిన వాళ్ళందరికీ తెలిసిందే. అవి (1) ఆర్యకులాలు (2) ఆర్యేతర కులాలు (3) వ్రాత్యకులాలు 4) పతిత కులాలు (5) సంకర కులాలు.

ఆర్యకులాలంటే, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగు వర్ణాలని మనువు అభిప్రాయం. మరో మాటలో చెప్పాలంటే మనువు చాతుర్వర్ణ వ్యవస్థనే ఆర్యమత సారంగా గుర్తించాడు.

చాతుర్వర్ణ సిద్ధాంతాన్ని ఆమోదించని వారిని మనువు ఆర్యేతర కులాల వాళ్ళు అని పేర్కొన్నాడు. ఉదాహరణకి దస్యు కులాన్ని ఆర్యేతర కులంగా మనువు చూపించాడు. ఒకప్పుడు చాతుర్వర్ణ సిద్ధాంతాన్ని విశ్వసించి ఆ తర్వాత తిరుగుబాటు చేసిన వాళ్లని మనువు వ్రాత్యులని పేర్కొన్నాడు. మనువు ఈ క్రింది కులాలను వ్రాత్యుల జాబితాగా చూపించాడు.

| **వ్రాత్య బ్రాహ్మణులు** | **వ్రాత్య క్షత్రియులు** | **వ్రాత్య వైశ్యులు** |
|---|---|---|
| 1. భృగ్గ కంటక | 1. జాల (ఝుల్ల) | 1.సుధన్వన |
| 2. అవంత్య | 2. మల్ల | 2. ఆచార్య |
| 3. వతధాన | 3. లచ్ఛవి | 3. కరూశ |
| 4. పుష్పద | 4. నాట (నట) | 4. విజన్మ |
| 5. శైఖ | 5. కరణ | 5. మైత్ర |
| | 6. ఖశ | 6. సాత్వత |
| | 7. ద్రవిడ | |

ఆర్య సంప్రదాయాన్ని ఆచారాలను పాటించకపోవటం వల్ల బ్రాహ్మణ మతగురువుల సేవలు కోల్పోయి శూద్రులుగా మారిన క్షత్రియులను మనువు పతిత కులాల జాబితాలో చేర్చాడు. వారిని మనువు ఈ క్రింది విధంగా పరిగణించాడు.

(1) పౌండ్రకులు (2) చోళులు (3) ద్రావిడులు (4) కాంభోజులు (6) యవనులు (6) శాక్యులు (7) పారదులు (8) పహ్లవులు (9) చీనులు (10) కిరాతులు (11) దరదులు.

తల్లిదండ్రులిద్దరూ ఒకే కులానికి చెందని పక్షంలో వారికి పుట్టిన సంతానాన్ని సంకర కులాలుగా మనువు చెప్పాడు.

ఈ మిశ్రమ కులాలను ఆయన వివిధ రకాలుగా విభజించాడు. (1) వివిధ ఆర్యకులాల సంతతి. దాన్ని (అ) అనులోమ (ఆ) ప్రతిలోమ అంటూ మనువు మరో రెండు శాఖలుగా విభజించాడు.

(2) అనులోమ, ప్రతిలోమ కులాల సంతతి.

(3) ఆర్య అనులోమ, ప్రతిలోమ కులాల, ఆర్యేతర కులాల సంతతి. ఆ కులాలను మిశ్రమ కులాల శీర్షిక క్రింద మనువు ఈ క్రింది రకాలుగా చూపాడు.

1. మిశ్రమ ఆర్యకులాల సంతతి

| తండ్రి | తల్లి | సంతతి | అనులోమ లేదా ప్రతిలోమ |
|---|---|---|---|
| బ్రాహ్మణ | క్షత్రియ | ? | |
| బ్రాహ్మణ | వైశ్య | అంబష్ఠ | అనులోమ |
| బ్రాహ్మణ | శూద్ర | నిషాద (పారశవ) | అనులోమ |
| క్షత్రియ | బ్రాహ్మణ | సూత | ప్రతిలోమ |
| క్షత్రియ | వైశ్య | ? | |
| క్షత్రియ | శూద్ర | ఉగ్ర | అనులోమ |
| వైశ్య | బ్రాహ్మణ | వైదేహక | ప్రతిలోమ |
| వైశ్య | క్షత్రియ | మాగధ | ప్రతిలోమ |
| వైశ్య | శూద్ర | కరణ | అనులోమ |
| శూద్ర | బ్రాహ్మణ | చండాల | ప్రతిలోమ |
| శూద్ర | క్షత్రియ | క్షత్రి | ప్రతిలోమ |
| శూద్ర | వైశ్య | ఆయోగవ | ప్రతిలోమ |

2. అనులోమ – ప్రతిలోమ కులాలతో ఆర్య కులాల సంతతి

| తండ్రి | తల్లి | సంతతి |
|---|---|---|
| 1. బ్రాహ్మణ | ఉగ్ర | ఆవృత |
| 2. బ్రాహ్మణ | అంబష్ఠ | ఆభీర |
| 3. బ్రాహ్మణ | ఆభీర | ధిగ్వణ |
| 4. శూద్ర | నిషాద | కుకూటక |

3. అనులోమ, ప్రతిలోమ కులాల మధ్య మిశ్రమ వివాహాల సంతతి

| తండ్రి | తల్లి | సంతతి |
|---|---|---|
| 1. వైదేహ | ఆయోగవ | మైత్రేయక |

| | | |
|---|---|---|
| 2. నిషాద | ఆయోగవ | మార్గవ(దాస), కైవర్త |
| 3. నిషాద | వైదేహ | కారావర |
| 4. వైదేహక | అంబష్ఠ | వేణ |
| 5. వైదేహక | కారావర | ఆంధ్ర |
| 6. వైదేహక | నిషాద | మేద |
| 7. చండాల | వైదేహ | పాండుసోపక |
| 8. నిషాద | వైదేహ | అహిందక |
| 9. చండాల | పుక్కస్స | సోపక |
| 10. చండాల | నిషాద | అంత్యవాసి |
| 11. క్షత్త | ఉగ్ర | శ్వపాక |

సంకర కులాల గురించి మనువు ఇచ్చిన జాబితాకు మనువు తర్వాతి స్మృతికారులు కొందరు కొన్ని చేర్పులు చేశారు. వారిలో ఔశాయన స్మృతి, బోధాయన స్మృతి, వశిష్ఠ స్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి, సూత స్మృతికర్తలు ఉన్నారు.

ఔశాయనస్మృతిలో ఈ క్రింది నాలుగు చేర్పులు ఉన్నాయి.

| మిశ్రమ కులం పేరు | తండ్రి కులం | తల్లికులం |
|---|---|---|
| 1. పులక్స | శూద్ర | క్షత్రియ |
| 2. ఏకజ | పులక్స | వైశ్య |
| 3. చర్మకారక | ఆయోగవ | బ్రాహ్మణ |
| 4. వేణుక | సూత | బ్రాహ్మణ |

బోధాయన స్మృతిలో ఈ క్రింది నాలుగు చేర్పులు ఉన్నాయి.

| మిశ్రమ కులం పేరు | తండ్రి కులం | తల్లి కులం |
|---|---|---|
| 1. క్షత్రియ | క్షత్రియ | వైశ్య |
| 2. బ్రాహ్మణ | బ్రాహ్మణ | క్షత్రియ |
| 3. వైన (ణ) | వైదేహక | అంబష్ఠ |
| 4. శ్వపాక | ఉగ్ర | క్షత్రియ |

మనువు జాబితాకు వశిష్ఠస్మృతి ఈ క్రింది కులాన్ని కూడా చేర్చింది.

| మిశ్రమ కులం పేరు | తండ్రి కులం | తల్లికులం |
|---|---|---|
| వైన (ణ) | శూద్ర | క్షత్రియ |

మిశ్రమ కులాల గురించి మనువు ఇచ్చిన జాబితాకు యాజ్ఞవల్క్య స్మృతి మరో రెండు నూతన కులాలను జోడించింది.

| మిశ్రమ కులం పేరు | తండ్రి కులం | తల్లికులం |
|---|---|---|
| 1. మూర్ధవాసిక | బ్రాహ్మణ | క్షత్రియ |
| 2. మహిష్య | క్షత్రియ | వైశ్య |

సూత సంహిత కర్త విస్తృత ప్రమాణంలో ఈ చేర్పులు చేశాడు. ఆయన చేర్చిన కులాల సంఖ్య అరవై మూడు.

| మిశ్రమ కులంపేరు | తండ్రి కులం | తల్లి కులం |
|---|---|---|
| 1. అంబష్ఠేయ | క్షత్రియ | వైశ్య |
| 2. ఊర్ధ్వనాపిత | బ్రాహ్మణ | వైశ్య |
| 3. కటకార | వైశ్య | శూద్ర |
| 4. కుంభకార | బ్రాహ్మణ | వైశ్య |
| 5. కుంద (డ) | బ్రాహ్మణ | వివాహిత బ్రాహ్మణి |
| 6. గోళక | బ్రాహ్మణ | వితంతు బ్రాహ్మణి |
| 7. చక్రి | శూద్ర | వైశ్య |
| 8. దౌషంత్య | క్షత్రియ | శూద్ర |
| 9. దౌషంతీ | క్షత్రియ | శూద్ర |
| 10. పత్తనశాలీ | శూద్ర | వైశ్య |
| 11. పుళింద | వైశ్య | క్షత్రియ |
| 12. బాహ్యద | శూద్ర | బ్రాహ్మణ |
| 13. భోజ | వైశ్య | క్షత్రియ |
| 14. మహీకార | వైశ్య | వైశ్య |
| 15. మాణవిక | శూద్ర | శూద్ర |
| 16. మ్లేచ్ఛ | వైశ్య | క్షత్రియ |
| 17. శాలిక | వైశ్య | క్షత్రియ |
| 18. శుండిక | బ్రాహ్మణ | శూద్ర |
| 19. శూలిక | క్షత్రియ | శూద్ర |
| 20. సపర్ణ | బ్రాహ్మణ | క్షత్రియ |
| 21. ఆగ్నేయ నర్తక | అంబష్ఠ | అంబష్ఠ |
| 22. అపితర | బ్రాహ్మణ | దౌషంతి |
| 23. ఆశ్రమక | దంతకేవల | శూద్ర |

| | | |
|---|---|---|
| 24. ఉదబంధ | సనక | క్షత్రియ |
| 25. కరణ | నాట | క్షత్రియ |
| 26. కర్మ | కరణ | క్షత్రియ |
| 27. కర్మకార | రేణుక | క్షత్రియ |
| 28. కర్మార | మాహిష్య | కరణ |
| 29. కుకుంద | మాగధ | శూద్ర |
| 30. గుహక | శ్వపచ | బ్రాహ్మణ |
| 31. చర్మోపజీవన | వైదేహిక | బ్రాహ్మణ |
| 32. చర్మకార | ఆయోగవ | బ్రాహ్మణి |
| 33. చర్మజీవి | నిషాద | కారుషి |
| 34. తక్ష | మాహిష్య | కరణ |
| 35. తక్షవృత్తి | ఉగ్ర | బ్రాహ్మణ |
| 36. దంతకవేలక | చండాల | వైశ్య |
| 37. దస్యు | నిషాద | అయోగవ |
| 38. ద్రుమిళ | నిషాద | క్షత్రియ |
| 39. నాట | పిచ్ఛల | క్షత్రియ |
| 40. నాపిత | నిషాద | బ్రాహ్మణ |
| 41. నీలాది వర్ణవిక్రేత | ఆయోగవ | చీర్కారి |
| 42. పిచ్ఛల | మల్ల | క్షత్రియ |
| 43. పింగళ | బ్రాహ్మణ | ఆయోగవ |
| 44. బాగలబ్ధ | దౌషంత | బ్రాహ్మణి |
| 45. భరూష | సుధన్వ | వైశ్య |
| 46. భైరవ | నిషాద | శూద్ర |
| 47. మాతంగ | వి(వై)జన్మ | వైశ్య |
| 48. మధూక | వైదేహిక | ఆయోగవ |
| 49. మతకార | దస్యు | వైశ్య |
| 50. మైత్ర | వి(వై)జన్మ | వైశ్య |
| 51. రజక | వైదేహ | బ్రాహ్మణ |
| 52. రథకార | మాహిష్య | కరణ |
| 53. రేణుక | నాపిత | బ్రాహ్మణ |
| 54. లోహకార | మాహిష్య | బ్రాహ్మణ |
| 55. వార్ధకి | మాహిష్య | బ్రాహ్మణ |

| | | |
|---|---|---|
| 56. వర్య | సుధన్వ | వైశ్య |
| 57. విజన్మ | భరూష | వైశ్య |
| 58. శిల్ప | మాహిష్య | కరణ |
| 59. శ్వపచ | చండాల | బ్రాహ్మణ |
| 60. శణక | మగధ | క్షత్రియ |
| 61. సముద్ర | తక్షావృ(తి)త్తి | వైశ్య |
| 62. సాత్వత | విజన్మ | వైశ్య |
| 63. సునిషాద | నిషాద | వైశ్య |

మనువు కులాలకు చేసిన ఐదు రకాల వర్గీకరణలో మొదటి నాలుగింటి విషయంలో ఇచ్చిన వివరణను తేలికగానే అర్థం చేసుకోవచ్చు. కానీ ఐదవ వర్గీకరణ లేదా సంకర కులాల విషయంలో మాత్రం ఆ వివరణ వర్తించదు. అనేక ప్రశ్నలు మన బుర్రలను వేధిస్తాయి. మొట్టమొదటి విషయం, మిశ్రమ కులాల విషయంలో మనువు ఇచ్చిన జాబితా శ్రద్ధగా రూపొందించింది కాదు. అన్ని రకాలుగా సంకరమయ్యే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని చేసిన సమగ్రమైన జాబితా కాదు.

ఆర్య కులాలు అనులోమ –ప్రతిలోమ కులాలతో కలిసినప్పుడు ఏర్పడిన మిశ్రమ కులాల గురించి చర్చించేటప్పుడు నాలుగు ఆర్య కులాలు ఒక్కొక్కటీ పన్నెండు అనులోమ – ప్రతిలోమ కులాలు ఒక్కొక్క దానితో కలిస్తే ఏర్పడే ప్రతి కొత్త కులం పేరు మనువు రాయవలసింది. అలా చేసి ఉంటే ఫలితంగా మనకు 48 కులాల జాబితా వచ్చి ఉండేది. వాస్తవంగా చెప్పాలంటే ఈ మిశ్రమ వివాహాల ఫలితంగా ఏర్పడినవి అంటూ నాలుగు కులాల పేర్లే చెప్పాడు.

అనులోమ – ప్రతిలోమ కులాల మధ్య మిశ్రమ వివాహాలు జరిగితే 12 కులాలు ఉన్నాయి కాబట్టి ఫలితంగా ఏర్పడే 144 కులాల జాబితా మనువు ఇవ్వాల్సి ఉండింది. కానీ మనువు 11 కులాల జాబితా మాత్రమే ఇచ్చాడు. ఈ 11 కులాలు ఏర్పడే క్రమంలో 5 కులాలకు సంబంధించిన ఐదు సంభావ్యతలను గురించి మాత్రమే ఇచ్చాడు. అందులో ఒకటైన వైదేహ కులం అనులోమ –ప్రతిలోమ జాబితాకు వెలుపల ఉన్న కులం. ఎనిమిదింటి గురించి పట్టించుకోనే లేదు.

ఆర్య కులాలు, ఆర్యేతర కులాల మిశ్రమం వల్ల పుట్టిన సంకర కులాల గురించి చెప్పినది అంతే వివాదాస్పదం. ఆర్యులు, ఆర్యేతరుల మధ్య నాలుగు కులాలలోని ఒక్కొక్క కులంతో మిశ్రమం చెందడం వల్ల ఏర్పడిన మొత్తం కులాల జాబితా మన దగ్గర ఉండవలసింది. ఒక్కటీ లేదు. ఆర్యేతర కులంగా దశ్యులొక్కరే ఉన్నారని అనుకుంటే అనులోమ ప్రతిలోమ కులాల్లోని ప్రతి ఒక్క కులంలో మిశ్రమం వల్ల ఏర్పడే 12 కులాల జాబితా మన ముందుండాలి. మనువు ఇచ్చిన దాంట్లో ఒకే ఒక్క కులం ఉంది.

మిశ్రమ కులాల విషయం మీద చర్చలో వ్రాత్యులకు, ఆర్య కులాలకూ మధ్య, వ్రాత్యులకూ, అనులోమ ప్రతిలోమ కులాలకు మధ్య, వ్రాత్యులకూ, ఆర్యేతర కులాలకూ మధ్య సంభోగాన్ని గురించి మనువు అసలు పట్టించుకోలేదు.

మనువు వదిలిపెట్టేసిన వాటిల్లో కొన్ని ప్రస్ఫుటమైనవీ, ముఖ్యమైనవీ ఉన్నాయి. బ్రాహ్మణులకు క్షత్రియులకూ మధ్య సంకరాన్ని గురించి తీసుకుందాం. ఈ రెండిటి సంకరం వల్ల జన్మించే కులం గురించి మనువు ప్రస్తావించలేదు. అంతేకాదు ఆ పుట్టే కులం అనులోమమా, ప్రతిలోమమా అనేది కూడా ప్రస్తావించలేదు. ఈ సమస్యతో వ్యవహరించడంలో మనువు ఎందుకు విఫలమయ్యాడు? అతని కాలంలో అటువంటి సంకరం జరగలేదనుకోవాలా? లేదా చెప్పడానికి భయపడ్డాడా? అదే అయితే ఎవరికి భయపడ్డాడు?

మనువు కానీ, ఇతర స్మృతి కారులు గానీ ప్రస్తావించిన కొన్ని మిశ్రమ కులాల పేర్లు కల్పనలాగా అనిపిస్తాయి.

మనువు జారత్వం నుండి ఏర్పడిన కులాలుగా పేర్కొన్న కొన్నిటి గురించి మనువుకు ముందు కాలంలో ఎప్పుడూ వినలేదు. ఆ తర్వాత ఆ కులాలకి ఏమైందో ఎవరికీ తెలీదు. నేటికైతే వారంతా ఎక్కడా తమ ఆనవాలు కూడా ఏమీ లేకుండా ఉనికిలో లేకుండా పోయారు. ఒక్కసారి ఏర్పడితే ఇక ఎప్పటికీ సమసిపోని ఒక ఘన పదార్థం లాంటిది కులం. ఒకసారి ఏర్పడితే ఇక అది ఒక స్వతంత్ర ఉనికిని కలిగి ఉంటుంది, ఏదైనా ప్రత్యేక కారణం ఉండి అంతరిస్తే తప్ప. అలాంటిది చాలా కొద్ది వాటికి మాత్రమే జరుగుతుంది.

అయోగవ, ధిగ్వాన, ఉగ్ర, పుక్కస, స్వాపక, స్వాపచ, పాండుసోపక, అహిందక, బండిక, మట్ట, మహికార, శాలిక, శుండిక, శూలిక, ఏకజ, కుకుండలాంటి (కొన్నిటిని మాత్రమే చెప్పుకుంటే) కులాల వారు ఎవరు? ఎక్కడున్నారు? వారికి ఏం జరిగింది?

ఇప్పుడిక మనువును ఇతర స్మృతికారులతో పోల్చి చూద్దాం. వాళ్ళు ప్రస్తావించిన మిశ్రమ కులాల గురించి వారందరికీ ఏకీభావం ఉందా? ఏ మాత్రం లేదు. కింద ప్రస్తావించిన వాటిని పోల్చి చూద్దాం.

| స్మృతికారుని పేరు | తండ్రి కులం | తల్లికులం |
|---|---|---|
| | 1. ఆయోగవ | |
| 1. మనువు | శూద్ర | వైశ్య |
| 2. ఔషణ (ఉశనసుడు) | వైశ్య | క్షత్రియ |
| 3. యాజ్ఞవల్క్య | శూద్ర | వైశ్య |
| 4. బోధాయనుడు | వైశ్య | క్షత్రియ |
| 5. అగ్ని పురాణం | శూద్ర | క్షత్రియ |

| | | |
|---|---|---|
| | **2. ఉగ్ర** | |
| 1. మనువు | క్షత్రియ | శూద్ర |
| 2. ఔషణ | బ్రాహ్మణ | శూద్ర |
| 3. యాజ్ఞవల్క్య | క్షత్రియ | వైశ్య |
| 4. వశిష్ఠ | క్షత్రియ | వైశ్య |
| 5. సూత | వైశ్య | శూద్ర |
| | **3. నిషాద** | |
| 1. మనువు | బ్రాహ్మణ | శూద్ర |
| 2. ఔషణ | బ్రాహ్మణ | శూద్ర |
| 3. బౌధాయన | బ్రాహ్మణ | శూద్ర |
| 4. యాజ్ఞవల్క్య | బ్రాహ్మణ | శూద్ర |
| 5. సూత సంహిత | బ్రాహ్మణ | వైశ్య |
| 6. సూత సంహిత | బ్రాహ్మణ | శూద్ర |
| 7. వశిష్ఠ | వైశ్య | శూద్ర |
| | **4. పుక్కస** | |
| 1. మనువు | నిషాద | శూద్ర |
| 2. బృహద్ – విష్ణు | శూద్ర | క్షత్రియ |
| 3. బృహద్ – విష్ణు | వైశ్య | క్షత్రియ |
| | **5. మాగధ** | |
| 1. మనువు | వైశ్య | క్షత్రియ |
| 2. సూత సంహిత | వైశ్య | క్షత్రియ |
| 3. బోధాయన | శూద్ర | వైశ్య |
| 4. యాజ్ఞవల్క్య | వైశ్య | క్షత్రియ |
| 5. బృహద్ – విష్ణు | వైశ్య | క్షత్రియ |
| 6. బృహద్ – విష్ణు | శూద్ర | క్షత్రియ |
| 7. బృహద్ – విష్ణు | వైశ్య | బ్రాహ్మణ |
| | **6. రథకార** | |
| 1. ఔషణ | క్షత్రియ | బ్రాహ్మణ |
| 2. బోధాయన | వైశ్య | శూద్ర |
| 3. సూత సంహిత | క్షత్రియ | బ్రాహ్మణ |

### 7. వైదేహక

| | | |
|---|---|---|
| 1. మనువు | శూద్ర | వైశ్య |
| 2. మనువు | వైశ్య | బ్రాహ్మణ |
| 3. యాజ్ఞవల్క్య | వైశ్య | బ్రాహ్మణ |

పైన పేర్కొన్న మిశ్రమ కులాల మూలాన్నీ, వ్యాప్తినీ, గురించిన వాస్తవాలను గమనిస్తే ఈస్మృతికారుల మధ్య ఇంత విస్తారమైన అభిప్రాయ భేదం ఎందుకుంది? రెండు కులాల మిశ్రమం తార్కికంగా మూడవ కులం పుట్టుకకు దారి తీయవచ్చు. కానీ అవే రెండు కులాల మిశ్రమం వివిధ కులాలను ఎలా పుట్టించగలదు? కానీ సరిగ్గా మనువు అతని అనుచరులు నొక్కి చెబుతున్నారు. ఈ కింది సందర్భాలను పరిశీలిద్దాం.

1. తండ్రి క్షత్రియుడు, తల్లివైశ్య వనిత అయినట్లయితే వారి సంతతి కులం
   (ఎ) 'క్షత్రియ' అని బోధాయనుడు చెప్పాడు.
   (బి) 'మాహిష్య' అని యాజ్ఞవల్క్యుడు అన్నాడు.
   (సి) 'అంబష్ఠ' అని సూతుడు చెప్పాడు.
2. తండ్రి శూద్రుడు, తల్లి క్షత్రియ వనిత అయితే సంతతి కులం
   (ఎ) 'క్షత్రీయ' అని మనువు చెప్పాడు.
   (బి) 'పులక్స' అని ఔషణుడు అన్నాడు.
   (సి) 'వైన(ణ)' అని వశిష్ఠుడు అన్నాడు.
3. తండ్రి బ్రాహ్మణుడు, తల్లివైశ్య స్త్రీ అయితే
   (ఎ) వీరి సంతతి 'అంబష్ఠ' అని మనువు అన్నాడు.
   (బి) సూతుడు వీరిని 'ఊర్ధ్వనాపిత' అన్నాడు.
   (సి) మళ్లీ మరోచోట 'కుంభకార' అన్నాడు.
4. తండ్రి వైశ్యుడు తల్లిక్షత్రియ వనిత అయితే
   (ఎ) వీరి సంతతిని 'మాగధ' అన్నాడు మనువు.
   (బి) సూతుడు భోజ – మ్లేచ్ఛ – శాలిక – పుళింద కులాలన్నీ ఈ ఒక్క మిశ్రమ సంతతే అన్నాడు.
5. తండ్రి క్షత్రియుడు, తల్లి శూద్ర వనిత అయితే
   (ఎ) వీరి సంతతిని 'ఉగ్ర' అని మనువు అన్నాడు.
   (బి) ఈ ఒక్క మిశ్రమ సంతతే దౌష్యంత – దౌషంతీ – శూలిక కులాలు అన్నాడు సూతుడు.

6. తండ్రి శూద్రుడు తల్లి వైశ్య వనిత అయితే,

(ఎ) వీరి సంతతిని 'ఆయోగవ' అన్నాడు మనువు.

(బి) వీరిని పత్తన శాలి, చక్రి అని అన్నాడు సూతుడు.

మరో విషయం చూద్దాం. మిశ్రమ కులాల పుట్టుక గురించి మనువు ఇచ్చిన వివరణ చారిత్రకంగా వాస్తవమైనదేనా? అభీరులతో మొదలుపెడదాం. అభీరులు బ్రాహ్మణ పురుషులకు అంబష్ట మహిళలకు పుట్టిన అక్రమ సంతానం అన్నాడు. చరిత్ర వారి గురించి ఏం చెబుతోంది? అభీరులు (అహిరుల భ్రంశ రూపం) సింధూ వరకు వ్యాపించి ఉన్న వాయవ్య ప్రాంతం కింది జిల్లాల్లో నివసించే పశుపాలక జాతులని చరిత్ర చెబుతోంది. వారు పరిపాలన చేస్తున్న ఒక స్వతంత్ర జాతి. విష్ణు పురాణం ప్రకారం అభీరులు మగధను జయించి అనేక ఏళ్ళ పాటు రాజ్యమేలారు.

అంబష్ఠులను బ్రాహ్మణ పురుషులకు వైశ్య స్త్రీలకుపుట్టిన అక్రమ సంతానం అన్నాడు మనువు. పతంజలి వీరిని ఆంబష్ఠ రాజ్య వాసులుగా పేర్కొన్నాడు. అంబష్ఠులు ఒక స్వతంత్ర తెగ అనేది నిర్వివాదాంశం. చంద్రగుప్త మౌర్యుని దర్బారులో గ్రీకు రాయబారి మెగస్తనీసు అంబష్ఠులు పంజాబ్ లో నివసించే తెగలనీ, భారతదేశం పై అలెగ్జాండర్ దండయాత్ర చేసినపుడు అతనితో పోరాడారని పేర్కొన్నాడు. మహాభారతంలో కూడా అంబష్ఠుల ప్రస్తావన ఉంది. విశిష్టమైన రాజకీయ వ్యవస్థకూ, సాహసానికీ వారు ప్రసిద్ధులు.

జారత్వ కులాలైన వైదేహక పురుషునికి కారావార స్త్రీకి జారత్వ సంబంధం వల్ల కలిగిన రెండో శ్రేణి జారకులం "ఆంధ్రులు" అని మనువు అన్నాడు. చారిత్రిక ఆధారాలు అందుకు భిన్నంగా ఉన్నాయి? దక్కను పీఠభూమికి తూర్పువైపున ఉన్న ప్రాంత ప్రజలే ఆంధ్రులు. ఆంధ్రుల గురించి మెగస్తనీస్ కూడా ప్రస్తావించాడు. ప్లినీ ది ఎల్డర్ (క్రీస్తుపూర్వం 77) ఆంధ్రుల గురించి చెబుతూ, వారు దక్కన్‌లో స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉన్న శక్తివంతమైన తెగ అనీ, వారి భూమిపై అపారమైన అధికారంతోపాటు అనేక పల్లెలనూ కందకాలూ, ప్రాకారాలు రక్షణగా ఉన్న 30 పట్టణాలనూ కలిగి ఉన్నారనీ, రాజుకు లక్షకాల్బలమూ, 2000 అశ్విక దళమూ, వెయ్యి ఏనుగులు ఉన్న పెద్ద సైన్యం ఉందనీ పేర్కొన్నాడు.

మనువు ప్రకారం మాగధులు వైశ్య పురుషునికి, క్షత్రియ స్త్రీకి పుట్టిన అక్రమ సంతానం. వ్యాకరణ కర్త పాణిని 'మాగధ'కు వేరే వ్యుత్పత్తి అర్థం ఇచ్చాడు. అతని ప్రకారం మగధ దేశస్థులు మాగధులు. మగధ అంటే ప్రస్తుత బీహారులోని పాట్నా, గయ జిల్లాల ప్రాంతం. చాలా పూర్వ కాలం నుండి మాగధులను సర్వసత్తాక స్వతంత్ర ప్రజలని పేర్కొన్నారు. వారిని గురించి మొట్టమొదట అధర్వణ వేదంలో ప్రస్తావించారు. పాండవులకు సమకాలికుడైన జరాసంధుడు మగధ రాజ్యానికి చెందిన ప్రముఖ రాజు.

మనువు ప్రకారం నిషాదులు బ్రాహ్మణ పురుషునికీ శూద్ర మహిళకి పుట్టిన అక్రమ సంతానం. చరిత్ర వేరే రకంగా చెబుతోంది. నిషాదులు స్వతంత్ర భూభాగం, తమ సొంత రాజరికం కలిగిన స్థానిక తెగ. వారు చాలా పురాతనమైన తెగ. రామాయణంలో నిషాదుల రాజు గుహుడు అనీ, వారి రాజధాని శృంగవేరపురం అనీ రాముడు అరణ్యవాసంలో ఉన్నప్పుడు ఆశ్రయం ఇచ్చారనీ పేర్కొన్నారు.

ఇక వైదేహక గురించి మనువు, వారు వైశ్య పురుషులకి బ్రాహ్మణ స్త్రీలకి కలిగిన అక్రమ సంతానం అంటాడు. వ్యుత్పత్తి అర్థం ప్రకారం చూస్తే వైదేహక అంటే విదేహ దేశవాసి అని అర్థం. ప్రాచీన విదేహ అంటే బీహార్ లోని చంపారన్, దర్భంగా జిల్లాల ప్రాంతం. ఆదేశం, ఆ దేశ ప్రజల గురించి చరిత్రలో అతి పురాతన కాలం నుండి తెలుసు. యజుర్వేదంలో వారి ప్రస్తావన ఉంది. రామాయణం వారి గురించి చెబుతుంది. రాముని భార్య సీత, విదేహ రాజు జనకుడి కుమార్తె. వారి రాజధాని మిథిల.

ఈ విధంగా చాలా విషయాలను పరిశీలించవచ్చు. ఇప్పటివరకు చెప్పినవి చూస్తే మనువు చరిత్రను ఎంత వక్రీకరించాడో శక్తివంతులైన, గౌరవనీయులైన తెగల ప్రజలను ఎట్లా జార సంతతిగా పేర్కొన్నాడో అర్థం చేసుకోవచ్చు. పెద్ద ఎత్తున అనేక తెగలను జార సంతతిని చేసేసిన మనువు దానిని వ్రాత్యులకు ఆపాదించలేదు. కానీ అతని అనుయాయులు ఆ పథకాన్ని కొనసాగించి వ్రాత్యులను కూడా జార సంతతిని చేశారు. మనువు ప్రకారం కర్ణుడు వ్రాత్యుడు. బ్రహ్మవైవర్త పురాణం వ్రాత్యులను జార సంతతిగా చేసి వైశ్య తండ్రికీ, శూద్ర తల్లికి పుట్టిన వారని చెప్పింది. మనువు ప్రకారం పౌండ్రకుడు వ్రాత్యుడు. బ్రహ్మవైవర్త పురాణం అతన్ని వైశ్య తండ్రికి, చుండీ తల్లికి పుట్టిన సంతానంగా పేర్కొంది. మనువు ప్రకారం మల్లుడు వ్రాత్యుడు. కానీ బ్రహ్మ వైవర్త పురాణం అతన్ని లెట్ట తండ్రికీ, తింబర తల్లికి పుట్టిన జార సంతతి అని చెప్పారు. మనువు ప్రకారం వార కౌటకులు వ్రాత్య బ్రాహ్మణులు. కానీ గౌతమ సంహితలో వారు బ్రాహ్మణ తండ్రికీ, వైశ్య తల్లికి జన్మించిన జార సంతతి యవనులు. మనువు ప్రకారం వ్రాత్య క్షత్రియులు. కానీ గౌతమసంహిత లో వారిని క్షత్రియ తండ్రికి శూద్ర తల్లికి పుట్టిన జార సంతతిగా పేర్కొన్నారు. కిరాతులు మనువు ప్రకారం వ్రాత్య క్షత్రియులు. కాని బల్లాల చరిత, వారిని వైశ్య తండ్రికి బ్రాహ్మణ తల్లికి పుట్టిన జార సంతతిగా పేర్కొంది.

మనువు జార సంతతిగా ప్రస్తావించిన కొన్ని జాతులు జార సంతతి కాకపోగా స్వతంత్ర జాతులని స్పష్టంగా అర్థం అవుతుంది. మరి మనువు తదితర స్మృతి కారులు వారిని జార సంతతిగా ఎందుకు పేర్కొన్నారు? ఎందుకు వారికీ ఉన్మాదం? ఈ ఉన్మాదానికి ఏదైనా పద్ధతి ఉందా?

వీటన్నిటినీ పరిశీలించిన తరువాత అసలు మిశ్రమ కులాల ప్రశ్న మనువు ఎందుకు లేవనెత్తాడనేది ఒక చిక్కుముడిగా మిగిలిపోతుంది.

బహుశా చాతుర్వర్ణ వ్యవస్థ విఫలమయింది అని మనువు గుర్తించి ఉండి ఉండాలి. బ్రాహ్మణులుగా గానీ క్షత్రియులుగా గానీ వైశ్యులుగా గానీ శూద్రులుగా గానీ వర్ణించలేని అసంఖ్యాక కులాల ఉనికి దానికి ఒక ఉదాహరణ. బహుశా చాతుర్వర్ణవ్యవస్థ ఉండగా దానికి వెలుపల ఇన్ని కులాలు ఎలా వచ్చాయనే దానికి ఒక వివరణ మనువు ఇవ్వాల్సి వచ్చి ఉండవచ్చు.

కానీ తాను ఇచ్చిన వివరణ ఎంత భయంకరమైనదో దాని పరిణామాలేమిటో మనువు గుర్తించాడా? పురుషుల వ్యక్తిత్వాలను అంతకన్నా ముఖ్యంగా స్త్రీల వ్యక్తిత్వాలను ఇది ఎంత ప్రభావితం చేస్తుందో గమనించాడా? చాతుర్వర్ణ నియమాల నిషేధం వల్ల స్త్రీ పురుషుల కలయికలు రహస్యంగా ఉంచాల్సొచ్చేది అనేది స్పష్టమే. కానీ అలాంటి రహస్య కలయికలు అక్కడక్కడా ఉండడం సంభవం. కాని అంత పెద్ద ఎత్తున జరిగేందుకు ఆస్కారం లేదు. కానీ అంత పెద్ద ఎత్తున సంకరం జరిగి ఉంటే తప్ప మనువు చెప్పిన విధంగా చండాలురూ అంటరానివారూ జన్మించే అవకాశం లేదు.

శూద్ర పురుషుడు, బ్రాహ్మణ స్త్రీ అక్రమ సంబంధంవల్ల పుట్టిన సంతానం చండాల కులం అని మనువు అన్నాడు. ఇది వాస్తవం అయ్యే అవకాశం ఉందా? దీనర్థం బ్రాహ్మణ స్త్రీలకు ఏ మాత్రం నైతిక కట్టుబాట్లు లేవనీ, వారికిశూద్రుల పట్ల ఏదో ప్రత్యేక ఆకర్షణ ఉందనీ అర్థం వస్తుంది. ఇది నమ్మ శక్యం కాదు.

చండాలుర జనాభా ఎంత విస్తారంగా ఉందంటే ప్రతి బ్రాహ్మణ స్త్రీ ఒక్కో శూద్రునికి ఉంపుడుగత్తెగా ఉందనుకుంటే కూడా ఈ దేశంలోని చండాలుర సంఖ్యకు అది సరిపోదు.

మిశ్రమ కులాల సిద్ధాంతం తయారు చేసినప్పుడు ఈ దేశంలోని అశేష ప్రజల పుట్టుకను హేయమైందిగా నిర్ణయించి వారి సామాజిక నైతిక పతనాన్ని సూచిస్తున్నాడని మనువు గుర్తించాడా? వాస్తవంలో కులాలు స్వతంత్రంగా ఉనికిలో ఉండగా వాటి పుట్టుక కులాల సంకరం వల్ల వచ్చిందని ఎందుకన్నాడు?

**అనువాదం: బి.అనురాధ**

**ఇంగ్లిష్ మూలం:** Riddle No. 18, Manu's Madness or the Brahmanic explanation of the origin of the mixed castes, Vol 4, pg 215 – 225.

# పితృసవర్ణత నుంచి మాతృసవర్ణతకి మార్పు - దీని నుంచి బ్రాహ్మణులు ఏం సాధించాలనుకున్నారు?

## చిక్కు ముడి :19

హిందూ చట్టంపై శ్రీ మేయిన్ (Mayne) రాసిన గ్రంథంలో బంధుత్వ నియమాలకు సంబంధించిన కొన్ని విపరీతమైన అంశాలను ఎత్తి చూపించారు. ఆయన ఇలా అన్నాడు.

'హిందూ చట్టంలో కుటుంబ సంబంధాలను నియంత్రించే భాగంలో ఉన్నన్ని విపరీతమైన అంశాలు, మరే భాగంలోనూ లేవు. ప్రాచీన పద్ధతులకు ప్రస్తుత పద్ధతులకూ మధ్య కొనసాగింపు పూర్తిగా ఆగిపోవటమే కాకుండా దీనికి సంబంధించిన ప్రాచీన పద్ధతులలోని వివిధ భాగాలు పరస్పర విరుద్ధంగా కూడ ఉన్నాయి. వారసత్వానికి సంబంధించిన ఒక హిందూ చట్టం ప్రకారం ఇది పద్నాలుగు తరాల వరకూ (అవిచ్ఛిన్నంగా) పురుష పూర్వీకులను వెతుక్కుంటూ వెళ్లే అవకాశం ఉంది. దీనిలోనే ఒక కుటుంబ శాసనంలో అంగీకరించిన కొన్ని వివాహ పద్ధతులున్నాయి. ఇవి "లోబరుచుకోటానికి", "బలాత్కారం చేయడానికి" పెట్టిన అందమైన మారుపేర్లు మాత్రమే. ఇందులో పన్నెండు రకాల కుమారులను గుర్తించారు. వారిలో చాలా రకాల కుమారులకు తండ్రితో రక్తసంబంధమే ఉండదు."

ఈ వైపరీత్యాలు పరమ వాస్తవాలు. హిందూ వివాహానికీ, హిందూ పితృత్వానికి సంబంధించిన శాసనాలు పరిశీలించిన వారికి ఇది స్పష్టంగా కనిపిస్తుంది.
హిందూ శాసనం ఎనిమిది రకాల వివాహాలను గుర్తించింది. అవి (1) బ్రాహ్మ, (2) దైవ, (3) ఆర్ష, (4) ప్రాజాపత్య, (6) అసుర, (6) గాంధర్వ, (7) రాక్షస, (8) పైశాచ.

బ్రహ్మ వివాహం అంటే వేదాలలో విజ్ఞుడైన (సదాచారపరుడైన) వరుడ్ని వధువు తండ్రి తనంతట తానుగా సాదరంగా ఆహ్వానించి అతనికి గౌరవంతో తన కుమార్తెను వస్త్రాభరణాదులతో కానుకగా (దానం) ఇవ్వటం.

దైవ వివాహం అంటే యజ్ఞాలు నిర్వహించే ఋత్విజునికి (కుటుంబ పూజారికి) యజ్ఞం రుసుము చెల్లించే సమయంలో దానికి బదులుగా తండ్రి తన కుమార్తెను ఇవ్వటం.
ఆర్ష వివాహం అంటే వరుడు, వధువు కోసం ఆమె తండ్రికి శుల్కం చెల్లించి, వివాహం చేసుకోవటం.

ప్రాజాపత్య వివాహం అంటే, ఒక పురుషుడు ఒక అమ్మాయిని తన భార్యగా కోరుతూ ఆమె తండ్రికి దరఖాస్తు పెట్టుకోవటం. ఆ దరఖాస్తును అమ్మాయి తండ్రి

అంగీకరించటం. ప్రాజాపత్య, బ్రహ్మ వివాహాల మధ్య ఉన్న తేడా ఏమంటే, కుమార్తెను తండ్రి కానుకగా సమర్పించటం ఇష్టపూర్వకంగా జరుగుతుంది. అయితే ప్రాజాపత్యంలో అందుకు దరఖాస్తు పెట్టుకోవాలి.

అసుర వివాహ పద్ధతిలో వరుడు, వధువు తండ్రికి, తండ్రి తరపు బంధువులకూ వధువుకూ తాను ఇవ్వగలిగినంత సంపద ఇచ్చి ఆమెను భార్యగా స్వీకరించవలసి ఉంటుంది. ఆర్ష అసుర వివాహ పద్ధతుల్లో పెద్ద తేడా ఏమీ లేదు. రెండిట్లోను వధువు అమ్మకం జరుగుతుంది. ఉన్న తేడా ఏమంటే ఆర్ష వివాహ పద్ధతిలో శుల్కం నిర్ణయమై ఉంటుంది. అసుర పద్ధతిలో అలా కాదు.

గాంధర్వ వివాహం, మతపరమైనది కాక ఇంద్రియ సుఖ సంబంధమైన ఉద్దేశాలలో చేసుకునే వివాహం. కన్యను బలవంతంగా పట్టుకొని ఆమె ఏడుస్తూ ఉంటే, సహాయం కోసం అర్థిస్తూ ఉంటే ఆమె బంధువులను స్నేహితులను యుద్ధంలో చంపిగాని, గాయపరచిగాని, వారి ఆస్తులు ధ్వంసం చేసిగాని, ఆమెను ఎత్తుకుపోయి వివాహం చేసుకోవటాన్ని రాక్షస వివాహం అంటారు.

పైశాచ వివాహం అంటే అమ్మాయిని, ఆమె నిద్రిస్తుండగా గాని, మద్యం మత్తులో ఉన్నప్పుడుగాని, ఏమరుపాటుగా ఉన్నప్పుడుగాని బలాత్కారం చేసి పెళ్ళి చేసుకోవటం. హిందూ శాసనం పదమూడు రకాల పుత్రులను గుర్తిస్తుంది. (1) ఔరస, (2) క్షేత్రజ (3) పుత్రికాపుత్ర (4) కానీన (6) గూఢజ (6) పునర్భవ (7) సహోఢజ (8) దత్తక (9) కృత్రిమ (10) కృతక (11) అపవిద్ధ (12) స్వయందత్త (13) నిషాద.

ఔరస పుత్రుడంటే, చట్ట ప్రకారం (శాస్త్రోక్తంగా) వివాహమాడిన భార్య ద్వారా తనకు పుట్టినవాడు.

పుత్రికాపుత్ర అంటే కూతురుకు పుట్టిన కొడుకు. ఈ పద్దతిలోని ప్రాముఖ్యం ఏమిటంటే ఒకరికి కొడుకుల్లేకుండా కూతురు మాత్రమే ఉంటే ఆమె తండ్రి ఎంపిక చేసిన, లేదా నియమించిన వ్యక్తితో లైంగిక సంబంధం పెట్టుకుని, అట్టి సంభోగం ద్వారా కొడుకును కంటే ఆ కొడుకు ఆమె తండ్రికి కొడుకు అవుతాడు. దీనిమూలంగానే ఆ కొడుకును పుత్రికా పుత్రుడు అని అంటారు. తనకు కొడుకుని కని ఇవ్వటం కోసం తనకు ఇష్టమైన వ్యక్తితో లైంగిక సంపర్కం పెట్టుకోవలసిందిగా బలవంతం చేసే హక్కు తండ్రికి, కూతురు వివాహం అయిపోయిన తర్వాత కూడ ఉంటుంది. అందుకనే అన్నదమ్ములు లేని అమ్మాయిని పెళ్ళి చేసుకోవద్దని హెచ్చరిస్తుంటారు.

క్షేత్రజుడు అంటే, ఆ పదం అర్థం ప్రకారం భూమి (అంటే భార్య) కొడుకు అని. హిందూ సిద్ధాంతాలలో భార్యను పొలం (క్షేత్రం)తోను భర్తను పొలం యజమానితోను పోలుస్తారు. భర్త చనిపోయినా లేదా బ్రతికి ఉండి నపుంసకుడైనా లేదా బాగు చేయలేని

రోగగ్రస్తుడైనా, అలాంటి సందర్భాలలో (సంతానం కోసం) భర్త సోదరుడిని గాని అతని సంబంధీకులను ఎవరినైనా గానీ ఆ భార్యకు కొడుకును పుట్టించటానికి నియమిస్తారు. ఈ పద్ధతిని నియోగం అంటారు. ఆ విధంగా పుట్టిన కొడుకును క్షేత్రజుడు అంటారు. తన తండ్రి ఇంట్లో నివసిస్తున్న పెళ్లికాని అమ్మాయి అక్రమ సంబంధం ద్వారా కొడుకును కని, ఆ తర్వాత ఎవరినైనా పెళ్లి చేసుకుంటే, ఆ భర్త తన పెళ్లికి ముందు భార్యకు పుట్టిన కొడుకును తన కొడుకుగా స్వీకరిస్తే, అట్టి కొడుకును కానీనుడు అంటారు.

గూఢజుడు అంటే భార్యాభర్తలు కలిసి ఉండటానికి అవకాశం ఉన్న కాలంలో అక్రమ సంబంధం ద్వారా పుట్టినట్టు అనుమానం ఉన్న కొడుకు. తిరుగులేని రుజువులతో చెప్పే అవకాశం ఏదీ లేదు కాబట్టి ఆ భర్త ఆ విధంగా పుట్టినవానిని తన కొడుకుగానే స్వీకరిస్తాడు. అతని పుట్టుక స్పష్టంగా కాకుండా గూఢంగా ఉన్నది కనుక అతనిని గూఢజుడు అంటారు.

సహోఢజుడు అంటే పెళ్లినాటికే గర్భవతిగా ఉన్న భార్యకు పుట్టిన కొడుకు. పెళ్లికి ముందే ఆమెతో సంబంధం పెట్టుకున్న భర్తకు పుట్టినవాడా లేక భర్తకు కాకుండా వేరేవానికి పుట్టినవాడా అని ఖచ్చితంగా చెప్పటానికి వీలులేదు. కాని నిశ్చయంగా, సహోఢజ అంటే గర్భవతి అయిన కన్యకు పుట్టిన కొడుకును తర్వాత ఆమెను పెళ్లి చేసుకున్న వ్యక్తి తన కొడుకుగా స్వీకరించినవాడు అని అర్థం.

పునర్భవుడు అంటే భర్తను విడిచి పెట్టేసిన స్త్రీ ఇతరులతో కొంతకాలం కాపురం చేసి తిరిగి భర్త కుటుంబంలో చేరి కన్న కొడుకు. భర్త నపుంసకుడైనా, కుల బహిష్కృతుడైనా, పిచ్చివాడైనా లేదా రోగగ్రస్థుడైనా భార్య అతనిని విడిచి పెట్టి వేరొక వ్యక్తిని భర్తగా గ్రహించి కుమారుని పొందినపుడు కూడా అతనిని ఈ విధంగా వ్యవహరిస్తారు.

"పరాశవుడు" అంటే బ్రాహ్మణునికి శూద్ర భార్య వలన కలిగిన పుత్రుడు అని అర్థం.

బాబితాలోని మిగిలిన రకాల పుత్రులు కొడుకులని చెప్పుకోవటానికి వీలుగా దత్తత చేసుకున్నవారు. 'దత్తకుడు' అంటే బాలుని తలిదండ్రుల అనుమతితో దత్తత తీసుకుని పుత్రునిగా గ్రహించినవాడు.

'కృత్రిముడు' అంటే దత్తత చేసుకుంటున్న బాలుడి సమ్మతితో మాత్రమే దత్తత చేసుకున్న పుత్రుడు.

కృతకుడు అంటే వేరే తల్లిదండ్రుల నుండి కొనుక్కున్న పుత్రుడు.

'అపవిద్ధుడు' అంటే తలిదండ్రులు విడిచి పెట్టేస్తే తెచ్చుకొని దత్తత చేసుకున్న పుత్రుడని అర్థం. 'స్వయం దత్తుడు' అంటే తల్లిదండ్రులు లేని లేదా తల్లిదండ్రులు విడిచి పెట్టివేసిన వ్యక్తి వచ్చి 'నన్ను మీ కొడుకుగా స్వీకరించండి' అని అడిగినప్పుడు ఆ విధంగా స్వీకరించినట్టి పుత్రుడు.

చాలారకాల వివాహ పద్ధతులు కన్యలను లోబరుచుకోటానికి, వారిపై లైంగిక అత్యాచారం చేయడానికి పెట్టిన అందమైన పేర్లు అనేది ఎంత నిజమో, చాలారకాల పుత్రులకు వారి తండ్రులతో రక్త సంబంధం ఎలా ఉండదో గమనించాం. ఈ వివిధ రకాల వివాహ పద్ధతులకూ, వివిధ రకాల పుత్రులకూ మనువు కాలంనాటికే చట్ట సమ్మతంగా గుర్తింపు ఉంది. మనువు చేసిన మార్పులు కూడ స్వల్పమైనవే. వివాహ పద్ధతులకు సంబంధించిన వీటిని కూడ మనువు చట్టవ్యతిరేకంగా గుర్తించలేదు. అతను చెప్పేది అంతా ఏమంటే, పై ఎనిమిది రకాల వివాహ పద్ధతులలో ఆరు, అంటే బ్రాహ్మ, దైవ, ఆర్ష, ప్రాజాపత్య, అసుర, గాంధర్వ అనేవి క్షత్రియులకు చట్ట సమ్మతమనీ – అసుర, గాంధర్వ, పైశాచ అనేవి వైశ్య, శూద్రులకు చట్ట సమ్మతమనీను.

అదే విధంగా పన్నెండురకాల పుత్రులలో ఎవరినీ అతడు తిరస్కరించలేదు. పైగా వారి బంధుత్వాన్ని గుర్తించాడు. అతడు చేసిన మార్పు ఏమంటే వారసత్వానికి సంబంధించిన నియమావళిని మార్చటం. వారిని రెండు తరగతులుగా విభజించాడు (1) వారసులు, బంధువులు (2) వారసులు కాని బంధువులు. అతనిలా అన్నాడు –

159. "తనకు పుట్టిన కొడుకు, తన భార్యకు పుట్టిన కొడుకు, దత్తత తీసుకున్న కొడుకు, రహస్యంగా పుట్టిన కొడుకు, తల్లితండ్రులు విడిచిపెట్టగా దత్తత తీసుకున్న కొడుకు, తయారు చేసుకున్న కొడుకు (పుత్రికా పుత్రుడు) ఈ ఆరుగురూ వారసులూ, బంధువులు అవుతారు."

160. "అవివాహితకు జన్మించిన పుత్రుడు, భార్యతో పాటుగా వచ్చిన కొడుకు, కొనుక్కున్న కొడుకు, పునర్వివాహం చేసుకున్న భార్యకు పుట్టిన కొడుకు, దత్తత తీసుకోమని కోరి వచ్చిన పుత్రుడు, శూద్ర వనితకు పుట్టిన కొడుకు  ఈ ఆరుగురూ వారసులు కాదు కాని బంధువులే."

ఒక మనిషి ఆస్తికి అతని ఇద్దరు పుత్రులు, ఔరసుడూ, (తనకు పుట్టినవాడు), క్షేత్రజుడు (తన భార్యకు పుట్టినవాడు) వారసులే, అయినా వారు రెండో వారిని మినహాయించి స్వంత తండ్రి ఆస్తికి (ఏ ఆస్తి ఎవరి తండ్రిదో దానికి) హక్కుదారులవుతారు.
తండ్రికి సంబంధించిన ఆస్తికి అతని ఔరస పుత్రుడే చట్ట సమ్మతమైన యజమాని అవుతాడు. అయితే కఠినంగా ఉండకుండా ఉండడం కోసం తక్కిన పుత్రులకు పోషణార్థం కొంత భృతిని ఇవ్వవచ్చు.

సగోత్రతకు (జ్ఞాతిత్వానికి/రక్తసంబంధం) సంబంధించిన చట్టంలో వేరొక భాగం చాలా పెద్ద మార్పులు చెందింది. అయితే దానిని ఎవరూ గుర్తించలేదు. అది శిశువు వర్ణాన్ని నిర్ణయించటానికి సంబంధించినది. పిల్లలది ఏ వర్ణం అవుతుంది? అతనిది తండ్రి వర్ణం అవుతుందా? తల్లి వర్ణం అవుతుందా? మనువు కంటే ముందున్న శాసనం

ప్రకారం పిల్లల వర్ణం తండ్రి వర్ణం అయ్యేది. తల్లి వర్ణం అసలు పరిగణనలోకి తీసుకొనేవారు కాదు. ఈ సిద్ధాంతాన్ని ఋజువు చేయటానికి కొన్ని ఉదాహరణలు చాలు.

| తండ్రి | | తల్లి | | శిశువు | |
|---|---|---|---|---|---|
| పేరు | వర్ణం | పేరు | వర్ణం | పేరు | వర్ణం |
| 1. శంతనుడు | క్షత్రియ | గంగ | తెలియదు | భీష్ముడు | క్షత్రియ |
| 2. పరాశరుడు | బ్రాహ్మణ | మత్స్యగంధి | బెస్త | కృష్ణ ద్వైపాయనుడు | బ్రాహ్మణ |
| 3. వశిష్ఠుడు | బ్రాహ్మణ | అక్షమాల | – | పాయనుడు | – |
| 4. శంతనుడు | క్షత్రియ | మత్స్యగంధి | బెస్త | విచిత్రవీర్యుడు | క్షత్రియ |
| 5. విశ్వామిత్రుడు | క్షత్రియ | మేనక | అప్సర | శకుంతల | క్షత్రియ |
| 6. యయాతి | క్షత్రియ | దేవయాని | బ్రాహ్మణ | యదువు | క్షత్రియ |
| 7. యయాతి | క్షత్రియ | శర్మిష్ఠ | అసుర | దృహ్యుడు | క్షత్రియ |
| 8. జరత్కారువు | బ్రాహ్మణ | జరత్కారి | నాగ | ఆస్తికుడు | బ్రాహ్మణ |

మనువు ఏం చేశాడు? పిల్లల వర్ణం నిర్ణయించే విషయానికి సంబంధించిన సూత్రాలలో మనువు చేసిన మార్పులు చాలా విప్లవాత్మకమైనవి. మనువు ఈ క్రింది నియమాలు పెట్టాడు.

"అన్ని కులాల (వర్ణాలు) లోనూ, ఏ కులానికి చెందినవారైనా సరే తమ తమ సామాజిక క్రమంలో సమాన కులానికి చెందిన కన్యలను చట్ట సమ్మతంగా వివాహం చేసుకోవటం ద్వారా సంతానం పొందితే ఆ పిల్లలకు తమ తండ్రి కులం వర్తిస్తుంది." (5)

"ద్విజునికి అతనికంటె కింది కులం స్త్రీ వల్ల పుట్టిన పుత్రులకు తండ్రి కులం వంటి కులమే వస్తుంది కానీ వారి తల్లుల తప్పిదంవల్ల వారు నిందాస్పదులవుతారు". (6)

"ద్విజునికి అతనికంటే కొంచెం కిందిస్థాయి కులానికి చెందిన భార్యవల్ల కలిగిన పుత్రులు, కులక్రమంలో (తల్లుల నుంచి సంక్రమించిన దోషంవల్ల) 'అనంతరులు'గా (అంటే తరవాతి స్థాయి కులానికి చెందిన వారుగా) పరిగణించబడతారు." (14)

"ఆర్యులకు తమతో సమాన కులానికి, లేదా కొంచెం దిగువస్థాయి కులానికి (అనంతర) చెందిన స్త్రీల వల్ల పుట్టిన ఆరుగురు పుత్రులు, ద్విజుల ధర్మాలే కలిగి ఉంటారు. అయినాగాని నియమోల్లంఘనం ద్వారా జన్మించారు కాబట్టి విధులకు సంబంధించిన విషయాలలో వారంతా శూద్రులతో సమానంగా ఉంటారు". (41)

మనువు ఈ క్రింది సందర్భాలను ప్రత్యేకమైనవిగా గుర్తించాడు.

(1) తండ్రీ తల్లీ ఒకే వర్ణానికి చెందిన వారైతే

(2) తల్లి, తండ్రి కులంకంటే ఒక మెట్టు కింది కులానికి చెందినది అయి ఉంటే – ఉదా: బ్రాహ్మణ తండ్రి– క్షత్రియ తల్లి, క్షత్రియ తండ్రి– వైశ్య తల్లి, వైశ్య తండ్రి– శూద్ర తల్లి

(3) తల్లికులం, తండ్రి కులానికి ఒక మెట్టు కంటే ఇంకా క్రిందిది అయి ఉంటే – ఉదా: బ్రాహ్మణ తండ్రి వైశ్య లేదా శూద్రతల్లి, క్షత్రియ తండ్రి–శూద్రతల్లి

మొదటి సందర్భంలో పిల్లలకు తండ్రి కులం వర్తిస్తుంది. రెండో సందర్భంలో కూడ పిల్లల కులం తండ్రి కులమే అవుతుంది. మూడో విషయంలో పిల్లల కులం తండ్రి కులం కాదు. పిల్లలకు తండ్రి కులం రాకపోతే మరే కులం వస్తుందో మనువు స్పష్టంగా చెప్పలేదు. కాని మనువును వ్యాఖ్యానించిన మేధాతిథి, కల్లుకభట్టు, నారదుడు, నంద పండితుడు మొదలైనవారంతా ఒకే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అటువంటి సందర్భాలలో పిల్లలకు తల్లి కులం వర్తిస్తుందని వారు చెప్పారు. సూక్ష్మంగా చెప్పాలంటే పిల్లల వర్ణాన్ని మనువు, పితృ సవర్ణత – (తండ్రి వర్ణం బట్టి) నుండి మాతృ సవర్ణత (తల్లి వర్ణం బట్టి) కు మార్చాడు.

ఇది చాలా విప్లవాత్మకమైన మార్పు. వివాహ రూపాలు నిర్దేశించి పెట్టి, పుత్రులలో రకాలు నిర్ణయించి, అనులోమ వివాహాలకు అనుమతి ఇచ్చి, పితృ సవర్ణ సిద్ధాంతం ప్రవేశ పెట్టి (ఇన్ని రకాలుగా) బ్రాహ్మణులు వర్ణవ్యవస్థను ఎంత కట్టుదిట్టంగా బిగించి ఉంచాలనుకున్నా అది అనియంత్రిత వ్యవస్థ అయిందనే సత్యాన్ని ఎవరూ గ్రహించకపోవడం చాలా శోచనీయమైన విషయం. వర్ణ వ్యవస్థలో చాల లొసుగులు ఉన్నాయి. కొన్ని వివాహ పద్ధతులకు వర్ణ సిద్ధాంతంతో సంబంధం లేదు. ఉండటానికి అవకాశం లేదు కూడ. రాక్షస, పైశాచ వివాహ పద్ధతుల్లో – బహుశా అన్ని సందర్భాలలోనూ పురుషులు క్రింది వర్ణాలకు, స్త్రీలు పై వర్ణాలకూ చెంది ఉంటారు. సంతానానికి సంబంధించిన నియమం కూడ శూద్రుల పిల్లలు బ్రాహ్మణ పిల్లలుగా చెలామణి కావటంకోసం చాలా లొసుగులు విడిచి పెట్టింది. ఉదా: గూఢజులు, సహోఢజులు, కానీనులను తీసుకోండి. వారు శూద్రులకు లేదా బ్రాహ్మణులకు, క్షత్రియులకు లేదా వైశ్యులకు పుట్టలేదని ఎవరు చెప్పగలరు? వీటి విషయంలో ఎలాంటి అనుమానాలు ఉన్నప్పటికీ, శాసనాంగీకారం పొందిన పితృసవర్ణతతో కూడిన అనులోమ పద్ధతి, కింది కులాల వారు పై వర్ణాలలోకి చేరిపోవటానికి వీలు కల్పించింది. శూద్రుడు బ్రాహ్మణుడు కాని క్షత్రియుడు కాని వైశ్యుడు కాని కాలేడు. కాని శూద్ర స్త్రీ శిశువు, ఆమె వైశ్యుణ్ణి వివాహమాడితే వైశ్య వర్ణానికి చెందుతుంది. క్షత్రియుణ్ణి వివాహమాడితే క్షత్రియ వర్ణానికి చెందుతుంది, బ్రాహ్మణుడిని పెళ్లాడితే బ్రాహ్మణ వర్ణానికి చెందుతుంది. క్రింది వర్ణాలను పై వర్ణాలలోకి లేవనెత్తడం (కలుపుకోవటం) వాస్తవమైనదీ రూఢి అయినదీను. అయితే ఇందుకు అనుసరించిన పద్ధతి మాత్రం పరోక్షం. పాతపద్ధతి వలన కలిగిన ఫలితాలలో ఇదొకటి. మరో ఫలితం ఏమంటే ఒక వర్ణానికి చెందిన సముదాయం ఎప్పుడూ కూడా మిశ్రమ (కలిసిపోయిన) సముదాయమే. బ్రాహ్మణ సమాజంలో బ్రాహ్మణ స్త్రీలకు, క్షత్రియ స్త్రీలకు, వైశ్య స్త్రీలకు, శూద్ర స్త్రీలకు పుట్టిన పిల్లలు ఉండి ఉంటారు. వారందరికీ బ్రాహ్మణ సమాజపు హక్కులు, యోగ్యతలు పొందే అర్హత ఉంటుంది. క్షత్రియ సమాజంలో క్షత్రియ

స్త్రీలకు, వైశ్య స్త్రీలకు, శూద్ర స్త్రీలకు పుట్టిన పిల్లలు ఉండి ఉంటారు. వారందరినీ క్షత్రియులుగానే గుర్తిస్తారు. క్షత్రియులకు ఉండే హక్కులు, ప్రయోజనాలు పొందే అర్హత వారికి ఉంటుంది. అదే విధంగా వైశ్య సమాజంలో వైశ్య స్త్రీలకు, శూద్ర స్త్రీలకు పుట్టిన పిల్లలు కూడా ఉండి ఉంటారు. వారిని వైశ్యులు గానే భావిస్తారు. వారంతా వైశ్యులకుండే హక్కులు, అర్హతలు పొందే అవకాశం ఉంటుంది.

మనువు చేసిన మార్పు హిందూ శాసనంలోని అత్యంత మౌలికమైన సిద్ధాంతాలలో కొన్నింటికి విరుద్ధమైనది. మొదటగా అది హిందూ శాసనంలోని క్షేత్ర – క్షేత్రజ నియమానికి విరుద్ధం, శిశుసంపద (శిశువు ఎవరికి చెందుతాడు) అనే విషయాన్ని గురించి వ్యవహరించేటప్పుడు శిశువుకు యజమాని, ఆ శిశువు తల్లికి చట్ట ప్రకారంగా ఉన్న భర్త అవుతాడు, కాని వాస్తవంగా జన్మకారకుడైన తండ్రి కాడు. ఈ సిద్ధాంతాన్ని గురించి మనువుకు తెలుసు. అతను ఇలా చెబుతున్నాడు.

"చట్టబద్ధమైన స్త్రీ సంపద (వైవాహిక బంధంతో తెచ్చుకున్న భార్య) లేని పురుషులు, ఇతరులకు చెందిన క్షేత్రంలో విత్తనాలు చల్లవచ్చు. అయితే ఫలం క్షేత్రస్వామికే చెందుతుంది. ఫలకారకుడైనవాడు దాని ఫలితాలను పొందలేడు. భూస్వామికి విత్తనానికి మధ్య ఏదైనా ప్రత్యేకమైన ఒడంబడిక ఉంటే తప్ప సాధారణంగా ఫలం స్పష్టంగా భూస్వామికే చెందుతుంది. ఎందుకంటే విత్తనం కంటే అది ఆశ్రయం పొందే స్థలం ఎక్కువ ముఖ్యం." దీనిపైననే 12 రకాల పుత్రుల హక్కులను నిర్ణయించారు. ఈ మార్పు పేట్రియా పొటెస్టాస్ (Patria Potestas)(రోమన్ చట్టం) నియమానికి కూడ విరుద్ధం. హిందూ కుటుంబం రోమన్ కుటుంబంలాగా పితృస్వామికమైనది. ఈ రెండింటిలోనూ కుటుంబ సభ్యులపైన తండ్రికి నిర్దిష్టమైన అధికారం ఉంటుంది. మనువుకు ఈ సంగతి తెలుసు. చాలా స్పష్టమైన మాటల్లో దీనిని గుర్తించాడు. హిందూ తండ్రి అధికారాన్ని నిర్వచిస్తూ, మనువు ఇలా అంటాడు. "భార్య, కొడుకు, బానిస ఈ ముగ్గురికీ ప్రత్యేకంగా (తమకంటూ) స్వంత ఆస్తి ఏదీ ఉండకూడదని శాసనం ప్రకటించింది. వారు సంపాదించే ఐశ్వర్యం వారి యజమానికి (వారు ఎవరికి చెంది ఉంటారో వారికి) చెందుతుంది."

వారు కుటుంబ యజమానికి అంటే తండ్రికి చెందుతారు. పేట్రియా పొటెస్టాస్ నియమం ప్రకారం "పుత్రుల సంపాదన తండ్రి ఆస్తి అవుతుంది. పితృత్వానికి సంబంధించిన శాసనంలో మార్పు తేవటం అంటే ఖచ్చితంగా అది తండ్రికి నష్టం."

ఈ శాసనాన్ని పితృ–సవర్ణత నుండి మాతృ సవర్ణతకు మనువు ఎందుకు మార్చాడు?

**అనువాదం: బి. అనురాధ.**

**ఇంగ్లిష్ మూలం:** Riddle No. 19, The change from Paternity to Maternity. What did the Brahmins wish to gain by it, Vol 4, pg 226 – 232

# హిందూకోడ్

సర్ ! హిందూ చట్టం క్రోడీకరించడం అనేది ఎంతో ముఖ్యమయిన చర్య. అలాంటిది సమావేశాలు ముగిసే ఈ చివరి సమయంలో ఇది సభ ముందుకు చర్చకు రావటం నాకు మాత్రమే కాకుండా బహుశా సభలోని సభ్యులకు కూడా చాలా విచారకరం. ఈ ఉదయం గౌరవ స్పీకర్ ప్రకటించినట్టుగా ప్రతిపాదనపై చర్చను ఒక అర్ధగంట విరామంతో, సాయంత్రం ఏడు గంటలలోపు ముగించాల్సి ఉంది. మనకున్న ఈ కొద్ది సమయంలోగా బిల్లులో లేవనెత్తిన వివిధ అంశాల పై తమ అభిప్రాయాలు తెలియజెప్పేందుకు శాసనసభ్యులకు ఎక్కువ సమయం ఇవ్వాల్సిన బాధ్యత నాపై ఉంది. నేను వ్యక్తపరిచిన కోరిక సాకారం చేసేందుకు నేనూ సహకరించవలసి ఉంది. నా ప్రారంభ ఉపన్యాసాన్ని వీలయినంత సంక్షిప్తంగా చేసి ఒక మార్గదర్శకం నెలకొల్పడం ద్వారా మాత్రమే అది సాధ్యం. ఈ రకమైన నిర్ణయం తీసుకోవడానికి నేను చింతిస్తున్నాను. ఎందుకంటే, ఈ బిల్లు విస్తృతి అపారం. ప్రస్తుత హిందూ చట్టం నేపథ్యంలోంచి ఇందులోని అంశాలను ఆసాంతం క్షుణ్ణంగా వివరించడానికి, ఎవరికైనా కనీసం నాలుగైదు గంటల సమయం పడుతుందని నిస్సందేహంగా చెప్పగలను. అయితే అది అసాధ్యం. అందువల్ల బిల్లులోని అతిముఖ్యమైన, ప్రస్తుతమున్న, మనకు తెలిసిన చట్టాలకు భిన్నంగా ఉన్న అంశాలను మాత్రమే ప్రవేశపెట్టడానికి పరిమితం అవుతున్నందుకు నన్ను క్షమించాలి.

సర్ ! లెక్కలేనన్ని ప్రివీ కౌన్సిల్, హైకోర్టు నిర్ణయాలలో చెదురుమదురుగా ఉన్నటువంటి, సాధారణ జనానికి వివిధ రూపాలలో వర్ణాలలో కనబడుతూ, నిరంతరం వివిధ రకాల వివాదాలకు కారణమౌతున్నటువంటి హిందూ చట్టం నిబంధనలను క్రోడీకరించటం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. ఇది ప్రధానంగా ఏడు రకాల అంశాలను క్రోడీకరించేందుకు ఉద్దేశించింది. మొదటగా, వీలునామా రాయకుండా చనిపోయిన హిందూ స్త్రీ పురుషులకు చెందిన ఆస్తి హక్కులకు సంబంధించిన చట్టాన్ని క్రోడీకరించటం. రెండవది, విల్లు రాయకుండా చనిపోయినవారి వారసులకు గల వారసత్వపు హక్కుల ప్రాధాన్య క్రమానికి సవరణలు నిర్దేశించడం. తరువాతి అంశం భరణం, వివాహం, విడాకులు, దత్తత, మైనారిటీ సంరక్షణ (గార్డియన్ షిప్) వంటి విషయాలకు సంబంధించినది. ఈ బిల్లు పరిధి, పరిమితులను శాసన సభ పరిశీలిస్తుంది. వారసత్వానికి సంబంధించిన సమస్యతో మొదలుపెడితే కనీసం బ్రిటిష్ ఇండియాలోని కొన్ని ప్రాంతాలకు సంబంధించి అయినా, ఈ శీర్షిక కింద ఈ బిల్లు ఒక కొత్త సూత్రాన్ని నిర్దేశిస్తుంది. వారసత్వానికి సంబంధించి హిందువులు రెండు వేరు వేరు చట్టాల కింద ఉన్నారు. ఈ విషయం ఈ సభలో ఉన్న అనేక మంది న్యాయవాదులైన సభ్యులకు తెలుసు. వీటిలో ఒక పద్ధతి 'మితాక్షర' కాగా

మరొకటి "దాయభాగ'. ఈ రెండు పద్ధతులకూ మధ్య ఒక మౌలికమైన తేడా ఉంది. మితాక్షరసూత్రం ప్రకారం ఒక హిందువు ఆస్తి అతని వ్యక్తిగత ఆస్తి కాదు. అది 'సహభాగస్వామ్య' ఆస్తి. అందులో తండ్రి, కొడుకు, మనుమడు, మునిమనుమడూ ఉంటారు. వీరందరికీ ఆ ఆస్తిపై జన్మహక్కు సంక్రమిస్తుంది. ఈ వ్యక్తులలో ఎవరైనా మరణించినట్లయితే, ఆస్తి అతనితో ఉన్న మిగతా వారందరికీ చెందుతుంది తప్ప, చనిపోయిన వారి వారసులకు సంక్రమించదు. ఈ బిల్లులో రూపొందించిన హిందూ చట్టం "దాయభాగ" నియమాన్ని అనుసరించి రూపొందింది. దాని ప్రకారం ఒక వ్యక్తి ఆస్తిని వ్యక్తిగత ఆస్తిగా పరిగణించి ఆ వ్యక్తి వారసులకు ఒక వీలునామా ద్వారా గానీ, కానుకగా కానీ లేదా మరే విధంగానయినా తన ఇష్టం వచ్చినట్లు పంపిణీ చేసుకోవడాన్ని హక్కుగా గుర్తిస్తుంది.

అది ఈ బిల్లు కోరే మౌలిక మార్పు. మరో మాటల్లో చెప్పాలంటే, ప్రస్తుతం 'మితాక్షర నియమం' అమలవుతున్న ప్రాంతాలలో, 'దాయభాగ' నియమాన్ని ప్రవేశపెట్టి, అన్ని ప్రాంతాలకూ ఒకే వారసత్వ చట్టాన్ని వర్తింపజేస్తుంది.

ఇక వారసులలో వారసత్వపు హక్కు ప్రాధాన్య క్రమాన్ని గురించిన సమస్య దగ్గరకు వస్తే 'దాయభాగ' నియమానికీ 'మితాక్షర' నియమానికీ మధ్య సాధారణ రూపాలను గురించిన విషయాల్లో కూడా కొన్ని మౌలికమైన తేడాలున్నాయి. 'మితాక్షర' నియమంలో చనిపోయిన వారి సజాతీయులకంటే గోత్రజులకు ప్రాధాన్యం ఉంటుంది. 'దాయభాగ' నియమం కింద చనిపోయిన వారి రక్త సంబంధీకులకు ఆస్తి హక్కు సంక్రమిస్తుంది కానీ సజాతీయులకూ గోత్రజులకూ కాదు. ఈ బిల్లు చేసిన మార్పులలో ఇదొకటి. మరో విధంగా చెప్పాలంటే ఇది మితాక్షర నియమంకంటే 'దాయభాగ' నియమాన్ని ఎక్కువగా ప్రవేశపెడుతోంది.

చనిపోయిన హిందువుకు సంబంధించి, వారసత్వపు హక్కుల ప్రాధాన్య క్రమాన్ని గురించి, ఈ సాధారణ మార్పుకు అదనంగా ఈ బిల్లు నాలుగు రకాల మార్పులను చేస్తున్నది. అందులో ఒకటి, వారసత్వపు హక్కుని గురించి వితంతువు, కుమార్తె, అప్పటికే చనిపోయిన కుమారుని వితంతువు వీరందరికీ కుమారునికి సంబంధించి ఏవిధమైన హక్కు ఉందో అదే విధంగా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. అందుకు అదనంగా కుమార్తెకు కూడా తండ్రి ఆస్తిలో వాటా ఇవ్వాలి. ఆమె వాటాను కొడుకుకు ఇచ్చే వాటిలో సగంగా నిర్ధారించటం జరిగింది. ఇక్కడ నేను మరోసారి లేవనెత్త దలుచుకున్న అంశం ఏమిటంటే, మహిళా వారసులకు సంబంధించినంత వరకు ఈ బిల్లు కుమార్తెకు సంబంధించిన అంశానికి మాత్రమే పరిమితమయింది. మిగిలిన మహిళా వారసులకు సంబంధించి, 1937 సంవత్సరపు హిందూ మహిళల ఆస్తి హక్కు చట్టం ఇప్పటికే గుర్తింపు పొందింది

కాబట్టి, బిల్లులోని ఈ భాగానికి సంబంధించి, ఈ బిల్లులో నిజమైన మార్పేమీ లేదు. నేను ఉదహరించిన చట్టంలోని భాగాల్నే ఈ బిల్లు ముందుకు తెస్తున్నది.

ఈ బిల్లుకు సంబంధించి రెండో మార్పు ఏమిటంటే, మహిళా వారసులకు చెందిన అంశంగా 'మితాక్షర', 'దాయభాగ' నియమాలలో గుర్తించిన సంఖ్య కంటే చాలా ఎక్కువగా మహిళా వారసులను గుర్తిస్తున్నది.

పాత చట్టంకంటే మించి ఈ బిల్లులో చేసిన మూడో మార్పు ఏమిటంటే, మహిళా వారసుల విషయంలో విల్లు వ్రాసిన వ్యక్తి చనిపోయే నాటికి ఒక నిర్దిష్ట మహిళ ధనవంతురాలా? పేదదా? ఆమె వివాహితా? అవివాహితా? సంతానవతియా? కాదా? అనే విషయాలనుబట్టి వివక్ష చూపించే విధానం మితాక్షర, దాయభాగ ఈ రెండు పద్ధతులలోనూ ఉండేది. మహిళా వారసుల మధ్య ఈరకమైన వివక్ష చూపడాన్ని ఇప్పుడు ఈ బిల్లు రద్దు చేస్తున్నది. ఇతర అంశాలు వేటితోనూ సంబంధం లేకుండా, ఆమె వారసురాలిగా ఆస్తి సంక్రమించే హక్కు కలిగిఉండే విధంగా ఈ బిల్లు మార్పును కోరుతున్నది.

చివరి మార్పు దాయభాగ నియమాన్ని అనుసరించి ఉన్న వారసత్వ హక్కుకు సంబంధించింది. దాయభాగ కింద తల్లికంటే తండ్రి ప్రాధాన్య క్రమంలో ముందుండేవాడు. ప్రస్తుత బిల్లులో తండ్రి కంటే ముందు తల్లికి ప్రాధాన్యత ఇస్తూ సవరణ చేసింది.

ఇదంతా మరణించిన హిందూ పురుషునికి సంబంధించిన వారసులకు గల వారసత్వపు హక్కు. ఇప్పుడు, విల్లు రాయకుండా మరణించిన మహిళల పరంగా ఆస్తి హక్కుకు సంబంధించిన అంశాలకు వస్తాను. ప్రస్తుతం అమలులో ఉన్న హిందూ చట్టం ప్రకారం ఒక హిందూ మహిళ ఆస్తికి సంబంధించి, ఒకటి 'స్త్రీధనం' అనీ, మరొకటి 'స్త్రీ ఆస్తి' అనీ రెండు భాగాలుగా ఉన్న విషయం హిందూ చట్టాన్ని తెలిసిన ఈ సభ సభ్యులందరికి తెలుసు. ముందుగా 'స్త్రీ ధనం' విషయాన్ని పరిశీలిద్దాం. ప్రస్తుతం ఈ స్త్రీధనం అనేది ఒకేరకంగా కాకుండా వివిధ రకాలుగా వర్గీకరించబడి ఉంది. ప్రస్తుత చట్ట ప్రకారం ఒక మహిళకు సంక్రమించే స్త్రీధనం కూడా దాని వర్గీకరణను బట్టి, సంక్రమించటం కూడా అనేక రకాలుగా ఉంది. ఒక వర్గీకరణను బట్టి సంక్రమించే స్త్రీధనం వేరొక వర్గీకరణ ప్రకారం మరో విధంగా వర్తించేటట్లుగా చట్టం ఉంది. ఈ పద్ధతులు మితాక్షరలో కానీ, దాయభాగలో కానీ ఒకే రకంగా ఉన్నాయి. స్త్రీ ధనానికి సంబంధించినంత వరకూ ప్రస్తుతం ప్రవేశపెడుతున్న ఈ బిల్లు రెండు మార్పులను చేస్తున్నది. ఒక మార్పేమిటంటే వివిధ వర్గాలుగా ఉన్న స్త్రీధనాన్ని ఒకే ఒక వర్గంగా ఏకీకృతం చేసి, ఆస్తి సంక్రమణకు ఒకే విధమైన పద్ధతిని ఏర్పరచటం. వివిధ రకాలైన స్త్రీధనానికి రకరకాల హక్కుదారులు ఉండటం ఇక్కడ తీసివేయటం జరిగింది. స్త్రీ ధనాన్ని అంతటినీ ఒకే విధమైనదిగా పరిగణించి, ఆస్తి సంక్రమణకు ఒకే నియమం ఏర్పాటయింది.

వారసులకు సంబంధించి ఈ బిల్లులో రెండో మార్పు ఏమిటంటే స్త్రీధనంలో కొడుకుకి కూడా వాటా సంక్రమించే హక్కు ఏర్పరచటం. కుమారునికి కుమార్తె తీసుకునే వాటాలో సగం ఇవ్వాల్సి వుంటుంది. తండ్రి ఆస్తిలో కుమార్తె సగం వాటా పొందుతున్నట్టే, తల్లి ఆస్తిలో కుమారుడు కూడా సగం వాటా పొందుతాడు. ఈ బిల్లును రూపొందించి, వారసత్వపు హక్కులకు సవరణ చేయడం ద్వారా ఒక రకంగా కుమారునికీ, కుమార్తెకీ సమాన స్థాయి ఉండేలా చూడడం ఈ బిల్లు కోరుకుంటుందని సభ్యులు గుర్తిస్తారు.

"స్త్రీ ఆస్తి"కి సంబంధించిన విషయాలు చూస్తే హిందూ చట్టం ప్రకారం స్త్రీకి సంక్రమించిన ఆస్తిని ఆమె జీవిత పర్యంత ఆస్తిగా పిలుస్తారని శాసనసభ సభ్యులకు తెలుసు. ఆ స్త్రీ, ఆ ఆస్తిపై వచ్చే ఆదాయాన్ని అనుభవించవచ్చు. ఆస్తి మూలధనాన్ని ఆమె న్యాయపరమైన అవసరాలకు తప్ప వినియోగించటం కుదరదు. ఆ స్త్రీ మరణానంతరం ఆ ఆస్తి ఆమె భర్త తరపు అనుభవాధికారం ఉన్న వారికి బదిలీ అవుతుంది. ఇక్కడ, ఈ బిల్లు రెండు మార్పుల్ని ప్రవేశపెడుతున్నది. ఒకటి, స్త్రీలకు పరిమిత హక్కులతో ఉన్న ఆస్తిహక్కును సర్వహక్కులు ఉన్న ఆస్తిగా మార్చడం. తమకు సంక్రమించిన ఆస్తిపై పురుషులకు ఎలా సర్వహక్కులూ ఉంటాయో, అలానే ఇక్కడ స్త్రీలకూ పరిపూర్ణ హక్కు ఉంటుంది. రెండోదేమిటంటే ఆస్తిని ఆ వితంతువు తర్వాత ఆస్తిపై అనుభవాధికారం ఉన్నవారు హక్కుగా కోరడాన్ని ఇది రద్దు చేస్తోంది.

ఈ బిల్లులో స్త్రీలకు వారసత్వంగా ఆస్తి పొందడానికి సంబంధించిన హక్కులకు అనుబంధంగా చేసిన మరొక అతి ముఖ్యమైన చేర్పు వరకట్నానికి సంబంధించినది. ఈ కట్నం అనేది ఎంత కుట్ర పూరితమైనదో సభ్యులందరకూ తెలుసు. ఎలానంటే, ఉదాహరణకు, బాలికలు తమ పెళ్ళి సందర్భంగా తల్లిదండ్రుల వద్ద నుంచి కట్నంగానో, లేదా స్త్రీ ధనంగానో, లేకపోతే బహుమానం కిందనో అపారమైన ఆస్తి తెచ్చినప్పటికీ వారిపట్ల ఎంతో ధిక్కారంతో నిర్దయగా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. నా ఉద్దేశం ప్రకారం ఈ బిల్లు గౌరవించదగిన అనేక నిబంధనలను అందిస్తున్నది. అదేమంటే, ఒక బాలికకు ఆమె వివాహ సమయంలో కట్నం కింద ఇచ్చిన ఆస్తిని ఒక ధార్మిక నిధి (ట్రస్టు)గా వ్యవహరించాలి. ఆ బాలికకు పద్దెనిమిది సంవత్సరాల వయసు వచ్చాక ఆమె దానికి హక్కుదారవుతుంది. ఆరకంగా ఆ ఆస్తిపై ఆమె భర్తగానీ, భర్త బంధువులు గానీ ఏ రకంగానూ పెత్తనం చెలాయించడానికి కుదరదు. ఆ ఆస్తిని వృధా ఖర్చు చేసే అవకాశాన్ని కూడా ఇది అరికట్టి ఆమె మిగిలిన జీవితాన్ని నిస్సహాయురాలిగా గడిపే బాధనుంచి తప్పిస్తుంది.

ఇక జీవన భృతికి సంబంధించిన అంశాలకు వద్దాం. ఈ భాగానికి సంబంధించి ఈ బిల్లులో పెద్దగా కొత్త అంశాలు ఏవీ లేవు. ఒక చనిపోయిన వ్యక్తి ఆస్తికి సంబంధించి, అతడు రాసిన విల్లు ద్వారాకానీ, వారసత్వంగా కానీ ఆస్తిని పొందిన వ్యక్తి నుంచీ చనిపోయిన

వ్యక్తిపై ఆధారపడి బ్రతికేవారు జీవన భృతిని పొందే హక్కును ఈ బిల్లు కలిగిస్తుంది. ఈ బిల్లులో పదకొండు రకాలయిన ఆశ్రితులను నమోదు చేయటం జరిగింది. ఇందులో, కనీసం నావరకు నాకు అనిపించిన అభిప్రాయం ప్రకారం ఆశ్రితుల జాబితాలో చివరికి ఉంపుడు గత్తెను కూడా చేర్చటం దురదృష్టకర అంశం. కానీ అదట్లా ఉంది. అది ఒక పరిగణించాల్సిన అంశం. ఆశ్రితుల జీవన భృతిని చూడవలసిన బాధ్యత చనిపోయిన వారి ఆస్తిని తీసుకున్న వారిపై ఉంది. నేను చెప్పినట్లుగా ఈ బిల్లులోని ఈ భాగంలో వేరే కొత్త అంశాలేవీలేవు.

ఈ బిల్లులోని అతి ముఖ్యమైన మరొక అంశం, భర్త నుంచి వేరుగా జీవిస్తున్న భార్య వేరుగా జీవన భృతిని కోరే హక్కుకు సంబంధించినది. సాధారణంగా, హిందూ చట్టంలోని ఈ అంశాలకింద, భార్య భర్తతో బాటుగా అతని ఇంటిలో నివసిస్తూ ఉండకపోయినట్లయితే, భర్త నుంచి జీవనభృతి పొందే హక్కు లేదు. అయితే ఒక భార్య భర్త నుండి వేరుపడి జీవిస్తుందంటే ఆమె స్వాధీనంలో లేని ఏవో అనివార్య పరిస్థితులు ఉండే అవకాశం ఉందని ఈ బిల్లు గుర్తిస్తుంది. అందువలన ఆ పరిస్థితులకు కారణాలను గుర్తించకుండా ప్రత్యేకంగా ఆమెకు భరణం ఇవ్వకుండా ఉండటం నిస్సందేహంగా తప్పు. ఒకవేళ భర్త (1) చెప్పుకోలేని వ్యాధితో బాధపడుతున్నా, (2) అతడు ఒక ఉంపుడుగత్తెను ఉంచుకున్నా, (3) కర్కశత్వంతో ప్రవర్తించినా, (4) భార్యను రెండేళ్ళ పాటు వదిలివేసినా, (5) అతడు వేరే మతంలోకి మారినా, (6) ఆమె విడిగా జీవించడానికి న్యాయమైన మరేదయినా కారణం ఉన్నా, ఆ భార్యకు తన భర్త నుంచి వేరు పడి ఉండి, జీవనభృతి, భరణం పొందే హక్కును ఈ బిల్లు కల్పిస్తున్నది.

తరువాతి అంశంగా వివాహానికి సంబంధించిన అంశాన్ని నేను లేవనెత్తుతున్నాను. ఈ బిల్లు రెండు రకాలైన పెళ్ళిళ్ళను గుర్తిస్తోంది. అందులో ఒకదానిని సాంప్రదాయిక వివాహం అంటారు, మరోదాన్ని 'సాంఘిక వివాహం' అంటారు. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం నుండి ఇది వైదొలగడమే అని సభ్యులు గుర్తిస్తారు. ప్రస్తుతం ఉన్న హిందూ చట్టం, సాంప్రదాయిక వివాహాన్ని మాత్రమే గుర్తిస్తుంది. కానీ మనం "సాంఘిక వివాహం" గా పిలుచుకునే వివాహాన్ని గుర్తించదు. చెల్లుబాటయ్యే ఒక సాంప్రదాయిక వివాహానికి ఉండే నిబంధనలు, చెల్లుబాటయ్యే ఒక రిజిస్టర్ వివాహానికి ఉండే నిబంధనలు పరిగణనలోకి తీసుకున్నట్లయితే, వీటి మధ్య చాలా కొద్దిపాటి తేడాయే ఉందని గమనిస్తారు. సాంప్రదాయిక వివాహానికి అయిదు షరతులున్నాయి. మొదటిగా, పెళ్ళికొడుకుకి 18 సంవత్సరాలు, పెళ్ళి కుమార్తెకు 14 సంవత్సరాలూ కనీస వయసు ఉండి తీరాలి. రెండోదేమిటంటే పెళ్ళి జరిగే సమయానికి వీరిద్దరిలో ఎవరికీ జీవించి ఉన్న జీవిత భాగస్వామి ఉండకూడదు. మూడోదిగా, వీరిద్దరి మధ్యనా నిషేధించబడిన బంధుత్వ సంబంధం ఉండకూడదు. నాలుగో అంశంగా వీరిరువురూ సపిండకులై ఉండకూడదు.

అయిదవ షరతుగా ఇరువురిలో ఏ ఒక్కరూ వె(్రి వారుకానీ, పిచ్చివారుగా కానీ ఉండరాదు. రిజిస్టర్ పెళ్ళికి సపిండకత్వం అడ్డురాదనే ఒక్క పోలిక తప్ప, మిగతా షరతులకు సంబంధించి సాంప్రదాయిక వివాహానికి, రిజిస్టర్ వివాహానికీ పెద్ద తేడాలేదు. ఒక్క తేడా ఏమిటంటే, రిజిస్టర్ పెళ్ళిని ఈ బిల్లులోని అంశాల ప్రకారం తప్పనిసరిగా రిజిస్టర్ చేయించాల్సి వుండగా, సాంప్రదాయిక తంతుతో జరిగే వివాహాన్ని వారు కోరుకుంటే మాత్రమే స్వచ్ఛందంగా రిజిస్టరు చేసుకోవచ్చు. ప్రస్తుతం అమలులో ఉన్న వివాహ నిబంధనలను ఈ బిల్లులో ఉన్న నిబంధనలతో పోల్చి చూసేట్లయితే, ఈ బిల్లులో మూడు రకాల తేడాలను చూడవచ్చు. సాంప్రదాయిక వివాహానికి సంబంధించి ప్రస్తుతం ఉన్న చట్టంలో వారి కులాన్ని, ఉప కులాలను కూడా తప్పని సరిగా గుర్తించాల్సి వుంది. ఈ బిల్లులో ఈ షరతు ఉండదు. బిల్లు ప్రకారం వివాహ సంబంధంలోకి వచ్చే స్త్రీ, పురుషుల కులంతో కానీ, ఉప కులంతో కానీ సంబంధం లేకుండా ఆ వివాహం చెల్లుబాటవుతుంది.

పండిట్ ఠాకూర్ దాస్ భార్గవ (తూర్పు పంజాబు–జనరల్): రెండు వేరువేరు కులాలకు చెందిన వ్యక్తుల మధ్య జరిగే పెళ్ళి చెల్లుబాటు అవుతుందా?

డా. బి.ఆర్. అంబేద్కర్: నా ఉపన్యాసం కొనసాగించనివ్వండి. గౌరవ సభ్యుడు తను ఉపన్యసించేటపుడు ప్రశ్నలు వేస్తే వాటికి నేను సమాధానం ఇస్తాను.

ఈ బిల్లులోని రెండో నిబంధన ఏమంటే, ప్రస్తుతం ఉన్న చట్టంలో ఉన్నట్లుగా వివాహానికి 'గోత్ర, ప్రవర' ప్రతిబంధకం కాదు. మరో ప్రత్యేకమైన మూడో అంశం వివాహ భాగస్వాముల గురించి. పాత చట్టంలో బహు భార్యాత్వానికి అనుమతి ఉంది. ఈ కొత్త చట్టం ఏకపత్నీ పద్ధతిని నిర్దేశిస్తుంది. సాంప్రదాయిక వివాహం రద్దుచేయలేనిది. విడాకులకు వీలులేనిది. కొత్తబిల్లు వివాహాన్ని రద్దుచేసుకొనే అవకాశాన్ని కలిగిస్తుంది. కొత్త బిల్లు కింద వివాహం చేసుకొనే జంటలోని ఎవరైనా తమ వివాహ ఒప్పందం నుండి వైదొలగడానికి ఈ కొత్త బిల్లు మూడు రకాల పరిష్కారాలను అందిస్తోంది. ఒకటి ఆ పెళ్ళి నిరర్థకమైనదిగా ప్రకటించటం, రెండో అంశంగా ఆ పెళ్ళి చెల్లుబాటు కానిదిగా ప్రకటించటం – మూడో అంశంగా దానిని రద్దు చేసుకోవటం. ప్రస్తుతం పెళ్ళి చెల్లుబాటు కాకపోవడానికి రెండు అంశాలు ప్రాతిపదికగా ఉన్నాయి. ఒకటి పెళ్ళి సమయానికి ఇద్దరిలో ఎవరికయినా జీవించి ఉన్న దాంపత్య భాగస్వామి అప్పటికే ఉండి ఉంటే ఆ పెళ్ళి చెల్లనిదిగా ప్రకటించటం, రెండో అంశంగా, ఆ దంపతుల మధ్య నిషేధిత పరిధిలో ఉన్న బంధుత్వం ఉన్నట్లయితే ఆ పెళ్ళిని చెల్లనిదిగా ప్రకటించటం. పెళ్ళి చెల్లుబాటు కాకుండా పోవడానికి నాలుగు ప్రాతిపదికలున్నాయి. ఒకటి సంసారానికి పనికిరాకపోవడం (నపుంసకత్వం), రెండోది వారిరువురూ సపిండకులు కావటం. మూడోది వారిరువురిలో ఎవరయినా వె(్రివారు కానీ, పిచ్చివారుగా కానీ అయిఉండటం. నాలుగవది సంరక్షకులను బెదిరించి కానీ, మోసంచేసి కానీ పెళ్ళికి ఒప్పించడం. పెళ్ళి రద్దు కావటమనే కత్తిని

అలానే తలపై వేలాడదీసి ఉంచకుండా నా అభిప్రాయం ప్రకారం, ఎంతో వివేకంతో అలా రద్దు చేసుకునే అంశానికి ఒక పరిమితి కూడా ఉంటుంది. దీని ప్రకారం, వివాహం జరిగిన మూడు సంవత్సరాలలోగా మాత్రమే వివాహం రద్దుకు వ్యాజ్యం వేయాలి. అలా మూడేళ్లలోపు వ్యాజ్యం వేయకుండా ఉన్నట్లయితే, ఆ వ్యాజ్యాన్ని స్వీకరించటం జరగదు. వివాహం చెల్లుబాటు కాకుండా ఉండేందుకు ఏ ప్రాతిపదికా లేనట్లుగా భావించి యధావిధిగా కొనసాగుతుంది. అంతే కాకుండా, న్యాయస్థానాలు ఒక వివాహాన్ని రద్దుచేసినా, చెల్లుబాటు కానిదిగా ప్రకటించినా, వారికి పుట్టిన బిడ్డలకు సంబంధించిన చట్టబద్ధతపై ఏ ప్రభావం పడకుండా వారి చట్టబద్ధహక్కులు కొనసాగేందుకు బిల్లు అంశాలను పొందుపరిచింది. తరువాత విడాకులకు సంబంధించిన సమస్య వద్దకు వద్దాం. విడాకులు పొందడానికి ఏడు రకాల కారణాలు ఉన్నాయి. (1) వదిలి వెళ్ళిపోవటం, (2) వేరొక మతంలోనికి మారటం, (3) ఉంపుడుగత్తెను ఉంచుకోవటం లేదా ఉంపుడుగత్తెగా మారటం, (4) నయం చేయలేనంతగా మతిస్థిమితం కోల్పోవడం, (5) తీవ్రమైన, నయంకాని రూపంలో ఉండే కుష్టు వ్యాధి, (6) అంటుకునేవిగా ఉండే సుఖవ్యాధులు (7) క్రూరత్వం.

దత్తతకు సంబంధించిన విషయానికి వస్తే ఈ బిల్లులో పొందుపరిచిన ఎన్నో నియమాలు ప్రస్తుతమున్న చట్టం నుంచి ఏ రకంగానూ భిన్నమైనవి కావు. దత్తత తీసుకోవడానికి సంబంధించి, బిల్లులోని ఈ భాగంలో రెండు కొత్త అంశాలున్నాయి. మొదటగా ఈ బిల్లులో భర్త దత్తత తీసుకోదల్చుకుంటే భార్య నుంచి అనుమతి తీసుకోవాలి. ఒకరికి మించి భార్యలు ఉన్నట్లయితే వారిలో కనీసంగా ఒకరి అనుమతి అయినా తీసుకోవాలి. రెండో అంశంగా ఒక వితంతువు దత్తత తీసుకోదలచుకుంటే, అందుకు ఆమెకు అధికారమిస్తూ ఆమె భర్త పూర్వ సూచనలుండాలని ఈ బిల్లు చెబుతోంది. వాస్తవ అంశాల పరంగా చూస్తే, తర్వాత వచ్చే వివాదాలను నివారించేందుకుగానూ, ఆరకంగా దత్తతకు అనుమతినిచ్చే సూచనలు రిజిస్టర్ అయిన పత్రాల రూపంలో గానీ, వీలునామాలో గాని ఉండటం అవసరం. మౌఖిక సాక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకోవటం జరగదు. అందువల్ల వివాదాలు చాలా వరకు తక్కువ అవుతాయి. ఈ బిల్లు దత్తత స్వీకారం అనేది రిజిస్టర్ చేసిన సాక్ష్యంగా ఉండాలని చెబుతోంది. ఈ దేశంలో ఎక్కువగా వివాదాలకు తావు ఇచ్చే ప్రధాన అంశం దత్తత, ఇందులో అనేక రకాల మౌఖిక సాక్ష్యాలు సృష్టించటం, ఇతరులతో కల్పిత సాక్ష్యాలు తేవటం, లంచం ఇచ్చి తప్పుడు సాక్షులను పెట్టడం వంటివి ఉన్నాయి. వితంతువులను ఇవి మోసం చేస్తున్నాయి. ఒక రోజున వారు తాము ఒక దత్తత స్వీకారం చేసినట్లుగా ప్రకటించి, అనంతరం తాము దత్తత తీసుకోలేదని అంటున్నారు. ఇటువంటి వివాదాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది. అందుకే ఈ బిల్లులో హిందువు దత్తత తీసుకోవడాన్ని రిజిస్టర్ చేయించాలనే ఒక కీలక అంశాన్ని పొందుపరచడం జరిగింది. తర్వాత మైనారిటీ, గార్డియన్షిప్‌ల గురించిన అంశం వుంది. ఈ బిల్లు పొందుపరిచే

చివరి అంశమిది. చట్టంలోని ఈ భాగంలో కొత్త అంశం ఏమీ లేదు. అందువలన చట్టంలోని ఈ భాగానికి సంబంధించినంత వరకూ నేనేమీ ప్రతిపాదించటం లేదు.

ఈ బిల్లులో లేవనెత్తిన, కొత్తవైన అంశాలనూ పరిశీలించవలసిన అంశాలనూ గురించి సభ్యులు అవగాహన చేసుకోవాలి. అవి మొదటగా ఆస్తికి జన్మహక్కును రద్దుచేసి బ్రతికి ఉండిన బంధువులు వారసులుగా ఉండేటట్లు చేయటం, రెండోదిగా లేవనెత్తిన అంశం కుమార్తెకు ఆస్తిలో సగం వాటా ఇచ్చేందుకు అంగీకరించటం, మూడో అంశంగా స్త్రీలకు గల పరిమిత ఆస్తి హక్కును సంపూర్ణ ఆస్తి హక్కుగా మార్పు చేయటం, నాలుగో అంశంగా దత్తత తీసుకోవటం, వివాహం జరపటం వంటి విషయాలలో కుల ప్రమేయాన్ని రద్దు చేయటం, అయిదోదిగా ఏకపత్నీ వివాహ సిద్ధాంతం, ఆరవదిగా విడాకుల సూత్రం ఉన్నాయి. ఈ నిర్దిష్ట అంశాలను విడిగా వర్గీకరించి ఉంచాను. ఎందుకంటే మనముందున్న సమయం చాలా తక్కువ. ఈ బిల్లుతో ముడిపడి వున్న ఈ అంశాలకు నిస్సందేహంగా న్యాయం జరగాలి. ఏయే అంశాలపై ధ్యాస ఉంచి చర్చించాలనే విషయమై సభ్యులకు అవగాహన కలిగించేందుకు వీటిని నిరిష్టంగా లేవనెత్తాను. బిల్లులో నిశ్చితంగా ఆమోదించవలసిన విషయాల్లోని భిన్నాంశాలను ఈ దశలో పేర్కొనటం సమయాన్ని వృధా చేయడమేనని అనుకొంటున్నాను. నేను ప్రతిపాదించిన అంశాలపై గౌరవ సభ్యులు చెప్పేది వినాలనుకుంటున్నాను. వాటిని సమర్థించవలసిన అవసరం ఏర్పడితే నా సమాధానం చెప్పేటపుడు వాటిని ప్రస్తావిస్తాను.

* * *

గౌ.డా. బి.ఆర్ అంబేద్కర్: సర్! మామూలుగా అయితే నేను చేసిన ఈ ప్రసంగం ఈ సందర్భానికి సరిపోతుందనుకునే వాడిని. కాని, ఇక్కడ ఓ వర్గం ఉంది. అది ప్రధాన వర్గం కాకపోవచ్చు. కాని బిల్లులోని కొన్ని భాగాలపై సందేహంతో ఉంది. అది లేనట్టుగా వ్యవహరించడం కష్టం. అయితే ఈ బిల్లు పట్ల ఆసక్తితో మాత్రమే కాకుండా ఎంతో బాధ్యతతో కూడిన ఆందోళనతో ఉన్న వారు ఈ సభ బయట ఉన్నారని నాకు తెలుసు. మీరు అనుమతిస్తే బిల్లు తెరపైకి వచ్చిననాటి నుంచీ వార్తాపత్రికల్లో వచ్చిన వివాదాస్పద అంశాల గురించి కొన్ని సాధారణ పరిశీలనలను ప్రస్తావించడం సరైందని భావిస్తున్నాను. ఈ అంశాలను భాగాలవారీగా, సెక్షన్ల వారీగా వివరిస్తాను. అయితే వివాదాస్పదమైనవి మాత్రమే ప్రస్తావిస్తాను. ముందుగా వివాహం, విడాకులను గమనించండి. మొదటగా ఇందులో మూడు రకాల వివాదాంశాలున్నాయి. మొదటిది చెల్లుబాటయ్యే వివాహాలకు కులాల రద్దు తప్పనిసరి అవసరం అని. రెండోది ఏకపత్నీ వివాహ నిబంధన. మూడోది – విడాకులకు అనుమతి.

'కుల పరిమితుల రద్దు' అనే వివాదాస్పదమైన మొదటి అంశం గురించి ప్రస్తావిస్తాను. బిల్లుకు సంబంధించినంత వరకూ, ఇది పాత, కొత్తల మధ్య ఒక విధమైన

రాజీ కుదిర్చే ప్రయత్నం చేస్తుంది. హిందూ సముదాయానికి చెందిన వారెవరైనా సనాతన ఆచారాలను పాటిస్తూ సాంప్రదాయ వివాహం చేసుకోదలుచుకుంటే ఆ సాంప్రదాయం ప్రకారం వధువు, వరుడు ఒకే వర్ణం, ఒకే కులం, ఒకే ఉప కులానికి చెంది ఉండాలని ఆ ధర్మం చెప్తుంది కాబట్టి అలా చేయకుండా నిరోధించేది ఈ బిల్లులో ఏం లేదు. అట్లాగే సంస్కరణవాది అయిన హిందువు, తనకు వర్ణం కులం, ఉప-కులం వంటి వాటిపై నమ్మకం లేక తన కులం వెలుపల వ్యక్తిని వివాహం చేసుకున్నా కూడా ఆ వివాహం చట్టప్రకారం చెల్లుతుంది అని మాత్రమే బిల్లు చెప్తుంది. వివాహచట్టం మేరకు ఎటువంటి ఆంక్షలూ లేవు. వైదీకులు, సనాతనులు స్వేచ్ఛగా వారి ధర్మం ప్రకారం సరైంది అనుకున్నది చేయవచ్చు. ధర్మాన్ని పాటించని సంస్కరణవాదులకు తమ హేతుబద్ధతనూ మనస్సాక్షినీ అనుసరించే స్వేచ్ఛ ఉంది.

శ్రీ మహావీర్ త్యాగి (యు.పి. జనరల్): ఒకవేళ వారి మనస్సాక్షి ఆవిధంగా సూచిస్తే వారు వారి మతం వెలుపల వివాహం జరుపుకోవచ్చా?

గౌ.డా.బి.ఆర్.అంబేద్కర్: మంచిదే - దానికి మరో బిల్లు చేపడదాం. గౌ.మిత్రుడు శ్రీ త్యాగి అవివాహితుడేమో తెలియదు. అయితే కనక నేను త్వరగా చేస్తాను.

శ్రీ మహావీర్ త్యాగి: నేను ఇతరులకు దారి ఏర్పరచాలనుకుంటున్నాను.

గౌ. డా.బి.ఆర్. అంబేద్కర్: ఫలితంగా, వివాహ చట్టానికి సంబంధించినంత వరకూ పాత, కొత్తలకు మధ్య పోటీ ఉంటే హిందూ సమాజంలో ఏం జరుగుతుంది? కొత్త మార్గం అనుసరించే వారు గెలుస్తారని ఆశిద్దాం. అలా కానీ పక్షంలో రెండు సమాంతర వివాహ విధానాలను దేశంలో అమలు చేయడంతో సంతృప్తి పడదాం. అప్పుడు ఎంచుకొనే అవకాశం ఉంటుంది. అప్పుడు శాస్త్రాలను ఉల్లంఘించడం ఉండదు. స్మృతులను ఉల్లంఘించటమూ ఉండదు.

ఏకపత్నీత్వానికి సంబంధించి - ఇది కొత్త విషయమే కావచ్చు. సంప్రదాయం, శాసనం లేదా శాస్త్రాలను గౌరవించేవారెవరైనా హిందూ భర్తకు బహుభార్యాత్వానికి నిరాటంకమైన హక్కు బేషరతుగా ఉండేదని సభలోని సభ్యులెవరైనా ఎత్తిచూపవచ్చు. అట్లా ఎప్పుడూ లేదు. ఈ రోజుకూ దక్షిణాదిన కొన్ని ప్రాంతాల్లో నటుకొట్టాయ్ చెట్టియార్లలో కొందరు - దీనిని పాటిస్తున్నారు. ప్రీవీ కౌన్సిల్ నివేదికలలో కూడా ఈ సంగతి ఉంది. వదంతులను సాక్ష్యాలుగా పెట్టుకొని మాట్లాడడం లేదు నేను. నటుకొట్టాయ్ చెట్టియార్లలో ఉన్న ఆచారం ఏంటంటే భార్య అంగీకారం ఉంటే తప్ప రెండో భార్యను చేసుకొనే వీలులేదు. రెండో విషయం, వివాహానికి అంగీకారం పొందిన భర్త మొదటి భార్యకు కొంత ఆస్తిని కేటాయించాలి, బహుశా తమిళ భాషలో దాన్ని "మొప్పు" అంటారు. సదరు ఆస్తి మీద ఆమెకు పూర్తిహక్కువస్తుంది. ఒకవేళ ఆమె అంగీకారంతో వివాహం చేసుకొని, ఆమెను సరిగా చూడకపోతే స్వతంత్ర జీవనం కొనసాగించే ఆర్థిక సామర్థ్యం

ఉంటుంది. బహుభార్యత్వం బేషరతుగా ఉండదని చెప్పడానికే దీనిని ప్రస్తావిస్తున్నాను. నేను తీసుకోదలిచిన రెండో ఉదాహరణ కౌటిల్యుడి అర్థశాస్త్రం నుంచి వివరిస్తాను. సభలో సభ్యులెంతమందికి ఈ గ్రంథంతో పరిచయం ఉన్నదో తెలియదు. ఎక్కువమందికి తెలుసనే అనుకుంటున్నాను. రెండో భార్యను పెళ్ళాడే హక్కు కౌటిల్యుడు పరిమితం చేశాడని చదివిన వారికి తెలుస్తుంది. మొదటగా ఎవరైనా మొదటి పది, పన్నెండు ఏళ్ళలోనే స్త్రీ సంతాన సామర్థ్య హీనతను అంచనా వేసుకోవాలి. అప్పుడు రెండో వివాహం గురించి ఆలోచించాలి. ఇది ఒక పరిమితి. కౌటిల్యుడు విధించిన రెండో పరిమితి ఏమిటంటే మొదటి వివాహ సమయంలో తీసుకున్న స్త్రీ ధనం అంతటినీ ఆమెకు తిరిగి ఇచ్చేసిన తర్వాతనే అతనికి రెండో వివాహం చేసుకునే హక్కు వస్తుంది. ఈ రెండింటిని పాటించినప్పుడే హిందూభర్త రెండోసారి వివాహం చేసుకోవడానికి అర్హుడని కౌటిల్యుని అర్థశాస్త్రం వివరిస్తోంది.

మూడో అంశం ఏమిటంటే వివిధ ప్రాంతాలలో అంగీకరించిన శాసనాల ప్రకారం ఏక భార్యాత్వం విధింపుగా ఉంది. ఉదాహరణకు మరుమక్కటాయం, అలియ సంతానం చట్టాలలో వివాహజీవితానికి ఏక భార్యాత్వనియమమే ఉంది. అలాగే ఇటీవలే ఆమోదించిన బొంబాయి, మద్రాసులలో అలాగే బరోడాలో శాసనాలు కూడా ఏకపత్నీ వివాహ చట్టాన్ని నిర్ధారిస్తున్నాయి.

ఇంతవరకూ ఇచ్చిన ఉదాహరణలను బట్టి మనం తీవ్రమైన లేదా విప్లవాత్మకమైన మార్పు చేయడం లేదని సభ గ్రహించిందని అనుకుంటున్నాను. మనం చేస్తున్నదానికి పూర్వానుగతం ఉంది. ఇండియాలో వివిధ రాష్ట్రాలు ఆమోదించిన శాసనాలు కౌటిల్యుడి అర్థశాస్త్రం వంటి ప్రాచీన శాస్త్రాలలోనివే. ఆమాటకొస్తే ప్రపంచవ్యాప్తంగా వివాహ సంబంధాలకు ఏకపత్నీ వివాహమే అత్యంత శ్రేయస్కరమైన పద్ధతిగా పేరుపొందింది.

శ్రీ దేశ్ బంధు గుప్త (ఢిల్లీ): మహ్మదీయ చట్టం మాటేమిటి?

గౌ.డా.బి.ఆర్.అంబేద్కర్: మహ్మదీయ చట్టం గురించి చర్చించినప్పుడు దానిని గురించి వివరిస్తాను.

విడాకుల విషయానికి వస్తే, సభకు విజ్ఞప్తి చేసేదేమంటే ఇందులో కొత్తగా కనిపెట్టిన విషయమేమీ లేదు. సభలోని ప్రతి ఒక్కరికీ శూద్రులని పిలిచే సముదాయాలలో ఆచారపరంగా విడాకులున్నాయని తెలుసు. సమాజంలో శూద్రులుగా పిలిచే వారి మొత్తం సంఖ్య ఎంతో ఎవరికైనా తెలుసా? హిందూ సమాజంలో శూద్రుల సంఖ్యను ఎవరూ ఇంతవరకు అంచనా వేయలేదు. హిందూ జనాభాలో శూద్రుల సంఖ్య 90% ఉంటుందనటంలో నాకు కొంచెం కూడా అనుమానం లేదు. బహుశా "పునర్జనిత" (ద్విజ) వర్గాలు ఈ దేశ జనాభాలో 10% కంటే ఎక్కువ ఉండరేమో? నేను సభలోని సభ్యులను ఈ సందర్భంగా ఓ ప్రశ్న వేయదలిచాను. దేశంలో 90% జనాభాకు వర్తించే

చట్టం దేశచట్టంగా అమలవుతుందా? లేక 10% వారు చేసిన చట్టాన్ని 90% జనాభా మీద రుద్దుతామా? సభలోని సభ్యులు ఈ సాదా ప్రశ్నకు సమాధానం చెప్పాలి. వారు చెప్పగలరు.

పునర్జనిత వర్గాలకు సంబంధించి, ఒకానొకకాలంలో అంటే నారద, పరాశర స్మృతుల రచనాకాలంలో భర్త వదిలి వేసినప్పుడుగాని, మరణించినప్పుడు గాని, పరివ్రాజకుడైనప్పుడు గాని స్త్రీకి విడాకులను అనుమతించి రెండో భర్తను పొందేందుకు అనుమతి ఉంది. ఇది తరువాత దశలోని పర్యవసానం కావచ్చు. నేను మీ శాస్త్రాల నుంచే ప్రవచనాలను చదివి వినిపిస్తాను.

గౌ.సభ్యుడు – "మీ శాస్త్రాలా?"

డా. బి.ఆర్.అంబేద్కర్: అవును. ఎందుకంటే నేను ఇతర కులానికి చెందినవాడిని.

ఈ దేశంలో ఏం జరిగిందో నేను సూచించే ప్రవచనభాగాలు తెలుపుతాయి. సరయిన విధంగా వైవాహిక సంబంధాలను మలిచి చూపిన శాస్త్ర భాగాలను, దురదృష్టవశాత్తు ఆచారాలు వాటిని ఎవరూ గమనించకుండానే, తెలియకుండానే ఎలా ధ్వంసం చేయనిచ్చాయో వివరిస్తాను. వివాహం లేదా విడాకుల చట్టంలో ప్రవేశపెట్టిన కొత్త సూత్రాలు అన్నీ న్యాయమైనవి, సముచితమైనవి, గతంలో ఉన్నవీ. వాటిని శాస్త్రాలేకాదు, ప్రపంచానుభవమూ సమర్థిస్తుంది.

దత్తతకు సంబంధించిన దాంట్లో మళ్ళీ మూడు వివాదాంశాలున్నాయి. దత్తతకు సంబంధించి మొదటి వివాదాంశం ఏమిటంటే పాత హిందూ చట్టంలో లాగా చెల్లుబాటయ్యే దత్తత ఒకే కులం నుండి అని కాని కుల గుర్తింపు ఉండాలని కానీ అనడంలేదు. వివాహం విషయంలో ఏ నియమాలను సూచించామో ఇక్కడకూడా అవే పాటిస్తున్నాం. ఇక్కడ కూడా చెప్పదలుచుకున్నదేమంటే బ్రాహ్మణుడు బ్రాహ్మణుడినే దత్తత తీసుకోదలుచుకొంటే అతనికా స్వేచ్ఛ ఉంది. కాయస్థుడు కాయస్తనే దత్తత తీసుకోదలుచుకున్నా అతనికా స్వేచ్ఛ ఉంది. శూద్రుడు శూద్రుడినే దత్తత తీసుకోదలుచుకున్నా అతనికి ఆ స్వేచ్ఛ ఉంది. బ్రాహ్మణుడు జ్ఞానవంతుడై తన కులం వారిని కాకుండా శూద్రుడిని దత్తత తీసుకోవాలనుకుంటే అతనికి అనుమతి ఉంది. కాబట్టి ఎటువంటి విధింపూ లేదు.

శ్రీ సేఠ్ గోవింద్ దాస్ (సి.పి, బేరర్: జెనరల్). అటువంటి బ్రాహ్మణుడిని జ్ఞానవంతుడిగా ఎందుకు భావిస్తున్నారు?

డా. బి.ఆర్.అంబేద్కర్: ఏమో నాకు తెలియదు. నా దృష్టిలో అతడు జ్ఞానవంతుడే. మీ దృష్టిలో అతడు చాలా అజ్ఞానపు చీకటి మనిషి కావచ్చు. అదొక భిన్నాభిప్రాయం. దత్తుని హక్కుల విషయంలో దత్తతకుముందు వితంతువు వేరొకరికి ఇచ్చివేసిన వాటిని దత్తుడు సవాలు చేసే హక్కుల పరిమితి గురించి, వివాదం ఉంటుందనుకోను. దత్తుని తండ్రి మరణించిన సమయం నుంచీ దత్తుడికి తండ్రి హక్కులు వస్తాయన్న అభిప్రాయాన్ని

కొనసాగించడంలో హేతువులేదు. అది శుద్ధ కల్పన మాత్రమే. దానికి విలువలేదు. కేవలం కల్పన మాత్రమే గాక దాని వల్ల ఎన్నో చిక్కులు, పేచీలు ఏర్పడతాయి. కాబట్టి దత్తత, ఆస్తి సంక్రమింపు హక్కు ఏక కాలికంగా జతపడి ఉంటుంది. సభలోని సభ్యులెవరయినా దీన్ని అంగీకరించకుండా వేరే ప్రతిపాదన చేస్తారనుకోను.

శ్రీ బి.దాస్: మేం అంగీకరిస్తున్నాం.

డా. బి.ఆర్.అంబేడ్కర్: అలాగే దత్తుడికి ఉండే హక్కులను పరిమితం చేయడం గురించి – అతనికుండే హక్కులతో తల్లికి హక్కులేకుండా చేయడంతోపాటు, అతనిచ్చే భరణం మీద ఆమె ఆధారపడి ఉండటమనే పరిస్థితిని ఈ సభలోని సభ్యులు ఎవరయినా ఏ కారణంతోనైనా అంగీకరిస్తారనుకోను. సనాతన సమాజంకోసం దత్తత హక్కును సంరక్షించాల్సిందే. కాని నాకర్థం కానిదేమంటే దత్తత అనేది అసలు ఉండాలా అని. మనలో దత్తత చేసుకునే చాలామంది చరిత్రలో నమోదు చేయాల్సినంత పేరు లేని వారమే. నేను వ్యక్తిగతంగా నా పేరు చరిత్రలో నిలిచేదిగా ఉండాలని అనుకోను, ఎందుకంటే బహుశః నాకుండే స్థానం చాలా తక్కువ. నేను హిందూ సముదాయంలో అసహజ సభ్యుడిని. ఎంతోమంది వారి స్థానాలు చరిత్రలో నిలవాలనే అనుకుంటారు. అటువంటప్పుడు దత్తతలో ఒక అబ్బాయినే ఎందుకు తీసుకుంటారు? మూర్ఖుడు, చదువురాని వాడూ, గుణంలేని వాడూ సామర్థ్యాలు లేని వాడూ అయిన ఒక అబ్బాయిని ఒక బీద స్త్రీకి బంధనంగా విధించి ఆమె ఆస్తినుంచి ఆమెను ఎందుకు దూరం చేయాలి? దత్తత గురించిన మీ పాత భావాలను వదలి వేయలేకపోతే ఈ నిబంధన కల్పించి దత్తపుత్రుడికి తల్లికుండే ఆస్తిని పూర్తిగా ఆమెకు కాకుండా చేసే పరిస్థితి లేకుండా ఉంచాలని విన్నపం చేసుకుంటున్నాను. ఈ పరిమితి ఎటువంటి వివాదానికి తావివ్వదని భావిస్తున్నాను.

సంప్రదాయ దత్తత రద్దు గురించి రెండు అంశాలు వివరించాలి. ఈ సాధారణ వాదాన్ని సభ ప్రశంసిస్తుందనుకుంటాను. అది ఏమంటే, బిల్లు ఆచార న్యాయంతో పొసగటం లేదు. అది ప్రాథమిక ప్రతిపాదన. మీరు ఒక చట్టం చేసి అదే సమయంలో ఆచార న్యాయాన్ని పెరిగేందుకు అనుమతిస్తే, సంప్రదాయం చట్టానికి వ్యతిరేకంగా వాదిస్తే అప్పుడు చట్టానికి ప్రయోజనం ఏముంటుంది? సంప్రదాయం చట్టాన్ని భక్షించి, దాన్ని శూన్యంగా, హీనంగా చెల్లకుండా చేస్తుంది. ఇక కృత్రిమ దత్తు, గోధ దత్తు, ద్వ్యముషాయన దత్తతల గురించి చెప్పాల్సివస్తే, అవి దత్తతలేకావు. ప్రీవీకౌన్సిల్ వారు వారి ఆదేశాలలో అభిప్రాయపడ్డట్టు దత్తత అనేది శుద్ధ మతవ్యవహారం. దత్తపుత్రుడికి ఆస్తి సంక్రమించడం ద్వితీయాంశం. అతనికి ఆస్తిరావచ్చు, రాకపోవచ్చు. ఆస్తిరాకపోయినా మత దృష్టిలో దత్తతకు గుర్తింపు ఉంటుంది. కాబట్టి నా విజ్ఞాపన ఏమంటే, ఈ సంప్రదాయ దత్తువిధానాలు అనేవి ఆస్తిని రెండు కుటుంబాల మధ్య ఉంచేందుకు చేసుకొనే ఒప్పందాలే. మనకిప్పుడు రాజ్యాంగం ఉంది. అందులోని ఆదేశిక సూత్రాల్లోని ఒక భాగంలో రాజ్యాంగం ఆస్తి

హక్కులను ఒక్కరి లేదా కొంతమంది చేతుల్లోనే కేంద్రీకరణ చెందకుండా చర్యలు తీసుకోవాలని రాసుకున్నాం కనక ఒకే ఆస్తిని రెండు పక్షాలు పంచుకుని తమ మధ్యనే ఉంచుకోవడానికి అనుమతిచ్చే "ద్వైముషాయన" పద్ధతులను సహించకూడదు. అదే కాక నిజాయితీగా దత్తత తీసుకోవాలనుకొనేవారు చట్టం అనుమతించే, నియమ నిబంధనలకు లోబడి ఉండే దత్తక దత్తును అంగీకరించకపోవడానికి ఏ కారణమూ కనపడదు.

డిప్యూటీ స్పీకర్: ఇప్పుడు ఒంటి గంటయింది. గౌ.మంత్రిగారు భోజన విరామం తరువాత కొనసాగించవచ్చు.

(అసెంబ్లీ భోజన విరామానికి రెండున్నర గంటలకు వాయిదా పడింది.)

అసెంబ్లీ భోజన విరామం తరువాత రెండున్నర గంటలకు సమావేశమయింది. డిప్యూటీ స్పీకర్ (శ్రీ ఎమ్. అనంత శయనం అయ్యంగార్) సభాపతి స్థానంలో ఉన్నారు.

గౌ. డా. బి.ఆర్. అంబేద్కర్: సహభాగస్వామ్య చట్టంలోని వివాదాంశాలను ప్రస్తావించదలచలేదు. మితాక్షర నియమం నిర్ధారించిన సహభాగస్వామ్యాన్ని బిల్లు ఎందుకు రద్దు చేస్తుందన్న ప్రశ్న వచ్చింది. సర్, ఇప్పుడు బాగా మనసు పెట్టి ఆలోచించిన మీదట ఈ విషయాన్ని మూడు రకాల దృష్టికోణాలతో పరిశీలించాలని నాకు అనిపించింది. సహభాగస్వామ్య ఆస్తి కోవలో ఎంత పెద్ద మొత్తంలో ఆస్తి వస్తున్నది? ఆ విధంగా వచ్చిన ఆస్తి పరిమాణంపట్ల తీవ్రంగానే ఆలోచించాల్సి ఉంటుంది. ఈ రోజుల్లో ఒక మనిషికి ఉండే ఆస్తి కంటే ఎంత ఎక్కువ పరిమాణంలో ఈ ఆస్తి ఉన్నదనేది ప్రశ్నలోని మొదటి దృష్టికోణం.

రెండోదేమిటంటే భాగస్వామ్య ఆస్తిలో భాగస్తుడికి వ్యక్తిగతంగా ఆస్తిని నిలిపి ఉంచుకునే హక్కు గురించి. భాగస్వాములలో ఒకరు స్వతంత్రంగా ఈ ఆస్తిని అన్యాక్రాంతం చేసే అవకాశం ఉందా? మూడో అంశం సహభాగస్వామికి స్వయంగా ఈ భాగస్వామ్యాన్ని తెంచుకోగల హక్కు ఉందా? ఒక వేళ సహభాగస్వామ్య ఆస్తి పరిధిలోకి వస్తున్నది మొత్తం ఆస్తిలో ఒక చిన్న భాగం అయితే మరిన్ని ప్రశ్నలు వస్తాయి. అట్లాగే ప్రస్తుతం ఉనికిలో ఉన్న హిందూ చట్టం ప్రకారం తన వాటా ఆస్తి హక్కును అన్యాక్రాంతం చేయగల హక్కు ఏ భాగస్వామి అయినా కలిగి ఉంటే అప్పుడు ఈ బిల్లు ప్రకారం సహభాగస్వామ్య ఒప్పందం రద్దు వేరే విధంగా ఉంటుంది. అట్లాగే ప్రస్తుత హిందూ చట్టం ప్రకారం భాగస్వామికి స్వతస్సిద్ధంగానే సహ భాగస్వామ్యం తెంచుకొనే హక్కు ఉంటే అప్పుడు ఈ బిల్లు భాగస్వామ్య హక్కు రద్దు చేస్తుందనే ప్రశ్న అందరూ అనుకుంటున్నంత ప్రాముఖ్యత గల విషయం కాదు. ఆ విషయాన్ని సభలోని సభ్యులు, బయటి ప్రజలు గ్రహించాలని నా విన్నపం.

ఇప్పుడు మొదటి ప్రశ్న తీసుకుందాం. సహభాగస్వామ్య ఆస్తిలో భాగస్వామిగా ఉన్నప్పటికీ కూడా ఆ వ్యక్తి ఎంతమేరకు విడిగా ఆస్తి కలిగి ఉండవచ్చు? మిత్రులారా! ఈ

విషయంపట్ల ఆసక్తి ఉన్నవారికి, హిందూ చట్టంలో ఉన్న స్థితి తెలిసినవారికి సహభాగస్వామిగా కొనసాగుతూ విడి ఆస్తిని కలిగి ఉండటం అనర్హత కాదనే విషయం తెలుసు. సహభాగస్వామి రెండు రకాలయిన ఆస్తులు కలిగి ఉండవచ్చు. ఒకటి భాగస్వామ్య ఆస్తి, రెండోది భాగస్వామ్య కూటమికి చెందని ఆస్తి. అది అతనికే చెందినటువంటిది. మరణానంతరం కూటమిలో మిగిలిన వారికి అది సంక్రమించదు.

ఒక వ్యక్తి సహభాగస్వామిగా ఉన్నప్పటికీ అతను కలిగి ఉండగల ఆస్తి స్వభావమూ పరిధుల గురించీ సభకు కొంత వివరిస్తాను. సహభాగస్వామ్య సభ్యుడిగా ఉన్నప్పటికీ దానితో సంబంధం లేకుండా ఒక సహ భాగస్వామి ఏ రకమైన ఆస్తి కలిగి ఉండవచ్చునే ఈ కింది విషయాలను హిందూ చట్టం పై లభించే ప్రామాణిక గ్రంథాలనుంచి తీసుకున్నాను. మొదటిది ఒక హిందువుకు తండ్రిద్వారా కాని తాత ముత్తాతల నుంచిగాని కాకుండా వేరే వ్యక్తి నుండి సంక్రమించిన ఆస్తి. దీనిని విడి ఆస్తిగా పరిగణించాలి. ఈ ఆస్తి సహభాగస్వామ్య ఆస్తిలోకి రాదు. రెండోదేమంటే తల్లి తండ్రిగారి నుంచి సంక్రమించిన ఆస్తి. మూడోది తండ్రినుంచి బహుమతిగా వచ్చిన తరతరాల చరాస్తి. నాలుగోది ప్రభుత్వం వ్యక్తిగతంగా ఇచ్చింది. సహకుటుంబ సభ్యుడిగా ఉన్నా ఇది సహకుటుంబ ఆస్తికాక, వ్యక్తిగత ఆస్తి అవుతుంది. అయిదోది, కుటుంబానికి చెందిన పూర్వుల ఆస్తి. ఎన్నడో కోల్పోయి కుటుంబ ఆస్తి సహాయం లేకుండానే సాధించుకొన్నది. దీనికి కుటుంబ ఆస్తితో సంబంధం ఉండదు. అయితే అసలు ఇది సహకుటుంబ ఆస్తిగా ఉన్నా తరువాత వ్యక్తిగత ఆస్తి అవుతుంది. ఆరోది వ్యక్తిగత ఆస్తి నుంచి వచ్చిన ఆదాయం, అటువంటి ఆస్తి నుంచి చేసే కొనుగోళ్ళు కూడా అతని వ్యక్తిగత ఆస్తే. ఏడవది, సహకుటుంబ ఆస్తిని వాటాలు వేసి పంచినపుడు మగ సంతానం లేని వ్యక్తి భాగం అతని స్వంత ఆస్తి అవుతుంది. ఎనిమిదవది మిగిలి ఉన్న ఒక్క సహ భాగస్వామి ఆస్తి. దత్తత అధికారం ఉన్న వితంతువు గాని లేకుంటే ఆ ఆస్తి అతని స్వంతాస్తి అవుతుంది. తొమ్మిదవది ఉమ్మడి కుటుంబంలోని సహ కుటుంబ సభ్యుడి విడి సంపాదన. పదవది జ్ఞాన సముపార్జన వల్ల వచ్చిన ఆస్తి. ఇప్పటి మితాక్షర నియమంలో ఈ పది రకాలుగాను చెప్పిన ఆస్తి సహభాగస్వామి వ్యక్తిగత ఆస్తి అవుతుంది. ఇది సహభాగస్వామ్య ఆస్తి కిందికి రాదు.

దీన్ని సాదా ఉదాహరణతో చెబుతాను. మన సచివాలయంలో వందలాది గుమాస్తాలు చిన్న జీతాలతో ఉన్న వారున్నారు. కొంతమంది క్యాబినెట్ సభ్యుల జీతం ఆయిన రూ. 4000 కన్నా ఎక్కువ జీతం తీసుకొనేవారూ ఉన్నారు.

గౌ. సభ్యులు: గుమాస్తాలా? వీళ్ళు గుమాస్తాలా" ?

డా. బి.ఆర్.అంబేద్కర్: నా ఉద్దేశం అధికారులు. ఒకరకంగా ఘనతకెక్కిన గుమాస్తాలు.

సభకు నేను చెప్పదలచిన అంశం ఇది – అధ్యయన ప్రయోజనాల ఫలితంగా పొందే ఆదాయం వ్యక్తిగతంగా రూ. 4000 లభిస్తే అది ఉమ్మడి కుటుంబంలో వాస్తవ

స్ఫూర్తితో, ఉమ్మడికుటుంబ అవసరాలకు పోవాలి. ఏమవుతుందప్పుడు? కొన్ని ఏళ్ళ క్రితం ఇక్కడే ఈ సభలోనే అధ్యయన ప్రయోజనాలచట్టం ఆమోదం పొందింది, ఇప్పుడున్న సభ్యులు కాకపోవచ్చు. దాని ప్రకారం అది ఉమ్మడి కుటుంబ ఆదాయంలో ప్రధాన భాగం, ఏదైతే సభ్యుడు విద్య ద్వారా ఆర్జిస్తున్నాడో, ఏ విద్య అయితే కుటుంబాదాయం ద్వారా వచ్చిందో ఇప్పుడది వ్యక్తిగత ఆదాయం అయింది. సభకు నేను చేసే విన్నపం ఒక్కటే. ఇంత విస్తృతమైన ఆస్తి వర్గీకరణలు ఉన్నప్పుడు, మితాక్షర నియమం వ్యక్తిగత ఆస్తిని 10 సంవర్గాలుగా చేస్తున్నప్పుడు, సహకుటుంబ ఆస్తిగా మారేందుకు ఇంకేం ఆస్తి మిగిలి ఉంటుంది? నా విన్నపం ఏమంటే చాలా కొద్ది పరిమాణంలో ఉన్న ఆస్తి మాత్రమే సహకుటుంబ ఆస్తిగా మిగిలి ఉంటుంది. మరో విషయం గమనిద్దాం. సహకుటుంబస్థుడంటే – సభ్యులు అర్థం చేసుకుంటారనుకుంటాను. సహకుటుంబస్థునికి ఉమ్మడి కుటుంబంలోలాగా కాకుండా పరిమితి గల, సంకుచిత పరిధి ఉంది. అదే ఉమ్మడి కుటుంబం అయితే వేరే విషయం. హిందూ వ్యవస్థ ఆస్తిని సంరక్షితం చేసి కలిపి ఉంచుతుంది. విడిపోకుండా డబ్బు దుబారా కాకుండా, కుటుంబ సభ్యుల వాటా దుర్వినియోగం కాకుండా చూస్తుంది అంటారు. నేను సభకు ఒక ప్రశ్నవేస్తున్నాను. ప్రస్తుతం ఉన్న మితాక్షర నియమం ప్రకారం ఈ ఆస్తి విహీనం చెందదా? ఆస్తి దుర్వినియోగం కాదా? సమాధానం నకారాత్మకంగానే ఉంటుంది. మీకు ఒకటి రెండు ఉదారణలు ఇస్తాను. ఒక తండ్రి విషయం తీసుకుందాం. పూర్వపు రుణంకోసం ఉమ్మడి ఆస్తిని తండ్రి అన్యాక్రాంతం చేయవచ్చు. దానికోసం అతను చేయవల్సిందంతా ఒక్కటే. ముందుగా ఒక అప్పును సృష్టించడం. వ్యక్తిగత ప్రామిసరీ పత్రం ఆధారంగా వెయ్యి లేదా రెండువేల రూపాయల అప్పు. ఆరునెలల తరువాత ఆ అప్పు తీర్చడంకోసం సహకుటుంబ ఆస్తి మొత్తం విక్రయించే హక్కు అతనికి ఉంటుంది. ఇప్పుడు నా విన్నపం ఏమంటే ఆ తండ్రికి అన్ని విధాల విస్తృత హక్కును వ్యక్తిగత రుణాలకు, పూర్వపు రుణాలకు గాను ఇవ్వవచ్చా? ఆస్తి అన్యాక్రాంతం చేయటానికి సంబంధించి మితాక్షర నియమం తండ్రికీ నిర్వాహకుడికీ మధ్య తేడా పాటిస్తోందని, దీన్ని గమనించండని సభకు చెబుతున్నాను. కుటుంబ అవసరాల నిమిత్తం ఆస్తి అన్యాక్రాంతం చేయడం అవసరం అని నిరూపిస్తే తప్ప వాస్తవానికి నిర్వాహకుడు ఆస్తిని అన్యాక్రాంతం చేయలేడు. కాని తండ్రి విషయంలో అటువంటి విధిలేదు. తండ్రి తనకోసం వ్యక్తిగత రుణం సృష్టించగలడు. అప్పుడు, ఆ వ్యక్తిగత రుణం కోసమే, కుటుంబ ప్రయోజనాలు లేకపోయినా ఆస్తిని అన్యాక్రాంతం చేయవచ్చు. మితాక్షర నియమం ప్రకారం తండ్రి ఆస్తిని, అపవిత్ర, అనైతిక, ప్రయోజనాల రుణం నిమిత్తం వినియోగించరాదు. ఒకవేళ అనైతిక ప్రయోజనాలకు కాకపోతే తండ్రి సహకుటుంబ ఆస్తిని మొత్తం అన్యాక్రాంతం చేయగలడు. అక్కడ పరిమితేలేదు.

అదే విధంగా కుమారుని సంగతి తీసుకోండి. మితాక్షర నియమం ప్రకారం కుమారుడు కుటుంబ ఆస్తిని పంచి ఇమ్మని ఎప్పుడైనా అతని ఇష్టాన్నిబట్టి అడగవచ్చు. సహకుటుంబ సభ్యుడెవరయినా ఆస్తి అన్యాక్రాంతం చేయలేడన్న హిందూ చట్టం ప్రకారం కుటుంబ ఆస్తి సంరక్షణ వాదాన్ని నేను అర్థం చేసుకున్నాను కాని వాస్తవానికి అట్లా లేదు. సహకుటుంబ ఆస్తి విధ్వంసం అంటే అది సహ భాగస్వామ్యంలోనే ఉంది. దానికి మూలం కుటుంబ న్యాయంలోనే ఉంది. ఎందుకంటే జన్మతః ఆస్తిలో భాగం అడిగే హక్కు సహకుటుంబ న్యాయం ద్వారా సిద్ధిస్తోంది కాబట్టి ఆ విధంగా అది సమాజాన్నే భగ్నం చేస్తోంది.

మూడోది ఒకవేళ కొడుకు ఆస్తి అన్యాక్రాంతం చేయకపోయినా వ్యక్తిగత ప్రయోజనాలకోసం ఆస్తి మీద అప్పు తీసుకోవచ్చు. అప్పిచ్చిన రుణదాత మితాక్షర నియమం ప్రకారం సహకుటుంబ వాటా మీద దావా వేసి అప్పిచ్చిన రుణం మొత్తం పొందవచ్చు. ఆవిధంగా ఒక అపరిచితుడు మితాక్షర నియమం ప్రకారం సహకుటుంబాన్ని విచ్ఛిన్నం చేయవచ్చు. గౌరవ మిత్రులకు ఒక ప్రశ్న వేయదలిచాను. అసలు ఈ పరిస్థితి గురించి ఇబ్బంది ఉన్నది ఎవరికి? ఎస్టేట్లోని పెద్ద మొత్తం ఆస్తి, సహకుటుంబ ఆస్తికి బయట ఉన్నపుడు, సహకుటుంబ ఆస్తికి సంబంధించి, రుణం అనైతికమైతే తప్ప తండ్రి అన్యాక్రాంతం చేయటానికి ఏ పరిమితి లేనప్పుడు, కుమారుడు తన ఇష్టం వచ్చినప్పుడు ఆస్తి నుంచి విడిపోగలినప్పుడు, ఆస్తి మీద అప్పు చేయగలిగినప్పుడు, అప్పు ఇచ్చిన రుణ దాత గ్రహింపుకు ఆస్తి మీద దావా వేయగలినపుడు దీన్ని సురక్షితమైన వ్యవస్థ అనగలమా? దానిలో ఏ లోపాలూ లొసుగులూ లేనే లేవా? నా విన్నపం ఒకటే. సహకుటుంబ ఆస్తిచట్టంలోనే దానిని భగ్నం చేయగల వీలుని కల్పించే అంశాలున్నాయి. కాబట్టి, ఈ బిల్లు ద్వారా తీవ్రమైన మార్పులు చేస్తున్నదేమీ లేదు. మనకందరికీ తెలిసినట్టుగా ప్రతి ఒక్కరూ విడిగా జీవించదలుస్తున్నారు. తండ్రి చనిపోగానే చట్టబద్ధమైన విషయాలకు కొడుకు ప్రాధాన్యం ఇవ్వడం ఈ నాడు చూస్తున్నదే. అందువల్ల బిల్లులోని ఈ భాగంలో తీవ్రమైందేమీ లేదు.

అయినా ఒక విషయం సాధారణంగా అందరూ గ్రహించనిది ఒకటి చెప్పాలి. ఉమ్మడి కుటుంబం, సహకుటుంబం మధ్య తేడా గమనించాలని అంటూ నేను మొదలు పెట్టాను. ఈ బిల్లు సహకుటుంబాన్ని కాదంటూనే ఉమ్మడి కుటుంబాన్ని కొనసాగనిస్తుంది. అది ఉమ్మడి కుటుంబాల జోలికి పోవడంలేదు. ఒకటే విషయం ఏమిటంటే 'దాయభాగ' చట్టంలో ఉమ్మడి కుటుంబాల లక్షణాలే మితాక్షరచట్టంలో ఉమ్మడి కుటుంబానికీ వర్తిస్తాయి. మితాక్షర నియమం బెంగాల్లో లేదు కాబట్టి అక్కడ ఉమ్మడి కుటుంబం లేదనుకోకూడదు. ఉమ్మడి కుటుంబం ఉంది. ఉమ్మడి కిరాయిదార్లుగా కాకుండా వారి హక్కుగా ఉమ్మడిగా

కలిసి ఉండటం అనేది ఉమ్మడి కుటుంబంలో ఉంది. ప్రస్తుత మితాక్షర న్యాయానికీ, భవిష్యత్తు మితాక్షర న్యాయానికీ తేడా అదే.

ఇప్పుడిక స్త్రీ ఆస్తివైపుకు వస్తాను. ఈ విషయంలోని చిక్కులగురించి ఎంతమందికి తెలుసునో నాకు తెలియదు. ఈ విషయం గురించి అధ్యయనం చేసినంత మేరకు, హిందూ చట్టంలో సంక్లిష్టమైనది ఏదయినా ఉందంటే అది స్త్రీ ఆస్తే.

గౌ.సభ్యుడు – స్త్రీ లాగానే...

గౌ. డా. బి.ఆర్. అంబేద్కర్ స్త్రీలాగానే! మీరు స్త్రీధనం అంటే ఏమిటని అడిగితే, మీ ప్రశ్నకు సమాధానం చెప్పేముందు, మీరు మరొక ప్రశ్న అడగాలి. నేను సమాధానం చెప్పాలి. 'ఆమె కన్యా లేక వివాహితా?, అని ముందుగా అడగాలి. ఎందుకంటే స్త్రీ ధనమేదో కానిదేదో ఆమె స్థాయి మీద ఆధారపడి ఉంటుంది. ఒకరకం ఆస్తి ఆమె కన్యగా ఉన్నప్పుడు పొందినట్టయితేనే అది స్త్రీధనం అవుతుంది. ఒకరకం ఆస్తి వివాహానంతరం పొందితే అది స్త్రీధనం కాదు. ఫలితంగా మీరు స్త్రీ ధనం ఏరకమైన వరసలో వారసత్వంగా వస్తుంది? అని అడిగితే మళ్ళీ మరొక ప్రశ్న వస్తుంది. స్త్రీధనం కన్యకు చెందుతుందా? వివాహితకు చెందుతుందా? కన్య అయితే ఉండే వారసత్వ నియమం వివాహిత అయితే ఉండే వారసత్వ నియమానికి చాలా తేడా ఉంది. వివాహిత స్త్రీల స్త్రీధనం విషయంలో మరొక ప్రశ్న వస్తుంది. ఆమె బెంగాల్ విధానానికి చెందుతుందా మితాక్షర విధానానికా? బెంగాల్ విధానానికీ మితాక్షర విధానానికి ఎంతో తేడా ఉంది. ఒకవేళ ఆమె మితాక్షర విధానానికి చెందితే నిశ్చిత సమాధానం రాదు. విషయాన్ని మరింత అన్వేషించాలి. మిథిలా విధానమా లేదా బెనారస్ విధానమా లేదా మరింకేదయినా విధానమా? ఇది చాలా సంక్లిష్ట విషయం. అదే సమయంలో గౌరవ సభ్యులు రెండు అంశాలు గుర్తుంచుకోవాలి. స్త్రీ ఆస్తికి సంబంధించి సాధారణంగా మాట్లాడితే అది రెండు కేటగిరీల్లోకి వస్తుంది. ఒకటి ఆమె స్త్రీధనం. రెండోది వితంతువు ఆస్తి. ఇది కుటుంబంలోని పురుషుడి ద్వారా సంక్రమించింది. ప్రస్తుత చట్టం ప్రకారం ఆమె జీవిత కాలంలో పొందేది. తరువాత ఆ ఆస్తి పురుష వారసుల శేష హక్కుదార్లకు సంక్రమిస్తుంది. ఇది ప్రస్తుత స్థితి.

కాబట్టి స్త్రీ ఆస్తికి సంబంధించి, రెండు వేర్వేరు రకాల ఆస్తులూ వాటికి సంబంధించిన రెండు రకాల వారసత్వాలూ ఉన్నాయి. స్త్రీధన ఆస్తికి వారసులు వేరు. పురుష సభ్యుడి నుంచి సంక్రమించిన స్త్రీ ఆస్తికి ఉండే వారసులు వేరు. ఇక్కడ హిందూచట్టం లోని ఈ భాగాన్ని క్రోడీకరించడం విషయంలో మనం పరిగణనలోకి తీసుకోవాల్సిన ప్రశ్న ఏమిటంటే ప్రస్తుతం ఉన్న స్త్రీ ధన ఆస్తి, వితంతు ఆస్తులుగా ఈ రెండు ప్రధాన విభజనను ఇప్పుడున్నట్లుగా ఉంచుతారా? రెండోది, స్త్రీధన ఆస్తికి ఒక వారసత్వం, వితంతు ఆస్తికి ఒక వారసత్వం అనే రెండిటినీ ఉంచుతారా? చట్టాన్ని క్రోడీకరించే ముందు ఈ రెండు ప్రధాన ప్రశ్నలు ఉదయిస్తాయి. ప్రస్తుత అయోమయస్థితి కొనసాగిస్తే ప్రయోజనం

దెబ్బతింటుందని క్రోడీకరణ చేసేముందు కమిటీ అభిప్రాయపడింది. స్త్రీకి సంపూర్ణ ఆస్తిహక్కు ఉంటుందా? ఉండదా అనేది మనం నిర్ణయించాలి. స్త్రీలకు ఉండే వారసత్వ మార్గాలను నిర్ణయించాలి. అవి ఏకరూపంగా ఉండవచ్చు. వేరుగా ఉండవచ్చు. ఆస్తిహక్కుకు సంబంధించి ఏకరూపత ఉండాలని, ఆ ఏకరూపత స్త్రీకి సంపూర్ణ ఆస్తి హక్కును గుర్తించేదిగా ఉండాలని కమిటీ అభిప్రాయపడింది.

స్త్రీకి సంపూర్ణంగా ఆస్తిహక్కు కల్పించడానికి వ్యతిరేకంగా జరిగిన వాదనలు చాలా వరకూ నాకు తెలుసు. మహిళలు బలహీనులని, అందరి ప్రభావాలకు గురవుతారని ఫలితంగా స్త్రీలను ప్రపంచంలో అందరి ప్రభావానికి వదలడం ఎంతో ప్రమాదకరమనీ అందువల్ల ఒక విధంగానో లేదా మరో విధంగానో కపటమైన మగవాళ్లెవరైనా వారిని ప్రభావితం చేయగలరనీ ఆ రకంగా ఆస్తి కోల్పోవడం వారికే కాకుండా ఏ కుటుంబం నుండి ఆస్తిని వారసత్వంగా పొందారో వారికీ హానికరం అని అంటున్నారు. కమిటీ తీసుకున్న అభిప్రాయం చాలా మామూలుది. కొన్ని సందర్భాల్లో, లేదా కొన్ని రకాల ఆస్తుల విషయంలో స్మృతులు స్త్రీధన ఆస్తికి సంబంధించి సంపూర్ణ హక్కు ఇవ్వడానికి సిద్ధపడ్డాయి. దానిని ఆమె తనకు కావల్సిన విధంగా పంపిణీ చేయవచ్చు. సభకు నా విన్నపం ఏమిటంటే స్త్రీని నమ్మి ఆమెకు స్త్రీధనం ఎలా కావాలంటే అలా పంపిణీ చేసుకొనే సంపూర్ణ హక్కు ఇచ్చినపుడు, మితాక్షర న్యాయ సూత్రాన్ని రద్దు చేయాలని ఎవరూ అభ్యంతరం లేవనెత్తలేదు. కాబట్టి ఆస్తిలోని మరొక భాగాన్ని అంటే వితంతు ఆస్తికి సంపూర్ణ హక్కును కల్పించకూడదనడం ఎంతవరకూ సమంజసం? ఒకభాగాన్ని వారు సమర్థవంతంగా తమకు నచ్చినట్టు పంపిణీ చేసుకోగల సామర్థ్యం ఉన్నప్పుడు మరొక భాగాన్ని పంపిణీ చేయగల సామర్థ్యం ఎలా లేకుండా పోయిందనేది వ్యతిరేక పక్షం తీసుకొనేవాళ్ళు నిరూపించాల్సి ఉంటుంది. కమిటీ ఎంత జాగ్రత్తగా పరిశీలించినా ఈ సందిగ్ధానికి సంతృప్తికరమైన పరిష్కారం కనుగొనలేకపోయింది. అందువల్ల నా దృష్టిలో కమిటీ చాలా సరిగ్గా ఆలోచించి, కొన్ని ప్రత్యేక సందర్భాలలో మహిళలు తెలివిగా తమ ఆస్తిని అమ్మగలిగీ, పంపిణీ చేయగలిగీ ఉన్నప్పుడు మరో సందర్భంలో మరొక ఆస్తిని కూడా పంపిణీ చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంటారని నిర్ధారణకు వచ్చింది. ఆ కారణంగానే స్త్రీలు ఇప్పుడు సంపూర్ణ ఆస్తి హక్కు కలిగి ఉండాలని నియమాన్ని రూపొందించింది.

ఈ విషయం గురించి మరో ప్రశ్న తలెత్తుతుంది. స్త్రీ ఆస్తి, అంటే కుమార్తె వాటా గురించి. ఇది చాలా సున్నితమైన ప్రశ్న అన్నామంటే దానిని చాలా తక్కువ చేసినట్టు. ఇది చాలా ఆతృత కలిగించే ప్రశ్న. ప్రపంచంలోనూ ఈనాడు ఇండియాలోనూ సాంప్రదాయవాదులూ, సాంప్రదాయేతరులూ ఎందరో ఆడపిల్లలకు జన్మనివ్వకుండా అయితే ఉండలేరు. ఇస్తున్నారు. ఆడపిల్లలే కనక జన్మించకపోతే ఈ ప్రపంచం ఏమయిపోయేదో నాకు తెలియదు. కానీ ఆడపిల్లకూ, మగపిల్లకూ ఇద్దరికీ సమానంగా ఇవ్వాల్సిన

ప్రేమాపేక్షలను ఆడపిల్లకి ఇవ్వడానికి మాత్రం తల్లిదండ్రులు సిద్ధపడడంలేదు. సెలెక్ట్ కమిటీ వాడినంత పై స్థాయి భాష కూడా నేను ఉపయోగించడం లేదు. నేను మొట్టమొదట సభకు చెప్పదలుచుకున్న విషయం ఏమిటంటే కూతుళ్లను వారసులలో చేర్చడం సెలెక్ట్ కమిటీ కొత్తగా కనుక్కున్నదేమీ కాదు. వారసత్వ చట్టంతో పరిచయం ఉన్న గౌరవ సభ్యులకు మితాక్షర దాయభాగలు రెండిటిలోనూ వారిని సంఘటిత శ్రేణి (కాంపాక్ట్ సిరీస్)లో చేర్చారని తెలుసు. హిందూ వారసులను వివిధ కేటగిరీలుగా విభజించిన విషయం గౌరవ సభ్యులకు తెలిసిందే. మొదటి కేటగిరీ సంఘటిత శ్రేణి. తరవాత సపిండవారసులు. ఆ తరవాత సమానోదకులు. ఆ తరవాత శ్రేణిలో బంధువులు వస్తారు. బంధువుల్లో మూడు కేటగిరీలున్నాయి. ఆత్మ బంధువు, పితృ బంధువు, మాతృ బంధువు. సంఘటిత శ్రేణి ప్రత్యేక వారసుల సముదాయం. ఇది గోత్రజులు, సమానోదకులు, బంధువులు విషయంలో ఉండే ప్రాధమిక వారసత్వపు నియమాలకు లోబడి ఉండదు. ఎందుకంటే అదొక మిశ్రమ కేటగిరి. ఇది రెండు రకాల పునాదుల మీద ఆధారపడి ఉంటుంది. అది రక్తసంబంధం మీద, మత ప్రయోజనాల మీద ఆధారపడి ఉంటుంది. సపిండకులు, సమానోదకులు బంధువుల కేటగిరీలకు సంబంధించిన ఎటువంటి గీటురాళ్ళు వీటికి వర్తించవు.

మితాక్షర, దాయభాగలను గమనిస్తే కూతురును సంఘటిత శ్రేణిలో చేర్చారని తెలుస్తుంది. మితాక్షర, దాయభాగల మధ్య తేడా ఒకటే. దాయభాగ వారసత్వంలో ఆస్తిని కోరుతున్నవారికి తర్పణ చేసే యోగ్యత ఉండడం అవసరం. అందుకే దాయభాగ వివాహితకూ, అవివాహితకూ నియమాన్ని విడదీస్తూ, వివాహిత కూతురు, కొడుకు గల కూతురికీ, వితంతువు అయిన కూతురికీ తేడా చూపుతుంది. ప్రాధాన్యత కొడుకు గల వివాహితకు ఉంటుంది. ఆ తరువాత వితంతువుకి, అటుతరువాతే అవివాహితురాలికీ, మూడో ప్రాధాన్యం ఉంటుంది. ఇదంతా ఈ కేటగిరిలోనే. వివాహితురాలై కొడుకు ఉంటే తర్పణం వదిలేందుకు అవకాశముంటుంది, కొడుక్కే ఆ అర్హత ఉంది కాబట్టి, వివాహితురాలైనా కొడుకు లేకపోతే, అక్కడ తర్పణం వదిలే అవకాశం ఉండదు. అందుకనే, ఆమెను కొంత కిందుగా ఉంచారు. నేను చెప్పదలిచిన అంశం, సభ గుర్తించాల్సిన అంశం ఏమంటే అమ్మాయిని సంఘటిత శ్రేణిలో చేర్చడంలో ఎటువంటి కొత్త విషయం లేదు. ఆమె అటు మితాక్షరలోనూ, ఇటు దాయభాగ లోనూ ఎప్పుడూ ఉంది. బిల్లులోని కొత్త విషయం ఏమంటే కూతురు హోదా పెంచడమే. ఈ బిల్లు ప్రకారం వితంతువైన స్త్రీ తన కొడుకుతో పాటు, తన మృత కుమారుని వితంతువు, మృత మనవడి వితంతువు మృత మునిమనవడి వితంతువులతో సహ ఏకకాలంలో వారసురాలిగా వుంటుంది.

అసలు అంశం ఏమంటే, మొదట్లో, ముఖ్యంగా మితాక్షర నియమం ప్రకారం స్త్రీకి అసలు వాటానే లేదు. దీనికి 1937లో మార్పు చేశారు. మృతి చెందిన వారి

వితంతువులకు, పూర్వ మృత కుమారుడికి, మనవడికి, మునిమనవడికి వారసత్వాన్ని కుమారుడితో పాటు కల్పించి ఏక కాలిక వారసులుగా చేశారు. అప్పుడు కుమార్తెను గురించిన అంశాలను వదిలివేశారు. వితంతువు, పూర్వమృత కుమారుడి వితంతువు, పూర్వమృత కుమారుడి కుమారుడితో సమానంగా కూతురి హెూదాను ఉంచడానికి ప్రభుత్వం సిద్ధపడలేదు. అందువల్ల ఇప్పుడు బిల్లు చేర్చిన కొత్త విషయం ఇదే. వారసుల క్రమంలో ఆమె హెూదాను పెంచింది. అంతేకాని ఆమెను వారసురాలిగా గుర్తించడం మొదటి సారికాదు.

ఇప్పుడిక ఆమె వాటా గురించి ప్రస్తావిస్తాను. రావు కమిటీ సూచించినట్టుగా శాస్త్రాలు తెలిసిన సాక్షులు ఎత్తిచూపినట్టుగా స్మృతులు కొడుకుతో పాటు కూతురిని ఏక కాలిక వారసురాలిగా గుర్తించడమే కాకుండా తండ్రి ఆస్తిలో నాలుగో వంతు వాటాకు అర్హురాలిగా చేశాయి. దీనిని మను, యాజ్ఞవల్క్య స్మృతులు ఆమోదించాయి. నేను ఒకసారి 137 స్మృతులు లెక్కించాను. మన ప్రాచీన బ్రాహ్మణులు స్మృతులు రాయడంలో ఇంతగా ఎందుకు ఆసక్తి కనబరచారో తెలియదు. బహుశా అప్పటికి అదే సర్వోన్నత వృత్తి కూడా కావచ్చు. స్మృతులు రాసే పనిలో నిమగ్నమయిన 137 మంది స్మృతి కారుల్లో ఉన్నత శ్రేణికి చెందినవారు యాజ్ఞవల్క్యుడు, మనువు. ఇద్దరూ కూడా కూతురు తండ్రి ఆస్తిలో నాలుగో వంతు భాగం పొందడానికి అర్హురాలని పేర్కొన్నారు. మొత్తానికి ఏదో కారణాల వల్ల ఆచారాలు శాస్త్ర సామర్థ్యాన్ని నాశనం చేసాయి. లేకపోతే మన స్మృతుల ప్రకారమే ఆమెకు తండ్రి వాటాలో నాలుగో వంతు దక్కి ఉండేది. ప్రీవీ కౌన్సిల్ దీనికి ఇచ్చిన రూలింగ్ నాకు విచారం కలిగించింది. చట్టాన్ని మెరుగు పరిచే దారిలో అది ఆటంకంగా నిలిచింది. అంతకుముందు ఒక కేసు విషయములో ప్రీవీ కౌన్సిల్, చట్టంకంటే సాంప్రదాయం ఎక్కువ అని తీర్పు ఇవ్వడంతో, ప్రాచీన స్మృతుల్లో రుషులు, స్మృతికారులు చేసిన చట్టాలను పరిశీలించడం న్యాయ వ్యవస్థకు అసంభవం అయిపోయింది. ప్రీవీ కౌన్సిల్ ఈ ఆదేశం ఇవ్వకపోయినట్టయితే ఎవరో ఒక న్యాయవాది, లేదా ఒక న్యాయమూర్తి తప్పక యాజ్ఞవల్కుడు, మనువు రాసిన స్మృతుల్లో ఉన్న ఈ విషయాన్ని బయటికి తీసి ఉండేవారనడంలో సందేహం లేదు. ఈ పాటికి స్త్రీ ఇంతకన్నా ఎక్కువ కాకపోయినా కనీసం నాలుగో వంతు వాటా అయినా అనుభవిస్తూ ఉండేది.

బిల్లు ముసాయిదాలో కూతురు వాటాను సగానికి పెంచితే, నా సెలెక్ట్ కమిటీ ఒక అడుగు ముందుకు వేసి ఆమె వాటాను కొడుకుతో సమానం చేసింది.
సెలెక్టు కమిటీలో ఏం జరిగిందో ఎలా ఈ నియమం రూపొందిందో ఆ వివరాలు నేను బయటపెట్టలేను కానీ నేను సంపూర్ణంగా......

శ్రీమతి రేణుకా రే (పశ్చిమబెంగాల్ – సాధారణ): ఏకగ్రీవంగా!

డిప్యూటీ స్పీకర్: బిల్లులో కొడుకు వాటాకు రెండింతలు అని తరవాత సగంవాటా కల్పించడం రాజీనా?

గౌ.డా.బి.ఆర్.అంబేద్కర్: అది రాజీ కాదు. నా శత్రువులు నా ఔత్సాహిక సమర్థకులతో కలిశారు. నా శత్రువులు ఈ బిల్లుని ఉన్నదానికన్న ఘోరంగా కనిపించేలా చేసి ఈ బిల్లును అపప్రథ పాలుచేయాలనుకున్నారు.

శ్రీ హెచ్. వి. కామత్: మీకు శత్రువులున్నారా?

గౌ.బి.ఆర్.అంబేద్కర్: ఏమయినా పరిస్థితి ఇది. అమ్మాయి వాటాకు సంబంధించిన కొత్త విషయం ఏమంటే కూతురి వాటాను పెంచడం వల్ల ఆమె పరిస్థితి కొడుకు లేదా వితంతువుతో సమానమైంది. అది కూడా నా దృష్టిలో కొత్త విషయం కాదు. మీరు నా దృష్టికోణాన్ని ఆమోదిస్తే, నేను ముందే చెప్పినట్లు మేము చేసిందల్లా మీరంతా గౌరవించే స్మృతుల్లోకి వెనక్కు వెళ్లడమే.

కూతురు వాటా గురించి ప్రశ్న వచ్చి, చర్చ జరిగినప్పుడు నేనూ, న్యాయవిభాగం సభ్యులు ప్రతి వారసత్వ విధానాన్ని పరిశీలించామని కూడా చెప్తున్నాను. మేము ముస్లిం వారసత్వ విధానాన్ని పరిశీలించాం. పార్సీ వారసత్వ విధానాన్ని పరిశీలించాం. ఇండియన్ వారసత్వ చట్టాన్ని కూడా పరిశీలించాం. వారసత్వ క్రమాన్ని గమనించాం. బ్రిటిష్ వారసత్వ విధానాన్ని కూడా పరిశీలించాం. ఎక్కడా కూతురిని వాటి నుంచి మినహాయించలేదు. ప్రపంచంలో ఏ విధానమూ కూతురును ఆస్తి వాటా నుంచి మినహాయించలేదు.

ఇప్పుడు ఒక ప్రశ్న నిరంతరం ముందుకువస్తోంది. కూతురికి ఆస్తిలో వాటా ఇవ్వడంతో కుటుంబ విచ్ఛిత్తి జరుగుతుంది అని. సూటిగా చెప్పాలంటే ఈ వాదంలో ఏమాత్రం పస లేదు. ఒక కుటుంబంలో 12 మంది అబ్బాయిలు ఒక అమ్మాయి ఉన్నారనుకుందాం. తండ్రి మరణించిన రోజే అతని కొడుకులు తక్షణమే ఆస్తిని 12 భాగాలు చేసి ఒక్కొక్కరికి పన్నెండవ వంతు ఇవ్వాలని నిర్ణయిస్తే, ఒకవేళ అమ్మాయికి 13వ భాగం వాటా ఇవ్వడం వల్ల కొత్తగా హీనస్థితికి దిగజారేదేముంటుంది?

12 వాటాలు, లేదా 12 ముక్కలు చేయడం, 13 ముక్కలు చేయడం కన్నా మెరుగేమీకాదు. ముక్కలు చేయడమే వద్దనుకుంటే మరో విధంగా ఆలోచించాలి. వారసత్వ చట్టం ద్వారా కాకుండా మరో చట్టంద్వారా ఆస్తి ముక్కలుగా కాకుండా చూడాలి. జాతీయ ఉత్పత్తి ప్రయోజనాల దృష్ట్యా జాతీయ దృక్పథంతో ఆలోచించాలి.

శ్రీ డి.ఎ. రామలింగం చెట్టియార్ (మద్రాసు–సాధారణ): హిందూ కోడ్ వ్యవసాయ భూమికి వర్తిస్తుందా?

గౌ.డా.బి.ఆర్.అంబేద్కర్: వర్తించదు. నేను మామూలుగా చెబుతున్నాను.

నాకు తెలిసినంతవరకు వివాదాస్పద విషయాలను – ఇటు సభ్యులు లేవనెత్తినవి, అటు ప్రజలు సూచించినవి అన్నీ వివరించాను. నేనిచ్చిన స్పష్టీకరణలు ఈ చర్చ పట్ల

అంత సుముఖంగా లేని సభ్యుల భయాందోళనలు తొలగించాయనే భావిస్తాను. ఇది ఏరకంగానూ విప్లవాత్మక చర్య కాదని వారికి అర్థమయ్యుంటుంది. కనీసం సమూల మార్పు కూడా కాదు. ఈ సందర్భంలో సభలోని సభ్యులకు ఒక ముఖ్యమైన వాస్తవం దృష్టిలోకి తీసుకురావాలనుకుంటున్నాను. అది రావు కమిటీ రూపకల్పన, పొందికలకి సంబంధించిన విషయం. అందులో నలుగురు సభ్యులున్నారు. ఈ నివేదిక పై సంతకం చేసిన ఇద్దరూ హిందూ సముదాయంలోని తీవ్రవాద సభ్యులకి చాలా దూరం. నాకు ఎన్నో ఏళ్ళబట్టీ తెలిసిన నా మిత్రుడు శ్రీఘర్పురే అందరిలోకి చాలా సంప్రదాయవాది. నాకు తెలుసు...

శ్రీ హెచ్.వి. కామత్: రాజకీయంగానా? లేక సామాజికంగానా?

గౌ.డా.బి.ఆర్.అంబేద్కర్: రాజకీయంగానూ, సామాజికంగానూ కూడా. అది చెప్పడానికి నేను ఏమాత్రం సంశయించడం లేదు. కొన్ని సందర్భాలలో ఆయన పొడవాటి కర్రతోనైనా (barge pole) సరే నన్ను తాకటానికి చాలా ఇబ్బందిపడేవాడు. ఆయన అంత ఛాందసవాది. నా మిత్రుడు టి.ఆర్. వెంకట్రామశాస్త్రి నిస్సందేహంగా ఉదారవాది. కానీ నాకు తెలిసినంత వరకు ఆయన రాడికల్ మాత్రం కాదు. దృక్పథం రీత్యా సనాతనులైన వీరు నివేదికపై సంతకం చేస్తే ఇది ఖచ్చితంగా విప్లవాత్మకమైంది కాజాలదని, నిశ్చయంగా హిందూ సమాజ పునాదులను నాశనం చేయదనీ భావించాలి. నా మటుకు నేను సంప్రదాయవాదిని. దీనిని బహుశః చాలామంది నమ్మరు. అయితే ప్రగతిశీల సంప్రదాయ వాదిని. సభలోని సభ్యులు ముఖ్యంగా సంప్రదాయవాదులైన సభ్యులు ఒకటి గుర్తించాలి. ఇక్కడ ఒక ముఖ్య విషయం చెప్పాలనుకుంటున్నాను. ప్రఖ్యాత రాజకీయ తత్త్వవేత్త ఎడ్మండ్ బర్క్, ఫ్రెంచ్ విప్లవానికి వ్యతిరేకంగా రాసిన గ్రంథంలో విప్లవ, తీవ్రవాదాలను ప్రస్తావించడంతోపాటు సంప్రదాయవాదులైన దేశ ప్రజలకు ఒక ముఖ్యమైన నిజం చెప్పడం మరవలేదు. సంప్రదాయ పరిరక్షణ చేద్దామనుకునేవారు, మరమ్మత్తు చేయడానికీ సిద్ధంగా ఉండాలి. నేను సభను అడుగుతున్నది అదే. ఈ బిల్లు ద్వారా జరుగుతున్నదదే. హిందూ వ్యవస్థ సంస్కృతిని శిథిలం కాకుండా రక్షించుకోవాలంటే అవసరమైనప్పుడు మరమ్మత్తు చేయడానికి సందేహించకండి. దాదాపుగా జీర్ణావస్థలో ఉన్న హిందూ వ్యవస్థలోని లోపాలకు మరమ్మత్తు చేయటంకంటే ఈ బిల్లు మరేమీ కోరటం లేదు.

శ్రీ హెచ్.వి. కామత్: సర్! ఒకటి గుర్తుచేసే అంశం మీద గౌ.బి.ఆర్.అంబేద్కర్ స్మృతుల నుండి పాఠాలను వివరిస్తామన్నారు. ఆయన మాట నిలుపుకుంటారా?

గౌ.డా.బి.ఆర్.అంబేద్కర్: అది చివరలో చేస్తాను. అదృష్టవశాత్తూ, శ్రీ ద్వారకనాథ్ మిట్టర్ రచించిన 'రైట్స్ ఆఫ్ హిందూ విమెన్' (హిందూ మహిళల హక్కులు) గ్రంథం నాదగ్గర ఉంది. వేదాలు ఉటంకించిన స్త్రీ హక్కులను స్మృతులు ఎంతవరకు గ్రహించాయో ఆ

తరవాత ఆ హక్కులను పూర్వస్థితికి తేవటానికి కొన్ని స్మృతులు ఎలా ప్రయత్నించాయో ఆ గ్రంథంలో చెప్పారు. ఆ గ్రంథంలో వివరించిన విషయాలు నా ఉపన్యాసంలో ప్రస్తావిస్తాను.

శ్రీ దేశబంధు గుప్త: సెలెక్టు కమిటీ ముందు సాక్ష్యంగా ప్రవేశపెట్టిన అంశాలను గౌరవమంత్రిగారు సభకు తెలుపగలరా?

గౌ.డా.బి.ఆర్.అంబేద్కర్: గౌరవ సభ్యులకు ఇది తెలిసిన విషయమే. రెండు సంస్థలు మా దగ్గరకు వచ్చి సాక్ష్యం తీసుకోవాలని అడిగాయి. కమిటీ అందుకు సమ్మతించింది. ఒక సంస్థ హాజరయ్యింది. ఒక సంస్థ లిఖిత పూర్వక జవాబు ఇచ్చింది. ఆ సంస్థ పేరు ధర్మ నిర్ణయమండలి. మొత్తం మీద వారికి బిల్లుతో పూర్ణాంగీకారం ఉంది. హాజరయిన మరో పెద్దమనిషికి లేదు.

**అనువాదం: బి.అనురాధ**

**ఇంగ్లిష్ మూలం:** Hindu Code, Vol. 14, part-1, pg 4 – 13 and 267-283

# రాజీనామా సందర్భంగా ప్రకటన

నేను కేబినెట్ సభ్యునిగా ఇక కొనసాగడం లేదని అధికారికంగా కాకపోయినా, అనధికారికంగా సభకు తెలుసునని నాకు తెలుసు. సెప్టెంబర్ 27 గురువారం నాడు ప్రధాన మంత్రికి నేను నా రాజీనామా సమర్పించి నన్ను తక్షణం విముక్తి చేయమని కోరాను. ప్రధానమంత్రి ఎంతో సహృదయంతో మరుసటి రోజే నా రాజీనామాను ఆమోదించారు. 28, శుక్రవారం తరవాత కూడా నేను కొనసాగానంటే అందుకు కారణం ప్రధానమంత్రి నన్ను సెషన్ ముగిసే వరకూ కొనసాగమని కోరడమే. రాజ్యాంగ ధర్మాన్ననుసరించి నేను ఒప్పుకోవలిసి వచ్చింది.

రాజీనామా చేసిన మంత్రి తన రాజీనామా గురించి వివరిస్తూ వ్యక్తిగతంగా ప్రకటన చేసే వెసులుబాటును మన నియమ నిబంధనలు అనుమతిస్తాయి. నేను పదవిలో ఉండగా అనేక మంది కేబినెట్ సభ్యులు రాజీనామా చేశారు. అయితే మంత్రులు రాజీనామా చేసిన సందర్భాలలో ప్రకటన చేసే విషయంలో ఒకేలాంటి ఆచరణ ఏమీ లేదు. కొందరు ఏ ప్రకటన చేయకుండానే నిష్క్రమిస్తే కొందరు ప్రకటన చేశాక రాజీనామా చేశారు. కొద్ది రోజులు నేను కూడా ఏ పద్ధతి అనుసరించాలా అనే మీమాంసలో పడ్డాను. పరిస్థితులన్నిటినీ లెక్కలోకి తీసుకున్న తరవాత, ప్రకటన చేయడం అనేది కేవలం అవసరం మాత్రమే కాదు రాజీనామా చేసే సభ్యులకు సభ పట్ల ఉండవలసిన బాధ్యత కూడా అనే అభిప్రాయానికి నేను వచ్చాను. కేబినెట్ అంతర్గత పని విధానం గురించి తెలుసుకునే అవకాశం సభకు ఉండదు. అక్కడ సామరస్యత ఉందా ఘర్షణ ఉందా అనేది తెలియదు. దానికి కారణం మైనారిటీలో పడ్డ సభ్యులు తమకు ఉండే సంయుక్త బాధ్యత వల్ల తమ భిన్నాభిప్రాయాలను బయట పెట్టకూడదు. ఫలితంగా ఘర్షణ ఉన్నప్పటికీ కేబినెట్ సభ్యుల మధ్య ఘర్షణ లేదని సభ భావిస్తుంటుంది. అందువల్ల తానెందుకు వెళ్లిపోదలుచుకున్నాడో, యెందువల్ల సంయుక్త బాధ్యతను ఇకముందు నిర్వహించలేకపోతున్నాడో ఒక ప్రకటన చేసి సభకు తెలియజేయడం నిష్క్రమిస్తున్న మంత్రి బాధ్యత.

రెండవది, ఒక మంత్రి ప్రకటన చేయకుండా వెళ్లిపోతే ఆ మంత్రి వ్యక్తిగత స్థాయిలోనో, బహిరంగ స్థాయిలోనో ఏదో లోపం ఉండి ఉంటుందని ప్రజలు భావించే అవకాశం ఉంటుంది. ఏ మంత్రి కూడా అటువంటి సందేహాలకు తావివ్వకూడదు. అలా ఉండడానికి భద్రమైన దారి, ప్రకటన ఇవ్వడమే.

మూడవది మనకు వార్తా పత్రికలున్నాయి. కొందరి పట్ల సానుకూలంగానూ కొందరికి వ్యతిరేకంగానూ ఉండే వివక్ష వాటికి యేళ్ళబట్టి ఉంది. వాళ్ళ తీర్పులు వాస్తవాల మీద చాలా అరుదుగా ఆధారపడి ఉంటాయి. ఎక్కడ ఖాళీలు కనిపించినా వాటిని రాజీనామా

చేయడానికి దారితీసిన పరిస్థితులు అనే పేరుతో అసలైనవాటిని వదిలిపెట్టి వారు సానుకూలంగా ఉండేవారిని మంచిగా చూపించేలాగా, వారు వ్యతిరేకించేవారిని చేదుగా చూపించే లాగా ఉండే కారణాలను సరఫరా చేసి వాటితో నింపేస్తారు. అలాంటి ఒక సంగతి నా విషయంలో కూడా జరిగింది.

ఈ కారణాల రీత్యా నేను బయటకు వెళ్ళే ముందు ప్రకటన చేయాలని నిర్ణయించుకున్నాను. న్యాయశాఖ మంత్రిగా పనిచేయడానికి ప్రధానమంత్రి నన్ను తన కేబినెట్ లోకి ఆహ్వానించి 4 సంవత్సరాల 1 నెల 26 రోజులు గడిచాయి. ఈ ఆహ్వానం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. 1946 ఆగస్టులో మధ్యంతర ప్రభుత్వం ఏర్పడినప్పటికీ నేను ప్రతిపక్ష శిబిరంలో ఉన్నాను. కలుపుకురావడానికి తగని వ్యక్తిగా నన్ను కొట్టిపడేశారు కూడా. ప్రధానమంత్రి పోకడలోని ఈ మార్పుకి కారణాలు ఏమిటో ఊహించుకొంటూ ఉండిపోయాను. నా సందేహాలు నాకున్నాయి. నాకు ఎన్నడూ స్నేహితులు కానివారితో ఎలా పనిచేయాలో నాకు తెలియదు. నాకంటే ముందు న్యాయశాఖామాత్యులుగా ఉన్నవారు చూపించిన స్థాయిలో న్యాయపరిజ్ఞానం, కుశాగ్ర బుద్ధి నేను ఒక న్యాయ శాఖ సభ్యుడిగా కొనసాగించగలనా లేదా అని నాకు సందేహం వచ్చింది. దేశ నిర్మాణంలో ప్రధానమంత్రి నా సహకారాన్ని కాంక్షించినప్పుడు నేను నిరాకరించకూడదన్న ఒకే ఒక్క కారణంతో నేను నా సందేహాలను పక్కకుపెట్టి ఆ ప్రతిపాదనకు అంగీకరించాను. ఒక క్యాబినెట్ సభ్యుడిగానూ, న్యాయశాఖా మంత్రిగానూ నా సామర్థ్యం ఎలాంటిదో నిర్ణయించే పని ఇతరులకు వదిలిపెడుతున్నాను.

ఇప్పుడిక, నా సహచరులతో సంబంధాలను తెగతెంపులు చేసుకోడానికి దారితీసిన విషయాల దగ్గరికి వస్తాను. పలు కారణాల రీత్యా చాలాకాలంగా వెళ్లిపోవాలనే కోరిక బలంగా పెరుగుతూ వచ్చింది.

రాజీనామా చేయడానికి ఏమాత్రం కారణాలు కాని పూర్తి వ్యక్తిగతమైన విషయాల గురించి మొట్టమొదట తడుముతాను. పరిపాలనాపరంగా చూస్తే న్యాయ శాఖకు ఏవిధమైన ప్రాముఖ్యతా లేదని, వైస్రాయి కార్యనిర్వాహక మండలి సభ్యునిగా ఉండడంవల్ల నాకు తెలుసు. భారత ప్రభుత్వ పరిపాలనా విధానాన్ని తీర్చిదిద్దే అవకాశం ఆ శాఖ ద్వారా సాధ్యం కాదు. ముసలి లాయర్లు ఆడుకొనేందుకు పనికి వచ్చే ఖాళీ సబ్బు పెట్టె లాంటిది అని మేము అనుకునే వాళ్ళం. ప్రధానమంత్రి నాకు ఈ ప్రతిపాదన చేసినపుడు న్యాయవాదిని కావడంతో పాటు నా చదువు, అనుభవం ఈ రెండిటివల్లా నేను ఏ పరిపాలక విభాగాన్నైనా నడపడానికి సమర్థుడననీ వైస్రాయి కార్యనిర్వాహక మండలిలో కార్మిక శాఖ, సి.పి.డబ్ల్యూ.డి. ఈ రెండు పరిపాలక విభాగాలను చేపట్టాననీ నాకు ఏదైనా పరిపాలక విభాగాన్ని కేటాయించమని చెప్పాను. దానికి ప్రధానమంత్రి అంగీకరించి న్యాయశాఖతో పాటు తాను ఏర్పాటుచేయబోతున్న ప్రణాళికా విభాగాన్ని కూడా ఇస్తానని చెప్పారు.

దురదృష్టవశాత్తూ ఆ ప్రణాళికా విభాగం చాలా చివరివరకూ ఏర్పాటుకానే లేదు. అదంటూ వచ్చాక నన్ను వదిలిపెట్టేశారు. నా పదవీకాలంలో అనేక సార్లు పరిపాలక విభాగాలు ఒక మంత్రి చేతిలో నుండి మరొకరికి మారుతూ ఉండేవి. అలాంటప్పుడు ఏదో ఒకసారి నాకు అవకాశం వస్తుందని అనుకున్నాను. కానీ ప్రతిసారి నన్ను గణన లోకి తీసుకోకుండా వదిలిపెట్టారు. కొందరు మంత్రులకు రెండు మూడు విభాగాలు కూడా ఇచ్చేసరికి వారా బరువు మోయలేకపోయేవారు. నాలాంటి వాళ్ళేమో అదనపు పని కోసం చూస్తూ ఉండేవారు. ఒక మంత్రి విదేశాలకు వెళ్తే కనీసం నాకు తాత్కాలిక బాధ్యతలు ఇవ్వడానికి కూడా సిద్ధపడలేదు. మంత్రుల మధ్య ఈ రకమైన పని విభజన చేయడానికి ప్రధానమంత్రికి ఉన్న విధానం ఏమిటో మాత్రం అర్థం కాలేదు. అది సమర్థతా? నమ్మకమా? స్నేహమా? మెతకదనమా? కేబినెట్‌కు ముఖ్యమైన విదేశీ వ్యవహారాల కమిటీ, రక్షణ కమిటీ వంటి ముఖ్య కమిటీలలో సభ్యునిగా కూడా నన్ను నియమించలేదు. ఆర్థిక శాస్త్రం (ఎకనామిక్స్), ద్రవ్య శాస్త్రం (ఫైనాన్సు) విద్యావిషయాలుగా చదువుకున్న నన్ను, ఆర్థిక వ్యవహారాల కమిటీ ఏర్పడినపుడు అందులో నియమిస్తారని ఆశించాను. కానీ నన్ను తీసుకోలేదు. ప్రధానమంత్రి ఇంగ్లండ్ వెళ్ళినపుడు కేబినెట్ నన్ను అందులో నియమించింది. కానీ ప్రధానమంత్రి తిరిగి రాగానే ఆయన కేబినెట్ పునర్నిర్మాణ వ్యాసాల్లో నన్ను విస్మరించాడు. మళ్ళీ తిరగరాసినపుడు నా పేరు కమిటీలో జోడించారు కానీ అదంతా నేను నా నిరసన తెలిపాకనే.

ఈ విషయంలో నేనెప్పుడూ ఫిర్యాదు చేయలేదని ప్రధానమంత్రి కూడా తప్పక అంగీకరిస్తారు. కేబినెట్ లోపల జరిగే అధికార రాజకీయాల్లో నేనెప్పుడూ భాగం పంచుకోలేదు. లేదా ఒక విభాగం ఖాళీ కాగానే జరిగే పదవుల పందేరంలో కూడా నేనెప్పుడూ భాగస్వామిని కాదు. నేనెప్పుడూ కేబినెట్ బాధ్యుడుగా ప్రధానమంత్రి నేను చేయడానికి సమర్థుడను అని భావించి ఇచ్చే పనిలో సేవ చేయడాన్నే నమ్మాను. కాబట్టి నా పట్ల తప్పు జరుగుతోంది అని అనుకోకుండా ఉండడం మానవ స్వభావానికి విరుద్ధం.

ప్రభుత్వం పట్ల అసంతృప్తి కలిగించిన మరో విషయం గురించి ఇప్పుడు ప్రస్తావిస్తాను. అది, వెనుకబడిన కులాలు, షెడ్యూల్డు కులాల పట్ల ప్రభుత్వం తీరుకు సంబంధించినది. వెనుకబడిన తరగతులకు రాజ్యాంగం ఎటువంటి రక్షణ చర్యలూ (safe guards) పొందుపరచలేదు. రాష్ట్రపతి ఆధ్వర్యంలో ఏర్పడే ఒక కమీషన్ సిఫారసుల పై ఆధారపడి కార్యనిర్వాహక ప్రభుత్వం ఆ పని చేస్తుందని దానికి వదిలిపెట్టేసారు. రాజ్యాంగాన్ని మనం ఆమోదించి ఏడాది పైనే అయింది. ప్రభుత్వం కమీషన్ నియమించడం గురించి కనీసం ఆలోచన కూడా చేయలేదు. నేను పదవిలో లేని ఏడాది (1946) కాలం షెడ్యూల్డు కులాలకు సారథ్యం వహిస్తున్న ముఖ్యులకూ నాకూ కూడా చాలా ఆందోళన కలిగించిన కాలం. షెడ్యూల్డు కులాలకు వాగ్దానం చేసిన రాజ్యాంగ పరిరక్షణచర్యల

విషయంలో బ్రిటిష్ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. షెడ్యూల్డు కులాల వారికి విధానసభ వారి తరఫున ఏం చేస్తుందో తెలుసుకునే అవకాశం లేదు. ఈ ఆందోళనకర కాలంలోనే ఐక్యరాజ్యసమితికి సమర్పించడానికి నేను షెడ్యూల్డు కులాల పరిస్థితి గురించి ఒక నివేదిక తయారు చేశాను. కానీ సమర్పించలేదు. విధాన సభ, భవిష్యత్ లో ఏర్పడే పార్లమెంటుకు ఒక అవకాశం ఇచ్చి దానితో ఎలా వ్యవహరిస్తారో వేచి చూడడం మంచిది అనిపించింది. షెడ్యూల్డు కులాల కోసం రాజ్యాంగంలో పొందుపరచిన పరిరక్షణ చర్యలు నాకు సంతృప్తిని కలిగించలేదు. అయినప్పటికీ ఆ వున్న వాటిని ఆమోదించి వాటిని మరింత ప్రభావవంతంగా మార్చేందుకు ప్రభుత్వం పట్టుదల చూపిస్తుందని ఆశించాను.

ఈ రోజు షెడ్యూల్డు కులాల పరిస్థితి ఏంటి? నేను చూసినంత మేరకు అది గతంలో లాగే ఉంది. గతంలో ఉన్న అదే అణచివేత, అదే వివక్ష బహుశా ఇప్పుడు ఇంకా దారుణమైన రూపాల్లో అమలవుతోంది. అలాంటి వందలాది ఘటనల గురించి నేను చెప్పగలను. ఢిల్లీ చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి ఎంతోమంది షెడ్యూల్డు కులాల ప్రజలు, అగ్రకుల హిందువుల నుండి తాము ఎదుర్కొంటున్న కష్టాల గురించి, పోలీసులు కేసులు నమోదు చేయడానికి నిరాకరించి తమకు ఎటువంటి సహాయము చేయకపోవడం గురించి నన్ను కలిసి ఎన్నో ఘటనల గురించి చెప్పారు. భారతదేశంలో షెడ్యూల్డు కులాల ప్రజల జీవితం లాంటిది ఈ ప్రపంచంలో మరే ప్రజల కన్నా ఉందా అని చూస్తే, నాకైతే ఇంకెవరూ కనబడలేదు. అయినా గానీ షెడ్యూల్డు కులాలకు ఎందుకు ఏ రకమైన ఉపశమనాలు మంజూరు చేయలేదు? అదే ముస్లింలకు పరిరక్షణ చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధతో పోల్చి చూడండి. ప్రధానమంత్రి సమయం, శ్రద్ధ అంతా ముస్లింలను పరిరక్షించడానికే కేటాయిస్తున్నాడు. భారత దేశంలోని ముస్లింలకు ఎక్కడైనా సరే, ఎప్పుడైనా సరే అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలనే నా కోరికవిషయంలో నేను ఎవరికీ లొంగను. ఆఖరికి ప్రధానమంత్రికి కూడా! కానీ ఒక విషయం తెలుసుకోవాలనుకుంటున్నాను. ఈ దేశంలో రక్షణ అవసరం అయింది ముస్లింలకేనా? షెడ్యూల్డు కులాలకూ, షెడ్యూల్డు తెగలకూ, భారతీయ క్రైస్తవులకూ రక్షణ అవసరం లేదా? ముస్లింల కంటే చాలా ఎక్కువ రక్షణ అవసరమైన ఈ సమూహాల పట్ల ఆయన ఏం శ్రద్ధ చూపించాడు?

షెడ్యూల్డు కులాల పట్ల ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యం గురించి నాకు కలిగిన ఆగ్రహాన్ని నేను నా లోపలే దాచుకోలేకపోయాను. ఒకసారి షెడ్యూల్డు కులాల బహిరంగ సభ జరుగుతున్నపుడు నా భావాలను బాహాటంగానే వెళ్ళగక్కాను. గౌరవ హోంమంత్రిని ఒక ప్రశ్న అడిగాను. షెడ్యూల్డు కులాలకు కేటాయించిన 12.5% ప్రాతినిధ్యం అమలు కావడం లేదు అన్న నా అభియోగం నిజమేనా అని! దానికి జవాబుగా గౌరవ హోంమంత్రి నా అభియోగం నిరాధారం అని చెప్పడానికి సంతోషిస్తున్నానన్నారు. కానీ తరవాత మాత్రం

ఏ కారణం చేతనో కానీ, లేదా ఆయన తన మనస్సాక్షిని శాంతపరచడానికి కావచ్చు వివిధ ప్రభుత్వ విభాగాలకు ఇటీవలి కాలంలో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎన్ని షెడ్యూల్డు కులాల నియామకాలు జరిగాయో తెలియజేయాలని ఒక సర్క్యులర్ పంపారట. అనేక విభాగాలు 'ఏమీ లేవు'అనో దాదాపుగా 'లేదు' అనో జవాబులు పంపినట్టుగా నాకు తెలిసింది. నేను చెప్పిన సమాచారం సరిగానే ఉన్నప్పుడు గౌరవ మంత్రిగారి జవాబు గురించి ఇప్పుడు నేనే వ్యాఖ్యానమూ చేయనక్కర్లేదు.

నేను ఏ కులంలో పుట్టానో ఆ షెడ్యూల్డు కులాల అభ్యున్నతి కోసమే నా బాల్యం నుండి కూడా నన్ను నేను అంకితం చేసుకున్నాను. నా మార్గంలో వేరే ప్రలోభాలు ఏమీ లేవని కాదు. నా స్వంత ప్రయోజనాలే ముఖ్యం అనుకుంటే నేను ఏం కావాలి అనుకుంటే అది అయ్యేవాడిని. నేను కాంగ్రెసులో చేరి ఉంటే అందులో అత్యున్నత స్థానంలో ఉండేవాణ్ణి. కానీ నేను ముందే చెప్పినట్టు నేను షెడ్యూల్డు కులాల అభ్యున్నతికి నన్ను నేను అంకితం చేసుకున్నాను కాబట్టి "నువ్వు సాధించాలనుకుంటున్న సమస్య కోసం నువ్వు సంకుచితంగా ఉండాల్సి వచ్చినా సరే అదే నయం" అన్న లోకోక్తినే నేను అనుసరించాను. అందువల్ల షెడ్యూల్డు కులాల ప్రయోజనాల విషయంలో జరిగింది శూన్యం అయినప్పుడు అది నాకెంత బాధ కలిగించి ఉంటుందో ఊహించగలరు.

నేనిప్పుడు నా రాజీనామాకి ప్రముఖ కారణమైన నాలుగో విషయం దగ్గరికి వస్తాను. క్యాబినెట్ అంటే కేవలం కమిటీలు ముందే చేసేసిన నిర్ణయాలను నమోదు చేసే కార్యాలయంగా మారిపోయింది. నేను చెప్పినట్టు, క్యాబినెట్ ఇప్పుడు కమిటీల ద్వారానే నడుస్తోంది. ఒక రక్షణ కమిటీ ఉంది. రక్షణకు సంబంధించిన ముఖ్య నిర్ణయాలన్నీ రక్షణ కమిటీ పరిష్కరించేస్తుంది. ఒక విదేశీ వ్యవహారాల కమిటీ ఉంది. విదేశీ వ్యవహారాలకు సంబంధించిన ముఖ్య వ్యవహారాలన్నీ ఆ కమిటీ చూస్తుంది. క్యాబినెట్ సభ్యులను వారు నియమిస్తారు. నేను ఏ కమిటీలోనూ సభ్యుడిని కాను. కానీ వాళ్ళంతా ఒక ఇనుప తెర వెనక పని చేస్తుంటారు. కమిటీ సభ్యులు కాని ఇతరులు ఆ విధానాల రూపకల్పనలో ఏ భాగస్వామ్యం లేకుండా వాటిపట్ల సంయుక్త బాధ్యత తీసుకోవాలి. ఇది చాలా అసంభవమైన స్థానం.

ఇప్పుడిక నేను చివరికి రాజీనామా చేయక తప్పని పరిస్థితికి దారితీసిన విషయం గురించి చెప్తాను. అది హిందూకోడ్ బిల్లు పట్ల వ్యవహరించిన తీరు. 1947 ఏప్రిల్ 11న బిల్లు ప్రవేశపెట్టడం జరిగింది. నాలుగేళ్ళ జీవితం తరవాత దానిలోని నాలుగు క్లాజులు ఆమోదం పొందాక అది ఎవరి గుర్తింపుకీ, ఎవరి కన్నీటికీ నోచుకోని చావు చచ్చిపోయింది. సభముందు ఉన్నప్పుడు కూడా దానికి ఎటువంటి ఆదరణ లేదు.

ఒక ఏడాది వరకు దానిని ఒక సెలెక్ట్ కమిటీ ముందు ఉంచడం అవసరం అని కూడా ప్రభుత్వానికి అనిపించలేదు. 1948 ఆగస్టు 31న నివేదికను గురించి సభలో ప్రతిపాదన పెట్టాను. అది కూడా బిల్లు పై చర్చను అజెండాలో పెట్టాలి అన్న ప్రతిపాదన మాత్రమే. 1949 ఫిబ్రవరి వరకూ బిల్లును అజెండాలోకి తీసుకోవాలి అనే ప్రతిపాదనకు కూడా ఆమోదం దొరకలేదు. అప్పుడు కూడా నిరాటంక చర్చ చేసేందుకు ఆమోదం దొరకలేదు. దానిని 10 నెలల్లో అప్పుడప్పుడూ చర్చకు కేటాయించారు. 1949 ఫిబ్రవరిలో ఒక నాలుగు రోజులు, మార్చిలో ఒకరోజు, ఏప్రిల్‌లో రెండు రోజులు. తర్వాత మళ్లీ డిసెంబరు 19న నేను ప్రవేశపెట్టిన 'సెలెక్ట్ కమిటీ నివేదిక ప్రకారం బిల్లును పరిశీలించాలి' అన్న ప్రతిపాదనను ఆమోదించింది. 1950లో బిల్లుపై చర్చకు సమయం కేటాయించలేదు. తర్వాత 1951 లో ఫిబ్రవరి 5న బిల్లు చర్చకు వచ్చింది. ఒక్కొక్క క్లాజు తర్వాత క్లాజును చర్చకు తీసుకున్నారు. అదీ మూడే రోజులు. ఫిబ్రవరి 5, 6, 7. అంతే ఆ తర్వాత దానిని మురిగిపోనీ అని వదిలేశారు.

పార్లమెంటుకు ఇది చివరిసెషన్ కాబట్టి హిందూకోడ్ బిల్లుని ఈ సభ అంతమయ్యేలోపు చర్చకు చేపట్టాలా లేక నూతన పార్లమెంట్ కోసం వదిలిపెట్టాలా అనేది తేల్చుకోవాల్సి ఉంది. బిల్లుపై చర్చను సభలో ముగించాలని క్యాబినెట్ ఏకగ్రీవంగా నిర్ణయించింది. 1951 సెప్టెంబర్ 17న మళ్ళీ క్లాజు తర్వాత క్లాజు ను పరిశీలించే ఉద్దేశంతో అజెండాలో చేర్చారు. చర్చ జరుగుతుండగా ప్రధానమంత్రి, మొత్తం బిల్లుపై చర్చ జరపడానికి సమయం సరిపోక పోవచ్చునీ, కాబట్టి మొత్తానికే వదిలేసే బదులుదానిలో కొంత భాగాన్ని ఆమోదించి చట్టం చేస్తే బాగుంటుంది అనే కొత్త ప్రతిపాదన చేశారు. ఇది నన్ను బాధతో మెలిపెట్టింది. అయినా సరే నేను ఒప్పుకున్నాను. ఎందుకంటే సామెత చెప్పినట్టు, 'మొత్తం పోగొట్టుకునే పరిస్థితి ఉన్నప్పుడు కొంతైనా జాగ్రత్త చేసుకోవడం మేలు' అని.

'వివాహం-విడాకులు' అంశం తీసుకుందామని ప్రధాన మంత్రి సూచించారు. ఆ కత్తిరించిన ముక్కల మీదే చర్చ కొనసాగింది. రెండు మూడు రోజుల చర్చ తర్వాత ప్రధానమంత్రి మరొక ప్రతిపాదనతో వచ్చారు. ఈసారి ప్రతిపాదన ఏమంటే వివాహం విడాకులు భాగంతో పాటు అసలు బిల్లుపై మొత్తం చర్చనే వదిలి పెట్టేద్దామన్నారు. ఇది నాకు ఒక పెద్ద అఘాతం లాగా తాకింది. నిర్ఘాంతపోయాను. అసలేమీ మాట్లాడలేక పోయాను. ఈ కత్తిరించబడిన బిల్లు మీద చర్చ చేయడానికి సమయం లేదు కాబట్టి వదిలేయాలనే విషయం అంగీకరించడానికి నేను సిద్ధంగా లేను. కేబినెట్‌లోని ఇతర శక్తివంతులైన సభ్యులు తమ బిల్లులను ముందు చర్చించాలనుకుంటున్నారు కాబట్టి దీనిని వదిలేశారని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను. ఇప్పుడున్న తీవ్రత తగ్గిన రూపంలో అయినా సరే హిందూ కోడ్ బిల్లు కంటే కూడా ప్రెస్ బిల్లు, బెనారస్, ఆలీఘర్

విశ్వవిద్యాలయాల బిల్లు ముందు చర్చించవలసిన బిల్లులు ఎలా అయిపోయాయో నాకు అర్థం కావడం లేదు. బెనారస్ విశ్వవిద్యాలయం,ఆలీఘర్ విశ్వవిద్యాలయం గురించి ఇప్పటికే చట్టం లేదని కాదు. వీటి గురించి బిల్లు ఈ సెషన్లోనే పాస్ కాకపోతే అవి నాశనం అయిపోయే పరిస్థితీ లేదు. ప్రెస్ బిల్లు అంత అత్యవసరం అయినదీ కాదు. ఇప్పటికే ఒక చట్టం ఉంది. దాన్ని ఆపి ఉండొచ్చు. నిజాయితీ గల వ్యక్తి అయినప్పటికీ ప్రధానమంత్రికి హిందూకోడ్ బిల్లు ఆమోదింప చేయడానికి అవసరమైనంత శ్రద్ధా, పట్టుదలా లేవని నాకనిపించింది.

ఈ బిల్లు విషయంలో నేను ఎంతో మానసిక క్షోభకు గురయ్యాను. నాకు పార్టీ యంత్రాంగ సహాయ సహకారాలను కూడా నిరాకరించారు. ప్రధానమంత్రి ఓటు వేసే స్వేచ్ఛను ఇచ్చారు. పార్టీ చరిత్రలో ఇది అసాధారణమైన విషయం. నేను అన్యథా భావించ లేదు. కానీ రెండు విషయాలు ఆశించాను. విషయంపై తగినంత చర్చ జరిగిన తర్వాత చీఫ్ విప్ ఇక ముగింపుకు రావచ్చని పార్టీ విప్ జారీ చేయాలని ఆశించాను. ఉపన్యాసాలకు ఒక సమయపాలన విధిస్తారనుకున్నాను. ఉపన్యాసాల విషయంలో సమాయావధి విధించి ఉంటే బిల్లుపై చర్చ పూర్తిగా జరిగే అవకాశం ఉండేది. ఓటు చేసే హక్కు ఇచ్చినప్పుడు ఉపన్యాసాల మీద సమయావధి విధిస్తూ విప్ జారీ చేయడానికి అభ్యంతరం ఉండకూడదు. కానీ అలాంటి విప్ జారీ చేయనేలేదు. హిందూకోడ్ బిల్లు విషయంలో పార్టీ చీఫ్ విప్ కూడా అయిన పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి వ్యవహారం చాలా విచిత్రంగా ఉంది. ఆయన కోడ్ కి భయంకర వ్యతిరేకి. చర్చ ముగింపు కోసం ఏనాడూ విప్ జారీ చేసి ఆయన నాకు సహకరించలేదు. ఒక్క క్లాజు మీదే రోజులు రోజులు కాలయాపన చేశారు. ప్రభుత్వ సమయాన్ని ఆదాచేసి, ప్రభుత్వ వ్యవహారాలను ముందుకు నడిపించడం చీఫ్ విప్ బాధ్యత. కాని హిందూ కోడ్ బిల్లు పైన చర్చ జరుగుతున్నప్పుడే ఆయన ఒక పద్ధతి ప్రకారం గైర్హాజరయ్యారు. ప్రధానమంత్రి పట్ల అంత అవిధేయంగా ఉండే చీఫ్ విప్‌ని కానీ, అవిధేయంగా ఉండే చీఫ్ విప్ పట్ల ఎంతో విధేయంగా ఉండే ప్రధాన మంత్రిని కానీ నేను ఎక్కడా చూడలేదు. ఆయన ఇంత రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తించినా కూడా ప్రధాన మంత్రికి ఆయన చాలా ప్రియమైన వ్యక్తి. ఎందుకంటే ఆయనెంత రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తించినా ఆయనకి పార్టీలో పదోన్నతి లభించింది. ఇలాంటి వాతావరణంలో కొనసాగడం చాలా కష్టం.

బిల్లుకు వ్యతిరేకత చాలా బలంగా ఉంది కాబట్టి దానిని పక్కకు పెట్టవలసి వచ్చింది అని చెప్పారు. ఎంత బలమైన వ్యతిరేకత? పార్టీలో బిల్లుపై అనేక సార్లు చర్చ జరిగింది. వ్యతిరేకించే వారు ప్రతిసారీ ఓటింగ్ జరిపించారు. విపక్షీయులు ప్రతిసారీ ఓడిపోయారు. చివరిసారిగా పార్టీలో బిల్లుపై చర్చ జరిగినప్పుడు 120 మందిలో 20 మంది మాత్రమే వ్యతిరేకించారు. పార్టీలో బిల్లుపై చర్చ జరిగినప్పుడు మూడున్నర గంటలల్లో 44 క్లాజులను

ఆమోదించారు. పార్టీలో అంతర్గతంగా ఏమాత్రం వ్యతిరేకత ఉందో దీన్ని బట్టే తెలుస్తోంది. సభలో కూడా బిల్లులోని 2, 3, 4 క్లాజుల పట్లనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. హిందూ కోడ్ బిల్లుకి మొత్తం ప్రాణం లాంటిక్లాజు 4కు కూడా అత్యధికమెజారిటీ లభించింది.

కాబట్టి సమయం లేదంటూ ప్రధానమంత్రి బిల్లును పక్కన పెట్టేయటాన్ని నేను అంగీకరించలేకపోతున్నాను. ఇంత వివరమైన సంజాయిషీ ఎందుకివ్వవలసి వస్తోందంటే నేను అనారోగ్యం వల్ల రాజీనామా చేశానని కొందరు అనుకుంటున్నారు. అలాంటి ఏ అభిప్రాయాన్నైనా సరే నేను తిరస్కరిస్తున్నాను. అనారోగ్యంతో విధులకు రాజీనామా చేసే లాంటి వాడిని కాదు నేను.

విదేశీ వ్యవహారాలతోనో, వెనుకబడిన తరగతుల పట్ల ప్రభుత్వ తీరు పట్లనో, నేను అసంతృప్తి చెంది రాజీనామా చేస్తున్నట్లయితే ఎప్పుడో చేసి ఉండాల్సింది, ఈ సమయంలో కాదు అని కూడా అనుకోవచ్చు. అది నిజమే అని కూడా అనిపించవచ్చు. కానీ నన్ను ఆపిన కారణం ఒకటుంది. మొట్ట మొదట నేను క్యాబినెట్ సభ్యుడిగా ఉన్నాను. రాజ్యాంగ రచనలో నిమగ్నమై ఉన్నాను. 1950 జనవరి 26 వరకు నా శ్రద్ధ అంతా అటువైపే ఉంచాల్సి వచ్చింది. ఆ తర్వాత ప్రజాప్రాతినిధ్య బిల్లు (డిలిమిటేషన్ ఆర్డర్). విదేశీ వ్యవహారాల మీద కేటాయించడానికి నాకు సమయమే లేదు. పనిని అసంపూర్తిగా వదిలిపెట్టి నిష్క్రమించడం నాకు సరైంది అనిపించలేదు.

రెండో విషయం, హిందూకోడ్ గురించైనా కొనసాగడం అవసరం అని భావించాను. నాకు భిన్నమైన అభిప్రాయం ఉంది. హిందూకోడ్ దేశంలోనే ఇప్పటివరకూ తీసుకున్న సాంఘిక సంస్కరణలన్నిటిలోనూ గొప్పది. దాని ప్రాముఖ్యత రీత్యా గతంలో భారత శాసనసభ చేసిన, చేయబోయే ఏ చట్టం తోనూ దీనిని పోల్చలేం. హిందూ సమాజానికి ప్రాణం వంటి వర్గానికి, వర్గానికి మధ్యనున్న అసమానతలు, లింగ సంబంధ అసమానతలు అలాగే ఉంచి కేవలం ఆర్థిక సంబంధిత సమస్యలపై చట్టాలు చేసుకుంటూ పోవడం అంటే మన రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే. పేడ కుప్ప మీద భవంతి నిర్మించడం లాంటిదే. హిందూకోడ్ కు నేను ఇచ్చిన ప్రాముఖ్యత అదీ! నాకు భిన్నాభిప్రాయాలున్నప్పటికీ నేను కొనసాగడానికి కారణం అదే. అది ఒక మంచి చేయడం కోసమే. ప్రతిపక్షం ముందుకు తెస్తున్న ఆటంకపరిచే ఎత్తుగడలను అధిగమించడానికి నాకు ఎంతో కొంత ఆశ ఉండదా! ఈ సందర్భంలో శాసనసభ నుండి ప్రధానమంత్రి చేసిన మూడు ప్రకటనల గురించి మాత్రం ప్రస్తావిస్తాను.

1949 నవంబర్ 28న ప్రధానమంత్రి ఈ క్రింది వాగ్దానం చేశారు. "ఇంకా ఏంటంటే, ప్రభుత్వం దీని (హిందూకోడ్) విషయంలో చిత్తశుద్ధితో ఉంది. దానిని పరిశీలిస్తోంది. ప్రభుత్వం దానితో ముందుకు పోతుంది. ఇది ఆమోదించడమా లేదా అనేది శాసనసభ పని. కానీ ప్రభుత్వం ఒక ముఖ్యమైన చర్య తీసుకుంటుంటే, ఒకవేళ

శాసనసభ దానిని తిరస్కరిస్తే శాసనసభ ప్రభుత్వాన్ని తిరస్కరిస్తుంది. ప్రభుత్వం మారిపోతుంది. ఇంకొక ప్రభుత్వం వస్తుంది. స్పష్టంగా అర్థం చేసుకోవాల్సిన విషయం ఏంటంటే ప్రభుత్వం దీనిని చాలా ప్రాముఖ్యత కలిగిన విషయంగా పరిగణిస్తోంది. దాని మీదే నిలబడుతుంది, లేదా పడిపోతుంది."

మళ్ళీ 1949 డిసెంబర్19వ తేదీన ప్రధానమంత్రి ఇలా అన్నారు. "హిందూ కోడ్ బిల్లుకి అంత ప్రాముఖ్యత లేదు అని సభ ఏమాత్రం అనుకోవడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే దానికి మేము చాలా ప్రాముఖ్యతనిస్తున్నాం. ఏదో ఒక క్లాజు గురించో మరొకదాని గురించో కాదు. సామాజిక ఆర్థిక సమస్యలలోని ఒక పెద్ద సమస్య పట్ల మా ప్రాథమిక వైఖరి వల్ల మనం ఈ దేశంలో రాజకీయ స్వేచ్ఛని పొందాం. రాజకీయ స్వాతంత్రాన్ని పొందాం. అది ఈ ప్రయాణంలో ఒక దశ. ఇంకా ఆర్థిక సామాజిక తదితర ఇతర దశలు ఉన్నాయి. ముందుకు పోవడం అంటే ఈ అన్నిటిలోనూ సమగ్ర అభివృద్ధి ఉండాలి".

1951 సెప్టెంబర్ 26న ప్రధాన మంత్రి అన్నారు –"మనకున్న అన్ని అవకాశాలలోనూ ఈ చర్య విషయంలో ప్రభుత్వం ముందుకు పోవాలనే అనుకుంటోంది అనేవిషయంలో సభకు ఆశ్వాసన ఇవ్వాల్సిన అవసరం లేదనే భావిస్తున్నాను. అయితే మళ్లీ తదుపరి అవకాశం వచ్చే వరకు ఈ విషయాన్ని వాయిదా వేయాలని అనుకుంటున్నాము. ఈ అవకాశం ఈ పార్లమెంట్ లోనే వస్తుందని ఆశిస్తున్నాను".

ఇది బిల్లుపై చర్చను వదిలిపెట్టేస్తున్నప్పుడు ప్రధానమంత్రి చేసిన ప్రకటన. ప్రధానమంత్రి ప్రకటనలను నమ్మకుండా ఎవరుంటారు? ప్రధానమంత్రి మాటలకూ, చేతలకూ తేడా ఉండొచ్చని నేను నమ్మలేకపోతే ఆ తప్పు నిస్సంశయంగా నాది కాదు. నా పట్ల నాకు నిజాయితీ ఉండాలి. అది నిష్క్రమించడం వల్లే ఉంటుంది. అలా చేసే ముందు పార్లమెంట్‌లోని నా సభ్యత్వ కాలంలో నా సహ సభ్యులు నాపై చూపిన మంచితనం, గౌరవాలకు వారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. పార్లమెంటు సభ్యులు నా పట్ల చూపిన గొప్ప సహనానికి కూడా నేను వారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

**అనువాదం: బి.అనురాధ**

**ఇంగ్లిష్ మూలం:** On the Eve of Resigning from the Cabinet, Vol 14, part 2, section 4, annexure I, pg 1317-27

# హిందూ స్త్రీ ఉత్థాన పతనాలు: అందుకు బాధ్యులెవరు?

మార్చి 1950 నాటి మహాబోధి పత్రికలో లామా గోవింద రాసిన "హైందవంలోనూ బౌద్ధంలోనూ స్త్రీల స్థానం" అనే వ్యాసం వచ్చింది. భారతదేశంలో స్త్రీ అధోగతికి బుద్ధుని ప్రవచనాలే ప్రధాన కారణమని ఆరోపిస్తూ "ఈవ్స్ వీక్లీ" లో 1950 జనవరి 21 న ప్రచురితమయిన వ్యాసానికి ఇది ప్రతిస్పందన. ఇటువంటి ఆరోపణలు వచ్చినప్పుడు ఏ బౌద్ధమతస్థుడైనా వాటిని ఖండించడానికి చేయవలిసిన పనే లామా గోవింద చేశాడు. కానీ ఈ విషయాన్ని ఇక్కడితో వదిలెయ్యకూడదు. బుద్ధునికి వ్యతిరేకంగా ఇటువంటి ఆరోపణలు చేయడం ఇదే మొదటిసారి కాదు. ఇలాంటివి బుద్ధుని గొప్పతనాన్ని భరించలేని వారు తరచూ చేస్తుంటారు. ఈవ్స్ వీక్లీ లోని రచయిత కంటే ఎంతో ఎక్కువ సాధికారత కలిగిన వారు కూడా చేస్తుంటారు. కాబట్టి ఈ విషయం లోతులలోకి వెళ్ళి తరచూ పునరుద్ఘాటించే ఈ ఆరోపణకున్న పునాది ఏమిటో పరిశీలించడం అవసరం. ఆరోపణ చాలా తీవ్రమైనదీ, ఘోరమైనదీ కాబట్టి మరింత పరిశీలన చేయడాన్ని మహాబోధి పాఠకులు ఆదరిస్తారని నా నమ్మకం.

బుద్ధునికి వ్యతిరేకంగా వచ్చినటువంటి ఆరోపణను రెండు కారణాల ఆధారంగా మాత్రమే సమర్థించగలము.

అటువంటి అవకాశమున్న మొదటి కారణం ఆనందుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా బుద్ధుడు ఇచ్చినట్టుగా ఉన్న జవాబు. (మహా పరిణిబ్బన సుత్తలోని 9వ అధ్యాయం)

"9. స్త్రీ జాతితో మనం ఎలా వ్యవహరించాలి? అని ఆనందుడు అడిగాడు.
వారిని చూడకుండా ఉండడం ద్వారా, ఆనందా!
ఒకవేళ చూస్తే ఏం చేయాలి?
మాట్లాడకుండా ఉండడం ద్వారా ఆనందా!
ఒకవేళ వారే మనతో మాట్లాడితే ఏం చేయాలి ప్రభూ?
పూర్తి మెలకువతో ఉండాలి ఆనందా!"

ఈ పేరా ఆక్స్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ముద్రించిన "మహా పరిణిబ్బన సుత్త" లో ఉందన్న విషయాన్ని కాదనేదేమీ లేదు. అసలు విషయం ఈ భాగం ఉందా లేదా అనేదాని గురించి కాదు. ఈ పేరా మీద ఏదైనా చర్చ చేయదలుచుకుంటే ఈ పేరా

వాస్తవంగా బుద్ధుడు చెప్పినదే అనీ, భిక్షువులు తరవాత కల్పించి చేర్చింది కాదు అనే విషయాన్ని నిరూపించవల్సిన అవసరం లేదా అనేదే అసలు విషయం.

బుద్ధుని మూల బోధనలు తెలిసిన వారెవరైనా ఇప్పుడున్న రూపంలో "సుత్త పిటక" ను చదివి ఆశ్చర్యపోతారు. బుద్ధుని మూల బోధనలకు పూర్తిగా పరాయమైన బ్రాహ్మణ భావనలను చేర్చి బౌద్ధ ఆరామాల ఆదర్శాలను అమలుచేసే బౌద్ధసంఘ భావాలను గజిబిజి చేసి, పౌరాణిక వలువలు కప్పడంతో "సుత్త పిటక" తనమూల ఆకృతిని కోల్పోయింది. ఫలితంగా శ్రీమతి రైస్ డేవిడ్స్ ఆశ్చర్యపోయి కింది ప్రశ్న అడిగినట్టే మనం కూడా అడుగుతాము.

"సుత్త పిటకలోని ఈ పుటల్లో గౌతముడేడీ? తరతరాల నుండి బౌద్ధ బోధనలను మౌఖికంగా కథలుగా నేర్పిస్తున్న ఉపాధ్యాయులు, విన్న విషయాలను జ్ఞాపకం మీద ఆధారపడి బోధించేవారూ, కేవలం బోధించేవారే కాక మౌఖికంగా విద్య నేర్చుకొనే విద్యార్థులు ఆ మూల బోధనల్లో ఏయేమార్పులు ఏ మేరకు చేశారో? ఎంతో కాలంగా మౌఖికంగా ప్రచారంలో ఉన్న వాటిని రాతలోకి మార్చిన సంపాదకుల కూర్పుల్లోనూ అనేకరకాలుగా జరిగిన గందరగోళంతో మూల బోధనలను ఏ మేరకు స్పష్టంగా వివరించగలిగారనేది అనుమానమే. ఈ కథకులు, బోధకులు, సంపాదకులు అందరూ తమ జీవితాదర్శాలను మిగిలిన ప్రపంచానికి భిన్నంగా ఎంచుకున్నవారు. పైగా ఎక్కువమంది ఈ ప్రపంచంతో సంబంధంలేని వారు. కాబట్టి ఇట్లా వక్రీకరణకు గురైన మాధ్యమాల ద్వారా బుద్ధుని బోధనలను చదవలసి వచ్చిన వ్యక్తి వీటిలో "బోధకుడు/ మార్గదర్శకుడు" చేసిన బోధనలు ఏవై ఉండొచ్చు అని ప్రశ్నించుకోవల్సి వస్తుంది."

అందువల్ల ఈ పేరాను భిక్షువులు తరవాత చేసిన చేర్పు అనడం అతిశయోక్తి కాదు. మొదటి విషయం బుద్ధుడు మరణించిన 400 సంవత్సరాల వరకు "సుత్త పిటక" లిఖిత రూపంలోకి రాలేదు. రెండవది, వాటిని సంకలనం చేసి సంపాదకత్వం నిర్వహించిన వాళ్ళు సన్యాసులు. ఈ సన్యాస సంపాదకులు సన్యాసుల కోసమే సంకలనం చేశారు. బ్రహ్మచర్యం పాటించడం అనేది సన్యాసులకు చాలా ముఖ్యం కాబట్టి ఆ విలువను నిలబెట్టి ఉంచడానికి దీనిని బుద్ధుడికి ఆపాదించడం సన్యాసి అయిన సంపాదకుని విషయంలో పెద్ద ఆశ్చర్యమేమీ కాదు.

ఈ పేరా తరవాతికాలంలో చేర్చారనడానికి మరొక రెండు విషయాలు కూడా తోడ్పడతాయి.

1. ఈ "సుత్త" కు ఉపోద్ఘాతంలో ఇచ్చిన పట్టికలో చూస్తే (డేవిడ్స్ పుస్తకం, దిఘ నికాయా, రెండవ భాగం, ఎస్‌బిబి సిరీస్, 72వ పేజీ) ఈ సుత్తలోని అనేక పేరాలు వేరే సుత్తలలో కూడా కనిపిస్తాయని గమనిస్తాము. అయితే ఈ పేరా మాత్రం మరే సుత్తలోనూ కనిపించదు.

2. ఈ సుత్తకు ఉపోద్ఘాతంలోని 38వ పేజీలోని ప్రస్తావన (డేవిడ్స్ ప్రచురించిన ఎస్‌బిఈ 11వ సంపుటం) వల్ల చైనా భాషలో కూడా ఈ సుత్త ఉందనే విషయం తెలుస్తోంది. అందులో కూడా ఈ పేరా లేదు.

ఇప్పుడు సంభావ్యతా పరీక్షను అమలుచేసి చూద్దాం. ఆనందుడు అలా అడగడానికి ఏదైనా కారణం ఉందా? స్త్రీల పట్ల బుద్ధునికి ఉన్న అభిప్రాయాలతో సరిపోలే విధంగానే ఈ ప్రశ్న ఉందా? ఇలాంటి ప్రశ్న ఆనందుడు అడగలేదనడానికి గానీ బుద్ధుడు అలాంటి జవాబు ఇచ్చే అవకాశంగానీ లేదనడానికి రుజువులు లేవు. అయితే బుద్ధుడు, ఆనందుడు స్త్రీల పట్ల ఎలా వ్యవహరించారో తెలియజేసే విషయాలను పిటకాలలో చూస్తే ఇటువంటి ప్రశ్న అడగటానికి గానీ అటువంటి జవాబు ఇవ్వటానికి గానీ అవకాశాలు లేవని అర్థమవుతుంది.

ఆనందుడు అలాంటి ప్రశ్న అడిగే అవసరం ఉందా అనే విషయానికి వస్తే – మహాపరినిర్వాణ సుత్తలో అదే అధ్యాయంలో బుద్ధుడు, ఆనందుడు ఎంత బాగా వ్యహరించేవారో అందరూ ఎంతగా ఇష్టపడేవారో చెప్పే గాథలు ఉన్నాయి. అందులో నుండి రెండు గాథలను ఈ దిగువన ఉటంకిస్తున్నాను.

"16. సోదరులారా, ఆనందునికి నాలుగు అద్భుతమైన సుగుణాలు ఉన్నాయి.

ఆనందుడిని చూడడానికి చాలా మంది సంఘ సోదరులు వచ్చినపుడు వాళ్ళు ఆనందుని చూడగానే ఎంతో సంబరపడేవారు. సత్యాన్ని గురించి ఆనందుడు వివరిస్తే ఆ ప్రసంగానికి పొంగిపోయేవారు. ఆనందుడు మౌనం వహిస్తే సోదర బృందం అంతా ఇబ్బంది పడేవారు.

సోదరులారా,ఇక సంఘ సోదరిలు,................భక్తులైన పురుషులుగానీ స్త్రీలు గానీ ఆనందుని చూస్తే ఎంతో సంబరపడేవారు. సత్యాన్ని గురించి ఆనందుడు వివరిస్తే ఆ ప్రసంగానికి పొంగిపోయేవారు. ఆనందుడు మౌనం వహిస్తే సోదరి బృందాలు అంతా ఇబ్బంది పడేవారు."

దీన్ని బట్టి ఆనందుని కలవడానికి సంఘ సోదరి బృందాలే కాక సంఘ సభ్యులు కాని వారైన భక్త మహిళలు కూడా రావడం సాధారణంగా జరిగేదేనని స్పష్టం. అతను వారిని చూసేవాడు, కలిసేవాడు, మాట్లాడేవాడు. అటువంటప్పుడు ఆనందుడు అలాంటి ప్రశ్న ఎందుకువేస్తాడు? స్త్రీలు ఆనందుని కలవడానికి వస్తారని బుద్ధునికి తెలుసు. దాని గురించి ఆయన ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. మహిళలతో అన్నిరకాలుగా సంబంధాలను నివారించాలనీ, నిషేధించాలనీ ఎందుకనుకొంటాడు? ఆ మొత్తం పేరానే చాలా అసహజంగా ఉంది. దానిని తరవాతి కాలంలో సన్యాసులు చేర్చారని భావించవల్సి వస్తుంది.

మహాపరినిర్వాణ సుత్త లోని పేరాకు పూర్తి విరుద్ధమైన మరొక ఘటన ఆనందుని జీవితంలో ఉంది. అందరికీ తెలిసిన విషయమే...మొదటి "సంగితి"లో (మండలి) ఆనందునికి వ్యతిరేకంగా ఐదు ఫిర్యాదులు నమోదయ్యాయి.

1) బుద్ధుని దృష్టిలో "వినయ" లోని ఏయే భాగాలు తక్కువ ప్రాముఖ్యత కలిగి ఉన్నవనీ వాటిని మార్చగలిగే అధికారాన్ని "సంఘానికి" ఇస్తున్నాడో ఆనందుడు అడిగి తెలుసుకోలేదనీ–
2) ప్రభువు ధరించే ఉడుపులను కుట్టే సమయంలో వెనక్కి తిరిగేటపుడు ఆ బట్టను తొక్కాడనీ–
3) ఇహలోకాన్ని విడిచిపెట్టిన ప్రభువుకు నమస్కరించే అవకాశం మొదట ఒక మహిళకు ఇచ్చాడనీ, ఫలితంగా ఆమె కన్నీళ్లతో ఆయన దేహం మలినమయిందనీ–
4) ప్రభువును మరొక జీవిత చక్రంపాటు ఉండాలని అడగలేదనీ–
5) "సంఘం"లోకి మహిళలను చేర్చుకోవడంలో ప్రధానపాత్ర అతనిదేననీ–

పై ఆరోపణల్లోని నేరాలన్నీ చేసినట్టు ఆనందుడు ఒప్పుకున్నాడు. వాటిని నేరాలుగా అంగీకరించవలిసిందా కాదా అనేది వేరే విషయం. మూడో ఆరోపణ చాలా ఆసక్తికరమైనది. ప్రస్తుత సందర్భంలో దానికి చాలా ప్రాసంగికత ఉంది. "ఒకవేళ మహాపరినిర్వాణ సుత్త" లో పేర్కొన్నది వాస్తవమే అయితే తన గురువును తాకడానికి ఆనందుడు ఒక మహిళను ఎలా అనుమతిస్తాడు? బుద్ధుడు ఐదు నిమిషాల ముందు ఇచ్చిన సలహాను అంత ఘోరంగా తెలిసి, తెలిసీ అతిక్రమిస్తాడా? దీనికి జవాబు లేదనే చెప్పాల్సి ఉంటుంది. దీని నుండి మనకు తెలిసేదేమిటి? ఆరోపిస్తున్న విధంగా బుద్ధుడు అలాంటి సలహా ఇవ్వలేదు. అలాంటి సలహా ఇచ్చి ఉన్నట్లయితే ఆనందుడు దానికి విరుద్ధంగా చేయడనేదే తర్కసంగతమైనది.

ఇప్పుడు బుద్ధుని వైపు నుంచి ఈ ప్రశ్నను పరిశీలిద్దాం. బుద్ధుడు అటువంటి జవాబు ఇవ్వడం సహజమేనా? స్త్రీల విషయంలో బుద్ధుని వ్యవహారం ఎలా ఉందనేదాన్ని బట్టి ఈ ప్రశ్నకి జవాబు ఉంటుంది. ఆనందునికి ఇచ్చాడంటున్న సలహా మేరకు బుద్ధుడు స్త్రీలను కలవకుండా తప్పించుకున్నాడా? వాస్తవాలేంటి?

రెండు ఉదాహరణలు వెంటనే స్ఫురణకు వస్తాయి. ఒకటి విశాఖకు సంబంధించినది. బుద్ధుని 80 మంది ముఖ్య అనుచరులలో ఆమె ఒకరు. భిక్ష–దాతల ముఖ్యురాలు. విశాఖ ఒక్కసారైనా బుద్ధుని బోధనలు వినడానికి వెళ్లకుండా ఉండి ఉంటుందా? ఆయన ఆరామాన్ని (మఠం) ఒక్కసారికూడా ప్రవేశించకుండా ఉండి ఉంటుందా? స్త్రీల పట్ల ఎలా వ్యవహరించాలో ఆనందునికి చెప్పినట్టే వ్యవహరించాడా? సభలో ఉన్న మిగతా భిక్షువులేం చేశారు? సభ వదిలి వెళ్లిపోయారా?

ఎవరికైనా గుర్తొచ్చే రెండవ విషయం, వైశాలికి చెందిన ఆమ్రపాలి గురించి. ఆమె బుద్ధుణ్ణి చూడడానికి వెళ్ళి ఆయననూ ఆయన అనుచరులనూ తన ఇంటికి భోజనానికి పిలిచింది. ఆమె ఒక వేశ్య. వైశాలి అంతటికీ అందకత్తె. బుద్ధుడు, భిక్షువులు ఆమెను తప్పించుకున్నారా? లిచ్చావుల ఆహ్వానాన్ని తిరస్కరించినందుకు వారు చాలా అవమానపడ్డప్పటికీ లెక్క చేయక బుద్ధుడూ, భిక్షువులూ ఆమె ఆహ్వానాన్ని మన్నించి ఆమె ఇంటికి వెళ్ళి భోజనం చేశారు.

ఇంకా వేరే ఉదాహరణలు లేక పోలేదు. బుద్ధుడు శ్రావస్తిలో ఉండగా మహా ప్రజాపతి గోతమి 500 మంది భిక్షుణిలను తనతో తీసుకువచ్చి వారికి ధర్మాన్నీ క్రమశిక్షణనూ నేర్పమని కోరింది. వాళ్లనుండి బుద్ధుడు పారిపోయాడా?

బుద్ధుడు వైశాలి నగరంలో ఉండగా పజ్జున పుత్రిక కోకనాద "మహావనం" అంతటా తన దేదీప్యమైన అందంతో కాంతులు ప్రసరిస్తూ అర్ధరాత్రి సమయంలో బుద్ధుని సమక్షానికి వచ్చినట్టు "సంయుత్త నికాయ" లో పేర్కొన్నారు.

ప్రసేనజిత్తు మహారాజు భార్య రాణి మల్లిక మతపర విధివిధానాల కోసం స్వయంగా అనేకసార్లు బుద్ధుడిని కలిసేదని పిటకాలలో అక్కడక్కడా నివేదికలు కనిపిస్తాయి.

బుద్ధుడు స్త్రీలను ఎప్పుడూ కలవడానికి నిరాకరించలేదని, స్త్రీలు కూడా బుద్ధుణ్ణి కలవడానికి ఎన్నడూ భయపడలేదనీ వీటన్నిటి ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. స్త్రీలను పదే పదే కలవటం వల్ల మానవ సహజమైన బలహీనతలతో కోరికలకు లొంగిపోతారనే భయంతో సాధారణ శిష్యుల కుటుంబాలను తరచూ కలవడం ఒక అలవాటుగా చేసుకోవద్దని బుద్ధుడు భిక్షువులకి సలహా ఇచ్చిన మాట నిజం. కానీ స్త్రీలని కలవనే వద్దని నిషేధించలేదు. తాను కూడా స్త్రీలను తిరస్కరించినదీ లేదు.

బుద్ధుడు బ్రహ్మచర్యం పట్ల చాలా పట్టుదలగా ఉండేవాడు. బుద్ధుని మాటల్లోనే చెప్పాలంటే "బ్రహ్మచర్య జీవితానికి స్త్రీలు మచ్చ తెస్తారు" అన్న సంగతి గురించి చాలా బాధాకరంగానే కానీ ఆయనకి ఎరుక ఉన్నది. అయితే ఆయన ఇచ్చిన సలహా ఏమిటి? స్త్రీలతో ఎటువంటి సంబంధమూ ఉంచుకోకూడదని ఆయన భిక్షువులందరికీ చెప్పాడా? ఆయన అటువంటి ఆంక్షలేమీ పెట్టలేదు. పైపెచ్చు, ఎవరైనా స్త్రీ ని చూసినపుడు, తల్లి పట్లా, సోదరి పట్లా, కూతురి పట్లా నీలో కలిగే భావనను గుర్తుతెచ్చుకో అని భిక్షువులకు చెప్పేవాడు.

బుద్ధుని వ్యతిరేకించేవారికి దొరికే మరొక ఆధారం, బుద్ధుడు "బౌద్ధ సంఘాల్లో"కి స్త్రీలను అనుమతించకుండా, చిట్టచివరికి అనుమతించవల్సి వచ్చినపుడు భిక్షుణి సంఘాలను విడిగా ఏర్పాటు చేసి దానిని భిక్షు సంఘానికి లోబడి ఉండాలని" చెప్పడం. ఇక్కడ కూడా మరికొంత విశ్లేషణ అవసరం.

మహాప్రజాపతి పరివ్రాజం తీసుకోవడాన్ని బుద్ధుడు ఎందుకు వ్యతిరేకించాడు? మహిళలు తక్కువ వర్గానికి చెందుతారు కాబట్టి సంఘాల్లో వారి చేరిక ప్రజల దృష్టిలో సంఘాన్ని పలుచన చేస్తుందన్న అభిప్రాయంతోనా? లేక తన సిద్ధాంతాన్నీ క్రమశిక్షణనూ మహిళలు మేథోపరంగానూ నైతికపరంగానూ నెరవేర్చజాలరనా? బుద్ధుడు మొండిగా వ్యతిరేకించినపుడు ఆనందుడు ఈ రెండవ ప్రశ్నను వేశాడు. బుద్ధుడు ఈ ప్రశ్నకు ఇక ఏరకమైన అనుమానాలకూ వివాదానికీ తావివ్వకుండా స్పష్టమైన జవాబు చెప్పాడు. "స్త్రీలు తన సిద్ధాంతాన్నీ క్రమశిక్షణనూ నేర్చుకోవడానికి పూర్తిగా సమర్థులు" అని బుద్ధుడు చెప్పాడు. వారు పరివ్రాజాన్ని స్వీకరించడాన్ని నిరాకరిస్తున్నది ఆ కారణంగా కాదని చెప్పాడు. తెలివిలో గాని, గుణంలో కాని బుద్ధుడు స్త్రీలను పురుషులకంటే తక్కువవారిగా పరిగణించలేదని దీని ద్వారా స్పష్టమే. ఇక మహిళలు తక్కువ వర్గానికి చెందుతారు కాబట్టి సంఘాల్లో వారి చేరిక ప్రజల దృష్టిలో సంఘాన్ని పలుచన చేస్తుందన్న అభిప్రాయం గురించి చెప్పనే అక్కర్లేదు. ఎందుకంటే అదే ఆయన అభిప్రాయం అయితే అసలు వారిని చేర్చుకొనేవాడే కాదు. "భిక్షుణి సంఘాలను విడిగా ఏర్పాటు చేసి దానిని భిక్షు సంఘానికి లోబడి ఉండాలని" చెప్పడం ఉచ్ఛనీచాలకి సంబంధించినది కాదు. అది కేవలం ఆచరణకు సంబంధించిన ఒక వెసులుబాటు. స్త్రీలను పరివ్రాజకులుగా (సన్యాసినులు) తీసుకోవడానికి సంబంధించి బుద్ధుడు రెండు సమస్యలను ఎదుర్కొన్నాడు. ఒకటి స్త్రీ పురుషులిరువురికీ ఒకే సంఘం ఉండాలా? ఆయన వేరు వేరు సంఘాలు ఉండాలని నిర్ణయించాడు. స్త్రీ పురుష పరివ్రాజకులు సాంగత్యంలో ఉంటే బ్రహ్మచర్యం అనే నిబంధన లుప్తమైపోతుందని ఆయన భావించాడు. ఆయన మాటల్లోనే చెప్పాలంటే వేరు వేరు సంఘాల ద్వారా ఇద్దరి మధ్యా ఒక అఖాతం ఉండడం అవసరమని భావించాడు. ఇలా రెండు వేరు వేరు సంఘాలను ఏర్పరిచిన తరవాత ఆయన మరొక సమస్యను ఎదుర్కొన్నాడు. రెండు సంఘాలు ఉంటే అవి దేనికవి స్వతంత్రంగా ఉండాలా, వాటి మధ్య అంతస్సంబంధం ఉండాలా? మొదటి సమస్యకు సంబంధించి స్త్రీ సంఘం పురుష సంఘం వేరుగా ఉంచడం తప్ప మరో మార్గం లేదు. ఇరువైపులా బ్రహ్మచర్యం నిబంధన ఫలితంగా ఏర్పడినది ఇది. కామేచ్ఛ ప్రభావం స్త్రీ పురుషులు ఇరువురుపైనా ఎంత బలంగా ఉంటుందో బుద్ధుడికి తెలుసు. బుద్ధుని స్వంత మాటల్లో చెప్పాలంటే ఈ ప్రవృత్తే పురుషుడిని స్త్రీ బంధంలోను, స్త్రీని పురుష బంధంలోనూ ఉంచుతుంది. ఈ బలాన్ని పూర్తిస్థాయిలో పనిచేయనిస్తే బ్రహ్మచర్య నిబంధన ఒక్క నిముషం కూడా నిలబడదు. బ్రహ్మచర్య నిబంధనను కాపాడడానికే ఆయన రెండు వేరు వేరు సంఘాలను ఏర్పాటుచేశాడు.

రెండవ సమస్యను తీసుకుందాం: బుద్ధుడు తీసుకున్న నిర్ణయం కాక మరొక నిర్ణయం ఏమన్నా సాధ్యమయ్యేదేనా? బౌద్ధవిశ్వాసాలను ఎంచుకున్న మహిళలు కొత్తవారు. వారు అతని ధర్మబోధనలను, క్రమశిక్షణ సూత్రాలలోనూ శిక్షణ పొందవలిసి ఉంది. ఈ

పాత్రను ఎవరు నెరవేర్చగలరు? ఇటువంటి పనిని ఆయన మగ భిక్షుకులకు తప్ప ఇంకెవరికి అప్పజెప్పగలడు? అదే ఆయన చేశాడు. భిక్షుణిలకు భిక్షులు బోధన చేసే పని అప్పజెప్పడం ద్వారా వారి మధ్య సృష్టించిన సంబంధం ఎటువంటిది?ఈ ప్రశ్న వేయవలసిన అవసరం ఉంది. దీనిని వివరించకుండా భిక్షుక సంఘం పట్ల భిక్షుణి సంఘపు అవిధేయత గురించి స్పష్టత ఏర్పడడం సాధ్యం కాదు. ఈ ప్రశ్నకు స్పష్టంగా కనిపించే సమాధానం ఏమిటంటే భిక్షుణిలకు భిక్షులు శిక్షణ ఇచ్చే పనిచేయడం ద్వారా వారి మధ్య గురు శిష్యుల సంబంధం ఏర్పడింది. గురుశిష్య సంబంధంలో గురువుకు శిష్యుల పట్ల ఎంతోకొంత ఆధిపత్యం శిష్యులకు విధేయతరూపంలో గురువు పట్ల ఎంతోకొంత అధీనత ఉండదా? ఇంతకు మించి బుద్ధుడు చేసిందేముంది?

ఈ సందర్భంలో క్రైస్తవ సన్యాసుల మఠాలకూ బౌద్ధ సన్యాసినుల మఠాలకూ ఉండే సంబంధంతో పోల్చి చూడడం ఉపయోగంగా ఉంటుంది. క్రైస్తవ సన్యాసినుల మఠాలు సన్యాసుల మఠాలకు లోబడి ఉండవా? ఖచ్చితంగా లోబడి ఉంటాయి. కాబట్టి క్రైస్తవ మతం స్త్రీలను పురుషులకంటే హీనంగా చూస్తుందని ఎవరైనా అనగలరా? మరి బుద్ధుడు భిక్షుణిలు, భిక్షుకులకు సంబంధించి చేసిన ఏర్పాటును మాత్రం మరోరకంగా వ్యాఖ్యానించడం ఎందుకు?

సుత్త పిటకకు సంబంధించినంత వరకూ బుద్ధుడు స్త్రీల పట్ల పూర్వభావనతో ఉన్నాడనడానికి గాని, పురుషులు స్త్రీల పట్ల ఎల్లప్పుడు జాగ్రత్తగా ఉండాలని అన్నాడనడానికి గానీ అవకాశంలేదు.

## 2

ఇప్పుడు నిర్దిష్ట సంఘటనలను వదిలిపెట్టి స్త్రీల పట్ల బుద్ధుడు సాధారణంగా ఎలా వ్యవహరించేవాడో ఆ ప్రవర్తన దగ్గరికి వద్దాం. బుద్ధునికి స్త్రీల పట్ల హీనమైన అభిప్రాయముందా? బౌద్ధ మతస్థులకు పవిత్రమైన సాహిత్యాన్ని చదివిన వారెవరికైనా బుద్ధుడు స్త్రీలను కించపరిచేలా ఏమీ చేయకపోవడమే కాకుండా స్త్రీల ఔన్నత్యాన్ని పెంచే విధంగా ప్రవర్తించాడని ఖచ్చితంగా నమ్మకం కలుగుతుంది. ఈ అభిప్రాయాన్ని తెలియజేసే కొన్ని ఉదాహరణలను ఇక్కడ ఇస్తాను.

భారత దేశ ప్రజలు పురాతన కాలం నుండి కూడా ఆడపిల్ల పుట్టుకను ఒక విపత్తుగానే భావిస్తారు. బుద్ధుడికి కూడా ఈ భావన ఉందా? ప్రసేనజిత్తు మహారాజుకి ఇచ్చిన సలహాను గాని గమనిస్తే సాంప్రదాయ అభిప్రాయానికంటే బుద్ధుని అభిప్రాయం ఎంత భిన్నంగా ఉందో అర్థం చేసుకోగలుగుతాము. ఒకసారి బుద్ధుడ్ని కలవడానికి ప్రసేనజిత్తు మహారాజు శ్రావస్తిలోని జేత వనానికి వెళ్ళాడు. రాజ ప్రసాదం నుండి ఒక వార్తాహరుడు వచ్చి రాణి మల్లిక ఆడపిల్లను కన్నదని కబురు తెచ్చాడు. ఇది వినగానే రాజు మొహం పాలిపోయింది. విచారంగా, కుంగిపోయినట్టుగా అయిపోయాడు. అతని

ముఖ కవళికల్లోని మార్పుని గమనించి బుద్ధుడు కారణం అడిగాడు. తెలుసుకున్న తరవాత, "ఎందుకు విచారం? ఆడపిల్ల మగ పిల్లవాడికన్నా మెరుగైన సంతానంగా రూపొందవచ్చు! ఆమె తెలివైన వ్యక్తిగా, గుణవంతురాలిగా కావచ్చు, ఆమె ఒక మగపిల్లవాడికి జన్మనివ్వవచ్చు, అతడు గొప్ప పనులు చేసేవాడు, గొప్ప రాజ్యాలు ఏలేవాడు కావచ్చు....."

ఒక ప్రశ్నకి జవాబుగా, కొన్ని కుటుంబాలు ఎందుకు ఉన్నతంగా ఎదుగుతాయి, కొన్ని ఎందుకు నశించిపోతాయి అన్న విషయం గురించి బుద్ధుడు భిక్షుకులకు ఈ కింది జవాబిచ్చాడని చెబుతారు.

"కుటుంబాలైనా, సన్యాసులైనా గొప్పవారైన తరవాత కూడా ఆ గొప్పతనాన్ని నిలబెట్టుకోలేకపోవడానికి కారణం, వాళ్ళు పోగొట్టుకున్న దానిని వెతకక పోవడం, పాడయినదానిని బాగుచేసుకోకపోవడం, మితిమీరి తినడం, తాగడం, ఒక అనైతికమైన స్త్రీ చేతిలోనో పురుషుడి చేతిలోనో అధికారం ఉంచడం. ఎక్కువకాలం గొప్పగా కొనసాగలేకపోయిన కుటుంబాలు పై నాలుగు కారణాల వల్లకానీ, వాటిలో కొన్నిటి వల్ల కానీ విఫలమవుతాయి".

''ఏ కుటుంబాలూ, సన్యాసులూ గొప్పగా కొనసాగగలుగుతారో, వాళ్ళు పోగొట్టుకొన్నదాన్ని వెతుక్కోవడం వల్లా, పాడయినదానిని బాగుచేసుకోవడం వల్లా, మితంగా తినడం తాగడం వల్లా ఒక గుణవంతులైన స్త్రీ చేతిలోనో, పురుషుడి చేతిలోనో అధికారం ఉంచడం వల్లా సఫలమవుతారు.....వాళ్ళు పై నాలుగు కారణాలవల్ల కానీ, వాటిలో కొన్నిటి వల్ల కానీ కొనసాగగలుగుతారు."

"చక్రం తిప్పగల అంటే చక్రవర్తి కాగల రాజు" ప్రపంచంలోకి వచ్చినపుడు ఏం జరుగుతుందో భిక్షుకులకు వివరించే సందర్భంలో బుద్ధుడు భిక్షుకులతో ఇలా అన్నాడు.

"అటువంటి రాజు కనిపించినపుడు చక్ర సంపద, ఏనుగు, గుర్రం, మణి, స్త్రీ, గ్రహపతి, వంశాంకురం అనే సప్త సంపదలు కూడా కనిపిస్తాయి."

మరో సందర్భంలో ప్రపంచానికి స్త్రీ విలువను గురించి చెప్తూ...

'' స్త్రీ అత్యున్నతమైన పదార్థం''- (ఎందుకంటే) ఆమె ఉపయోగం నిరాకరించవీలులేనిది లేదా ఆమె ద్వారానే బోధిసత్వులు, ప్రపంచ పరిపాలకులు జన్మిస్తారు. (వ్యాఖ్యాత జోడించాడు).

ఆడపిల్ల పుట్టడం విచారించవలసిన విషయం కాదు, పైగా ఆనందించవలసిన విషయం అని అభిప్రాయపడిన వ్యక్తిని, ఒక స్త్రీని ఆధిపత్యంలో ఉంచడం ద్వారా కుటుంబాన్ని అధోగతిపాలు కాకుండా ఉంచగలదని అభిప్రాయపడిన వ్యక్తిని, స్త్రీని సప్త సంపదలలో ఒకటిగానూ, అత్యున్నతమైన విలువ కలిగినదిగానూ వర్ణించడానికి సంశయించని వ్యక్తిని స్త్రీ ద్వేషిగానూ, స్త్రీని అలక్ష్యం చేసేవాడుగా ఎలా వర్ణిస్తారు?

స్త్రీజాతి పట్ల బుద్ధుడికున్న సాధారణ అభిప్రాయాలివి. స్త్రీలను అవహేళన చేయడానికి అవమానించడానికి ఉద్దేశించినవని ఎవరైనా అనగలరా?

**3**

భిక్షుకుల అజమాయిషీలో భిక్షుణిలను ఉంచడంలో సామాజిక తప్పిదాన్ని చూడగలిగిన వారు, స్త్రీలను సన్యసించడానికి లేదా పరివ్రాజాన్ని స్వీకరించడానికి అనుమతించడం ఎంత విప్లవాత్మకమైన చర్యో గ్రహించడం లేదు. బ్రాహ్మణ సిద్ధాంతం స్త్రీలకు జ్ఞానం సంపాదించుకునే హక్కుని నిరాకరించింది. సన్యాసం తీసుకునే విషయంలో భారత మహిళల పట్ల వాళ్ళు మరొక తప్పిదాన్ని చేశారు. వేదాలను పూజించి చాలాకాలం వరకూ ఉపనిషత్తులను గుర్తించ నిరాకరించిన బ్రాహ్మణులకు సన్యాసం పుచ్చుకోవడం ఆదర్శం కాదని చరిత్ర చెప్తోంది. సన్యాసం ఉపనిషత్తుల ఆదర్శం. ఆత్మనే బ్రహ్మ అనే ఉపనిషత్తుల సిద్ధాంతాన్ని గుర్తించటమే సన్యాసానికి పరమావధి. బ్రాహ్మణులు సన్యాస జీవితానికి బద్ధవిరోధులు. చివరికి కొన్ని షరతులతోనే అంగీకరించారు. అందులో ఒక షరతు శూద్రులకు, స్త్రీలకు సన్యాసం నిషిద్ధం.

బ్రాహ్మణులు స్త్రీలకు సన్యాసాన్ని ఎందుకు నిషేధించారో తెలుసుకోవడం అవసరం. ఎందుకంటే స్త్రీల పట్ల బ్రాహ్మణుల వైఖరిని అర్థం చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. ఈ వైఖరి బుద్ధుని వైఖరికి పూర్తిగా భిన్నమైనది. కారణాన్ని మనువు చెప్పాడు. అది ఈ కింది విధంగా ఉంది.

IX. 18. "స్త్రీలకు వేదాలు అధ్యయనం చేసే హక్కు లేదు. అందువల్ల వారి అంతిమ సంస్కారాలు వేద మంత్రాలు లేకుండా జరుగుతాయి. వేదాలు తెలుసుకొనే హక్కు లేనందున స్త్రీలకు మతం గురించిన జ్ఞానం ఉండదు. వేదమంత్రాలు చదవడం పాపాలను కడిగేస్తుంది. స్త్రీలు మంత్రాలు చదవలేరు కనక వారు అసత్యం లాంటి వాళ్ళు."

మనువు బుద్ధుని తరవాత వాడయినప్పటికీ పురాతన ధర్మ సూత్రాలలో చెప్పిన దృక్పథాన్నే పునరుద్ఘాటించాడు. ఈ దృక్పథం భారత స్త్రీలను అవమానించేదీ, గాయ పరిచేది. జ్ఞానం సంపాదించుకోవడం అనేది మానవులు ప్రతి ఒక్కరి జన్మహక్కు. ఎటువంటి సముచిత కారణం లేకుండా జ్ఞానాన్ని పొందే హక్కుని నిరాకరించడం గాయపరచడం వంటిదే. జ్ఞానం సంపాదించుకొనే హక్కుని నిరాకరించి తరవాత జ్ఞానం లేదు కనక అసత్యం లాగే ఆమె అపరిశుభ్రమైనదని ప్రకటించి బ్రహ్మని చేరడానికి మార్గమైన సన్యాసం తీసుకోవడానికి అనర్హురాలని ప్రకటించడం ఆమెను అవమానపరచడమే. ఆమె తన ధార్మిక శక్తిని పొందడానికి హక్కుని నిరాకరించడమే కాకుండా బ్రాహ్మణులు ఆమెకు ధార్మిక వంధ్యత్వాన్ని ఆపాదించారు.

ఇది స్త్రీల పట్ల ఒక క్రూరమైన చర్య. దీనికి సాటి మరొకటి లేదు. ప్రొఫెసర్ మాక్స్ ముల్లర్ చెప్పినట్టు, "దైవానికి మానవుడు ఎంత దూరంగా ఉన్నా సరే, భూమిపై

మానవుని మించి మరొకరెవ్వరూ దేవునికి దగ్గరగాలేరు. భూమిపైన మనిషికి మించి దేవుడిని పోలిన వాళ్ళు మరొకరు లేరు." పురుషుల విషయంలో ఇది నిజమైతే మరి స్త్రీల విషయంలో ఎందుకు నిజం కాజాలదు? బ్రాహ్మణుల దగ్గర ఈ ప్రశ్నకు సమాధానం లేదు.

స్త్రీలను పరివ్రాజకుల జీవితానికి ఆహ్వానించి బుద్ధుడు ఈ రెండు తప్పులను ఒకే దెబ్బతో సరిచేశాడు. ఆయన స్త్రీలకు జ్ఞానాన్ని పొందే హక్కుని కల్పించి పురుషులతో పాటు వారు కూడా తమ ధార్మిక శక్తిని పొందే హక్కుని కల్పించాడు. భారత దేశంలోని స్త్రీల విషయంలో ఇది విప్లవం, విముక్తీ రెండూనూ. ప్రొఫెసర్ మాక్స్ ముల్లర్ మాటల్లో చెప్పాలంటే...

"వేధించే పురాతన బ్రాహ్మణ చట్టాల సంకెళ్ళు ఎట్టకేలకు తెగిపోయాయి. ఎందుకంటే బౌద్ధం వ్యక్తిగత స్వేచ్ఛనూ, మరీ ముఖ్యంగా సమాజం విధించిన పరిమితులను అధిగమించే హక్కునూ, వానప్రస్థానానికి సైతం వెళ్లాలనే కోరిక కలిగినపుడు స్వేచ్ఛగా వెళ్ళి, ధార్మిక స్వేచ్ఛను అనుభవించే జీవితాన్ని జీవించడంతో సహా అన్ని వ్యక్తిగత హక్కులను బౌద్ధమతం వాగ్దానం చేస్తుందని భారతదేశ చరిత్ర చెబుతుంది".

బుద్ధుడు భారతదేశ స్త్రీలకు ఇచ్చిన స్వేచ్ఛకు చాలా ప్రాముఖ్యత ఉంది. భిక్షుణి సంఘాలు, భిక్షుక సంఘాలకు లోబడి ఉండడం వల్ల కలిగిన ఏ అపవాదునయినా అది అధిగమిస్తుంది. ఈ స్వేచ్ఛలో డొల్లతనం లేదు. అది వారు గాఢంగా అనుభవించి గానం చేసిన స్వేచ్ఛ. "ఓ ఎంత దివ్యమైన స్వేచ్ఛతో ఉన్నాను నేను......" అని ముత్త అనే బ్రాహ్మణ కులానికి చెందిన భిక్షుణి గానం చేసింది. "ఈ శిలపై నేను ఆసీనమై ఉన్నాను. నా ఆత్మని తాకుతూ స్వేచ్ఛా గాలులు వీస్తాయి....." అంటూ మరొక బ్రాహ్మణ యువతి మెట్టిక అనే భిక్షుణి గానం చేసింది.

శ్రీమతి రైస్ డేవిడ్ చెప్పినట్టు.... " ఈ స్వేచ్ఛను పొందడానికి వాళ్ళు కూడా తమ తరవాతి క్రైస్తవ సోదరిల లాగానే తమ సామాజిక హోదాను, అన్నిరకాల గృహ సంబంధ విజయాలను, వారి ప్రపంచాన్నే వదులుకొన్నారు. తమను ఎంత ఆరాధించినా, ఎంత శ్రద్ధ కనపరిచినా, ఎంత చక్కని నివాసం ఏర్పరిచినా వారి హోదా ఎవరో ఒకరికి అనుబంధంగా ఉండటమే. వాటన్నిటినీ వదులుకొని అందుకు బదులుగా వారు వ్యక్తిగా ఒక హోదాను అందుకున్నారు."శిరో ముండనంతో, స్త్రీ పురుష అంతరం లేని ఏకాంబర వస్త్ర ధారణతో, పురుషుల వలెనే లోదుస్తులని ధరించి సోదరి స్వేచ్ఛగా వంటరిగా కీకారణ్యంలోకి పోయి రావచ్చు. శిఖరాలు అధిరోహించవచ్చు."

స్త్రీలను భిక్షుణిలుగా మారడానికి అనుమతించడం ద్వారా బుద్ధుడు వారి స్వేచ్ఛకు దారి తెరవడమే కాకుండా లింగ భేదం లేకుండా వారికి గౌరవం దక్కేలా చూశాడు. ఆమెకు లభించిన స్వేచ్ఛ గురించి రైస్ డేవిడ్ మాటల్లో:

"లింగ ప్రసక్తి లేకుండా కనీసం సోదర అరహంతులు తననొక హేతుబద్ధమైన వ్యక్తిగా గుర్తించినందుకు ఆమె ఎంతో ఆనందించింది.

ఆరకంగా ఆధ్యాత్మిక వాతావరణంలో ఆమె ఊపిరి పీల్చుకుంది. "విషయాలను ఉన్నవి ఉన్నట్లుగా" చూసే శక్తిని పొందడాన్ని బౌద్ధులు "జాగృతం కావడం" అంటారు. ఆ జాగృతి కలిగించిన "ఆరియా"లతో పిటకాలలో వర్ణించే మతపరమైన కులీనులతో 'మేధోపర సాహచర్యాన్ని' ఆమె పంచుకుంది."

"స్త్రీ స్వభావం ఆరియాలైన మనల్ని ఎలా అడ్డుకొంటుంది?" ప్రశ్నించింది సోమ అనే భిక్షుణి.

"కట్టుబాటుని నిజంగా అర్థం చేసుకోగలిగే అంతర్దృష్టి ఉన్నవారికి,
ఈ కింది ప్రశ్న ఉదయించే వారికి ఇది ఏమి సూచిస్తుంది?
ఈ విషయాలలో నేను స్త్రీనా, లేక నేను పురుషుడినా?
నేను కానిదెవరు?
అటువంటి వాటికి 'మార' సరిగ్గా జవాబు చెప్పగలదు."

అంతే కాదు. స్త్రీలను భిక్షుణిలుగా మారేందుకు అనుమతించడం ద్వారా బుద్ధుడు స్త్రీ పురుష సమానత్వం కోసం వారికి మార్గం చూపాడు. శ్రీమతి రైస్ డేవిడ్ చెప్పినట్టు ..."సాంకేతికంగా భిక్షువులకు భిక్షుణిలను శాశ్వతంగా జూనియర్లుగా నియమించిన మాట వాస్తవం. అయితే తమ మేధస్సు ద్వారానూ ఔన్నత్యం ద్వారానూ "తేరీలు" తమ సమూహంలోని సర్వోన్నతులతో సమానత్వాన్ని పొందగలరనేది కూడా అంతే వాస్తవం." కీర్తన, (xxx,vii)లలో ఒకానొక ప్రస్తావనలో బౌద్ధ ధర్మ స్థాపకుడైన బుద్ధునికి వారసుడైన మాహా కశ్యపునితో సమానంగా "బద్ధ" (అనే తేరి) ఆధ్యాత్మికతను పొందింది. ఈ సందర్భంలో బుద్ధుడు "కన్యాత్వాన్ని" ప్రధానం చేయలేదని గుర్తించవచ్చు. వివాహితులు, అవివాహితులు, వితంతువులు, ఆఖరుకి వేశ్యలతో సహా స్త్రీలలోని అన్ని సమూహాలకూ తన మార్గాన్ని తెరచి ఉంచాడు. అందరూ పురుషులతో పాటుగా ప్రతిభను, స్వేచ్ఛనూ గౌరవాన్నీ సమానత్వాన్నీ పొందవచ్చు.

## 4

స్త్రీల స్థితి ఒకప్పుడు ఉన్న పరిస్థితి నుండి అధోగతికి దిగజారిందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ప్రాచీన కాలపు రాజ్యతంత్రంలో స్త్రీలు నిర్వహించిన పాత్ర గురించి ఎక్కువ చెప్పలేరు. కానీ వారు దేశ మేధోపర, సామాజిక జీవితంలో ఉన్నత స్థానాన్ని కలిగి ఉన్నారు అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. బ్రహ్మచర్యాన్ని ముగించి

వివాహానికి సిద్ధమైన యువతి ఉపనయనానికి అర్హురాలనే విషయం అధర్వణ వేదంలో స్పష్టంగా ఉంది. స్త్రీలు మంత్రాలు జపించవచ్చనీ స్త్రీలకు కూడా వేదాలు చదవడం నేర్పారని శ్రౌత సూత్రాలలో స్పష్టంగా ఉంది. స్త్రీలు గురుకులాలలో విద్య నేర్చారనీ వేదాలలోని వివిధ శాఖలను అధ్యయనం చేసి తర్కంలో ఆరితేరారు అనడానికి పాణిని రచించిన అష్టాధ్యాయ ఒక సాక్ష్యం. పతంజలి రచించిన మహాభాష్యంలో విద్యార్థినులకు గురువులుగా మహిళలే వేదాలు బోధించారని పేర్కొన్నాడు. మతం, తత్వశాస్త్రం,అధిభౌతిక శాస్త్రం వంటి సంక్లిష్ట విషయాలపై స్త్రీలు పురుషులతో బహిరంగ చర్చల్లో పాల్గొన్న ఉదంతాలు కొల్లలు. జనకుడు, సులభల మధ్యా యాజ్ఞవల్కుడు, గార్గిల మధ్యా యాజ్ఞవల్కుడు, మైత్రేయిల మధ్యా శంకరాచార్య, విద్యాధరిల మధ్య జరిగిన బహిరంగ వాగ్వివాదాలు మనువుకు ముందు కాలంలో స్త్రీలు విద్య, అధ్యయనాలలో అత్యున్నత శిఖరాలను అధిరోహించారని తెలియజేస్తున్నాయి.

ఒకప్పుడు స్త్రీలను అత్యున్నతంగా గౌరవించారనటంలో సందేహం లేదు. ప్రాచీన భారతదేశంలో మహారాజు పట్టాభిషేక సమయంలో ప్రముఖ పాత్ర వహించిన రాత్నులలో రాణి కూడా ఒకరు. ఇతరులకు అర్పించినట్టే రాజు రాణికి కూడా పూజలు అర్పించేవాడు.రాణికే కాకుండా పట్టాభిషిక్తుడు అవుతున్న రాజు కింది కులాలకు చెందిన తన ఇతర భార్యలకు కూడా పూజలు అర్పించేవాడు. పట్టాభిషేకం పూర్తయ్యాక తన శ్రేణులలోని ముఖ్య నాయకుల భార్యలకు కూడా నమస్కరించే వాడు. ప్రపంచంలోనే స్త్రీలకు ఇది అత్యున్నత స్థానం. వారు అధోగతి చెందడానికి కారణం ఎవరు? హిందూ స్మృతి కారుడు మనువే దీనికి కారణం. మరే సందేహానికి తావులేకుండా ఉండేందుకు మనుస్మృతిలో మనువు స్త్రీలకు సంబంధించి చేసిన కొన్ని న్యాయసూత్రాలను ఇక్కడ పేర్కొంటున్నాను.

II. 213. పురుషులను వశపరచుకోవడం (ప్రపంచంలో) స్త్రీల నైజం. ఆ కారణంగానే తెలివైన పురుషులు స్త్రీల సన్నిధిలో ఏమరుపాటుగా వ్యవహరించరు.

II. 214. మూర్ఖులనే కాదు స్త్రీలు విజ్ఞులను కూడా తప్పుదోవ పట్టించి కోరికలకూ క్రోధానికీ బానిసలను చేయగలరు.

II. 215. పురుషుడు తల్లితో గాని, చెల్లితో గాని, కూతురుతో గానీ ఏకాంత ప్రదేశాలలో ఉండరాదు. ఎందుకంటే ఇంద్రియాలు శక్తివంతమైనవి. అవి విజ్ఞుడిని సైతం లొంగదీయగలవు.

IX. 14. స్త్రీలకు అందంతోనూ వయసుతోను పని లేదు. అందగాడి కైనా సరే కురూపికైనా సరే మగవాడైతే చాలు తమని తాము అర్పించుకుంటారు.

IX. 15. పురుషుల పట్ల వ్యామోహం వల్లా చంచల స్వభావం వల్లా సహజంగానే ఉండే కర్కశత్వం వల్ల ఎంత జాగ్రత్తగా రక్షించినప్పటికీ స్త్రీలు తమ భర్తల పట్ల అవిధేయంగా ఉంటారు.

IX.16. సృష్టికర్త వారి స్వభావాన్ని ఆ విధంగా సృష్టించాడు కాబట్టి పురుషుడు పట్టుదలతో శ్రమించి వారికి కాపలా కాయడం తప్పనిసరి.

IX.17. వారిని సృష్టించినప్పుడు వారికి ఆసనం, ఆభరణం, అపవిత్ర కోరికలు, ద్వేషం, నిజాయితీ లేని తనం, అసూయ, దుష్ప్రవర్తనను కేటాయించాడు.

మనువు ఉద్దేశంలో స్త్రీలు ఎంత అధములో ఇది చూపిస్తోంది. స్త్రీలకి వ్యతిరేకంగా మనువు ఈ ఉద్దేశంతోనే చట్టాలు తయారుచేశాడు. స్త్రీలు ఎటువంటి పరిస్థితుల్లోనూ స్వేచ్ఛగా ఉండకూడదు. మనువు అభిప్రాయంలో..............

IX.2. స్త్రీలను పగలు, రాత్రి తమ కుటుంబంలోని మగవాళ్ళపై ఆధారపడేలా ఉంచాలి. ఒకవేళ వాళ్లు ఇంద్రియ సుఖాలకు అలవాటు పడితే వారిని అదుపు చేయాలి.

IX.3. ఆమెను బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు, సంరక్షిస్తారు. స్త్రీ ఎట్టి పరిస్థితుల్లో స్వతంత్రంగా ఉండరాదు.

IX.5. అవి ఎంత అల్పమైనవి అనిపించినా సరే చెడు తలంపులకు పాల్పడకుండా మహిళలను రక్షించు కోవాలి. అలా రక్షించుకోకపోతే వారు కుటుంబాలకు విషాదాన్ని కలిగిస్తారు.

అన్ని కులాలకు ఉండే అత్యున్నత విధులను దృష్టిలో పెట్టుకున్నప్పుడు, బలహీనులైన భర్తలు కూడా తమ భార్యలను రక్షించుకోవాలి.

V.147. బాలిక కానీ యువతి గానీ వృద్ధురాలు గానీ ఆమె సొంత ఇంట్లోనైనా సరే స్వతంత్రంగా ఏదీ చేయకూడదు.

V.148. బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త అధీనంలో ఉండాలి. భర్త మరణించినప్పుడు కొడుకుల అధీనంలో ఉండాలి. స్త్రీ ఎన్నడూ స్వతంత్రంగా ఉండరాదు.

V.149. ఆమె తండ్రి నుండి కానీ భర్త నుండి కానీ కొడుకుల నుండి కానీ వేరు పడాలని ప్రయత్నించకూడదు. వారిని వదిలి పెట్టడం ద్వారా ఆమె రెండు కుటుంబాలకు (తనది, తన భర్తది) అప్రతిష్ట కలుగచేస్తుంది. స్త్రీ కి విడాకుల హక్కు ఉండరాదు.

IX.45. "వివాహానంతరం భార్యాభర్తలు ఒకటవుతారు. దానర్థం ఒకసారి వివాహం అయిన స్త్రీ ఇక విడిపోవడం అనేది ఉండకూడదు."

చాలామంది హిందువులు విడాకుల విషయంలో మనువు చెప్పిన చట్టం విషయంలో ఇక్కడే ఆగిపోయి మనువు వివాహాన్ని చాలా పవిత్రంగా భావించాడనీ అందువల్లనే విడాకులను అనుమతించలేదని భావిస్తూ ఆత్మ సంతృప్తి పొందుతుంటారు. ఇది చాలా వాస్తవ దూరమైన విషయం. అతను విడాకుల చట్టం రూపొందించిన ఉద్దేశం పూర్తిగా వేరు. అది పురుషుల్ని స్త్రీకి కట్టబెట్టడం కోసం కాదు. స్త్రీని పురుషుడికి కట్టబెట్టి పురుషుని స్వేచ్ఛగా వదిలిపెట్టడానికే ఉద్దేశించినది. ఎందుకంటే పురుషుడు తన భార్యను వదిలిపెట్టడాన్ని మనువు నిరోధించలేదు. పురుషుడు స్త్రీ ని వదిలి పెట్టడానికే కాదు

అమ్మి వేయడానికి సైతం అనుమతిస్తాడు. భార్య మాత్రం విడిపోయి స్వతంత్రురాలు కావడాన్ని నిరోధిస్తాడు. మనువు ఏం చెప్పాడో చూడండి....

IX.46. అమ్మకం వల్ల గానీ, పరిత్యజించడం వల్ల గానీ భార్య భర్త నుండి విడుదల కాజాలదు.

దీనర్థం భార్యను అమ్మివేసినా విడిచి పెట్టినా తనను కొనుక్కున్న వారికి గాని వేరొకరికి గాని చట్టబద్ధమైన భార్య కాజాలదు. దీనికన్నా దుర్మార్గం మరొకటి లేదు. మనువు తన న్యాయ సూత్రాలు రూపొందించేటప్పుడు న్యాయాన్యాయాలను గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. బౌద్ధం స్త్రీలకు అనుమతించిన స్వేచ్ఛను వారికి దక్కకుండా చేయాలని అతను తలచాడు. స్త్రీలకు స్వాతంత్రం ఉండడాన్ని మనువు సహించలేకపోయాడు. దానిని అరికట్టడానికే ఆమెకు స్వేచ్ఛ లేకుండా చేశాడు. ఆస్తికి సంబంధించి మనువు భార్య స్థాయిని ఒక బానిస స్థాయికి దిగజార్చాడు.

IX.416. భార్యకు, కొడుకుకు, బానిసకు ఆస్తి ఉండదు. వారు ఎవరికి చెందుతారో వారు సంపాదించే/పొందే ఆస్తి కూడా అతనికే చెందుతుంది.

ఒక స్త్రీ వితంతువు అయినప్పుడు ఒకవేళ ఆమె భర్తది ఉమ్మడి ఆస్తి అయి ఉంటే ఆమెకుపోషణ ఖర్చునూ, భర్త వేరు పడి ఉంటే భర్త ఆస్తి నుండి భరణాన్ని అనుమతించాడు కానీ ఆ ఆస్తి పై ఆమెకు అధికారాన్ని అనుమతించలేదు. మనుస్మృతి ప్రకారం భార్యని కొట్టే హక్కు భర్తకు ఉంటుంది.

VIII.299. భార్య, కొడుకు, బానిస, విద్యార్థి, తమ్ముడు తప్పు చేస్తే తాడుతో గాని బెత్తంతో కానీ కొట్టవచ్చు.

మనుస్మృతి ప్రకారం స్త్రీలకు జ్ఞానం పొందే హక్కు లేదు. వేదాలు పఠించే హక్కును వారికి మనువు నిషేధించాడు. స్త్రీలు కూడా సంస్కారాలు ఆచరించవలసి వుంటుంది. కానీ వేదమంత్రాలు చదవకుండా ఆచరించాలి. మతాచారాలకు ముఖ్యమైనవి క్రతువులు. స్త్రీలు అటువంటి క్రతువులు నిర్వహించడాన్ని మనువు నిషేధించాడు.

XI.36-37. స్త్రీలు వేదాలలో ఉటంకించిన క్రతువులు ఆచరించడం నిషేధం. ఒకవేళ ఆచరిస్తే ఆమె నరకానికి పోతుంది. ఆమె క్రతువులు చేయకుండా నిరోధించేందుకు బ్రాహ్మణ పురోహితుల సహకారం ఆమెకు అందకుండా చేసాడు.

IV.205-206. స్త్రీలు నిర్వహించిన క్రతువులలో బ్రాహ్మణులు భోజనం ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదు. స్త్రీలు నిర్వహించే క్రతువులు అపవిత్రమైనవి. భగవంతునికి ఆమోదం కానివి. అందువల్ల వాటికి దూరంగా ఉండాలి.

చివరగా జీవితాదర్శంగా మనువు స్త్రీల ముందు ఉంచిన విషయం గురించి ఒక్క మాట. అది మనువు మాటల్లో చెప్పడమే ఉత్తమం.

V.151. తండ్రి గానీ తండ్రి అనుమతితో సోదరుడు గానీ ఆమెను వివాహబంధంలో ఎవరికి ఇస్తారో అతను జీవించి ఉన్నంత కాలం ఆమె అతనికే విధేయురాలుగా ఉండాలి. అతను మరణించాక అతని స్మృతిని అవమానపరచకూడదు. విధివంచితుడైనా వేరే చోట సుఖాలను వెతుక్కుంటున్నా, మంచి అలవాట్లు లేకున్నా విధేయురాలైన భార్య భర్తని ఎల్లప్పుడూ దైవంలాగా పూజిస్తూ ఉండాలి.

V.155. స్త్రీలు భర్తలను వదిలిపెట్టి ఏ క్రతువులూ ఏ నోములూ ఏ ఉపవాసాలూ చేయనవసరం లేదు. భర్తకు విధేయురాలుగా ఉండడం అనే ఒక్క విషయం తోటే ఆమెకు స్వర్గం ప్రాప్తిస్తుంది.

ఈ ఆదర్శం సారాంశంగా మనువు అనేక ధర్మపన్నాలు నిర్దేశించాడు.

V.153. పవిత్ర మంత్రాలతో వివాహం చేసుకున్న భర్త తోనే రుతుకాలంలోనూ రుతుకాలం కానికాలంలోనూ ఇహలోకంలోనూ పరలోకంలోనూ ఆమె సుఖ సంతోషాలు ఉంటాయి.

V. 150. ఆమె ఎల్లప్పుడు సంతోషంగానూ, అతని కుటుంబ వ్యవహారాలు చక్కపెట్టడంలో తెలివిగానూ, గిన్నెలు శుభ్రం చేయడంలో జాగ్రత్తగానూ, ఖర్చుపెట్టడంలో పొదుపరిగానూ ఉండాలి.

ఇవీ హిందువులు స్త్రీలకు చూపించిన గొప్ప ఆదర్శం!!!

స్త్రీల అనర్హతల గురించి మనువు నిర్మించిన ఈ కట్టడానికి గోపురం లాంటి మరొక చట్టాన్ని ప్రకటించాడు. అది స్త్రీలను చంపడం ఉపపాతకమే అంటే చిన్న నేరం అన్నాడు. తాగడం, స్త్రీలను, శూద్రులను, వైశ్యులను, క్షత్రియులను, నాస్తికులను చంపడం కూడా చిన్నపాటి నేరాలే. శూద్రులను, వైశ్యులను, క్షత్రియులను చంపడం ఉపపాతకములు అని మనువు ఎందుకన్నాడో తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే బ్రాహ్మణులు వీరందరి కంటే ఉన్నతులు అని నిరూపించదలుచుకున్నాడు. అందువల్ల బ్రాహ్మణుడ్ని చంపడం “మహాపాతకం” అన్నాడు. మరి ఇదే విషయం స్త్రీలకు ఎందుకు అన్వయించలేదు? ఎందుకంటే మనువు దృష్టిలో స్త్రీ ఏ విలువా లేనిది.

పైన ఉటంకించిన ఈ విషయాలన్నీ చూశాక భారతదేశంలో స్త్రీల పరిస్థితి అధోగతికి దిగజారడానికి కారణం మనువు అనడానికి ఎవరైనా సందేహిస్తారా? బహుశా చాలా మందికి ఈ విషయం తెలుసు. కానీ వారికి రెండు విషయాలు తెలిసినట్టు లేదు. మనువు లోని ప్రత్యేకత ఏమిటనేది వారికి తెలియలేదు. వీళ్ళ గురించి మనువు చెప్పిన దానిలో దిగ్భ్రాంతి కలిగించే కొత్త విషయమేమీ లేదు. భారతదేశంలో బ్రాహ్మణీయం పుట్టినప్పటినుంచీ ఉన్నవే. ఈ అభిప్రాయాలన్నీ బ్రాహ్మణులవే. మనువుకు ముందు ఇవన్నీ సామాజిక సిద్ధాంతాలు గానే ఉనికిలో ఉన్నాయి. మనువు చేసింది ఏమిటంటే సామాజిక సిద్ధాంతంగా ఉన్నదాన్ని రాజ్యాంగ చట్టాలుగా రూపొందించడం. వారికి తెలియని రెండో

విషయం ఏంటంటే ఈ అనర్హతలను మనువు స్త్రీలకు ఎందుకు ఆపాదించాడనే విషయం. బౌద్ధ ధర్మం వైపు పెద్ద ఎత్తున మళ్ళడం ద్వారా బ్రాహ్మణీయ మతం పునాదులను కదిలిస్తున్నది, ఆర్యసమాజంలో ముఖ్య సమూహాలైన స్త్రీలు, శూద్రులే. బౌద్ధం వైపు వెల్లువలా దూకుతున్న స్త్రీల ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలనేదే మనువు కోరిక.

ఈ కారణంగానే మనువు స్త్రీలపై ఈ అనర్హతలను విధించి వారిని శాశ్వతంగా అశక్తులను చేశాడు. సందేహం ఉన్నవారెవరైనా మనుస్మృతిలో ఉటంకించిన ఈ క్రింది నిషేధాలను పరిశీలించవచ్చు.

V.88. వర్ణ సంకరం వల్ల జన్మించిన వారికి, సన్యాసం స్వీకరించిన వారికి, ఆత్మహత్యలు చేసుకొని చనిపోయిన వారికి అంత్యక్రియలనూ కర్మలనూ జరపరాదు.

V. 89. భిన్న మతాలలో చేరిన స్త్రీలకు, స్వేచ్ఛగా వ్యవహరించే స్త్రీలకు, గర్భస్థ శిశువునూ భర్తనూ గాయపరిచిన స్త్రీలకు, మద్యం సేవించే స్త్రీలకు ఈ అంత్యక్రియలు నిషిద్ధం.

ఈ నిషేధం ఇతరులతో పాటు సన్యాసం స్వీకరించిన వారిపట్లా మత భ్రష్టులైన వారిపట్లా ఎక్కుపెట్టాడు. సన్యాసుల పట్ల విధించిన నిషేధం పరివ్రాజకులను ఉద్దేశించినది. భిన్న సంప్రదాయాలలో చేరిన మహిళలు అంటే మనువు దృష్టిలో ఉన్నది బౌద్ధమతమే అనడంలో సందేహం లేదు. అందువల్ల సన్యాసులకు, మతం మారిన స్త్రీలకు అంత్యక్రియలు కర్మకాండలు జరపరాదని అన్నాడంటే అది బౌద్ధ మతం స్వీకరించిన స్త్రీ లేదా పురుషుని కుటుంబాన్ని ఉద్దేశించినదే ననేది స్పష్టమే. మరో మాటలో చెప్పాలంటే వారిని కుటుంబం నుంచి వెలి వేయాలని చెప్పడమే. మనువు బౌద్ధ మతానికి బద్ధ వ్యతిరేకి. స్త్రీలపై అనేక రకాలైన అసమానతలను గుప్పించడం వెనుక రహస్యం అదే. ఎందుకంటే కుటుంబాన్ని బౌద్ధ మతం నుండి కాపాడాలంటే స్త్రీలను అదుపు చేయాలని మనువుకు తెలుసు. అందుకే ఆ పని చేసాడు. భారతదేశంలో స్త్రీల అధోగతికి కారణం మనువుకు ఆపాదించాలి తప్ప బౌద్ధానికి కాదు.

ఈ పరిమిత పేజీల్లో హిందూ స్త్రీ ఉత్థాన పతనాల గురించి వివరించే ప్రయత్నం చేశాను. స్త్రీల అధోగతికి కారకులెవరో అందుకు పాల్పడడానికి కారణాలేమిటో వివరించడానికి కూడా ప్రయత్నించాను. పక్షపాతం పూర్వభావన లేని వారందరికీ ఈ విషాదానికి కారణం బుద్ధుడు కాదనే విషయం అర్థమవుతుందని ఆశిస్తున్నాను. బుద్ధుడికి ఆపాదించాల్సినదేమన్నా ఉంటే అది పురుషుల స్థాయికి సమానంగా స్త్రీలని నిలపడానికి ప్రయత్నం చేశాడు అనేదే.

**అనువాదం: బి. అనురాధ**

**ఇంగ్లిష్ మూలం:** The Rise and Fall of the Hindu Woman: Who was responsible for it ? Vol. 7, part 2, pg 109-129

## హిందూ స్త్రీ ఉత్థాన పతనాలు: అందుకు బాధ్యులెవరు? అనుబంధం :

## హైందవంలోనూ బౌద్ధమతంలోనూ స్త్రీల పరిస్థితి – లామా గోవింద

(1950 జనవరి 21 న "మన నూతన గణతంత్రం" పేరుతో "ఈవ్స్ వీక్లీ" లో ప్రచురితమైన వ్యాసానికి ప్రతిస్పందన)

"యూరోప్ లో కంటే చాలాముందు నుండే భారత దేశంలో స్త్రీలకు రాజ్యతంత్ర విషయాలు అలవాటే. రామాయణ మహాభారతాల్లో ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి." 1950 జనవరి 21న "ఈవ్స్ వీక్లీ" లో ప్రచురితమైన "మన నూతన గణతంత్రం" వ్యాసంలో ఈ వాక్యాలను ప్రముఖంగా ప్రచురించారు. విజ్ఞులైన రచయిత మహాభారతంలో ముఖ్య పాత్ర ద్రౌపది, ఎవరి భర్త లేదా భర్తలు (ఎందుకంటే ఆమెకు ఐదుగురు భర్తలు కదా) తనను జూదంలో ఓడారో, ఆమె గురించి కానీ అనడంలేదు కదా! లేక తనను చెరబట్టిన రావణుని అన్ని ప్రయత్నాలను వీరోచితంగా తిప్పికొట్టినా, భర్తనుండి ఆమె పవిత్రతను శంకించడం, అగ్నిపరీక్ష పెట్టడం, అడవుల్లో వదిలేయడం వంటివి ప్రతిఫలంగా పొందిన సీత గురించా? రచయిత ఈ వ్యాసంలో చెప్పినట్టుగా స్త్రీల పరిస్థితి ఉందని మనం నమ్మితే ద్రౌపదికి తన ఐదుగురు భర్తలను జూదంలో పందెం కాసే అవకాశం ఎందుకు రాలేదా అని సందేహం రాక తప్పదు. తన శీలాన్ని శంకించిన వారిని చితి మీదకో, అడవుల్లోకో పంపే అవకాశం సీతకు ఎందుకు రాలేదా అని కూడా సందేహం వస్తుంది.

ఈ సందర్భంగా ''ఆరోజుల్లో స్త్రీలను రాజ్యతంత్రంలో బాగా ఉపయోగించుకున్నారని" అనడం చాలా సబబుగా ఉంటుంది.

ఇక యూరోప్‌లోని మహిళలంటారా, భారత దేశంలోని తమ సోదరిల కన్నా వారు వెనుకబడి ఉన్నారో లేదో నేను చెప్పలేను కానీ, రాజ్యతంత్రంలో అవకాశాలు వచ్చినపుడు మాత్రం వారు వాటిని ఉపయోగించుకోవడంలో చురుగ్గా ఉన్నారని మాత్రం చెప్పగలను. ఎలిజబెత్ రాణి కానీ ద్రౌపది స్థానంలో ఉంటే అదృష్టహీనుడైన తన ప్రియుడు లార్డ్ ఎస్సెక్స్ కి వేసినట్టు ఐదుగురు భర్తలకు మరణ శిక్ష వేసిఉండేది. నా అభిప్రాయంలో రాజ్యతంత్ర అధికారం, కుత్సితం ఉన్న బెస్సీ రాణి కన్నా రాజ్యతంత్రం లేని ద్రౌపది ఎక్కువ ప్రియమైనదిగా అనిపిస్తుంది. యూరోప్ చరిత్ర వచ్చింది కాబట్టి ఇక్కడ ప్రస్తావించవలిసిన మరొక వ్యక్తి అనేక మంది పిల్లల తల్లి, సమర్ధవంతమైన పరిపాలన చేయగలిగిన ఆస్ట్రియా మహారాణి మరియా థెరీసా. మనం ఇంకా యూరోప్ తొలినాళ్ళ చరిత్ర కానీ తీసుకుంటే అత్యంత తక్కువ స్థాయి నుండి అత్యున్నత స్థాయికి ఎదిగిన బైజాంటియమ్ మహారాణి థియోడోరా ఇంకా చాలా చక్కని ఉదాహరణ కాగలదు. ఆమె వేశ్యగా జీవితాన్ని ప్రారంభించి మహారాణిగా మారింది.

భారత స్త్రీత్వానికి ఇది ఉదాహరణ అని నేనకోవడంలేదు. అలాగే రాజ్యతంత్రం స్త్రీల గౌరవాన్ని పెంచుతుందని కూడా అనుకోవడం లేదు. భారతదేశంలో స్త్రీలకు రాజ్యతంత్రం యూరోప్ కంటే "చాలా కాలం" కిందనే అలవాటు అని రచయిత అన్నప్పటికీ చరిత్రలో తాజా ఉదాహరణలైన ఝాన్సీ రాణి, చాంద్ బీబీలు తప్ప అంతకంటే ముందు కాలానికి చెందిన ఉదాహరణలు కనపడవు. మనం సమీక్షిస్తున్న ఈ వ్యాసంలో అన్నింటికంటే ఆశ్చర్యం గొలిపే వ్యాఖ్యానం – "విచారకరమైన విషయం ఏమిటంటే బౌద్ధ సిద్ధాంతం మహిళలను తెర వెనుకకు నెట్టివేసింది" అనేది.

అయితే దురదృష్టవశాత్తూ ఆ సిద్ధాంతం ఏమిటనేది విజ్ఞులైన ఈ రచయిత పేర్కొనలేదు. నేను పవిత్ర బౌద్ధ గ్రంధాలను, బోధనలను నిశితంగా పరిశీలించినప్పటికీ స్త్రీల గురించి ప్రత్యేకంగా ఎటువంటి సిద్ధాంతమూ నాకు కనిపించలేదు. మొత్తంగా మానవ జాతి గురించి మాత్రమే వీటిలో ఉంది. నాలుగు పవిత్ర సత్యాలు, ఆధారిత సృష్టి సిద్ధాంతం (ఫార్ములా ఆఫ్ డిపెండెంట్ ఆరిజినేషన్), విముక్తి అష్టాంగ మార్గం – వీటన్నింటిలో ఎక్కడా పురుషులకూ స్త్రీలకూ మధ్య తేడా చూపించలేదు.

బౌద్ధ చరిత్ర మొత్తంగా గమనించినట్లయితే బౌద్ధేతర దేశాలలో కన్నా బౌద్ధ సమాజాలలోనే మహిళల స్థానం సాపేక్షికంగా మెరుగ్గా ఉండటం మనం గమనించవచ్చు. బౌద్ధ సమాజపు తొలినాళ్ళ నుండి కూడా స్త్రీ పురుషుల మౌలిక సమానత్వం దాని విశిష్ట లక్షణం.

సిలోన్, బర్మా, సియాం, ఇండో చైనా, టిబెట్ వంటి ఏ బౌద్ధ దేశంలో నివసించినవారికైనా అక్కడ మహిళల స్థానం ఆశ్చర్యకరమైనంత ఉన్నతంగా ఉందని అర్థమవుతుంది. బౌద్ధురాలైన ఒక భార్య తన భర్తను భగవంతుడిగా చూడనవసరం లేదు. తన భర్త తిన్న తర్వాతనే ఆమె తినాలని బౌద్ధ సమాజం ఆశించదు. భర్త చనిపోతే ఎటువంటి సుఖసంతోషాలు లేని నిరర్థక జీవితం గడపాలని లేదా భర్తతో పాటు సతీసహగమనం చేయాలని ఆశించదు. దానికి భిన్నంగా, తన భర్తతో పాటు జీవించలేనని ఆమె భావిస్తే భర్తను వదిలేయటానికి ఆమెకు స్వాతంత్రం ఉంది. భర్త చనిపోయిన తరువాత ఆమె ఒక సాంఘిక బహిష్కృతురాలిగా జీవితం వెళ్ళదీయనవసరం లేదు. ఆమెకు ఇష్టమైతే మళ్ళీ పెళ్లి చేసుకోవచ్చు. మహిళలకు వారి స్వతంత్ర వ్యవహారాలు ఉండవచ్చు. బర్మా, టిబెట్ దేశాల గురించయితే నేను నా సొంత అనుభవం నుండి కూడా చెప్పగలను. అక్కడ సామాజికంగానూ ఇతర సాంఘిక వ్యవహారాల్లోనూ స్త్రీలకు పురుషులతో పూర్తి సమానత్వం ఉంది. నిజానికి పురుషుల కంటే కూడా మహిళలే ఎక్కువ చొరవను, సామర్థ్యాన్ని ప్రదర్శిస్తారు. పురుషులు ఈ వ్యవహారాలనన్నింటినీ సంతోషంగా మహిళలకు అప్పగిస్తారు.

"బుద్ధుడికి మహిళల పట్ల వివక్ష భావం ఉందనీ, పురుషులు మహిళల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎప్పుడూ హెచ్చరికలు చేసేవాడనీ" రచయిత తన వ్యాసంలో

అన్నది నిజమే అయితే బౌద్ధ సమాజంలో మహిళల స్థితి ఈ విధంగా ఉండేది కాదు. గత కాలపు మహా బోధకులలో అందరికంటే ఎక్కువ విశాల హృదయం కలిగిన వాడు, ఉదార స్వభావం ఉన్నవాడు, ఓర్పు కలిగినవాడు అయినందునే భారతదేశపు పుత్రులలోమిగిలిన వారెవ్వరికంటే కూడా ఎక్కువగా భారతదేశం వెలుపల పూజలందుకుంటున్నాడు. అటువంటి బోధకుడికి వివక్షను ఆపాదించడం అంటే అది చాలా తప్పు అంచనా. బుద్ధునిలో వివక్ష స్వభావం ఏమాత్రం లేక పోవటం, అతని ప్రాపంచిక దృక్పథానికున్న విశ్వజనీనత, కుల, వర్ణ, లింగ భేదాలతో నిమిత్తం లేకుండా అతనికి మానవ స్వభావం పట్ల ఉన్న లోతైన అవగాహనలే భారతదేశంలోని గొప్ప సాధువుల్లో కెల్లా అతడికి మాత్రమే ప్రపంచవ్యాప్తంగా ఈ గుర్తింపు లభించడానికి కారణం. (లేకపోతే అసలు అతడు బుద్ధుడిగా (జ్ఞానం పొందినవాడిగా) గుర్తింపు ఎలా పొందుతాడు?) వాస్తవానికి అప్పటిదాకా మనువు చట్టాల బాధితులుగా చాలా అననుకూలమైన పరిస్థితుల్లో ఉండే స్త్రీల విముక్తికి అతడే పునాదులు వేశాడు. ఈ విషయాన్ని రచయిత కూడా ఒప్పుకున్నారు. దానితో మహిళలను తెర వెనక్కు మొట్టమొదట నెట్టివేసింది బౌద్ధులు అని రచయిత ఇచ్చిన వ్యాఖ్యానాన్ని తానే ఖండించుకున్నట్లయింది. గొప్ప సాధువులు కాగలిగే అవకాశం ఒక పురుషుడి కన్నా స్త్రీకే ఎక్కువగా ఉందని చాలా స్పష్టంగా ప్రకటించింది బుద్ధుడే.

బుద్ధుడు ఒక సందర్భంలో రాకుమారి తనకు పంపిన ఆహ్వానాన్ని తిరస్కరించాడు. ఎందుకంటే అప్పటికే అతను ఒక వేశ్య పంపిన ఆహ్వానాన్ని ఒప్పుకొని ఉన్నాడు. ఈ వాస్తవాన్ని గమనించినట్లయితే తొలినాళ్ల బౌద్ధం ఎటువంటి వైఖరి కలిగి ఉండేది అనేది మనకు అర్థమవుతుంది. "ఆమ్రపాలి వంటి ఒక తుచ్ఛమైన" వ్యక్తికి ఇటువంటి గౌరవం దక్కిందని రాకుమారి దిగ్భ్రాంతి పొంది బుద్ధుడిని అక్కడికి వెళ్లవద్దని ఒప్పించడానికి ప్రయత్నం చేసింది. కానీ బుద్ధుడు తన మాటపై నిలబడ్డాడు. ఆ తరువాత ఆమ్రపాలి అతడికి గొప్ప శిష్యురాలై అతడి మెప్పు పొందింది. బుద్ధుడికి ఒకవేళ మహిళల పట్ల వివక్షతాభావమే ఉండి ఉంటే ఈ సందర్భంలో అతడు చూపించి వుండేవాడు.

"పురుషులు మహిళల పట్ల అప్రమత్తంగా ఉండాలని బుద్ధుడు ఎప్పుడూ హెచ్చరికలు చేసేవాడు", అనేది అర్ధ సత్యమే. బుద్ధుడు ఏ సందర్భంలో ఇలా అన్నాడనే విషయాన్ని పూర్తిగా చదివి తెలుసుకునే శ్రద్ధ లేని వాళ్లను తప్పుదారి పట్టించే విషయం ఇది. బుద్ధుడు ఈ హెచ్చరిక "పురుషులందరికోసం" చేయలేదు. భారత సంప్రదాయంలో సన్యాసులు అనుసరించే బ్రహ్మచర్య దీక్షకు కట్టుబడి ఉండడం కోసం వారికి బుద్ధుడు ఈ హెచ్చరిక చేశాడు. బ్రహ్మచర్య దీక్షను బౌద్ధ సన్యాసులు అయినా హిందూ సన్యాసులైన ఒకేలా ఆమోదించి అనుసరించారు. సన్యాసినులు పురుషుల పట్ల కూడా ఇట్లాగే అప్రమత్తంగా ఉండాలని బుద్ధుడు హెచ్చరికలు చేశాడు. కాబట్టి అతడు ఈ హెచ్చరికలు

చేసింది మహిళల పట్ల అతనికి ఉన్న వివక్షతా భావం వల్ల కాదు. పురుషులలోనూ, మహిళల్లోనూ సహజంగా ఉన్న మానవ బలహీనత పట్ల గుర్తెరిగి ఉండటం వల్లనే.

భారతదేశంలోని మహిళల్లో మతసాహిత్యానికి స్వతంత్రంగా గణనీయమైన స్థాయిలో దోహదం చేసింది బౌద్ధ మహిళలే. ఆ కాలంలోని గొప్ప రచయితలతో సరిసమానంగా వీరిని గుర్తించారు. బౌద్ధ సోదరిలు రాసిన పాటలకు మత గ్రంథాల స్థాయిలో గౌరవనీయమైన స్థానం ఇచ్చి వాటికి బుద్ధుడి బోధనల, అతని ప్రముఖ శిష్యుల బోధనల పక్కన ఉంచడం చూసినా ఈ విషయం స్పష్టమవుతుంది.

హిందూ మతము, బౌద్ధము కూడా ఎంతో మంది గొప్ప మహిళలను సృష్టించాయి. గతంలోని, సాధువులు ఆ కాలపు అవసరాలకు అనుగుణంగా, తాము ఎవరికైతే బోధిస్తున్నారో వారు అర్థం చేసుకునే స్థాయికి అనుగుణంగా ఆచారాలను ఏర్పరిచి, బోధనలను ప్రకటించారు. వాటిలో తప్పులెన్నే ప్రయత్నం చేసే బదులు ఎన్నెన్నో గొప్ప సామ్రాజ్యాలు ఉద్భవించి నశించినా ఇప్పటికీ చిరస్థాయిగా నిలిచి ఉన్న భారత మహిళల లోని ఆ గొప్ప మహిళామణులను అనుసరించడానికి ప్రయత్నించాలి. వారి ఆలోచనలు రాజ్యతంత్రం కంటే ఉన్నతమైనవి. వారి హృదయాలు చక్రవర్తుల శక్తి కంటే గొప్పవి.

సావిత్రికి తన భర్త పట్ల ఉన్న అపారమైన ప్రేమ, తెలివితేటల వల్ల మృత్యు రాజైన యముడిని కూడా ఓడించగలిగింది. స్త్రీత్వానికి ఉండే ఉన్నత లక్షణాలకు ఆమె ఒక నమూనాగా నిలిచిపోయింది. ఉపనిషత్తుల్లో జరిగిన వాదోపవాదాల్లో మైత్రేయి, గార్గిలు వినిపించిన గొంతుకలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. మీరాబాయి భక్తి పాటల వలెనే, పద్మిని వీర గాథల వలెనే సాధ్వీలు అయిన బౌద్ధ సోదరీమణులు పాడిన పాటలు కూడా చిరస్థాయిగా నిలిచిపోతాయి.

(హిందూ స్త్రీల ఉత్థాన పతనాలు: దానికి బాధ్యులెవరు? అన్న రచనకు అనుబంధం.)

**అనువాదం: బి.అనురాధ**

**ఇంగ్లిష్ మూలం:** The Position of Women in Hinduism and Buddhism, Vol 17, pg 495, Appendix—II,

# కులనిర్మూలన

"చాతుర్వర్ణ వ్యవస్థను సమర్థిస్తున్న వారు తమ వ్యవస్థలో స్త్రీల కేమౌతుందన్న విషయాన్ని ఆలోచించినట్టు కనబడదు. స్త్రీలు కూడా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్గాలుగా విభజించబడతారా, లేక తమ భర్తల హోదానే పొందుతారా? స్త్రీ యొక్క వర్ణం వివాహం మీద ఆధారపడవలసి ఉంటే, అసలు చాతుర్వర్ణ మూల సిద్ధాంతమే ఎగిరిపోదా? ఒక మనిషి విలువనుబట్టి ఆ మనిషి వర్ణాన్ని నిర్ణయించాలనేది కదా చాతుర్వర్ణ సిద్ధాంతం? విలువనుబట్టి మానవులు నాలుగు వర్ణాలుగా విభజించబడడం అనేది నిజమైన విభజనా? కాక, నామమాత్ర విభజనా? అది కేవలం నామమాత్ర విభజనే అయితే, అది వ్యర్థం. అప్పుడు తమ పద్ధతి స్త్రీలకు వర్తించదని చాతుర్వర్ణ సమర్థకులు ఒప్పుకోవలసి ఉంది. అది నిజమైన విభజన అయితే, దానిని స్త్రీలకు కూడా యధాతథంగా వర్తింపజేయడానికి చాతుర్వర్ణ వాదులు సిద్ధంగా ఉన్నారా? అప్పుడు, పురోహితురాళ్ళను, సైనికురాళ్ళను కలిగి ఉండడానికి వారు సిద్ధపడి ఉండాలి. హిందూ సంఘం ఇప్పుడు ఉపాధ్యాయులను, న్యాయవాదినులను కలిగి ఉండడానికి అలవాటు పడింది. ఇకమీద – సారాకాపు, కసాయి పని మొదలైన వృత్తులలో స్త్రీలను పెట్టడానికి సంసిద్ధం కావాలి. కానీ, పురోహితురాళ్ళు, సైనికురాళ్ళు కావడానికి స్త్రీలను అనుమతించే మగవాడు గొప్ప సాహసవంతుడై ఉండాలి. మరి, చాతుర్వర్ణ పద్ధతిని స్త్రీలకు వర్తింపజేయడం అంటే ఈ పర్యవసానాలు తప్పవు. ఈ ఇబ్బందులన్నీ పరామర్శించి చూసుకొన్న తరువాత, కేవలం మనిషి పుట్టుకతో మూర్ఖుడు అయితే తప్ప, మరొకడెవడూ చాతుర్వర్ణ పద్ధతిని విజయవంతంగా పునరుద్ధరించ గలమనుకొంటాడని నేను భావించను."

**హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణ (పేజి–49) అనువాదం: బోయి భీమన్న**

**ఇంగ్లీష్ మూలం:** On Annihilation of Castes, Vol 1 - Part-1 Chapter XVI pg-61

# ప్రసూతి ప్రయోజన బిల్లు (సంపుటి-2)

డా. అంబేడ్కర్: సర్! ఈ బిల్లు మొదటి పఠనాన్ని బలపరచడానికి నిలబడ్డాను. ఈ సందర్భంగా ఈ బిల్లుకు వ్యతిరేకంగా లేవనెత్తిన కొన్ని అంశాలకు సమాధానం చెప్పదలచాను. గౌరవనీయులైన సాధారణ సభ్యుడు బిల్లుకు వ్యతిరేకంగా మాట్లాడుతూ ఇది "ప్రమాదం" వంటిది, కాదని చెప్పారు. అంటే కార్మికుల నష్టపరిహార చట్టం కింద 'ప్రమాదం' అనే దాన్ని మనం ఎలా అర్థం చేసుకుంటామో ఇది అలాంటిది కాదన్నారు. కాబట్టి ఆ చట్టంలోని సూత్రాన్ని ఈ బిల్లు కింద ప్రయోజనం పొందబోయే స్త్రీలకు వర్తింపచేయరాదన్నారు. సర్! ఇది "ప్రమాదం" కాదని నేనూ అంగీకరిస్తున్నాను. అంతమాత్రాన ఈ బిల్లు కలిగించాలనుకునే ప్రయోజనానికి వాళ్లు అర్హులు కారని అర్థం కాదు. ఈ బిల్లుకు గల ప్రాతిపదిక సూత్రమే పూర్తిగా పక్షపాత వైఖరితో కూడుకున్నది. తల్లి పై ప్రభావం చూపే ప్రసూతి పూర్వ పరిస్థితులు, తర్వాత బిడ్డను పెంచడం అనేవి ఈ బిల్లులో చాలా ముఖ్యమైన విషయాలు. వీటిపై పూర్తి ఏకాభిప్రాయం ఉందని నమ్ముతున్నాను. కాబట్టి సర్! జాతీయ ప్రయోజనాల దృష్ట్యా కాన్పుకు ముందూ తరువాత కూడ తల్లికి కొంత విశ్రాంతి వుండాలి. ఆ సూత్రం పైనే ఈ బిల్లు ఆధారపడింది. అలాంటప్పుడు దాని బాధ్యత ఎక్కువగా ప్రభుత్వంపైనే ఉంటుందని ఒప్పుకోకతప్పదు. ప్రజా సంక్షేమం బాధ్యత ప్రధానంగా ప్రభుత్వానిదే. ఈ వాస్తవం అంగీకరించడానికి నేను సిద్ధంగా వున్నాను. ప్రసూతి సౌకర్యాన్ని ప్రవేశపెట్టిన అన్ని దేశాలలోనూ దానికి సంబంధించి ప్రభుత్వం కొంత బాధ్యత వహించడం చూస్తున్నాము. అయితే స్త్రీని పనిలో పెట్టుకునే ఏ యజమాని అయినా ప్రసూతి సదుపాయాల బాధ్యత నుండి పూర్తిగా మినహాయింపు పొందుతాడని అంగీకరించడానికి నేను సిద్ధంగా లేను. దానికి కారణం ఇది. కొన్ని పరిశ్రమల్లో పురుషులను పెట్టుకోవడం కన్నా స్త్రీలను నియమించడం ఎక్కువ లాభదాయకమని యజమాని స్త్రీలను ఉద్యోగంలో చేర్చుకుంటాడు. అందులో సందేహం లేదు. పురుషుల్ని నియమించడం కన్నా స్త్రీలను పెట్టుకోవడం వల్ల దామాషా రీత్యా హెచ్చు లాభం పొంద కలుగుతున్నాడు. పురుషుల బదులు స్త్రీలను పెట్టుకోవడం వల్ల ప్రత్యేక లాభం వస్తున్నపుడు కొంతవరకన్నా యజమాని ప్రసూతి వేతన బాధ్యత వహించాలని చెప్పడం పూర్తిగా సమంజసం. కాబట్టి ప్రసూతి బత్తెం విషయంలో ప్రభుత్వంపై కొంత బాధ్యత వేయవలసి ఉన్నప్పటికీ, ఇప్పుడున్న పరిస్థితుల్లో యజమానిపై కూడా కొంత బాధ్యత పడడం సరియైందనే భావిస్తున్నాను. అందువల్ల నేను ఈ బిల్లును బలపరుస్తున్నాను.

ఈ బిల్లు ఫ్యాక్టరీలకు మాత్రమే వర్తిస్తుందని, ఇతర పరిశ్రమలకు, వ్యవసాయ వృత్తులకు వర్తించదని చెప్పారు. దానికి సమాధానం చెప్పటం సులభం. ఒక స్త్రీ ఆరోగ్యానికి

భంగకరమైనటువంటి పరిస్థితులు ఉండే పరిశ్రమలకు మాత్రమే ఈ సూత్రం వర్తిస్తుంది. ఫ్యాక్టరీలలో స్త్రీ ఆరోగ్యానికి హాని కలిగించే ప్రమాదాలు లేక పరిస్థితులు ఉంటాయి కాని వ్యవసాయ తదితర వృత్తులలో ఆ పరిస్థితులు లేవు. ఈ కారణం వలన ఆ చట్టాన్ని సామాన్యంగా ఫ్యాక్టరీలకు మాత్రమే పరిమితం చేస్తారు. ఉదాహరణకు కార్మికుల నష్టపరిహార చట్టం విషయంలో కూడ ఇదే చెప్పొచ్చు. ఫ్యాక్టరీలలో సంభవించే ప్రమాదాలకు మాత్రమే ఈ చట్టం వర్తిస్తుంది. కనుక ఆ శాసనం ఫ్యాక్టరీలకే పరిమితమైంది. ఇతర వృత్తులకు కాదు. దీనివల్ల పరిశ్రమలపై పడే భారం వేతనాలు తగ్గడానికి కారణమవుతుందని గౌరవనీయులైన సాధారణ సభ్యుడు చెప్పారు. అది వేతనాలు తగ్గడానికి కారణం అవుతుందని నేను అనుకోవడం లేదు. ఒకవేళ అలా జరిగినా పరిశ్రమల మీద పడే ఈ అదనపు భారం కొంత వరకైనా వేరే చోటికి బదిలీ అవుతుంది. కాబట్టి గౌరవనీయులైన సాధారణ సభ్యునికి అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు. ఇది శాసన రూపం పొందగానే ఈ భారం బహుశ వినియోగదార్ల మీద పడుతుంది. ఉత్పత్తి దారులైన స్త్రీలకు లాభదాయకమైనపుడు వారు తయారుచేసే వస్తువుకు ఎక్కువ ధర చెల్లించడానికి సమాజానికి అభ్యంతరం ఉండకూడదు.

ఈ శాసనం బొంబాయి రాష్ట్రానికే వర్తింపజేయటం న్యాయం కాదని భారతదేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా దీన్ని వర్తింపచేయాలని అన్నారు. సర్! నామనవి ఏమంటే ఈ శాసనం బ్రిటిష్ ఇండియా మొత్తానికి వర్తింపజేశారనుకోండి. ఎవరో లేచి "ఈ బిల్లును ఇండియాకే ఎందుకు పరిమితం చేయాలి? మిగతా దేశాలతో పోల్చినపుడు ఇండియాకు నష్టం కలుగుతుంది కాబట్టి ఈ బిల్లులోని సూత్రాన్ని మొత్తం ప్రపంచం ఆమోదించే దాకా ఆగుదాం. అప్పుడు అందరం సమానమవుతాం" అని అనకూడదని ఏముంది? కాబట్టి ఈ వాదనల్లో పస లేదు. ఈ బిల్లు వల్ల వచ్చే ప్రయోజనాలను బొంబాయి రాష్ట్రంలోని ఫ్యాక్టరీల్లో శ్రమించే పేద స్త్రీలకు వర్తింప జేయాలని నా విన్నపం.

**అనువాదం: బి. అనురాధ**

**ఇంగ్లిష్ మూలం:** Maternity Benefit Bill, Vol 2, pg 166

# జనన నియంత్రణ చర్యల గురించి (సంపుటి-2)

ప్రస్తుత జీవన పోరాటం సకాలంలో పెళ్లి చేసుకోవడం అనేది చాలామందికి అసంభవంగా చేస్తోంది. అందువల్ల అది వారిని రకరకాలైన వ్యాధులకు, అలవాట్లకు గురిచేస్తూ ఉంది. అనారోగ్య పరిస్థితుల్లో పిల్లల్ని కనాల్సి రావడం వల్ల కానీ, వెంట వెంట జరిగే కాన్పుల వల్ల కానీ చాలామంది స్త్రీలు జీవచ్ఛవాలుగా మారుతున్నారు. కొంతమంది వాళ్ల ప్రాణాల్నే పోగొట్టుకొంటున్నారు. అవాంఛిత జననాలను నిరోధించేందుకు గర్భస్రావం చేసుకొనే ప్రయత్నాల వల్ల స్త్రీల ప్రాణాలమీద భారీగా ప్రభావం పడుతోంది. అవాంఛిత పిల్లలు తరచుగా తల్లుల నిర్లక్ష్యానికి గురవుతారు. అందువల్ల వాళ్లు సంఘానికి బరువై పోతుంటారు. రోగ గ్రస్తులైన వారి వల్ల కలిగే అనారోగ్య / వికలాంగ సంతతి వల్ల సమాజం మరింత క్షీణిస్తుంది. ఈ విపత్తులన్నింటినీ నివారించడానికి జనన నియంత్రణే ఏకైక మార్గం. అనవసరమైన గర్భ ధారణల నుంచి సమాజం ఏ విధంగానూ లాభం పొందదు. తల్లిదండ్రులు కోరుకోవడం వల్ల పుట్టిన పిల్లలు మాత్రమే సమాజానికి ప్రయోజనకరంగా ఉంటారు. అందువల్ల ప్రతి స్త్రీకి కూడా చాలా సులభంగా గర్భనిరోధక సాధనాలను అందుకునే అవకాశం ఉండాలి.

.................వైద్యులు ఒకరు వ్యాఖ్యానించినట్టు, స్త్రీలు అనుభవించే పురిటినొప్పులను కానీ పురుషులు భరించవలిసి వస్తే జీవితంలో ఒక్కరి కంటే ఎక్కువ పిల్లల్ని కనడానికి ఏ మగవాడూ సిద్ధపడడు.

**అనువాదం: బి. అనురాధ**

**ఇంగ్లిష్ మూలం:** On Measures for Birth Control, Vol 2, pg 264, Appendix I

# భారత రాజ్యాంగ సంస్కరణల పై సంయుక్త కమిటీ ముందు ఇచ్చిన సాక్ష్యం

భారత మహిళల ఓటుహక్కుపై ఏర్పడిన బ్రిటిష్ కమిటీ తరపున లేడీ లేటన్, శ్రీమతి ఓ.స్ట్రేసీ, సర్ ఫిలిప్ హర్టోగ్

డా.అంబేద్కర్ : నేను ఒక ప్రశ్న అడగాలని అనుకుంటున్నాను. నా అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారో లేదో నాకు తెలియదు కానీ మహిళలకు ఓటుహక్కు ఇవ్వాలని మీరు ఒత్తిడి తెస్తున్నప్పుడు భారతీయ సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన మహిళలకు ఓటుహక్కు లభించే విధంగా ఓటు పద్ధతిని రూపొందించాలని మీరూ కోరుకుంటున్నట్లు నేను భావిస్తాను. కేవలం ఉన్నత వర్గాలకు మాత్రమే లేదా కేవలం మధ్య తరగతి వర్గాలకు లేదా అట్టడుగు వర్గాలకు చెందిన మహిళలకు మాత్రమే ఓటుహక్కు ఇవ్వనక్కరలేదని, వారివారి వర్గాల జనాభాకు తగినట్లుగా ఓటర్ల జాబితాలో చేర్చిన మహిళల సంఖ్య ఉండాలని మీరు కూడా కోరుకుంటున్నారని నేను భావిస్తున్నాను.

లేడీ లేటన్ : అవును. ఆచరణ సాధ్యమైనంత మేరకు తప్పకుండా.

డా.అంబేద్కర్ : నలుగురికి ఒకరు లేక అయిదుగురికి ఒకరు వంతున గణిత శాస్త్ర నిష్పత్తిని మీరు కోరుకుంటున్నారని అనుకోవడంలేదు. అయితే, ఆ నిష్పత్తితో పాటు, అన్నివర్గాలకు చెందిన అందరు మహిళలను ఓటర్ల జాబితాలో చేర్చాలని కూడా మీరు కోరుకుంటున్నారా?

లేడీ లేటన్ : తప్పకుండా! వీలైనంతమేరకు అలాగే జరగాలని కోరుకుంటున్నాం. పట్టణ, గ్రామీణ ఓటర్లకు, వివిధ వర్గాల వారికి తగినంత ప్రాతినిధ్యం లభించాలని కోరుకుంటున్నాం.

డా.అంబేద్కర్ : విద్యార్హతను కాని, ఆస్తి అర్హతను కాని ఎక్కువ స్థాయిలో నిర్ణయించినట్లయితే, భారతీయ సమాజంలోని ఒకే ఒక వర్గం మహిళలకు మాత్రమే ఓటర్ల జాబితాలో స్థానం లభిస్తుందని మీరూ అంగీకరిస్తారని అనుకుంటున్నాను.

లేడీ లేటన్ : అవును. అదనంగా మరో విషయం కూడా చెప్తున్నాను. పరిపాలనాపరంగా సాధ్యమైతే ఆ విషయాన్ని మనం స్వాగతించాలి. ఎక్కువ ఆస్తి కలిగిన వర్గానికి చెందిన వారి భార్యలకే కాక, తక్కువ ఆస్తి కలిగిన వర్గం వారి భార్యలకు కూడా ఓటుహక్కు కల్పించాలని మా వినతిపత్రంలో మేం గట్టిగా కోరాం.

డా. అంబేద్కర్ : ఒక విషయం తెలుసుకోవాలని నేను ఆదుర్దాగా ఉన్నాను. మీ ప్రాధాన్యత కేవలం పురుషులకూ స్త్రీ లకూ మధ్య నిష్పత్తికి మాత్రమేనా లేక ఆ స్త్రీ ఓటర్లు జనాభాలోని అన్ని వర్గాలకు సమనిష్పత్తిలో చెంది ఉండేలా చూసేందుకు కూడా ప్రాధాన్యం ఇస్తారా?

లేడీ లేటన్ : ఈ రెండు రకాలకు ప్రాధాన్యం ఇస్తున్నాము. అయితే, ప్రస్తుతానికి మహిళల ప్రయోజనాలకు ఈ విధంగా తగిన రక్షణ లభిస్తుందని మేం భావిస్తున్నాం. అన్ని జిల్లాలలోనూ తగినంతమంది ఓటుహక్కు ఉన్న మహిళలు ఉన్నట్లయితే, ఓటుహక్కులేని మిగిలిన మహిళలకు వారే ప్రాతినిధ్యం వహిస్తారు కనుక, ఓటుహక్కు లేని మహిళల సంఖ్య వీలైనంత తక్కువగా ఉండేటట్లు చూడాలని మేం భావిస్తున్నాం. అది కూడా వీలయినంత త్వరగా ప్రవేశపెట్టాలని చూస్తున్నాం. ఆచరణ సాధ్యమయ్యేటట్లు అయితే వయోజన ఓటుహక్కును అడగడానికి మేం సిద్ధంగానే ఉన్నాం. అయితే, పరిపాలనాపరంగా అది సాధ్యం కాదని మాకు తెలుసు.

డా. అంబేద్కర్ : ఇదే విషయాన్ని నేను మరొక విధంగా చెప్పనా? సామాజిక సంక్షేమ విషయాలలో మహిళలందరికీ ఆసక్తి ఉంటుందనే విషయం పూర్తి వాస్తవమే. అయితే, సామాజిక సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే, ధనం ఖర్చవుతుందని, పన్ను విధింపు కూడా అవసరమవుతుందని మీరు కూడా గుర్తిస్తారు.

లేడీ లేటన్ : అవును. నాకు ఆ విషయం పూర్తిగా తెలుసు.

డా. అంబేద్కర్ : అయితే, అందరు మహిళలు అదే వైఖరి అవలంబిస్తారని చెప్పలేం. తమతమ వర్గాల ప్రాతిపదికన వారు విభేదించవచ్చు.

లేడీ లేటన్ : అవును. అందుకు నేను మీకు రెండు సమాధానాలు ఇవ్వగలను. అన్నిటికంటే ముందు విద్యకు సంబంధించిన అంశాన్ని తీసుకోండి. విద్యపై ఖర్చు చేయడానికి మీ దగ్గర కొంత డబ్బు ఉందనుకోండి. ఆ డబ్బును పురుషులపై, స్త్రీలపై సమానంగా ఖర్చు చేయాలని ప్రతి వర్గానికి చెందిన మహిళలు అంగీకరిస్తారు. తగినంత ఒత్తిడి తేగల మహిళలు లేనట్లయితే, బాలికల విద్యపై కన్నా ఎక్కువ బాలుర విద్య పై ఎక్కువమొత్తం ఖర్చు పెట్టుకుంటూ వెళ్తారు. మొదటగా పరిశీలించవలసిన విషయాలలో అది ఒకటి. మరొక విషయం కూడా నేను చెప్తున్నాను. విద్యపై అధికమొత్తం డబ్బును ఖర్చు చేయాలని సంక్షేమ విషయాల్లో చురుకైన పాత్ర వహిస్తున్న అన్నివర్గాల మహిళలు పట్టుపడుతున్నారు.

ప్రస్తుత సమయంలో అత్యధిక వర్గాలకు చెందిన మహిళలు అదే వైఖరిని అవలంబిస్తారని మీరు నిర్భయంగా నమ్మవచ్చని నేను అనుకుంటున్నాను. అయితే, ఓటు హక్కును వీలైనంతమందికి కల్పిస్తే నేను ఎంతో సంతోషిస్తాను. అందువల్లనే విద్యార్హతకు నేను ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాను. ఒత్తిడి తేగలిగినంత తెలివితేటలు ఉన్న ఏ మహిళ అయినా సముచితమైన కాల పరిమితిలోపల తనను తాను విద్యావంతురాలిగా మలచుకోగలదు. ఓటుహక్కున్న వర్గ మహిళలు ఓటుని వినియోగించలేదని ఏ వర్గ మహిళలు అయినా బలంగా అభిప్రాయపడితే వారికి అక్షరాస్యత కూడ ఉంటే వారి చేతుల్లో ఆయుధం ఉన్నట్లే, ఈ కారణంతోనే నేను అక్షరాస్యతకు ఎప్పుడూ చాలా సుముఖంగా ఉంటాను. ఈ కారణంతోనే భారతదేశంలో సంఘటితమైన మహిళలు అందరూ అక్షరాస్యతను కోరుకుంటూ ఉంటారు.

డా. అంబేద్కర్ : నా అభిప్రాయాన్ని మీరు అర్థం చేసుకున్నంత మేరకు నేను సంతృప్తి చెందాను.

సర్ ఫిలిప్ హర్టోగ్: అక్షరాస్యత గురించి మిమ్ములను ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను. మహిళలకు ఓటుహక్కు కల్పించే విషయంలో అక్షరాస్యతను ఒక పరీక్షగా అవలంబించడంలో ఏవో పరిపాలనాపరమైన ఇబ్బందులు ఉన్నాయని అంటున్నారు. వాటి గురించి మా దగ్గర ఎటువంటి సమాచారం లేదు. అయితే, నేను అర్థం చేసుకున్న ఆ ఇబ్బందుల్లో అన్నిటికంటే మొదటిది ఏమిటంటే, అవసరమైన విద్యార్హత ఒక మహిళకు ఉందో లేదో రిజిస్ట్రేషన్ అధికారి తెలుసుకోవడానికి ఉపకరించే సర్టిఫికెట్లు ఏమీ లేవని అంటున్నారు. అందువల్ల, ఆ అధికారి తనకు తోచిన విధంగా వ్యవహరించి ఆ మహిళను ఓటర్ల జాబితాలో చేర్చవచ్చు, చేర్చకపోవచ్చు. పరిస్థితి అలా ఉన్నప్పుడు ప్రతిపాదనలో సూచించిన విధానాన్ని మనం అనుసరించవలసి ఉంటుంది. ఆ మహిళ అక్షరాస్యతాస్థాయిని గ్రామాధికారి పరిశీలించాలని, ఆయన ఇచ్చే సర్టిఫికెట్ పై తాసిల్దారు సంతకం చేయాలని సూచించారు. ఇందులో ఉండే పరిపాలనాపరమైన ఇబ్బందిని ఈ విధంగా సూచించారని నేను భావిస్తున్నాను. ఒక గ్రామంలోని మహిళ అక్షరాస్యురాలో, కాదో తెలుసుకోవడానికి గ్రామాధికారి ఆమె వద్దకు ఎలా వెళ్లాలి? ఓటు కావాలనుకునే మహిళే తనంతట తాను గ్రామాధికారి వద్దకు వెళ్లి, దరఖాస్తు పెట్టుకోవాల్సి ఉంటుందని మీరు అంటారా?

సర్ ఫిలిప్ హర్టోగ్: సాధ్యమయ్యే విధానం అది ఒక్కటేనని నేను భావిస్తున్నాను. "ఓటర్ల జాబితాలో నా పేరును చేర్చాలని నేను కోరుకుంటున్నాను. నేను అక్షరాస్యురాలిని. అక్షరాస్యతా పరీక్షకు నేను సిద్ధం", అని స్వయంగా కాని, తన భర్త ద్వారా కాని చెప్పగలిగేంత ఆసక్తి మహిళకు ఉండాలి.

బట్లర్: దానికి, దరఖాస్తుకి తేడా ఏమిటి?

లేడీ లేటన్: అక్షరాస్యతకు సంబంధించిన దరఖాస్తుకు మా విజ్ఞాపన పత్రంలో అభ్యంతరం చెప్పామని నేను అనుకోవటంలేదు. మేం అభ్యంతరం చెప్పము. ఏ విద్యార్హత అయినా కలిగి ఉండి, అక్షరాస్యులుగా అప్పటికే గుర్తింపు తెచ్చుకున్న ప్రజలను ఏ పేచీ లేకుండా ఓటర్ల జాబితాలో చేర్చాలని మేం భావిస్తున్నాం. దానికి భిన్నమైన పరిస్థితిలో దరఖాస్తు చేసుకోవాలి.

డా. అంబేద్కర్ : అభ్యంతరకరంగా ఉండడానికి అవకాశం ఉన్న కుటుంబాలలో జరిపిన విచారణల ప్రాతిపదికన ప్రస్తావించిన ఈ అభ్యంతరం నిజంగా మళ్లీ తలెత్తదా?

సర్ ఫిలిప్ హర్టోగ్: సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఇచ్చిన రెండు సమాధానాలను ఇక్కడ ప్రస్తావించటం సముచితమని నాకు తోస్తున్నది. ఎందుకంటే, డా. అంబేద్కర్ లేవనెత్తిన అంశంతో వీటికి ప్రత్యక్ష సంబంధం ఉంది. 7437వ ప్రశ్నకు సెక్రటరీ ఆఫ్ స్టేట్ సమాధానం ఇస్తూ ఇలా చెప్పారు "భవిష్యత్తులో ముందు తరాల బాలికలు లేదా మహిళల విషయంలో ఎన్నికల కోసం విద్యా సంబంధమైన రిజిస్టర్లను ఉపయోగించుకోవటం ఇప్పటికంటే చాలా తేలికయిపోతుంది. అయితే ఇప్పటికి ఒక్కసారి కూడా ఈ పద్ధతిని అమలు చేయని రాష్ట్రాలలో మాత్రం మొదటిసారిగా అటువంటి రిజిస్టర్లను ఉపయోగించుకోవటంలో చాలా ఇబ్బందులు ఎదురు కావచ్చు". 7214వ ప్రశ్నకు సెక్రటరీ ఆఫ్ స్టేట్ చెప్పిన సమాధానాన్ని ఈ సమాధానంతో కలిపి చదువుకోవాలని మిమ్ములను కోరుతున్నాను. మార్కెస్ ఆఫ్ శాలిస్‌బరీ కి సమాధానం ఇస్తూ, పార్లమెంట్ చట్టంలో ఓట్ల పద్ధతికి సంబంధించి 10 సంవత్సరాలపాటు ఎటువంటి మార్పూ చేయవద్దని తాను సూచిస్తున్నట్లు చెప్పారు. అందువల్ల, రెండవ, మూడవ, లేదా నాలుగవ ఎన్నికలు 10 సంవత్సరాల లోపే వచ్చినపక్షంలో రెండవ, మూడవ, లేదా నాలుగవ ఎన్నికలకు రిజిస్టర్ ఉపయోగించడంలో పెద్దగా ఉపయోగం ఉండదు. ఇప్పుడు సంఖ్య సమస్య గురించి చూద్దాం. అక్షరాస్యులైన మొత్తం మహిళల సంఖ్యను లోథియస్ నివేదికలో పన్నెండున్నర లక్షలుగా అంచనా వేశారు. ఆ నివేదికలోని 86 వ పేజీలో ఈ అంశం ఉన్నది. వారిలో

3,45,000 మంది మహిళలు మద్రాసులో ఉన్నారు. ఈ మహిళలకు సంబంధించి ఎటువంటి ఇబ్బందీ లేదు. ఇక మిగిలిన భారతదేశం అంతటికీ కలిపి 8,75,000 మంది మాత్రమే ఉన్నారు. ఒక ఎన్నికకు మద్రాసులోని 3,45,000 మంది మహిళలను ఓటర్ల జాబితాలో చేర్చడం సాధ్యమవుతున్నప్పుడు, మిగిలిన భారతదేశం అంతటికీ 8,75,000 మంది మహిళలను ఓటర్ల జాబితాలో చేర్చడం అసాధ్యం ఎందుకవుతుంది?

**అనువాదం: బి. అనురాధ**

**ఇంగ్లిష్ మూలం:** Vol-2 Evidence before the Joint Committee on Indian Constitutional Reform, Pg 696, Lady Layton, Mrs. O. Stracey and Sir Philip Hartog, on behalf of the British Committee for Indian Women's Franchise.

# సంస్కర్తలు వారి భవితవ్యం

ఏ విధంగా అయితే బుద్ధుడు శూద్రులను, కడజాతి మనుషులను భిక్షుకులుగా చేయడం ద్వారా బౌద్ధమతంలో అత్యున్నత స్థాయికి వారి స్థాయిని పెంచాడో అదేవిధంగా స్త్రీల స్థాయిని కూడా పెంచాడు. ఆర్యుల సమాజంలో శూద్రులను ఏ స్థానంలో ఉంచారో స్త్రీలను కూడా అదే స్థానంలో ఉంచారు. ఆర్య సాహిత్యం అంతటా కూడా శూద్రులను, స్త్రీలను ఒకే స్థాయికి చెందిన వారుగా పేర్కొన్నారు. సన్యసించడం ఒక్కటే మోక్షానికి తెరిచి ఉన్న మార్గం. కానీ వారికి సన్యాసం పుచ్చుకునే హక్కుని నిరాకరించారు. స్త్రీలు, శూద్రులు మోక్ష పరిధికి బయటివారిగానే లెక్క. శూద్రుల విషయంలో లాగానే బుద్ధుడు స్త్రీల విషయంలో కూడా ఆర్యులు పెట్టుకున్న నియమాలను ఉల్లంఘించాడు. బౌద్ధమతంలో ఏ విధంగా అయితే శూద్రుడు భిక్షుకుడు కాగలుగుతున్నాడో అదేవిధంగా స్త్రీ పరివ్రాజిక కాగలిగింది. ఇది స్త్రీలను ఆనాటి ఆర్య సమాజం దృష్టిలో సంభవమైనంత అత్యున్నత స్థాయికి తీసుకుపోయింది.

**అనువాదం: బి. అనురాధ**

**ఇంగ్లిష్ మూలం:** Reformers and their Fate, Vol. 3, pg 221

# బ్రాహ్మణ మత విజయం

బౌద్ధమత ప్రాబల్యం బాగా ఉన్న రోజుల్లో శూద్రులు, స్త్రీలు సాధించిన ఉన్నతి బ్రాహ్మణులకు కోపాన్ని తెప్పించడమే కాకుండా సహింపరానిదిగా చేసిందని శూద్రులకూ స్త్రీలకూ వ్యతిరేకంగా చేసిన చట్టాలను చూస్తే అర్థం అవుతుంది. వారి పవిత్ర సాంఘిక వ్యవస్థను అది ఆసాంతం తలకిందులు చేసింది. మొదటివారిని చివరకు, చివరివారిని మొదటికి మార్చింది. బ్రాహ్మణులు రాజకీయ బలాన్ని ఉపయోగించి శూద్రుల, స్త్రీల స్థాయిని తిరిగి వెనుకటి స్థితికి తగ్గించేందుకు ఎంత పట్టుదలగా ప్రయత్నించారో మనువు రచించిన చట్టాలు వివరిస్తాయి. విజయం సాధించిన బ్రాహ్మణిజం పూర్వ ఆశయాలను అంటే బానిసత్వం వంటి వాటిని తిరిగి అమలులోకి తెచ్చేందుకు శూద్రులపైనా, స్త్రీలపైనా విరుచుకుపడింది. శూద్రులను, స్త్రీలను బానిస వర్గాలుగా చేయడంలో సఫలమైంది. శూద్రులు మిగతా మూడు వర్ణాలకు బానిసలైతే, స్త్రీలు వారి భర్తలకు బానిసలయ్యారు. బౌద్ధమతంపై విజయం సాధించిన తర్వాత బ్రాహ్మణులు చేసిన అకృత్యాలలో కెల్లా యిది అత్యంత ఘోరమైంది. వర్గాధిపత్యం కోసం అక్రమ విజేతలు కొన్ని వర్గాలను హీనపర్చేందుకు చేసిన ఈ అకృత్యాలకు సరితూగే చారిత్రక సంఘటన ప్రపంచంలో యింకొకటి లేదు. బ్రాహ్మణమతం సాగించిన ఈ అధఃకరణ (వర్గాలను హీనపరచే కార్యక్రమం) విశ్వరూపం ఏమిటో దురదృష్టవశాత్తూ పూర్తిగా అర్థం చేసుకోవడం లేదు. స్త్రీ, శూద్ర అనే రెండు చిన్నమాటల వెనక దానిని దాచిపెట్టారు. దీనిని అర్థం చేసుకోదలిచినవారు ఈ రెండు మాటల వెనుక ఉన్న సంఖ్య గురించి ఆలోచిస్తే దాని విస్తృతి గురించి అర్థమవుతుంది. ఇది ఎంతమంది ప్రజలకు వర్తిస్తుంది? జనాభాలో స్త్రీలు సగభాగం ఉంటారు. మిగిలిన దాంట్లో శూద్రుల సంఖ్య మూడింట రెండు వంతులకు తక్కువ కాదు. ఈ రెండు వర్గాలు కలిస్తే జనాభాలో దాదాపు 75 శాతం వుంటుంది. ఇంత పెద్ద మొత్తంలో వున్న ప్రజలను బ్రాహ్మణమతం శాశ్వతమైన బానిసత్వానికీ, భ్రష్టతకూ గురిచేసింది. ఈ భ్రష్టత్వం వల్లనే 75 శాతం మంది ప్రజలు జీవించడానికి గల హక్కును, స్వేచ్ఛను, సుఖ జీవనయత్నావకాశాలను కోల్పోయి తద్వారా భారతదేశం మృత జాతికాకపోయినా, క్షీణ జాతిగా మారింది.

**అనువాదం: బి. అనురాధ**

**ఇంగ్లిష్ మూలం:** The Triumph of Brahmanism, Vol 3, pg 316

# అంటరానితనం - అరాచకత్వం: సంపుటి 5

హిందువుల బావి నుండి అంటరానివారు నీళ్ళు తోడుకోవటానికి ధైర్యం చేస్తే వారి మీద హిందూ స్త్రీలు కూడా దాడి చేయడానికి సంశయించరనేది ఒక వాస్తవం. 1932 ఫిబ్రవరి 26 న "ప్రతాప్" పత్రికలో ప్రచురించిన వార్తను పోల్చి చూద్దాం.

"1932 ఫిబ్రవరి 19 వ తేదీన పూల్ బజ్వాన్ గ్రామంలో ఒక విషాద సంఘటన చోటు చేసుకుంది. 1932 జనవరి 13 వ తేదీన మహాశయ రామ్ లాల్, అతని మిత్రుడు పండిట్ బన్సీలాల్ లను ఏ బావి దగ్గరైతే కొందరు రాజపుట్‌లు దుడ్డుకర్రలతో కొట్టారో అదే చోట మహాశయ రామ్‌లాల్ నీళ్ళు తోడుకోవడానికి వెళ్ళినపుడు జరిగింది. అప్పుడు ఒక రాజపుట్ స్త్రీల గుంపు కర్రలు, బ్యాట్లు పట్టుకొని వచ్చి మహాశయని ఎంత భయంకరంగా కొట్టారంటే వర్ణించడం కష్టం. వాళ్ళు కొట్టడం పూర్తయ్యే సరికి అతని శరీరం అంతా రక్తమయం అయిపోయింది. అప్పుడు అతనిని ఫుక్ లియాన్ ఆసుపత్రిలో చేర్చారు."

**అనువాదం: బి. అనురాధ**

**ఇంగ్లీష్ మూలం:** Untouchability and lawlessness, Vol 5, pg 37, సంపుటి 17: అనుబంధం–II

# రాముని రహస్యాలు

....................ఇక తన స్వంత భార్య సీత పట్ల రాముడు ఎలా ప్రవర్తించాడో పరిశీలించండి. సుగ్రీవుడు, హనుమంతుడు సమకూర్చిన సైన్యం సహాయంతో రాముడు లంకపై దండెత్తాడు. వాలి సుగ్రీవుల అన్నదమ్ముల విషయంలో ఎంత నీచమైన పాత్ర వహించాడో లంకలో కూడా అదే చేశాడు. రావణున్ని, అతని కొడుకునూ చంపి విభీషణుణ్ణి రాజును చేస్తానని వాగ్దానం చేసి అతని సహాయం తీసుకున్నాడు. రాముడు రావణుణ్ణి, అతని కుమారుడైన ఇంద్రజిత్తును హతమార్చాడు. యుద్ధానంతరం రాముడు చేసిన మొదటి పని ఏమంటే రావణునికి సకల మర్యాదలతో దహనక్రియలు జరిపించడం. తర్వాత విభీషణునికి పట్టం కట్టడంలోనే ఆసక్తి చూపాడు. పట్టాభిషేకం అయిపోయిన తర్వాత సీత దగ్గరకు హనుమంతుణ్ణి పంపాడు. అదయినా తనూ, లక్ష్మణుడూ, సుగ్రీవుడూ ఆరోగ్యంగా, క్షేమంగా వున్నామనీ తాము రావణుణ్ణి హతమార్చామనీ చెప్పడానికే.

రావణ సంహారానంతరం రాముడు మొదట సీత దగ్గరకు వెళ్ళి వుండవలసింది. కాని అతను వెళ్ళలేదు. సీతపట్ల కంటే విభీషణుని పట్టాభిషేకం పట్ల ఎక్కువ ఆసక్తి కనపరిచాడు. పట్టాభిషేకం అయిపోయిన తర్వాతయినా తాను స్వయంగా వెళ్ళలేదు. హనుమంతుణ్ణి పంపాడు. సరే. ఏ సందేశాన్ని ఇచ్చి పంపాడు? ఆమెను తీసుకుని రమ్మని హనుమంతుడితో చెప్పలేదు. తాను ఆరోగ్యంగా, సంతోషంగా వున్నానని మాత్రమే చెప్పమన్నాడు. 'రాముణ్ణి చూడాలని నాకు ఉన్నది' అని సీత హనుమంతుడితో చెప్పుకోవలసి వచ్చింది. రావణుడు ఎత్తుకుపోయి పది నెలలకు పైగా బంధించి ఉంచిన తన స్వంత భార్యను చూసుకోవడానికి రాముడు వెళ్ళలేదు. సీతనే అతని దగ్గరకు తీసుకువచ్చారు. సీతను చూడగానే రాముడు ఆమెతో ఏమన్నాడనుకున్నారు? వాల్మీకి వ్రాసి వుంచిన ప్రత్యక్ష ప్రమాణమే గనుక లేకుండా ఉంటే లంకలో రాముడు సీతను కలుసుకున్నప్పుడు అన్న మాటలు చూస్తే ఎన్నో బాధలు పడిన భార్యను చూసి ఏమాత్రం జాలి, దయ కలిగిన మనిషయినా ఆ విధంగా మాట్లాడతాడంటే మనం నమ్మడానికి చాలా కష్టమయ్యేది. రాముడు సీతను ఇలా సంబోధించాడు. (యుద్ధకాండ – సర్గ 115, శ్లోకాలు: 1–23) "నిన్ను చెరబట్టిన నా శత్రువుని యుద్ధంలో జయించి నిన్ను కొల్లగొట్టుకు వచ్చాను. నా గౌరవాన్ని నిలబెట్టుకున్నాను. నా శత్రువుని శిక్షించాను. నా వీర పరాక్రమాన్ని ప్రజలు తిలకించారు. నా శ్రమకు ఫలితం దొరికిందని నాకు చాలా సంతోషంగా ఉన్నది. రావణుణ్ణి హతమార్చడానికి, కళంకాన్ని తుడిచివేసుకోవడానికి నేనిక్కడకు వచ్చాను. నీ కోసం నేను ఈ శ్రమ తీసుకోలేదు."

సీత పట్ల రాముని ప్రవర్తనకంటే క్రూరమైనది మరొకటి ఏదయినా ఉంటుందా? అక్కడితో రాముడు ఆగలేదు. ఆమెతో ఇంకా ఇలా అంటాడు:

"నీ శీలాన్ని శంకిస్తున్నాను. రావణుడు నిన్ను ఖచ్చితంగా చెరిచి ఉంటాడు. నిన్ను చూస్తుంటేనే నాకు అసహ్యం వేస్తున్నది. ఓ జనకుని కూతురా! నీ ఇష్టమొచ్చిన చోటుకి వెళ్ళిపోనిస్తాను. నీతో నాకే సంబంధమూ లేదు. నిన్ను తిరిగి జయించుకున్నాను. నాకు తృప్తిగా వున్నది. ఎందుకంటే నా లక్ష్యం అదే. నీ అంత సౌందర్యవతి అయిన స్త్రీని అనుభవించకుండా రావణుడు విడిచి పెట్టివుంటాడని నేను అనుకోవడంలేదు."

సహజంగానే సీత రాముణ్ణి నీచుడు, అధముడు అని అన్నది. "హనుమంతుణ్ణి నా దగ్గరకు పంపినప్పుడే రావణుడు ఎత్తుకుపోయాడు కాబట్టి నిన్ను నేను విడిచి పెట్టేస్తున్నానని కబురుచేసి వున్నట్లయితే ఆత్మహత్య చేసుకొని, నీకీ శ్రమ లేకుండా చేసేదానిని కదా?" అన్నది. అతనికేమీ మాటరాకుండా పాతివ్రత్యాన్ని నిరూపించుకుంటానని ప్రతిజ్ఞ చేసింది. అగ్నిప్రవేశం చేసి పునీతురాలుగా బయటకు వచ్చింది. ఈ రుజువుతో దేవతలు సంతృప్తిచెంది సీత పరమపావని అని ప్రకటించారు. అప్పుడు ఆమెను అయోధ్యకు తీసుకువెళ్ళడానికి రాముడు అంగీకరించాడు.

అయోధ్యకు తిరిగి తీసుకువచ్చిన తర్వాత అయినా ఆమెను ఏమి చేశాడు. అతను రాజు అయ్యాడు. ఆమెను పట్టమహిషిని గావించాడు. అంతే, కాని రాముడు రాజుగానే వుండిపోయాడు. చాలా తొందరలోనే సీత రాణిగా కొనసాగలేకపోయింది. ఈ సంఘటన రామునికి ఎంతో అపఖ్యాతిని తెచ్చి పెట్టింది. సీతారాముల పట్టాభిషేకం అయిన కొన్ని రోజులకు సీత గర్భవతి అయిందని వాల్మీకి రామాయణంలో చెప్పాడు. ఆమెను గర్భవతిగా చూసిన కొందరు దుర్మతులు ఆమె లంకలో వున్నప్పుడు రావణుని వలనే గర్భం దాల్చిందని నిందమోపి, అటువంటి స్త్రీని భార్యగా తిరిగి తీసుకు వచ్చినందుకు రాముణ్ణి నిందించారు. ద్వేషపూరితమైన ఈ వదంతిని విదూషకుడైన భద్రుడు రామునితో చెప్తాడు. ఈ నింద రాముణ్ణి చాలా నొప్పించింది. చాలా అవమానం జరిగిందని బాధపడ్డాడు. ఇది చాలా సహజం కూడా. అయితే ఇందులో అసహజమయినదేమంటే, ఆ అవమానాన్ని వదిలించుకునేందుకు ఆయన అవలంబించిన తీరుతెన్నులే.

ఈ అవమానాన్ని శీఘ్రగతిని తొలగించుకోవడానికి ఆయన అడ్డదారి తొక్కాడు. అంటే, నిండు చూలాలు అయిన సీతను చెలికత్తెలు ఎవరూ లేకుండా, తిండి సౌకర్యం లేకుండా, ఆఖరికి ఆమెకు చెప్పాచెయ్యకుండా చాలా ద్రోహబుద్ధితో ఒక అడవిలో విడిచి పెట్టేయాలని నిశ్చయించుకున్నాడు. సీతను విడిచిపెట్టేయాలనే భావం అతనికి అకస్మాత్తుగా క్షణికోద్రేకంగా వచ్చినట్టిది కాదు. ఆ భావం అతనికి ఎలా పుట్టింది, దానినేవిధంగా పెంపుచేశాడు, ఏవిధంగా దానిని అమలు పరిచాడు అనే విషయాలు కొంచెం వివరంగా చెప్పుకోవలసి వుంది.

నగరంలో సీత గురించి వచ్చిన అపవాదు గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో భద్రుడు వచ్చి తనకు చెప్పినప్పుడు రాముడు తన సహోదరులను పిలిపించి తన భావాలను వెల్లడించాడు. సీత పాతివ్రత్యమూ, పవిత్రతా లంకలో రుజువైనాయని, దానికి దేవతలు సాక్ష్యంగా నిలిచారనీ, ఆమె అమాయకత్వాన్ని, పాతివ్రత్యాన్ని, పవిత్రతనూ తాను సంపూర్ణంగా విశ్వసిస్తున్నానని, వారితో చెప్పాడు. "ఇంత జరిగినప్పటికీ సీతపై ప్రజలు అపనింద మోపి నన్ను నిందిస్తూ, నన్ను అవమాన పరుస్తున్నారు. ఈ అవమానాన్ని ఎవరూ సహించలేరు. గౌరవమనేది చాలా గొప్ప సంపద. దానిని నిలబెట్టుకోవడానికి దేవతలు, ఉత్తమ పురుషులూ ఎప్పుడూ ప్రయత్నిస్తూ వుంటారు. ఈ అగౌరవాన్ని, అవమానాన్ని నేను సహించలేను. ఇటు అగౌరవం, అవమానాన్నుంచి నన్ను కాపాడుకోవడానికి ఆఖరికి మిమ్మల్ని విడిచిపెట్టడానికి కూడా నేను సిద్ధమే. సీతను విడిచి పెట్టడానికి వెనుకంజ వేస్తానని భావించకండి" అని వారితో అన్నాడు.

అది మంచో, చెడో అనే ఆలోచనకు తావీయకుండా ప్రజల నింద నుంచి తప్పించుకోవడానికి సీతను విడిచిపెట్టేయడమొక్కటే సులువైన మార్గమని రాముడు అప్పటికే నిర్ణయించుకుని వున్నాడని మనకు దీనివలన తెలుస్తుంది. సీత జీవితం గురించి అసలు ఆలోచించనే లేదు. ఆలోచించినదల్లా తన పేరు ప్రతిష్ఠలు. ఈ అపవాదును అరికట్టడానికి ఆయన ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. రాజుగా ఆ పని చెయ్యవచ్చు. తన భార్య పవిత్రురాలని నమ్మిన భర్త తప్పకుండా ఆ పనిచేసి తీరుతాడు. జనులు చేస్తున్న అపనిందకు రాముడు లొంగిపోయాడు. అపనిందలకు కొదవ ఏముంది? ఇతరులు ఆయనను బలహీనుడు, పిరికివాడైన రాజని అంటున్నా రామునికి ప్రజాస్వామ్యంలో చాలా నమ్మకం వుందని చెప్పే హిందువులకు కొదవలేదు. ఏది ఎలా వున్నప్పటికీ తన కీర్తి ప్రతిష్టలను నిలుపుకోవడానికి తాను ఎంచుకున్న దుష్టమైన మార్గాన్ని రాముడు తన సోదరులకే చెప్పాడు. ఎవరికైతే ఈ విషయం తెలియవలసి ఉన్నదో ఎవరికైతే దీనివలన నష్టం వాటిల్లుతున్నదో ఆ సీతకు మాత్రం చెప్పలేదు. అంతేకాక ఆమెను పూర్తి అంధకారంలో ఉంచాడు. ఈ వ్యవహారాన్ని చాలా రహస్యంగా ఉంచి, దానిని అమలు చేయడానికి సమయం కోసం ఎదురుచూస్తున్నాడు.

రాముడు ఎదురుచూస్తున్న ఆ అవకాశాన్ని సీతను వెన్నాడుతున్న క్రూర విధి అందజేసింది. గర్భవతులైన స్త్రీలు రకరకాల వస్తువుల మీద రకరకాల అభీష్టాలను వ్యక్తం చేస్తూంటారు. రామునికిది తెలుసు. ఒకరోజు సీతతో నీకు దేనిమీదయినా మనసు కలుగుతున్నదా అని అడిగాడు. అవునని చెప్పిందామె. దేనిమీద అని రాముడు అడిగాడు. గంగానది ఒడ్డున ముని ఆశ్రమ పరిసరాలలో కందమూల ఫలాలు తింటూ కనీసం ఒక్కరాత్రి అయినా గడపాలని వుంది అని ఆమె చెప్పింది. సీత అలా చెప్పగానే రామునికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. "రేపే నిన్ను పంపించే ఏర్పాటు చేస్తాను, బెంగపడకు"

అని చాలా ప్రేమతో అన్నాడు. భార్యమీద ఎంతో ప్రేమ వున్న భర్త చేసిన వాగ్దానంగా సీత భావించింది. కాని రాముడు ఏమి చేశాడు? సీతను విడిచి పెట్టేయాలని తాను చేసుకున్న నిర్ణయాన్ని అమలుచేయడానికి ఇది మంచి అవకాశంగా భావించాడు. ఆ ప్రకారం తన సోదరులతో రహస్యంగా సమాలోచనలు జరిపి, సీతను విడిచి పెట్టేయాలనే తన పథకాన్ని అమలుచేయుడానికి సీత కోరిన కోరికనే అవకాశంగా ఉపయోగించుకుంటున్నానని వారితో చెప్పాడు. సీత తరఫున తనను ఎవరూ బ్రతిమాలవద్దని వారితో చెప్పాడు. తనకు అడ్డం గనుక వచ్చినట్లయితే వారిని శత్రువులుగా భావిస్తానని కూడా వారిని హెచ్చరించాడు.

మరుసటి రోజునే రథం మీద తీసుకుని వెళ్ళి గంగానది ఒడ్డున అరణ్యంలో ఉన్న ముని ఆశ్రమం దగ్గర సీతను విడిచిపెట్టిరమ్మని లక్ష్మణున్ని ఆజ్ఞాపించాడు. సీత గురించి రాముడు తీసుకున్న నిర్ణయం ఆమెకు చెప్పడానికి ధైర్యం ఎలా కూడగట్టుకోవాలో లక్ష్మణునికి తెలియలేదు. లక్ష్మణుని అవస్థ చూసి రాముడు నది ఒడ్డున వున్న ముని ఆశ్రమ పరిసరాలలో కొంతకాలం గడపడానికి సీత ఇదివరకే తన కోరికను వెల్లడించి వున్నదని అన్నాడు. దానితో లక్ష్మణునికి మనస్సు తేలికపడింది. ఈ సంభాషణ రాత్రి సమయంలో జరిగింది.

మరుసటి రోజు ప్రొద్దున రథాన్ని సిద్ధం చేయమని సుమంతుణ్ణి లక్ష్మణుడు ఆదేశించాడు. రథాన్ని సిద్ధం చేశానని సుమంతుడు లక్ష్మణునితో చెప్పాడు. ఆ తరువాత లక్ష్మణుడు అంతఃపురానికి వెళ్ళి సీతను కలుసుకొని ఆశ్రమ పరిసరాలలో కొన్ని రోజులు గడపాలని తనకు కోర్కె ఉన్నదని ఆమె రామునితో చెప్పిన విషయం, రాముడు ఆమె కోరికను నెరవేరుస్తానని చేసిన వాగ్దానం ఆమెకు గుర్తుచేసి అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడానికి రాముడు తనను నియమించాడని ఆమెతో అన్నాడు. రథం సిద్ధంగా వున్నదని ఆమెతో చెప్పి "వెళ్దాం పదండి" అన్నాడు. రాముని పట్ల కృతజ్ఞత నిండిన హృదయంతో ఆమె రథం ఎక్కింది. సుమంతుడు రథం నడుపుతూ వుండగా, లక్ష్మణుడు ఆమె తోడురాగా రథం గమ్యస్థానాన్ని చేరుకుంది. గంగ ఒడ్డున వారు చేరారు. బెస్తవాళ్ళు వారిని నావలో అవతలి ఒడ్డుకు దాటించారు. లక్ష్మణుడు సీత కాళ్ళ పైబడ్డాడు. వెచ్చని కన్నీళ్ళు బొటబొట కారుతూ వుండగా "ఓ మచ్చలేని మహారాణీ! నేను చేస్తున్న పనికి నన్ను క్షమించు. నిన్ను తన ఇంట్లో పెట్టుకొని వున్నందుకు తనను ప్రజలు నిందిస్తున్నందువల్ల నిన్ను ఇక్కడ వదిలి వేయమని మా అన్నగారి ఆజ్ఞ" అని అన్నాడు.

రాముడు వదిలివేయగా అడవిలో చనిపోవలసిన సీత అక్కడకు సమీపంలో ఉన్న ఆశ్రమానికి చేరుకున్నది. వాల్మీకి ఆమెకు రక్షణ కల్పించి తన ఆశ్రమంలో వుంచుకున్నాడు. కొంతకాలానికి, ఆ ఆశ్రమంలో సీత కుశలవులు అనే ఇద్దరు కవల పిల్లల్ని ప్రసవించింది. వారు ముగ్గురూ వాల్మీకితోనే జీవించారు. వాల్మీకి ఆ బాలురను

పెంచి పెద్ద చేసి తాను రచించిన రామాయణం గానం చేయడం నేర్పించాడు. ఆ అరణ్యంలో వాల్మీకి ఆశ్రమంలో పన్నెండు సంవత్సరాలు ఆ పిల్లలు పెరిగారు. రాముడు పరిపాలిస్తున్న అయోధ్యకు ఆ అరణ్యం ఎంతో దూరంలోలేదు. ఆ పన్నెండు సంవత్సరాలలో సీత కనీసం బ్రతికివుందో, చనిపోయిందో తెలుసుకోవడానికి ఆ ఆదర్శ వంతుడైన భర్త, ప్రేమమూర్తి అయిన తండ్రి ఏ ఒక్కసారి కూడా ప్రయత్నించలేదు.

పన్నెండు సంవత్సరాల తర్వాత చాలా విచిత్రమైన పరిస్థితులలో రాముడు సీతను కలుసుకున్నాడు. ఒక యజ్ఞం చేయాలని రాముడు సంకల్పించాడు. అందులో పాల్గొనవలసిందిగా ఋషులందరికీ ఆహ్వానాలు పంపాడు. అయోధ్యకు దగ్గరలోనే వాల్మీకి ఆశ్రమం ఉన్నప్పటికీ రాముడు కావాలనే వాల్మీకికి ఆహ్వానం పంపలేదు. ఎందుకు ఆహ్వానం పంపలేదో రామునికి తెలుసు. కాని వాల్మీకి తనంతట తాను సీత కుమారులను ఇద్దరినీ తీసుకుని యజ్ఞం వద్దకు వచ్చాడు. ఆ పిల్లలు తన శిష్యులని పరిచయం చేశాడు. యజ్ఞం జరుగుతుండగా ఆ బాలురిద్దరూ సభికుల ముందు రామాయణం గానం చేయసాగారు. రాముడు చాలా ఆనందించాడు. ప్రశ్నలడిగి, వారు సీత కుమారులని తెలుసుకున్నాడు. అప్పుడు అతనికి సీత జ్ఞాపకం వచ్చింది. అప్పుడయినా ఏమి చేశాడు? సీత కోసం ఎవరినీ పంపలేదు. ఆ అమాయకులైన బాలురిద్దరినీ పిలిచాడు. వారికి తమ తండ్రి చేసిన పాపాలు ఏమీ తెలియవు. ఒక క్రూరమైన విధికి బలి అయ్యారు. వారిని పిలిచి సీత నిజంగా పతివ్రత, పవిత్రురాలు అయితే తనపైన తన భర్తపైన వచ్చిన అపనిందను రూపుమాపుకోవడానికి ఈ సభలో తనంతతానుగా వచ్చి ప్రతిజ్ఞ గైకొనవలసిందని వాల్మీకితో చెప్పమన్నాడు.

ఈ పని లంకలో ఒకసారి ఆమె చేసింది. ఆమెను విడిచి పెట్టేముందు ఇదే పని మరొకసారి చేయించివుండవలసింది. సీత తన పాతివ్రత్యాన్ని రుజువు చేసుకుంటే ఆమెను భర్త తిరిగి స్వీకరిస్తాడనే వాగ్దానం ఏదీ లేదు.

వాల్మీకి ఆమెను సభ ఎదుటకు తీసుకువచ్చాడు. ఆమె రామునికి ఎదురుగా నిలబడింది. అప్పుడు వాల్మీకి "ఓ దశరథుని కుమారా! ప్రజలు అపనింద వేశారని నీవు విడిచిపెట్టేసిన సీత ఇదిగో! నీవు అనుమతిస్తే ఆమె తన పాతివ్రత్యాన్ని రుజువు పరచు కుంటుంది. వీరు నీ కవలపిల్లలు. నా ఆశ్రమంలో వారిని పెంచాను" అని అన్నాడు. "సీత పవిత్రురాలని, వారు నా కుమారులని నాకు తెలుసు" అని అంటాడు రాముడు. "ఆమె తన పాతివ్రత్యాన్ని రుజువు చేసుకోవడానికి లంకలో అగ్నిప్రవేశం చేసింది. అందుకనే ఆమెను తిరిగి స్వీకరించాను. కాని ఇక్కడి ప్రజలకు ఆమెపై అనుమానాలు ఇంకా పోలేదు. అందుకని మళ్ళీ యిక్కడ సీత అగ్నిప్రవేశం చేయాలి. ఈ ఋషులూ, ఈ ప్రజలూ దీనికి సాక్ష్యంగా వుంటారు" అని అన్నాడు.

ముకుళిత హస్తాలతో సీత భూదేవికేసి చూస్తూ "రాముని తప్ప మనసులో కూడా ఏ పురుషుణ్ణి నేను తలంచలేదు. కాబట్టి ఓ భూమాతా నన్ను నీ ఒడిలోకి తీసుకో! వాచా కర్మేణా రాముణ్ణి నేను ఎప్పుడూ ప్రేమించాను. కాబట్టి ఓ భూమాతా! నన్ను నీలోనికి తీసుకుని వెళ్ళిపో" అని ప్రతిజ్ఞ చేసింది. ఆమె ప్రమాణం స్వీకరించగానే, భూమి భళ్ళున తెరుచుకున్నది. బంగారు సింహాసనం మీద సీతను కూర్చుండబెట్టుకుని లోపలికి తీసుకుని వెళ్ళిపోయింది. మంత్రముగ్ధులైన ప్రజలు వీక్షిస్తుండగా సీతపై దేవతలు పూలవర్షం కురిపించారు.

దీనిని బట్టి తెలిసేదేమంటే, మూర్ఖుని కంటే తక్కువ ఏమీ కాని విధంగా ప్రవర్తించిన రాముని దగ్గరకు తిరిగి వెళ్ళడం కంటే మరణించడమే మేలని సీత భావించింది అని.

ఇదీ సీత విషాద గాథ, దేవుడైన రాముడు చేసిన నేరమూను.

మహారాజు అయిన రాముని ప్రవర్తన ఎలా వుండేదో తెలియజేయడానికి కొన్ని విషయాలు వెలుగులోకి తెస్తాను. రాముణ్ణి ఒక ఆదర్శప్రాయుడైన రాజుగా అభివర్ణిస్తారు. ఆ అభిప్రాయం ఏదైనా వాస్తవాల ఆధారంతో ఏర్పరచుకొన్నదేనా? నిజం చెప్పాలంటే, రాముడు ఎప్పుడూ రాజ్య పరిపాలన చేయలేదు. నామమాత్రానికే ఆయన రాజు. పరిపాలన భారం అంతా తమ్ముడైన భరతునికి అప్పగించాడని వాల్మీకి చెబుతాడు. రాజ్య వ్యవహారాలు, ప్రజల మంచిచెడ్డలు, బాధలు ఆయన ఎన్నడూ పట్టించుకోలేదు. రాజయిన నాటి నుండీ రాముని దినచర్యను, దైనందిన జీవితాన్నీ చాలా వివరంగా వాల్మీకి వర్ణించాడు. (ఉత్తరకాండ – సర్గ:42, శ్లోకం 27) ఆయన వ్రాసిన దాని ప్రకారం రోజును రెండు భాగాలుగా విభజించవచ్చు. మధ్యాహ్నం వరకు ఒకటి, ఆ తర్వాతది రెండు. ఉదయం నుంచి మధ్నాహ్నం వరకూ రాముడు పూజాపునస్కారాలలో, ఆరాధనా కార్యక్రమాలలో మునిగిపోయేవాడు. మధ్నాహ్నం తరువాత ఒకరోజు విదూషకులతోను, మరొక రోజు అంతఃపుర కాంతలతోనూ గడుపుతూ వుండేవాడు. అంతఃపుర కాంతలతో ఆయనకు విసుగెత్తినపుడు విదూషకులతో గడిపేవాడు. విదూషకులతో విసుగెత్తినపుడు అంతఃపుర కాంతల దగ్గరకు వెళ్ళేవాడు. (ఉత్తరకాండ – సర్గ: 43, శ్లోకం 1) అంతఃపుర కాంతలతో రాముడు ఏవిధంగా కాలక్షేపం చేసేవాడో వాల్మీకి చాలా వివరంగా వర్ణించాడు. ఈ అంతఃపురం అశోకవనంలో ఉండేది. రాముడు అక్కడ భోజనం చేస్తూ వుండేవాడు. ఆయన భోజనం పంచభక్ష్యపరమాన్నాలతో చాలా రుచిగా ఉండేదని వాల్మీకి రాస్తాడు. ఇందులో మాంసము, పండ్లు, మద్యం తప్పక ఉండేవి. రాముడు మద్యం ముట్టనివాడేమీ కాదు. చాలా అధికంగా ఆయన మద్యపానం చేసేవాడు. సీత కూడా తనతో కలిసి మద్యం సేవించేలా రాముడు చూసేవాడని వాల్మీకి వ్రాస్తాడు. (ఉత్తర కాండ –సర్గ: 42, శ్లోకం 8) వాల్మీకి వర్ణించిన రాముని అంతఃపుర కాంతలను చూస్తే వారేమీ తక్కువ

కాదనిపిస్తుంది. నృత్య సంగీతాలలో ప్రవీణురాండ్రయిన అప్సరసలు, నాగకన్యలు, కిన్నెరలు ఉండేవారు. వీరే కాక వివిధ దేశాల నుంచి తెచ్చుకున్న సుందరాంగులు కూడా ఉండేవారు. మద్యం సేవిస్తూ, నృత్యం చేస్తూ ఆ స్త్రీల మధ్య రాముడు కాలం గడుపుతూ ఉండేవాడు. రాముణ్ణి వారు ఆనందపరిచేవారు. రాముడు వారికి పూలహారాలు వేసేవాడు. వాల్మీకి రాముణ్ణి “స్త్రీ లోలురలో రాజకుమారుడు” అని పిలిచేవాడు. ఇది ఒక రోజు కథ కాదు. ఆయన జీవనవిధానమే అంత.

**తెలుగు అనువాదం: రాముని కృష్ణుని రహస్యాలు-డా. బి. విజయభారతి, బొజ్జా తారకం; హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణ (పేజి- 8-14 ; 22-24)**

ఇంగ్లిష్ మూలం: డా.అంబేద్కర్ రచనలు- Riddles of Rama and Krishna, Vol 4, page 323

# మహిళల గురించి బాబా సాహెబ్ అభిప్రాయాలు

ఊర్మిళా పవార్, మీనాక్షీ మూన్

తమ విముక్తికై అస్పృశ్యులు జరుపుతున్న ఆందోళన డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ వంటి సమర్థ నాయకుడిని సంపాదించుకోగానే ఎంతోకాలంగా పేదరికం, అజ్ఞానం, మూఢనమ్మకాలలో మగ్గిపోతున్న సమూహాలలో రాజుకుంటున్న అస్తిత్వ జ్వాల రగులుకున్నది. తనని తానే పోగొట్టుకున్న సమూహం అది. "అనంతకాలాల నుండీ మిమ్మల్ని నిశ్శబ్దంగా ఉంచారు, కాబట్టి మీరు అలాగే ఉండాలి" అనీ, "పని చేస్తూనే ఉండండి కానీ ప్రతి ఫలాన్ని ఆశించకండి" అనీ తమకు చెప్పే మాటలతో ఎంతోకాలంగా మోసపోతున్న అమాయక ప్రజలు సత్యం తెలుసుకోవడానికి మేల్కోవడం మొదలయ్యింది. తాము తక్కువ వారమనే భావన వాళ్ళ మనసులలో నుండి మెల్లగా కరిగిపోనారంభించింది.

మహద్ సత్యాగ్రహం దగ్గర డా.అంబేడ్కర్ ఉపన్యాసం అస్పృశ్య మహిళల్లో ఒక విప్లవాన్ని తీసుకువచ్చింది. వారి ఆలోచనలు, ఆచరణ మారడం మొదలయ్యింది. వాళ్ళు సభలు సమావేశాలలో పెద్ద సంఖ్యలో పాల్గొనడం మొదలుపెట్టారు. మహిళా సంఘాలు ఏర్పడ్డాయి. సభలూ సమావేశాలలో స్త్రీలు శక్తివంతంగా మాట్లాడడం మొదలుపెట్టారు. వాళ్ళు ఊరేగింపుల్లో పాల్గొని ఉద్యమంలోనూ దాని పోరాటాల్లోనూ చురుకుగా పాల్గొనసాగారు. మహిళల పట్ల డా.అంబేడ్కర్ ఉదార భావాలే అస్పృశ్య మహిళల్లోని ఈ పెనుమార్పు వెనుక చోదక శక్తి అని మనం మర్చిపోకూడదు.

డా.అంబేడ్కర్ విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించడం, పశ్చిమ దేశాలలోని స్త్రీ పురుష సమానత్వ భావాల ప్రభావం ఆయన మీద ఉండడమే ఈ ఉదార భావాలకి కారణం అని అనుకుంటే పొరపాటే. ఆయన విద్యార్థిగా ఉన్న నాటినుండే ఆడపిల్లలూ మగపిల్లలూ ఇద్దరూ చదువుకోవాలనీ పురుషులతో పాటు మహిళలు కూడా అన్ని రంగాలలోనూ చురుకుగా పాల్గొనాలనీ అభిప్రాయపడ్డారు.

బాబాసాహెబ్ కుటుంబం ఎంతో నాగరీకంగా ఉండేది. ఆయన తండ్రి తన చెల్లెళ్లకు, కూతుళ్లకు చదవడం, రాయడం నేర్పించాడు. బాబాసాహెబ్ అత్త రామాయణ, మహాభారతాల వంటి పుస్తకాలకు తాత్పర్యాలు చెప్తుండేది. సైన్యంలో పనిచేసే వారి కుటుంబాల్లోని పిల్లల్లో అమ్మాయిలూ అబ్బాయిలూ కూడా బడికి వెళ్ళేవారు.

అమెరికాలో విద్యార్థిగా ఉన్నకాలంలో సతారాలో మిలిటరీ కుటుంబాలు నివసించే కాలనీలోని తన పక్కింటి జమేదార్ జాదవ్‌కు బాబాసాహెబ్ ఒక ఉత్తరం రాశారు. ఆయన తన కూతుర్ని బడికి పంపుతున్నందుకు అభినందిస్తూ "తల్లిదండ్రులు పిల్లలకి జన్మనివ్వగలరు కానీ వారి ఖర్మ మాత్రం వారిదే" అనుకోవడం తప్పని రాశారు. "పిల్లలని

తీర్చిదిద్దుకోవాలి. మగపిల్లలతో పాటు ఆడపిల్లల్ని కూడా చదివిస్తే మనం వేగంగా పురోగతిని సాధించలేకపోవడం అనేదే ఉండదు. ఈ భావాలను కనీసం నీ దగ్గరి బంధువులలోనయినా ప్రచారం చేయాలి". అని కూడా రాశారు. ఆడపిల్లల్ని చదివించడంలో తల్లిదండ్రుల బాధ్యతను ఇక్కడ బాబాసాహెబ్ స్పష్టంగా ఎత్తిచూపారు.

సామాజికంగా వెనుకబడిన, సహ విద్య అనే మాటే తెలియని ఔరంగాబాద్ వంటి పట్టణంలో బాబా సాహెబ్ కాలేజీ తెరిచి మగపిల్లలతో పాటు ఆడపిల్లలని కూడా చేర్చుకున్నారు. అంతే కాదు ఆడపిల్లలు పెద్ద సంఖ్యలో చేరేందుకు వీలుగా సిటీ నుండి కాలేజీ వరకు బస్ సౌకర్యం కూడా కల్పించారు. సమాజంలో ఆడపిల్లలకి కూడా వ్యక్తులుగా ఒక స్వతంత్ర అస్థిత్వం ఉంటుందని బాబాసాహెబ్ అందరికీ చూపారు. ఆడపిల్లలకు చదువుతో పాటు నైతికవర్తన కూడా అంతే అవసరమని బొంబాయిలోని రవళి క్యాంపు దగ్గర  మహిళా మండలి సమావేశంలో నొక్కి చెప్పారు.

లండన్ నుండి రమాబాయికి రాసే ఉత్తరాల్లో ఆమెను చదవడం, రాయడం నేర్చుకొమ్మని ప్రోత్సహించేవారు. ఎంతో ఆప్యాయంగా ఆమె చదువు గురించి అడిగి తెలుసుకొనేవారు. తన భర్తను సంతోషపెట్టడానికి ఆమె చదవడం మొదలుపెట్టింది. ఆయన విదేశాల్లో ఉన్నప్పుడు ఉత్తరాలు రాసేది.

అయితే జస్టిస్ రనడే తన భార్య చదువు, మేధోభివృద్ధి కోసం పెట్టినంత ప్రత్యేక శ్రద్ధ మాత్రం తన భార్యకోసం బాబాసాహెబ్ పెట్టలేకపోయారు. దీనికి రెండు కారణాలున్నాయి. సామాజిక నేపథ్యం, సంస్కృతులలో ఉన్న తేడా ఒకటైతే వారి దినచర్యల్లో ఉన్న తేడా మరొక కారణం. తన భార్యను చదువుకోవడానికి ప్రోత్సహించిన గౌరవం మాత్రం బాబాసాహెబ్‌కు దక్కవలసిందే.

"చిన్న వయసులోనే పెళ్ళి చేసి తల్లిదండ్రులు పిల్లల జీవితాలను పాడుచేయకూడదు. తన భార్య కాబోయే వ్యక్తి విషయంలో భర్తలకి ఎలా ఎంపిక స్వేచ్ఛ ఉంటుందో అలాగే తన భర్తను ఎంచుకొనే విషయంలో ఆడపిల్ల అభిప్రాయాలు కూడా తెలుసుకోవాలి. చాలా సార్లు అందమైన అమ్మాయిని కురూపికి ఇచ్చి పెళ్ళి చేసేస్తూ ఉంటారు. తమ అభిప్రాయం తెలియజేసే హక్కుని అమ్మాయిలకు నిరాకరిస్తున్నారని ఈ విషయం తెలియజేస్తోంది."

1938లో ఒక విద్యార్థి బృందంతో మాట్లాడుతూ "స్త్రీ ఒక వ్యక్తి. అందుకే ఆమెకు కూడా వ్యక్తిగత స్వేచ్ఛ ఉండాలి" అని బాబాసాహెబ్ ప్రకటించారు.

1942 లో జరిగిన మహిళా పరిషద్‌లో కొన్ని విషయాల గురించి ఆయన నొక్కి చెప్పారు. "ఆడపిల్లలకి, మగపిల్లలకి చిన్నప్పుడే పెళ్ళిళ్ళు కుదర్చకండి. ముందు వాళ్ళని ఆర్థికంగా స్వతంత్రులు కానివ్వండి. ఎక్కువ మంది పిల్లలు ఉండడం వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించండి. పెళ్ళి అనేది ఒక ఆడపిల్ల ఎదుగుదలకి అడ్డంకి. ఆమెపై పెళ్ళిని

రుద్దకండి. పెళ్లి తరవాత ఆమె తన భర్తకి స్నేహితురాలిగా, సమానహక్కులున్న ఇల్లాలిగా ఉండాలి. ఆమె తన భర్తకు బానిసగా మారకూడదు".

మహద్‌లోని చావ్‌దార్ చెరువు దగ్గర సత్యాగ్రహం సందర్భంగా బాబాసాహెబ్ మహిళలను ఉద్దేశించి చేసిన ప్రసంగం వారిలో ఒక విప్లవాత్మకమైన మార్పును తీసుకువచ్చింది. ఆయన ఇలాంటి ప్రసంగాలను పదే పదే ఇస్తుండేవారు. 1953 మే 29న బొంబాయిలోని చెంబూర్‌లో మాట్లాడుతూ భారీ నగలను ధరించడం సరైంది కాదనీ తమ చీర కట్టు తమ కులాన్ని పట్టిచ్చే పద్ధతిలో ఉండరాదనీ చెప్పారు.

డా. అంబేద్కర్ 1932 అక్టోబర్‌లో ఒక హత్య కేసులో వాదించడానికి సావంతవాడికి వెళ్లినప్పుడు అస్పృశ్య కులానికి చెందినవారు ఏర్పాటు చేసిన సభలో మహిళలను ఉద్దేశించికూడా ఇలాంటి ప్రసంగమే చేశారు. ఆ ప్రసంగం అత్తవారింటికి వెళ్తున్న బిడ్డకి తల్లి చెప్పే సలహాల వంటిది. "మీ జీవితం ఎంత కష్టభూయిష్టమైనదైనా సరే మీ కొడుకులనూ కూతుళ్లను బడికి పంపండి. ఇంట్లోని మగవాళ్ళు చచ్చిన గొడ్డు మాంసం తీసుకువస్తే ఖచ్చితంగా వ్యతిరేకించండి. మీ బట్టలు చిరిగిపోతే వాటిని వేసుకొనేముందు కుట్టుకొని, ఉతికి వేసుకోండి. సవర్ణ కులాల మహిళలకూ మీకూ మధ్య ఎటువంటి తేడాలూ కనపడకూడదు. ఈ మాత్రం చేసినా సరే మన కులాలను విముక్తి చేయడంలో మీరు ముఖ్యమైన పాత్ర నిర్వహించినట్టే." మహిళలు ఎక్కడ సమావేశమైనా బాబా సాహెబ్ ఈ రకంగా మాట్లాడేవాడు.

1952 డిసెంబర్ 25న నిపాణిలో దళిత పరిషద్ జరిగింది. స్త్రీలూ పురుషులూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు."చచ్చిన పశువుల మాంసం తిని జీవితం గడుపుతున్నారు. ఇంతకంటే ఘోరమైన పరిస్థితి ఇంకేముంటుంది. అందుకే మీరు పోరాటంలో చేరాలి" అని బాబాసాహెబ్ ఆ సభ లోని మహిళలను ఉద్దేశించి మాట్లాడారు.

బాబాసాహెబ్‌కు పేదరికమంటే ఏమిటో అనుభవం ద్వారా తెలుసు. తన చుట్టూ ఉన్నవారంతా తిండికీ బట్టకీ లేని అస్పృశ్యులే. పేదరికం కారణంగా ఇలా అవమానాలకు గురయ్యే ఆ తల్లులనూ చెల్లెళ్లనూ చూసి ఆయన హృదయం మెలితిరిగేది. బుద్ధపూర్ణిమ రోజు వందలాది పేద మహిళలకు చీరలు పంచిపెట్టాలనుకుంటున్నట్టు భావూరావు గైక్వాడ్‌కు ఉత్తరం రాశారు.

పేదరికం, ఎక్కువ సంఖ్యలో పిల్లల్ని కలిగి ఉండడం తమ జాతిని వేగంగా అభివృద్ధి చెందకుండా నిరోధిస్తాయని బాబాసాహెబ్ తన ప్రజలకి గుర్తుచేశారు.

1938లో విద్యార్థుల నుద్దేశించి ప్రసంగిస్తూ "కుటుంబ నియంత్రణ బాధ్యత స్త్రీ పురుషులిద్దరిపైనా ఉన్నద"ని బాబాసాహెబ్ వివరించారు. తన 14 మంది అన్నదమ్ములూ అక్కచెల్లెళ్ళ గురించి, పేదరికంలో గడిపిన తన బాల్యం గురించీ మాట్లాడారు. "ఒక్క

బిడ్డనైతేనే సరిగ్గా పెంచగలం. తక్కువ మంది పిల్లలుంటే స్త్రీలు పిల్లల్ని కనే భయంకరమైన బరువు నుండి విముక్తమై ఇతర కర్తవ్యాలకోసం తమ శక్తిని వినియోగించగలుగుతారు." బాబా సాహెబ్ అభిప్రాయాలతో ప్రభావితుడయిన ఇండిపెండెంట్ లేబర్ పార్టీకి చెందిన శాసనసభ్యుడు ప్రభాకర్ రోహం, శాసనసభలో కుటుంబ నియంత్రణపై తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు. అదే యేడాదిలో మహిళా కార్మికుల సంక్షేమానికి సంబంధించిన బిల్లును బాబాసాహెబ్ సమర్థించారు. "ప్రసవానికి ముందూ తరవాతా కూడా స్త్రీకి విశ్రాంతి అవసరం కాబట్టి ఆమెకిచ్చే జీతంతో కూడిన సెలవు ఖర్చును యజమాని భరించాలి" అని వాదించారు.

అనాథ పిల్లలకు, బహిష్కృత మహిళలకు, అవివాహిత స్త్రీలకు ఆశ్రయం కల్పించాలని బాబాసాహెబ్‌కు బలమైన ఆకాంక్ష ఉండేది. అందువల్ల ఔరంగాబాదులో ఒక అనాథాశ్రమాన్ని నిర్మించాలనుకున్నారు. "పేదలు, బహిష్కృత తల్లులు, అవివాహిత తల్లులు చిన్న పిల్లల్ని ఇక్కడ వదిలిపెట్టచ్చు. వాళ్ళ సంరక్షణ బాధ్యత నాది" అని ప్రకటించారు.

పురుషులు మహిళలకు అన్యాయం చేయడాన్ని ఎన్నడూ సహించేవారు కాదు. ఎవరైనా వ్యక్తి తన భార్యను వివక్షతో చూస్తే వెంటనే అతన్ని మందలించేవారు. అలాంటి ఒక ఘటన ఎప్పటికీ మరువలేనిది. బాబా సాహెబ్‌కు సన్నిహితుడైన జీవప్ప అయిదాలే షోలాపూర్ జిల్లాలోని వావి గ్రామంలో నివసించేవాడు. అదే గ్రామానికి చెందిన కర్భారి అనే కార్యకర్త, పిల్లలు పుట్టలేదని 55వ యేట మళ్ళీ పెళ్ళిచేసుకోవాలనుకున్నాడు. "ఒకవేళ నీలో లోపం ఉండి నీకు పిల్లలు కలగలేదని నీ భార్య మరొకరిని పెళ్ళి చేసుకోవాలనుకుందనుకో నీకు ఎలా ఉంటుంది? నీకు పిల్లలు కావాలని ఉంటే ఆమెకు మాత్రం ఉండదా? ఆడవాళ్ళకు కూడా పిల్లలు కావాలని ఉంటుంది." అని ఆ కార్యకర్తను ప్రశ్నించారు.

నైతికవర్తన అనేది చాలా ముఖ్యమైన విషయంగా బాబాసాహెబ్ పరిగణించేవారు. 1932 లో వ్యాఘ్యులు, మురళీలు, దేవదాసీల ముందు ప్రసంగిస్తూ, "వ్యభిచారాన్ని వదిలిపెట్టి నైతిక జీవితాన్ని ఎంచుకోండి. మనకి పేదరికం అంటే భయం లేదు. అది మనం పుట్టినప్పటి నుండీ ఉంది. కాబట్టి పేదరికం భయంతో ఈ జీవికను చేపట్టవద్దు" అని చెప్పారు. వారిని ఒప్పించేందుకు మహాభారతంలో ద్రౌపది ఉదాహరణ చూపి ఆమె కౌరవుల ఐశ్వర్యాన్ని తిరస్కరించి పాండవుల వెంట వనవాసానికి వెళ్లడాన్ని గురించి చెప్పారు. స్త్రీలను నైతికంగా ఎత్తిపట్టాలని భావించి, తను చేస్తున్న పని కోసం, పట్టే బాపూరావు ఇచ్చిన డబ్బుని తిరస్కరిస్తూ "పావలాబాయిని నాట్యం చేయించి కూడబెట్టిన సొమ్ము తనకు వద్దని" ప్రకటించారు.

1928 అక్టోబర్ 23న సైమన్ కమీషన్ ముందు డా.అంబేద్కర్ వాదించారు. వయోజనులైన యువతీ యువకులందరికీ వోటు హక్కు ఇవ్వాలనేది ఆయన మొట్టమొదటి డిమాండు. రౌండ్ టేబుల్ సమావేశంలో దీనిని మళ్ళీ ప్రస్తావించారు.

ఆయన ప్రారంభించిన వివిధ ఆందోళనల్లో మహిళల పని సామర్థ్యానికి తగిన అవకాశాలను కల్పించారు. 1932-33లో జనతా పత్రిక కార్యవర్గంలో శ్రీమతి సావిత్రిబాయి బొరాడే, శ్రీమతి అంబుబాయి గైక్వాడ్ లను చేర్చుకున్నారు. దళితుల ముఖ్యమైన మహాసభల్లో మహిళలకు ప్రత్యేకమైన వేదికలను కల్పించారు. అంటే పురుషుల మహాసభతో పాటుగా పక్కనే మహిళల మహాసభ కూడా నిర్వహించేవారు. ఈ విధంగా తరవాత మహిళలు తమ సొంత వేదికలను ఏర్పాటు చేసుకున్నారు.

మహిళల హక్కులు, ఉద్ధరణ, వారి అభివృద్ధి కేవలం సలహాల ద్వారా సాధ్యం కాదనీ, దానికి కొన్ని చట్టపరమైన అవకాశాలు కూడా అవసరమని గుర్తించి బాబా సాహెబ్ హిందూ కోడ్ బిల్లును తయారుచేశారు.

హిందూ కోడ్ బిల్లు:

గార్గి, మైత్రేయి, సులభ, విద్యాధరి వంటివారు వేదాల్లోనూ, శాస్త్రాల్లోనూ విద్వాంసులుగా ఉన్న కాలం కూడా ఒకప్పుడు ఉంది. మహిళలకు పురుషులతో సమానంగా హక్కులుండేవి. మహిళలకు, పురుషులకు ఒకేరకమైన న్యాయ స్మృతి ఉండేది. అలాగే బుద్ధుని కాలంలో కూడా కుందల్ కాషా, క్షేమ అనే ఇద్దరు బౌద్ధ భిక్షుణిలు ధర్మశాస్త్రాల్లో విద్వాంసులు. వాద ప్రతివాదాల్లో ఆరితేరినవారు. జైన, బుద్ధ విశ్వాసాలలో మహిళలకు సమాన హోదా ఉండేది. మహిళలకు విద్యార్జన చేసే, బోధన చేసే, వృత్తి చేపట్టే, తమను తాము అభివృద్ధి చేసుకుని, నిర్వాణం పొందే స్వేచ్ఛ సైతం ఉండేది. కానీ తరవాతి కాలంలో మనుస్మృతి, యాజ్ఞవల్క్య స్మృతులు, మానవుల్లో ఉచ్ఛ, నీచ సంబంధాలను ఏర్పాటు చేశాయి. ఒక ప్రత్యేక వర్గపు స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చడానికి ఈ నియమాలు, చట్టాలు పనిచేశాయి. ఈ చట్టాలు హిందూమతం, బౌద్ధ మతాల మధ్య ఘర్షణ కారణంగా ఏర్పడ్డాయి. శూద్రులకూ మహిళలకూ బౌద్ధం కల్పించిన స్వేచ్ఛను మనుస్మృతి హరించివేసింది.

బుద్ధుడు స్త్రీలకు సమాన హోదాను, సమాజంలో గౌరవనీయమైన స్థానాన్ని కల్పించాడు. ఆ రకంగా బుద్ధ భగవానుడే స్త్రీల స్వాతంత్ర్యాన్ని ఎత్తిపట్టిన మొట్టమొదటివాడని చెప్పవచ్చు.

శూద్రుల గురించీ, మహిళల గురించీ మనుస్మృతి పేర్కొన్న ఆదేశాల ముద్ర హిందూస్థాన్‌లోని పితృస్వామిక సంస్కృతి పై ఉంది. తద్వారా సమాజం స్త్రీల సాధికారత అనే భావనలకు దూరంగా ఉండిపోయింది.

బ్రిటిష్ వారి ఆగమనం తరువాత స్త్రీ పురుష సమానత్వంతో సహా ఇతర సంస్కరణలు కూడా ఉన్నప్పటికీ ధర్మశాస్త్రాలు శూద్రులకూ మహిళలకూ నిర్దేశించిన నియమాలనూ, నైతిక సూత్రాలనూ పూర్తిగా ధిక్కరించే సాహసం మాత్రం ఎవ్వరూ చూపలేకపోయారు. ఇది ప్రభుత్వం చేయవలిసిన పని. దేశం స్వాతంత్ర్యం సంపాదించుకొని, నూతన రాజ్యాంగం తయారుచేసుకోవాల్సినపుడు పౌరులంతా ప్రగతి పథంలోనూ, అభివృద్ధి పథంలోనూ ప్రయాణించడానికి వీలుగా ఒక కొత్త న్యాయవ్యవస్థనూ, కొత్త నైతిక సూత్రాలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది.

డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ను రాజ్యాంగ కమిటీకి ఛైర్మన్ గా నియమించినపుడు రావ్ కమిటీ రూపొందించిన హిందూ కోడ్ బిల్ ఆయన ముందుకు వచ్చింది. అందులో ఆయన మౌలికమైన మార్పులు చేసి తిరగరాసిన హిందూ కోడ్ బిల్లును 1948ఆగస్టు 12న శాసనసభాకమిటీ ముందు ప్రవేశపెట్టారు. నూతన బిల్లుపై బాబాసాహెబ్ ప్రగతిశీల భావనల ముద్ర ఉన్నది. ప్రతీఘాతుక భావజాలాన్ని ఎత్తిపట్టే ప్రతి ఒక్కరూ ఆ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు.

ఒక తీవ్ర, భీకర వ్యతిరేకత నిండిన వాతావరణంలో బిల్లు పై చర్చ జరిగింది. పితృస్వామిక సామాజిక పొందికను ఈ బిల్లు సవాలు చేసి, పురుషునితో సమాన హోదాను కల్పించడం ద్వారా భారతీయ స్త్రీని గౌరవించింది. వివాహం, విడాకుల విషయాలలో హిందూ స్త్రీకి పురుషులతో సమానంగా హక్కులు కల్పించింది.

1. స్త్రీకి విడాకులిచ్చే హక్కు ఉంది.
2. భర్త విడాకులు ఇస్తే ఆమెకు భరణం పొందే హక్కు ఉంది.
3. ప్రతి వ్యక్తికీ ఒక వివాహమే చట్టబద్ధమవుతుంది. స్త్రీలు స్థిరత్వం సాధించేందుకు వీలుగా తగిన కారణం లేని రెండవ వివాహం నిషేధం.
4. స్త్రీలకు కూడా పిల్లలను దత్తత తీసుకొనే హక్కు ఉంది.
5. మగపిల్లలను దత్తత తీసుకున్నట్టే ఆడపిల్లలను కూడా దత్తత తీసుకోవచ్చు.
6. తమ సంపాదనపై స్త్రీలకు హక్కు ఉంది.
7. తండ్రి ఆదాయంపై కూతుళ్లకు కూడా సమాన హక్కు ఉంది.
8. తండ్రి ఆస్తికి కూతురు కూడా వారసురాలు కావచ్చు.
9. కులాంతర వివాహాలు చట్టబద్ధం.
10. స్త్రీలకు తన స్వంత ఆస్తిని అమ్ముకునే హక్కు ఉంది.

సంక్షిప్తంగా చెప్పాలంటే హిందూ కోడ్ బిల్లులో 9 విభాగాలు, 137 క్లాజులు, 7 అనుబంధాలు ఉన్నాయి. మునుపెన్నడూ ఎరగనంత ఉద్వేగంతో బిల్లుపై భిన్నాభిప్రాయాలు తలపడ్డాయి. సనాతన సాధువులు ఏర్పరిచిన మతపర నియమాలను ఒక అంటరానివాడు ధ్వంసం చేస్తున్నాడని సాంప్రదాయవాదులంతా ప్రకటించారు. బిల్లుని వ్యతిరేకించినవారిలో

భారత రిపబ్లిక్ మొదటి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్, సర్దార్ వల్లభ భాయ్ పటేల్ ఉన్నారు. సాంప్రదాయ హిందువులతో పాటు, శంకరాచార్య, బ్రహ్మానంద సరస్వతి, స్వామీ కరపత్రిజీ, డా.పట్టాభి సీతారామయ్య తదితరులతో పాటు, కలకత్తా నుండి ఎన్నికైన అజీముద్దీన్ మొహమ్మద్ కూడా బిల్లుని వ్యతిరేకించాడు.

బిల్లుకి వ్యతిరేకంగా పార్లమెంటు బయట నిరసన ప్రదర్శనలు జరిగాయి. హిందూ కోడ్ బిల్లు నశించాలి అనే నినాదాలు ఇచ్చారు. బాబాసాహెబ్‌కు హత్యా బెదిరింపులు వచ్చాయి. “మురికి కాలవలో ప్రవహించే గంగాజలం పవిత్రం కాజాలదు. కొత్త నియమావళి ఎంత సమగ్రంగా ఉన్నా సరే అది అంబేడ్కర్ వంటి ఒక మహర్ రూపొందించడం వల్ల దానిని మాస్థాయికి తగినదానిగా మేము అంగీకరించలేము.” అంటూ జెరే శాస్త్రి అసహ్యకరమైన భాషలో బిల్లుని విమర్శించాడు.

ఆ తుచ్ఛమైన విమర్శకు స్పందిస్తూ “జెరే శాస్త్రి వంటివారి ప్రతీఘాతుకుల మురికి భావాలను కూడా పరిశుద్ధం చేయగల శక్తి డా.అంబేడ్కర్ జ్ఞానానికి ఉంది” అని వి.ఎస్.ఖండేకర్ అన్నాడు. “హిందూ కోడ్ బిల్లు అన్నా చెల్లెళ్ల మధ్య వివాహాలను అనుమతిస్తుంది,” అని పుకార్లు పుట్టించి బిల్లుపై వ్యతిరేకతను చెలరేపడానికి కరపత్రి స్వామి ప్రయత్నించాడు.

బాబా సాహెబ్ ఇంగ్లీషు భాషలో ఉన్న బిల్లును, సోహన్ లాల్‌శాస్త్రితో హిందీలోకి అనువాదం చేయించి అన్ని హిందూసంస్థలకు ఉచితంగా పంచిపెట్టారు. హిందూ స్మృతులలో కూతుళ్ళకు ఆస్తి హక్కులను, వితంతు పునర్వివాహాలను అనుమతించిన సూక్తులను బయటకు తీసుకురావడానికి పండిత్ ధర్మదేవ్ విద్యాలంకార్‌కు అంబేడ్కర్ ఐదు వేల రూపాయలను చెల్లించి “వీరార్జున్ సమాచార్” లో వరుసగా ప్రచురింపజేశారు.

బిల్లు తరఫున ప్రచారం చేయమని అఖిల భారత మహిళా కాంగ్రెస్‌ను కూడా అభ్యర్థించారు. బిల్లును సమర్థిస్తూ వివిధ మహిళా సమావేశాలలోనూ ఆర్య సమాజ సభల్లోనూ ఉపన్యాసాలు చేశారు.

దుర్గా బాయి (తరవాత కాలంలో ఆమె సి.డి.దేశ్‌ముఖ్‌ను వివాహం చేసుకున్నారు.) మరో ఇద్దరు మహిళలతో సహా అనేక మంది విద్యావేత్తలు బాబాసాహెబ్ నేతృత్వంలో సమావేశమయ్యారు. దుర్గాబాయి ఉపన్యసిస్తూ హిందూ మహిళల దుస్థితిని గురించి వివరించి స్వాతంత్ర్యం పురుషులకు మాత్రమే కాదనీ స్వతంత్ర భారత దేశం మహిళల సంక్షేమాన్ని కూడా సుసాధ్యం చేయాలనీ ప్రకటించింది. “నేటి సమాజంలో స్త్రీ బానిసగా మిగిలిపోదు. ఆదర్శ హిందూస్త్రీగా బతకడానికి ఆమెకు తన హక్కులు కూడా కావాలి.” అని ఆమె అన్నారు. పద్మజా నాయుడు, రాజశ్రీ పార్లమెంట్ లో బిల్లుని సమర్థించారు. దాదర్ (ముంబై) లోని కిట్టే భండారీ హాల్లో 1949, ఆగస్టు 21 న హిందూ కోడ్ బిల్లు లేక భీమా స్మృతి ని సమర్థిస్తూ సదస్సు జరిగింది. ఇందులో 25 మహిళా సంఘాలు, 10

సామాజిక సంఘాలు పాల్గొన్నాయి. పూనా లోని లా కాలేజీ ప్రిన్సిపాల్ జే.ఆర్. ఘర్‌పూరే అధ్యక్షత వహించడానికి అంగీకరించారు. హిందూ కోడ్ బిల్లును సమర్థిస్తూ శ్రీమతి చంద్రకళా హోరే ఒక కరపత్రాన్ని ఈ సందర్భంగా ప్రచురించారు.

1950 జనవరి 19 న ముంబైలోని విల్సన్ కాలేజీలో జరిగిన సభలో ముంబై మాజీ కమీషనర్ (షెరీఫ్) పాల్గొన్నారు. ఎన్.ఎం. జోషి అధ్యక్షత వహించగా ఊర్మిళా మెహతా, ప్రొఫెసర్ తోపే, ప్రొఫెసర్ పాండ్యా, ప్రొఫెసర్ కపాడియా, శ్రీమతి మిథాన్ లభ్ ప్రసంగించారు. ఈ ఇద్దరు మహిళలు కూడా బిల్లుని సమర్థిస్తూ బిల్లుని వ్యతిరేకిస్తున్నవారిని ఎండగట్టారు.

హిందూ కోడ్ బిల్లును ఆమోదిస్తే తాను రాజీనామా చేస్తానంటూ రాజేంద్రబాబు తన రాజీనామా ఆయుధాన్ని బయటకు తీశాడు. ఇదంతా గమనించి పండిట్ నెహ్రూ బిల్లు విషయంలో మౌనం వహించాడు. బిల్లు వాయిదాల మీద వాయిదాలు పడుతూ చివరికి 1951 సెప్టెంబర్ 26న సస్పెండ్ అయ్యింది. దీనిని భరించలేక బాబా సాహెబ్ న్యాయ శాఖ మంత్రిగా తన పదవికి సెప్టెంబర్ 27 న రాజీనామా చేశారు.

తరవాత హరిబావ్ పతస్కర్ అనే మహారాష్ట్ర బ్రాహ్మణున్ని ఆ బిల్లును ప్రవేశపెట్టడానికి ఎంచుకున్నారు. చివరికి దానిని దఫదఫాలుగా పాక్షికంగా ఆమోదించారు.

జెండర్ సమానత్వం చాలా ఆలస్యంగా విజయం సాధించింది.

**అనువాదం: బి. అనురాధ**

**ఇంగ్లిష్ మూలం:** Babasaheb's Views on Women, We Also Made History: Women in the Ambedkarite Movement, Urmila Pawar and Meenakshi Moon, Chapter 10, pg 82-86

హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెడుతూ డా. అంబేద్కర్ స్త్రీలు వివాహితులైతే ఒక చట్టం, అవివాహితులైతే ఒక చట్టం, వితంతువులైతే మరో చట్టం, ఇన్ని రకాలుగా ఉండటం సరైంది కాదని బలంగా వాదించారు. స్త్రీలకు ఆస్తి హక్కు ఉండాలని, ఆస్తి పంపకాల సందర్భంగా వితంతువుల పట్ల వివక్ష ఉండకూడదని మార్పులు సూచించారు. కులాంతర మతాంతర వివాహాలకు కూడా చెల్లుబాటు ఉండాలని, ధార్మిక పద్ధతులకి అతీతంగా రిజిస్టర్ పెళ్లిళ్లను ప్రవేశపెట్టి ఏ పద్ధతిలో చేసుకునే పెళ్లిళ్లకైనా గుర్తింపు గౌరవం ఉండాలని హిందూ కోడ్ బిల్లులో సూచించారు. ఇంకా చాలా సందర్భాలలో చట్ట సభల్లో ఆయన స్త్రీల సమస్యల గురించి వాదించారు. స్త్రీలకు కుటుంబ నియంత్రణ పద్ధతులను సులభంగా అందుబాటులో ఉంచవలిసిన బాధ్యత ప్రభుత్వానిదే అని గట్టిగా వాదించారు. అలాగే ముంబయ్ ఫ్యాక్టరీల్లో స్త్రీలకు ప్రసూతి ప్రయోజన బిల్లును ప్రవేశపెట్టాలని, ఆ భారం మొయ్యాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని నొక్కి చెప్పారు. స్త్రీల చేతిలో అక్షరాస్యత ఒక ఆయుధంగా పనిచేస్తుందన్నారు. అన్ని వర్గాల స్త్రీలకు ఓటు హక్కు కావాలన్నారు. ముఖ్యంగా ఆయన ఈ వాదనలు చేసిన కాలాన్ని కనక దృష్టిలో పెట్టుకుంటే (1930 లు, 50 ల మధ్య కాలం) ఆ కాలంలోనే స్త్రీల విషయంలో ఇంత ప్రగతిశీలంగా ఆలోచించడం డా. అంబేద్కర్ లోని ఒక ఫెమినిస్టు కోణాన్ని చూపిస్తుంది.

ప్రత్యేకంగా స్త్రీలకు సంబంధించి డా.అంబేద్కర్ చేసిన కృషి గురించి తెలుసుకోవాలనుకొనేవారికి ఈ పుస్తకం చాలా ఉపయోగపడుతుంది.